జూలై, 2011

# స్థానిక పాలన

గ్రామీణ వికాస మాసపత్రిక

సంపుటి: 3 సంచిక: 6 పేజీలు: 64 వెల: రూ. 20/-




## సమగ్ర గ్రామీణాభివృద్ధి కోసం సుస్థిర వ్యవసాయ పద్ధతులు



అపార్డు ప్రచురణలను తిలకిస్తున్న
మంత్రివర్యుల బృందం



అపార్డు వసతిగృహానికి శంకుస్థాపన చేస్తున్న
కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి
శ్రీ విలాస్ రావ్ దేశ్‌ముఖ్



ఇందిరాక్రాంతి పథం స్టాల్‌ని
తిలకిస్తున్న మంత్రివర్యుల బృందం



అపార్డు స్టాఫ్ క్వార్టర్స్‌కు
శంకుస్థాపన చేస్తున్న
గౌ॥ ముఖ్యమంత్రి
శ్రీ ఎన్. కిరణ్‌కుమార్ రెడ్డి

# స్థానిక పాలన

గ్రామీణ వికాస మాసపత్రిక

సంపుటి: 3 సంచిక: 6

జూలై, 2011



చీఫ్ ఎడిటర్

**కె. చంద్రమౌళి** ఐ.ఏ.ఎస్.

ఎడిటర్

**డా॥ వి. శివశంకర ప్రసాద్**

ఎడిటోరియల్ బోర్డు

**కె. అంబరీష్,** ఐ.ఏ.ఎస్. (రిటైర్డ్)

**సెబాస్టియన్ రాజు** ఎ.పి.ఎ.ఎస్. (రిటైర్డ్)

**జి. గంగాధరం**

**డాక్టర్ సి. కృష్ణ మోహనరావు**

**ఎమ్.ఎ. కుమార రాజా**

**బ్రిగేడియర్ డి.వి. రావు**

**ప్రొ. ఆర్. సూర్యనారాయణ రెడ్డి**

**డాక్టర్ లీలా ప్రసాద్**

**హెచ్. కూర్మారావు**

**డాక్టర్ కె. లక్ష్మీపతి**

**ఎమ్. విజయలక్ష్మి**

**ఎ. సుభాష్‌చంద్ర గౌడ్**



కాన్సెప్ట్, ప్లానింగ్,
ఎడిటింగ్, డిజైనింగ్

**కాక్స్‌టన్ ఆఫ్‌సెట్ ప్రైవేట్ లిమిటెడ్**
హైదరాబాద్

ప్రచురణ

ఎ.ఎం.ఆర్. అపార్డ్



రాజేంద్రనగర్
హైదరాబాద్-500 030
ఆంధ్రప్రదేశ్, ఇండియా
ఫోన్ : 040-24018656
ఫ్యాక్స్ : 040-24017005
E-mail : krishna.chandramouli90@gmail.com
editorsthanikapalana@gmail.com


# విషయ సూచిక


సంపాదకీయం ........................................ 2

ఉపాధి హామీ పనుల్లో ఎ.పి. భేష్ ........................................ 3

యువతరం చేతుల్లో దేశ భవిత: అందుకు సరియైన వేదిక
అపార్డ్ కీ క్యాప్ ........................................ 5

గ్రామంలో కలకాలం నిలిచే పనులు చేపట్టండి ........................................ 7

దిగువమాఘం గ్రామాన్ని సందర్శించిన అపార్డు బృందం ........................................ 8

వ్యాస పౌర్ణిమ సందర్భంగా రవి కాంచనిచో కవిగాంచునే కదా
వెంటాడే వాక్యం ........................................ 9

బాలల భవితకు బంగారు బాటలు ........................................ 10

పక్షి ప్రేమికుడు అలెన్ ఆక్టివియన్ హ్యూమ్ ........................................ 16

ఆంధ్రప్రదేశ్‌లో సంక్షేమ పథకాలు ........................................ 17

ముంచుకొస్తున్న ఆరోగ్య విపత్తులు – ఆస్తమాపై అవగాహన ........................................ 19

ఆధునిక తెలుగు సమానార్థక పదకల్పన ........................................ 21

పంచాయితీరాజ్ సిబ్బందికి కూడా శిక్షణ ఎంతో అవసరం ........................................ 24

గ్రామ అభివృద్ధికి భారత్ నిర్మాణ్ వాలంటీర్లు ........................................ 25

ఆకట్టుకున్న భారత్ నిర్మాణ్ వాలంటీర్ల స్వచ్ఛంద సేవ ........................................ 26

చీదేడులో కీ క్యాప్ ఐ.ఇ.సి. కార్యక్రమాలు ........................................ 27

ప్రపంచీకరణతో పెరుగుతున్న జనాభా సమస్య ........................................ 29

గట్టిపోటీలో టెన్నిస్ రారాజులు, రారాణులు ........................................ 32

కిశోర బాలికలు తెలుసుకోవాల్సిన విషయాలు ........................................ 36

వినియోగదారుల రక్షణ గురించి తెలుసుకుందాం ........................................ 38

పాత పుస్తకాలు (కథ) ........................................ 41

కుక్కకాటుకు జాగ్రత్తలు ........................................ 44

కేరళలో ఆదర్శవంతమైన పంచాయితీరాజ్ వ్యవస్థ ........................................ 47

విజన్-2040 (హాస్యకథ) ........................................ 50

స్వాతంత్ర్య సమరయోధులు – పరిపాలనాదక్షులు ........................................ 52

దేశ భక్తుల కల్పవల్లి దేవిశెట్టిపల్లె ........................................ 53

వాతావరణ కాలుష్యం – భవిష్యత్ పరిణామాలు
తీసుకోవలసిన జాగ్రత్తలు ........................................ 54

ఆహార భద్రతతోనే ప్రగతి ........................................ 56

సాధికారత దిశగా మహిళ అడుగులు – ఆటంకాలు ........................................ 57

సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం – అమలు తీరు – ఒక పరిశీలన .. 59

నీరు – నీరు – నీరు ........................................ 62

జూలై, 2011

# ప్రపంచ జనాభా దినం

దేశాభివృద్ధిలో జనాభా పాత్రే కీలకమైనది. ఒక దేశ విస్తీర్ణం, భౌగోళిక పరిస్థితులు, లభ్యమయ్యే వనరులు, జనాభా సంఖ్య, ఆ జనాభా అక్షరాస్యత, నైపుణ్యాలు, అభివృద్ధి ప్రక్రియలో వారి పాత్ర మొదలైన అంశాలు ముఖ్యపాత్ర వహిస్తాయి. జనాభా సంఖ్య మితిమీరినా, అతి తక్కువున్నా దేశాభివృద్ధిపై ప్రతికూల ప్రభావం పడుతుంది.

1987లో ప్రపంచ జనాభా 500 కోట్లకు చేరినప్పుడు, జనాభా విషయాలపై శ్రద్ధ వహించడానికి, ప్రజల్లో, ప్రభుత్వాల్లో అవగాహన కలిగించడానికి ప్రపంచ జనాభా దినాన్ని జరపడం మంచిదని ఐక్యరాజ్యసమితి భావించి జూలై 11 వ తేదీని అందుకు నిర్ణయించింది. అభివృద్ధిపై, పర్యావరణంపై జనాభా సంఖ్య కనబరిచే ప్రభావాలపై, తదితర సంబంధిత విషయాలపై చర్చలు జరపటం, అందుకు అనుగుణమైన కార్యక్రమాలు రూపొందించటం వంటివి ప్రతి ఏటా చేపడుతున్నారు. 1989లో మొదటిసారి ప్రపంచ జనాభా దినాన్ని నిర్వహించారు. అప్పటినుంచి ఐక్యరాజ్యసమితి జనాభా నిధి ప్రోత్సాహంతో వివిధ దేశాల ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, ఇతర సంస్థలు ప్రపంచ జనాభా దినాన్ని నిర్వహిస్తున్నాయి. ఈ ఏడాది 'అత్యవసర ప్రపంచ సమస్యలపై శ్రద్ధ వహించటం' అనే థీమ్‌ని నిర్ణయించారు.

ప్రస్తుతం ప్రపంచ జనాభా 700 కోట్లకు చేరింది. వీటిలో మొదటి 10 స్థానాలను చైనా (134 కోట్లు), భారత్ (121 కోట్లు), అమెరికా (31 కోట్లు), ఇండోనేషియా (24 కోట్లు), బ్రెజిల్ (20 కోట్లు), పాకిస్థాన్ (18 కోట్లు), బంగ్లాదేశ్ (15 కోట్లు), నైజీరియా (15 కోట్లు), రష్యా (13 కోట్లు) ఆక్రమిస్తున్నాయి.

2011 నాటి జనాభా లెక్కల గణాంకాల ప్రకాం 121 కోట్లున్న భారతదేశ జనాభా 2025 నాటికి చైనాను కూడా మించిపోగలదని అంచనాలు చెప్తున్నాయి. 2050 నాటికి 160 కోట్లను దాటుతుందని అంచనా. ఇప్పటికే అధిక జనాభాతో సతమతమవుతున్న మన దేశానికి ఈ పెరిగే జనాభా మరింత తీరని సమస్య అవుతుందనే ఆందోళన నెలకొన్నది.

ప్రతి భౌగోళిక ప్రాంతానికీ కొంత సామర్థ్యం ఉంటుంది. అక్కడ లభ్యమయ్యే వనరులు, విస్తీర్ణం బట్టి ఎంత జనాభా అక్కడ సౌకర్యవంతంగా బతకగలరో ఒక పరిమితి ఉంటుంది. అందుబాటులో ఉన్న విస్తీర్ణం, వనరుల కంటే జనాభా మితిమీరినప్పుడు మొత్తం జనాభాకు అన్ని సౌకర్యాలు అందవు. పేదరికం తాండవిస్తుంది. నిరక్షరాస్యతను రూపుమాపటం సవాళ్లతో కూడుకున్నదే. వైద్య, ఆరోగ్య సదుపాయాల కల్పన కూడా ఒక సమస్యగా మారుతుంది. 2009 నాటి గణాంకాల ప్రకారం భారతదేశంలో ప్రతి 1000 మదికి జననాల రేటు 22 ఉండగా, మరణాల రేటు 6 మాత్రమే ఉంది. సగటు ఆయుర్దాయయం 70 సంవత్సరాలకు పెరగడం, జనాభా నియంత్రణలో పెద్దగా పురోగతి లేకపోవటం ఇందుకు కారణం.

అన్నింటికంటే దేశాన్ని బాధిస్తున్న సమస్య స్త్రీ, పురుష జనాభా నిష్పత్తిలో సమతూకం లోపించటం. 2011 నాటి జనాభా లెక్కల ప్రకారం, ప్రతి 1000 మంది పురుషులకు భారతదేశంలో 940 మంది మాత్రమే స్త్రీలున్నారు. అదే 0-6 సంవత్సరాల మధ్య ప్రతి 1000 మంది బాలురకు 914 మంది మాత్రమే బాలికలు ఉన్నారు. హర్యానాలో అయితే ఈ సంఖ్య 830, పంజాబ్‌లో 846 మాత్రమే. స్వాతంత్ర్యం వచ్చే నాటికే అంతంత మాత్రం ఉన్న స్త్రీ, పురుష నిష్పత్తి తరువాత బాగా పడిపోతూ వచ్చింది. లింగ నిర్ధారణ పరీక్షా సదుపాయాలు అందుబాటులోకి వచ్చాక పరిస్థితి తీవ్రమైంది. అక్షరాస్యత విషమంలో ముందున్న కేరళ ప్రతి 1000 మంది పురుషులకు 1084 మంది స్త్రీలతో ఈ విషయంలో కూడా ముందంజలో ఉంది. అనేక రాష్ట్రాలతో పోలిస్తే, మన రాష్ట్రంలో పరిస్థితి బాగా మెరుగ్గానే ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి 1000 మంది పురుషులకు 992 మంది స్త్రీలున్నారు. జాతీయ నిష్పత్తి (1000-940) కంటే ఇది చాలా మెరుగు.

జనాభా నియంత్రణ విధానాలను మరింత కట్టుదిట్టంగా అమలు చేయటం, ఉన్న జనాభాకు సరిపడినంత విద్యా సౌకర్యాలు కల్పించి వారిలో అధిక జనాభా అనర్థాల గురించి అవగాహన కల్పించడం, మహిళలకు మంచి ఉపాధి, ఉద్యోగ సౌకర్యాలు కల్పించటం వంటి చర్యల ద్వారా అధిక జనాభా, స్త్రీ, పురుష నిష్పత్తిలోని అసమతుల్యత అదుపులోకి రాగలవు.

కె. చంద్రమౌళి.

( కె. చంద్రమౌళి )

# ఉపాధి హామీ అమల్లో ఎ.పి. భేష్

## కేంద్ర మంత్రి విలాస్ రావు దేశ్‌ముఖ్ ప్రశంస



**మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఆంధ్రప్రదేశ్‌లో చక్కగా అమలవుతున్నదని, ఆయా పథకాల ద్వారా గ్రామీణాభివృద్ధి విశేషంగా జరుగుతున్నదని కేంద్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి శ్రీ విలాస్‌రావ్ దేశ్‌ముఖ్ ప్రశంసించారు.**

### వార్తల్లో 'అపార్డ్'

రాజేంద్రనగర్‌లోని అపార్డ్‌లో జూన్ 12వ తేదీన జరిగిన సమీక్షా సమావేశంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్. కిరణ్ కుమార్ రెడ్డితో కలసి కేంద్రమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో అత్యధికంగా ఏ రాష్ట్రంలో లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో 65 వేల కుటుంబాలకు ఉపాధి హామీ పథకం చేరుతోందని సంతృప్తి వ్యక్తంచేశారు. రాష్ట్రంలో అమలవుతున్న పలు పథకాలను రాష్ట్ర ముఖ్యమంత్రితో కలసి సమీక్షించానని, మహిళా సంఘాల అభివృద్ధి, ఉపాధి హామీ అమలు పనులు, గృహనిర్మాణం, త్రాగునీరు, గ్రామీణాభివృద్ధి తదితర అంశాలు ఇందులో ఉన్నాయని పేర్కొన్నారు. రాబోయే కాలంలో వీటిని మరింత విస్తృతంగా అమలు చేసేందుకు అవసరమయ్యే అదనపు నిధులను కేంద్రం

నుంచి అందిస్తామని వెల్లడించారు.

ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన పథకంలో కొన్ని ఇబ్బందులున్నాయని, దీనికి త్వరలోనే సవరణలు చేపట్టి అన్ని రాష్ట్రాలకు అనుకూలంగా ఉండేలా అమలు చేస్తామని చెప్పారు. ప్రజోపయోగమైన పథకాలలో నిధుల సమస్య లేకుండా చేస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారు. రాష్ట్రంలో మహిళలంతా ఐకమత్యంగా ఉంటూ పలు పథకాలను సద్వినియోగం చేసుకుంటున్న తీరు ఇతర రాష్ట్రాలకు ఆదర్శమని, సమీపంలోనే ఉన్న తమ మహారాష్ట్రలో కూడా ఈ పథకాలలో మహిళలు సాధిస్తోన్న విజయగాథలను వివరించేందుకు తగిన చర్యలు తీసుకుంటానన్నారు. ఇక్కడి మహిళలను జిల్లా పరిషత్, మండల పరిషత్, పంచాయతీ ఎన్నికలలో పురుషులతో సమానంగా 50% రిజర్వేషన్లు కల్పించి ప్రోత్సహిస్తున్నారని, మహిళాభివృద్ధితో రాష్ట్రం వేగవంతంగా అభివృద్ధి సాధిస్తోందని ఆయన అన్నారు. గ్రామీణాభివృద్ధిలో మహిళాస్వయంసహాయక సంఘాలను భాగస్వాములను చేసి సుస్థిర వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహిస్తున్నతీరు ఆదర్శం అని అన్నారు.

ఎస్.హెచ్.జి. మహిళల్లో చైతన్యం ఆశ్చర్య పరిచిందని, దేశంలోని రాష్ట్రాలకేగాక బంగ్లాదేశ్ వంటి దేశాలకు కూడా ఆంధ్రప్రదేశ్ ఆదర్శంగా నిలిచిందని ప్రశంసించారు. గ్రామీణాభివృద్ధి పథకాల అమల్లో ఎన్జీఓల పాత్ర తగ్గిందనే వాదనను ఆయన తోసిపుచ్చారు.

ముఖ్యమంత్రి కిరణ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో అమలు చేస్తున్న గ్రామీణాభివృద్ధి పనులకు కేంద్రం నుంచి ప్రతీ ఏటా రూ. 11,509 కోట్లు విడుదల అవుతాయని అన్నారు. ఆయా నిధులతో గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలకు అవసరమయ్యే అన్ని సదుపాయాలను కల్పిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలోని స్వయం సహాయక బృందాల ప్రయోజనాలను పెంచేందుకు నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రిని కోరామని చెప్పారు. ఇందుకోసం ముందుగా కేంద్రం నుండి రూ. 100 కోట్లు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశానని తెలిపారు. నిరుద్యోగ యువతకు ఉపాధి




అవకాశాలను అభివృద్ధి చేసేందుకు రూ. 150 కోట్లు ఇవ్వాలని కోరామన్నారు. ఈ మొత్తంతో 15 లక్షల మంది యువతకు వివిధ అంశాలలో శిక్షణ ఇచ్చేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు. పలు పథకాలలో ఏడాదికి 1.5 లక్షల మందికి శిక్షణ ఇస్తున్నామని, కేంద్ర నిధులు విడుదలైతే వీరి సంఖ్యను ఏటా 5 లక్షలకు పెంచుతామని చెప్పారు. అపార్డ్‌కు గ్రామీణ విశ్వవిద్యాలయం గుర్తింపు తీసుకువస్తూ ఈ సంస్థకు అదనంగా రూ. 100 కోట్లు కేటాయించాలని ఆయన కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. గ్రామ సర్పంచ్ స్థాయి నుంచి కేంద్రమంత్రి స్థాయితో పాటు అనేక ఉన్నత పదవులలో పనిచేసిన విలాస్‌రావు దేశ్‌ముఖ్ ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న అభివృద్ధిని ప్రశంసించడం సంతోషమని, అదే సమయంలో ఆయా పథకాల విస్తృతికి అవసరమయ్యే నిధులను కేటాయిస్తారని సి.ఎం. ధీమా వ్యక్తం చేశారు. అపార్డ్‌లో సెమినార్‌లో పాల్గొనేందుకు విచ్చేసిన కేంద్రమంత్రి విలాస్‌రావు దేశ్‌ముఖ్ ముందుగా అపార్డులో రూ. 3 కోట్ల వ్యయంతో నిర్మించదలచిన స్టాఫ్ క్వార్టర్స్‌కు, రూ. 2.5 కోట్లతో నిర్మించనున్న అతిథి గృహానికి శంకుస్థాపనలు చేశారు. అనంతరం ఇక్కడ ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లోని వివిధ శాఖల స్టాళ్ళను ఆయన సందర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు జానారెడ్డి, మాణిక్యవరప్రసాద్, సునీతా లక్ష్మారెడ్డి, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి రెడ్డి సుబ్రహ్మణ్యం, గ్రామీణ త్రాగునీటి సరఫరా వ్యవస్థ ప్రిన్సిపల్ సెక్రటరీ చిత్రా రామచంద్రన్, గృహ నిర్మాణ్ శాఖ స్పెషల్ చీఫ్ రంగా రెడ్డి జిల్లా కలెక్టర్ శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

**కేంద్రం నుంచి రాష్ట్రం ఆశిస్తున్నవి ఇవి :**

- అపార్డును గ్రామీణ విశ్వవిద్యాలయంగా అభివృద్ధి చేయడానికి రూ. 100 కోట్లు అవసరం.
- స్వయం సహాయక బృందాలు రుణం అవసరమైనప్పుడు ఇతరుల మీద ఆధారపడాల్సిన అవసరం లేకుండా రుణాలు సమకూర్చడానికి వీలుగా బ్యాంకేతర ఆర్థిక సంస్థ (నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్) ఏర్పాటుకు రూ.100 కోట్లు ఇవ్వాలి.
- యువతలో నైపుణ్యం అనివృద్ధి (స్కిల్ డెవలెప్‌మెంట్) దిశగా వివిధ కార్యక్రమాలు చేపట్టడానికి రూ. 150 కోట్లు అవసరం. ప్రస్తుతం ఏటా 1-1.20 లక్షల మందికి ఉపాధి కల్పిస్తుండగా, ఏటా కనీసం 5 లక్షల మంది యువతకు ఉపాధి కల్పించాలని లక్ష్యం.
- ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన కింద నిధుల కేటాయింపు చాలా తక్కువగా ఉంది. నిధులు పెంచాలి.



# యువతరం చేతుల్లో దేశ భవిత : అందుకు సరియైన వేదిక అపార్డ్ కీ క్యాప్

## గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి శ్రీ డి. మాణిక్య వరప్రసాద్

భారత దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మలచటానికి యువతే కీలకమని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలందరికి చేరాలంటే భారత్ నిర్మాణ్ వాలంటీర్లు ఒక చక్కని సాధనంగా ఉపయోగపడతారని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి శ్రీ డొక్కా మాణిక్య వరప్రసాద్ అన్నారు.



5-6-2011న అపార్డులో జరిగిన భారత్ నిర్మాణ్ వాలంటీర్ల శిక్షణా కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న మంత్రి శ్రీ మాణిక్య వర ప్రసాద్ మాట్లాడుతూ, దేశంలో పేదరిక నిర్మూలన కోసం చేస్తున్న ప్రయత్నాలు సఫలీకృతం కావాలంటే ప్రభుత్వ కార్యక్రమాల రూపకల్పన, అమలు, పర్యవేక్షణ, మధింపులలో ప్రజలు తప్పనిసరిగా భాగస్వాములు కావాలని అన్నారు.

ప్రజల భాగస్వామ్యాన్ని సాదించటానికి అపార్డ్ కీ - క్యాప్ కార్యక్రమంలో శిక్షణ పొందిన భారత్ నిర్మాణ్ వాలంటీర్లు క్షేత్ర స్థాయిలో కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా భారత్ నిర్మాణ్ వాలంటీర్లతో మంత్రి పలు విషయాలను చర్చించారు. తాను కూడా ఒక కుగ్రామంలో పుట్టానని, పేదరికం అంటే ఏమిటో ప్రత్యక్షంగా అనుభవించానని ఆయన అన్నారు.

గ్రామాలలో కనీస వసతులు లేక పలు ఇబ్బందులు పడినప్పటికీ, మొక్కవోని ధైర్యంతో పరిస్థితులను ఎదిరించి తాను ఈ స్థితికి చేరుకున్నానని, గ్రామీణ వాతావరణంలో పెరిగే పేదలు అందరూ కూడా తమ ధైర్యాన్ని విడనాడకుండా బీదరికం నుండి బయటపడే మార్గాలు అన్వేషించాలని ఆయన అన్నారు. ఇందుకు భారత్ నిర్మాణ్ వాలంటీర్ల సహకారం ప్రజలకు అవశ్యమని అంటూ, శిక్షణ పొందిన భారత్ నిర్మాణ్ వాలంటీర్లందరూ, ల్యాబ్ టు ల్యాండ్, కీ క్యాప్ కార్యక్రమాన్ని ఒక వేదికగా ఉపయోగించుకొని ప్రజలకు సేవ చేయాలని పిలుపునిచ్చారు.

తాను ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఒక వేదికగా ఈ ల్యాబ్ టు ల్యాండ్ కీ క్యాప్ ఉపయోగపడగలదనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తపర్చారు. గ్రామాలలో కనీస మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తున్నప్పటికీ, ఎక్కడో చిన్న చిన్న లోపాల వల్ల ప్రజల భాగస్వామ్యం లభించటంలేదని, గ్రామీణాభివృద్ధికి ప్రజా భాగస్వామ్యం తప్పనిసరి అని అన్నారు.

ప్రజలలో ప్రశ్నించే తత్వాన్ని ప్రోత్సహించాలని భారత్ నిర్మాణ వాలంటీర్లకు పిలుపునిచ్చారు. నేడు ప్రజలను లబ్దిదారులుగా కాకుండా హక్కుదారులుగా చూసే భావనతో ప్రభుత్వం ఉపాధి హామీ, విద్యా హక్కు, సమాచార హక్కు చట్టం వంటి సాధనాలను ప్రజల ముందుంచిందని, వీటిని ఉపయోగించుకుంటూ గ్రామీణ ప్రజలు సాధికారత పొందేలా యువత కీలక భూమిక పోషించాలని ఆయన పిలుపునిచ్చారు. ఒక మంచి వ్యవస్థ నిర్మాణం జరగాలంటే మంచి గ్రామాలు ఉండాలని, మంచి గ్రామంగా మారాలంటే ప్రజలలో మంచితనం పెరగాలని, ప్రజలలో మంచిని పెంపొందించేందుకు భారత నిర్మాణ వాలంటీర్లు కృషి చేయాలని మంత్రి మాణిక్యవర ప్రసాద్ ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా అపార్డు కమీషనరు శ్రీ కె. చంద్రమౌళి, ఐఏఎస్ మాట్లాడుతూ కీ - క్యాప్ కార్యక్రమం క్రింద 2000 మంది భారత్ నిర్మాణ్ వాలంటీర్లకు ప్రత్యేక శిక్షణను రూపొందించి, భాగస్వామ్య శిక్షణా పద్ధతుల ద్వారా భారత్ నిర్మాణ్ వాలంటీర్లలో ఉత్సుకత, రేకెత్తించటం జరిగిందని అన్నారు. శిక్షణ కోసం ప్రత్యేకంగా డాక్యుమెంటరీ ఫిల్ములు రూపొందించి, యువత వైఖరులలో కూడా మార్పుని ప్రోత్సహించడం జరిగిందని తెలియచేసారు.

ఈ కార్యక్రమాన్ని సి.ఎన్.ఆర్.ఎం. సెంటర్ హెడ్, హెచ్ కూర్మారావు సమన్వయ పర్చగా, ఇతర ఫ్యాకల్టీ సభ్యులు, సెంటర్ హెడ్‌లు తోడ్పాటును అందచేసారు. ఈ కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ గంగాధరం, డిప్యూటీ డైరెక్టర్లు డా. కృష్ణమోహన్, సుభాష్ చంద్ర గౌడ్, సెంటర్ హెడ్‌లు డా. లీలాప్రసాద్, శ్రీమతి విజయ లక్ష్మి, డా. వి.యస్.యస్. ప్రసాద్, ఫ్యాకల్టీ సభ్యులు రమేష్, టి.ఎం.కె. గాంధీ, లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు. ■



# గ్రామంలో కలకాలం నిలిచే పనులు చేపట్టండి

## భారత్ నిర్మాణ్ వాలంటీర్లకు దిశానిర్దేశం చేసిన అపార్డ్ కమీషనర్ చంద్రమౌళి





**ఏడువేల పైచిలుకు జనాభా. రెండు వేల ఐదు వందల కుటుంబాలు గల రొంపిచర్ల గ్రామం పారిశుధ్య రంగంలో విశేషమైన కృషి చేసి రాష్ట్రపతి నుండి నిర్మల్ గ్రామ పురస్కారం పొందటం పలు గ్రామాలకు ఆదర్శనీయమని అపార్డ్ కమీషనర్ కె. చంద్రమౌళి, ఐ.ఏ.ఎస్. అన్నారు. గ్రామాన్ని అభివృద్ధి బాటలో నిల్పటానికి శ్రమించిన గ్రామ సర్పంచ్ ఇబ్రహీం ఖాన్‌ను, పంచాయితీ సభ్యులను, గ్రామస్తులను ఈ సందర్భంగా ఆయన అభినందించారు.**

రాష్ట్ర వ్యాప్తంగా 79 గ్రామ పంచాయితీలను ఎంపిక చేసి ఇప్పటికే సుమారు 2080 మంది వాలంటీర్లను ఎంపిక చేసామని ఆయన తెలియచేసారు. రొంపిచర్ల నుండి కూడా భారత్ నిర్మాణ్ వాలంటీర్లకు అపార్డ్‌లో శిక్షణ అందచేసామని, శిక్షణ అనంతరం గ్రామంలో బి.ఎన్.వి.లు చేపడుతున్న కార్యక్రమాలు స్ఫూర్తిదాయకమన్నారు. గ్రామంలో నెలకొని ఉన్న సమస్యలను గుర్తించి కలకాలం నిలిచే పనులను బి.ఎన్.విలు ప్రోత్సహించాలని ఆయన పిలుపునిచ్చారు. బి.ఎన్.విలు అంకిత భావంతో పనిచేయాలని, ఎప్పుడు భగవంతునిపై విశ్వాసాన్ని కోల్పోకుండా మంచినడవడికను కలిగి ప్రజల మేలుకోసం శ్రమించాలని ఆయన అన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్లవేళలా భగవంతుడిని తన వెనకాలే ఉండమని కోరిన భక్తుని కథను ఖురాన్ నుంచి ఉటంకించారు. సభకు అధ్యక్షత వహించిన సర్పంచ్ ఇబ్రహీంఖాన్ మాట్లాడుతూ గ్రామం కొన్ని రంగాలలో అభివృద్ధి సాధించినప్పటికీ ఇంకా అనేక సమస్యలు గ్రామాభివృద్ధికి నిరోధకాలుగా పరిణమించాయని, వీటిలో ప్రత్యేకించి గ్రామంలో 30 పడకల ఆసుపత్రి బీడి కార్మికులకు ఇ.ఎస్.ఐ. వైద్యశాల తరహా ప్రత్యేక వైద్య సదుపాయాలు, ముస్లింలకు శ్మశాన వాటిక, కళ్యాణ మంటపం, ఆర్యవైశ్యుల స్మశాన వాటికకు ప్రహరీగోడ నిర్మాణం. రొంపిచర్ల గ్రామంలో నీటి శుద్ధి ప్లాంటు ఏర్పాటు, భూగర్భ నీటిపారుదల వ్యవస్థ వంటి సమస్యలు పరిష్కరించాల్సి ఉందని తెలియచేసారు. ఇందుకు సహకరించవలసినదిగా అపార్డు కమీషనరుని ఆయన కోరారు.

జిల్లా పంచాయితీ అధికారి డా. శేషారెడ్డి మాట్లాడుతూ, అన్ని ప్రభుత్వ కార్యక్రమాలను వినియోగించుకోవటంలో రొంపిచర్ల పంచాయితీ ముందుంటుందని, ఇక్కడి నిర్ణయాలను గ్రామసభ తీసుకొంటుందని అన్నారు. ఇ-పంచాయితీ కార్యక్రమం ద్వారా ప్రజలకు సత్వర సేవలు అందుతాయని అన్నారు. గ్రామ పంచాయితీ స్వంత ఆదాయ వనరులను పెంచుకోవటానికి షాపింగు కాంప్లెక్సుల నిర్మాణం, మార్కెట్ సదుపాయాల కల్పన వంటివి చేపట్టి ప్రజలకు సౌకర్యవంతమైన సేవలందిస్తున్నారని అన్నారు. ఇక్కడి ప్రజలు చైతన్యవంతులని, పాలక వర్గానికి అన్ని విధాలుగా సహకారం అందించటం వల్ల అభివృద్ధికి మారుపేరుగా నిలుస్తోందని డా. శేషారెడ్డి అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో అపార్డు ఫ్యాకల్టీ సభ్యులు ప్రొ. సూర్యనారాయణ రెడ్డి, హెచ్. కూర్మారావు, డా. కృష్ణమోహన్ రావు, వైస్ ప్రిన్సిపాల్ సజ్జా సుబ్బారావు, ఫ్యాకల్టీ సభ్యులు శోభన్ బాబు, వెంకటరత్నం, కృష్ణయ్య, సి.ఇ.ఓ. నాగేశ్వరరావు, ఎం.పి.డి.ఓ. జ్యోతి, సింగిల్‌విండో అధ్యక్షుడు హరినాథ్ రెడ్డి, జడ్.పి.టి.సి. సభ్యుడు సిద్ధారెడ్డి, యం.పి.టి.సి. సభ్యుడు నీలోఫర్ తదితరులు పాల్గొన్నారు.



# దిగువమాఘం గ్రామాన్ని సందర్శించిన అపార్డు బృందం

**అపార్డ్ ల్యాబ్ టు ల్యాండ్ కీ - క్యాప్ కార్యక్రమం వినియోగించుకొని గ్రామంలో సంపూర్ణ గ్రామీణాభివృద్ధి సాధించాలని అపార్డు ప్రొఫెసర్ ఆర్. సూర్యనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. దిగువ మాఘం గ్రామంలో ల్యాబ్ టు ల్యాండ్ కీ - క్యాప్ కార్యక్రమం అమలు జరుగుతున్న తీరు తెన్నులను పరిశీలించటానికి 18.6.2011న అపార్డు బృందం. ఇ.టి.సి. కాళహస్తి అధ్యాపక బృందంతో కలిసి సందర్శించింది.**

దిగువమాఘం గ్రామం పలు రంగాలలో ఇప్పటికే ఆదర్శవంతంగా ఉందనీ, గ్రామ సర్వతోముఖాభివృద్ధి దిశలో ఇంకా పురోగతి సాధించాల్సిన పారిశుద్ధ్యం, గృహ వసతి, ఉపాధి తదితర రంగాలపై గ్రామ పంచాయితీ, ప్రజల్లో భారతనిర్మాణ వాలంటీర్ల దృష్టి సారించాల్సిన ఆవశ్యకత ఉందని అన్నారు. ఇందుకు అవసరమైన సహకారాన్ని అపార్డ్ అందచేస్తుందని తెలియచేసారు. అపార్డులోని సి.ఎన్.ఆర్.ఎం. సెంటర్ హెడ్ కూర్మారావు మాట్లాడుతూ, ప్రజా సంక్షేమం కోసం అమలుచేస్తున్న సుమారు 255 ప్రభుత్వ పథకాలు సక్రమంగా ప్రజలందరికి చేరేలా ప్రజలకు అవగాహన కల్పించటానికి కీ - క్యాప్ కార్యక్రమాన్ని అపార్డు ప్రారంభించిందని చెప్పారు.

ఈ కార్యక్రమం క్రింద గ్రామంలో ఎంపిక చేయబడిన భారత్ నిర్మాణ వాలంటీర్లకు వివిధ ప్రభుత్వ పథకాలపై శిక్షణ అందచేయనున్నట్లు తెలియచేసారు. అపార్డ్ డిప్యూటీ డైరెక్టర్ డా. కృష్ణ మోహన్ మాట్లాడుతూ, ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకొనేలా చేయటమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యం అని అన్నారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా పరిషత్తు సి.ఇ.ఓ. నాగేశ్వరరావు మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరి సహకారం కావాలని. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. శ్రీకాళహస్తి విస్తరణా శిక్షణా కేంద్ర వైస్ ప్రిన్సిపాల్ సజ్జా సుబ్బారావు మాట్లాడుతూ, ల్యాబ్‌టు ల్యాండ్ కార్యక్రమంలో పాలు పంచుకోవటానికి గ్రామస్తులు ఉత్సుకత చూపుతున్నారని, త్వరలోనే భారత్ నిర్మాణ్ వాలంటీర్లను శిక్షణ కోసం అపార్డుకు పంపనున్నట్లు తెలియచేసారు. అపార్డ్ డిప్యూటీ డైరెక్టర్ సుభాష్ చంద్రగౌడ్ మాట్లాడుతూ, భారత్ నిర్మాణ్ వాలంటీర్ల సహకారంతో గ్రామంలో కుటుంబాల వారీ సర్వే చేపట్టి వివిధ పథకాల క్రింద అర్హుల జాబితాను రూపొందించి ఆయా శాఖలకు పంపాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఇ.టి.సి. ఫాకల్టీ శోభన్ బాబు, డి.టి.ఎం. మధు, ఎం.పి.డి.ఓ. శ్రీదేవి, ఎం.ఇ.ఓ. ప్రేమలత, హౌసింగ్ ఇంజనీర్ గుణ శేఖర్ రెడ్డి, పంచాయిత్ రాజ్ ఎ.ఇ. కమలాకర నాయుడు తదితరులు పాల్గొన్నారు. ■




## వ్యాస పౌర్ణమి సందర్భంగా

# రవి కాంచనిచో కవిగాంచునే కదా

**'అపారే కావ్యసంసారే కవిరేవ ప్రజాపతిః' అన్నారు మన పూర్వ ఆలంకారికులు. అపారమయిన ఈ కావ్యప్రపంచంలో కవే బ్రహ్మ.**

**'కావ్యంతు జాయతే జాతు కస్యచిత్ ప్రతిభామతః' అని అన్నారు. ఒకానొక ప్రతిభావంతుడి ప్రతిభ వల్లనే కావ్యం జనిస్తుంది.**

కవిర్మనీషీ పరిభూః స్వయంభూః అన్నారు. కవిశబ్దం మొదట పరబ్రహ్మ పరంగా వ్యవహారంలో ఉంది. తరువాత ఆ పరబ్రహ్మను దర్శించిన మహార్షులూ కవిశబ్దం వాచ్యులయ్యారు. అటువంటి పరబ్రహ్మను దర్శించిన మహాకవులలో వేదవ్యాసుడు అగ్రగణ్యుడు.

'ఒక్క వాల్మీకి తప్ప వేరొక్క డెవడు సుకవి శబ్దవాచ్యుండు అని విశ్వనాథవారు అన్నారు. లోకంలో కవి అంటే వాల్మీకి, వాల్మీకి అంటే కవి అనే ప్రాచుర్యం ఉండడమే వీరి మాటకు కారణం. దీనిని బట్టి కాళిదాసాదులు కవులు కారా అనే ప్రశ్న కూడా ఉదయిస్తుంది.

కవిత్వం ఒక అల్కెమీ..
అది కాళిదాసుకి తెలుసు!
పెద్దన్నకు తెలుసు.
కృష్ణశాస్త్రికి తెలుసు

శ్రీశ్రీకి తెలుసునన్నాడు అమృతం కురిసిన రాత్రిలో దేవరకొండ బాలగంగాధర తిలక్. అచేతనాలకూ, మానేషేతరజీవాలకూ మానవధర్మాలనూ, ప్రవృత్తులనూ కల్పించి కవిత్వంతో జీవం పోసిన కవి కాళిదాసైతే; ధర్మప్రతిష్ఠాపన కోసం, చతుర్విధ పురుషార్థ సాధన కోసం, లోకహితం కోసం మానవ వైరుధ్యాలను పాత్రలకు ఆపాదించి సమాజాన్ని అద్భుతంగా ఆవిష్కరించిన మహానుభావుడు వేదవ్యాసుడు. అందుకే వేదవ్యాసుణ్ణి...

అచతుర్వదనో బ్రహ్మ
ద్విబాహు రపరో హరిః
అఫాలలో చనశ్శంభుః
భగవాన్ బాదరాయణః

అని అన్నారు. బాదరాయణుడయిన వ్యాసభగవానుడు నాల్గు ముఖాలు లేని బ్రహ్మ. రెండే చేతులు ఉన్న అపర విష్ణువు, నుదుటి పయిన మూడో నేత్రం లేని శివుడు.

భాగవతం ప్రకారం వ్యాసుడు సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడి అవతారం. కృష్ణద్వీపంలో జన్మించడం వల్ల కృష్ణద్వైపానుడు, పరాశర మహర్షి పుత్రుడయి నందువల్ల పారాశర్యుడు, సత్యవతి కుమారుడయినందువల్ల సాత్యవతేయుడు అనే పేర్లు కల ఈ వ్యాస భగవానుడికి వేదాలను వ్యాసం చేయటం వల్ల ఈ పేరు వచ్చింది.

వేదవ్యాసుడి వైదిక సారస్వతం విషయం అటుంచి; మహాభారత మహాభాగవత రచనల ద్వారా సామాజిక శాస్త్రవేత్తగా గుర్తింపు పొందాడు. మహాభారతంలో లేనిదేదీ లోకంలో వుండదనేంత ప్రశస్తిని ఆ రచనకు వచ్చే విధంగా మహాభారతాన్ని తీర్చిదిద్దాడు. మహాభారతం ఒక విజ్ఞానసర్వస్వం. ఎవరు ఏ రూపంలో చూస్తే ఆ రూపంలోనూ, ఎవరు దేనిని కోరుకుంటే ఆ ప్రయోజనాన్ని మహాభారతం ద్వారా పొందవచ్చు.

మొదట 8800 శ్లోకాలకే పరిమితమయిన మహాభారతానికి జయసంహితమని పేరు. ఆ తరువాత వేదవ్యాసుడే తన శిష్యులయిన పైల, జైమిని, వైశంపాయనుడు మొదలయిన వారికి మహాభారతాన్ని ప్రవచించినాడు. ఆ శిష్యులు చక్కగా దేశం నలుమూలలా మహాభారతాన్ని ప్రచారం చేస్తూ వచ్చారు. అనేక వాఖ్యానాలతో ఉపాఖ్యానాలతో 8800 శ్లోకాలకు పరిమితమయిన ఈ మహాభారత రచన నేడు లక్ష శ్లోకాలతో లభిస్తోంది.

రాజనీతి, నీతి, అర్థనీతి, లోకరీతి మహాభారతంలో కన్పిస్తాయి. వేదాంత గ్రంథంగానే కాక, సమకాలీన సమాజాన్ని పట్టి చూపే గ్రంథంగానూ, పురాణాలసారాన్ని అందించేదిగానూ, కావ్యప్రయోజనాన్ని సాకారంచేసే రచనగానూ, నీతిని ఉపదేశించే కావ్యంగానూ, చారిత్రక విషయాలను అందించే చారిత్రక ఇతిహాసంగానూ మహాభారతం ప్రసస్తి కాంచింది. ఒక్క మాటలో చెప్పాలంటే - వేదవ్యాసుడే నడచి వచ్చే భారతామ్నాయం. భూత భవిష్యత్ వర్తమానాలను దర్శించిన దార్శనికుడు. కవయః క్రాంత దర్శినః అన్న ఆర్యోక్తికి నిలువెత్తు దర్పణం వేదవ్యాసుడు. సూర్యుడు చొరబడని ప్రదేశాలేమయినా ఉంటే ఉండవచ్చు కానీ కవి చూడని అంశాలు, తాకని విషయాలు ఉండవు కాక ఉండవు. అందుకే శాశ్వత సత్యాలను కవి ఆవిష్కరిస్తాడు. ఒక్క ఉదాహరణ చూడండి--

రాజునకు ప్రజ శరీరము
రాజు ప్రజకు నాత్మ గాన రాజుం బ్రజయున్
రాజోత్తమ యన్యోన్య వి
రాజితులై యుండవలయు రక్షార్చనలన్

ఈ భావం సర్వకాల సర్వావస్థలలోనూ ఆచరణ యోగ్య మయినదే. దీన్ని ఆచరించిన దేశం శాంతి సౌభాగ్యాలకు నిలయమని వేరే చెప్పనక్కరలేదు. ఇటువంటివి మహాభారతంలో కోకొల్లలు. ఇంతటి దివ్యమయిన సందేశాలను అందించిన వాడు కావటం వల్లనే వేదవ్యాసుడు ఆదర్శాచార్యుడయ్యాడు. వ్యాసపౌర్ణమి రోజున తమ తమ గురువులను పూజించడం అనాదిగా వస్తున్న సంప్రదాయం.

***- డా. అద్దంకి శ్రీనివాస్***



# బాలల భవితకు బంగారు బాటలు

### భారత రాజ్యాంగం

భారత రాజ్యాంగంలో పౌరులకు నిర్దేశించిన ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాల అమలు ద్వారా బాలల హక్కులు పరిరక్షింపబడతాయి.

### ప్రాథమిక హక్కులు

**ఆర్టికల్ 14**

**సమానత్వం-రక్షణ**

భారత భూభాగం లోపల ఏ పౌరునికీ రాజ్యం శాసన దృష్టిలో సమానత్వాన్ని, శాసనాల వలన రక్షణను నిరాకరించరాదు.

**ఆర్టికల్ 15**

**విచక్షణ చేయడంపై నిషేధం**

రాజ్యం కేవలం మత, జాతి,కుల, లింగభేద, జన్మస్థాన కారణాల బట్టిగాని, వాటిలో దేనిని బట్టిగాని ఏ పౌరునికీ విరుద్ధంగా విచక్షణ చేయరాదు.

**ఆర్టికల్ 16**

**సమానావకాశం**

రాజ్యం ఆధీనంలో ఏ పరిధిలోనైనా ఉద్యోగానికి లేదా నియామకానికి సంబంధించిన విషయంలో పౌరులందరికీ సమానావకాశం ఉండాలి.

**ఆర్టికల్ 17**

**అంటరానితనం రద్దు (అస్పృశ్యతా నిర్మూలన)**

అంటరానితనం రద్దయింది. ఏ రూపంలోనైనాగానీ దాని ఆచరణ నిషేధించబడింది. అంటరానితనం కారణంగా కలిగే ఏ అనర్హతనైనా అమలుజరపడం చట్టరీత్యా శిక్షార్హమైన నేరం.



**ఆర్టికల్ 19**

వాక్ స్వాతంత్ర్య హక్కు, వాక్ స్వాతంత్ర్యానికి సంబంధించిన హక్కుల పరిరక్షణ

**ఆర్టికల్ 21**

ప్రాణ, వైయక్తిక, స్వాతంత్ర్య రక్షణ

**ఆర్టికల్ 23**

మనుషుల క్రయ విక్రయాలు, వెట్టి, అటువంటి మరే ఇతర బలవంతపు చాకిరీలు నిషేధించబడ్డాయి. ఈ నిబంధనను ఉల్లంఘించడం చట్టరీత్యా శిక్షార్హమైన అపరాధం.

**ఆర్టికల్ 24**

14 ఏళ్ళలోపు వయస్సు గల ఏ బిడ్డనూ కార్ఖానాలో గాని, గనిలో గాని, అపాయకరమైన మరే ఇతర ఉద్యోగంలోగాని, పెట్టి పని చేయించరాదు.

**ఆర్టికల్ 25**

అంతరాత్మ ననుసరించే స్వాతంత్ర్యం,స్వేచ్ఛాయుత మతావలంబన, ఆచరణ, ప్రచారాలు.

**ఆర్టికల్ 29(1)**

భారత పౌరుల్లో ఏ వర్గం వారైనా తమదైన విశిష్ట భాష, లిపి, సంస్కృతుల్ని కాపాడుకొనే హక్కు కలిగి ఉంటారు.

**ఆర్టికల్ 32**

ఈ భాగం ప్రసాదించిన హక్కులు అమలు కావడానికి సముచిత చర్యల ద్వారా సర్వోన్నత న్యాయస్థానాన్ని అర్థించే హక్కుకు హామీ లభించింది.

## ఆదేశిక సూత్రాలు

ఇవి ఏ న్యాయస్థానం చేతగానీ అమలు జరపదగినవి కావు. కాని ఇవి దేశ పరిపాలనకు మూలాధారం అవుతాయి. శాసన నిర్మాణంలో వీటిని వర్తింపజేయటం రాజ్యాంగం యొక్క కర్తవ్యం.

**అధికరణం (ఆర్టికల్) 39 :** బాలలను తగని పనులలో పెట్టటంపై నిషేధం, వారి అభివృద్ధికి అవకాశాలు, సౌకర్యాలు కల్పించడం.

**అధికరణం (ఆర్టికల్) 42 :** ప్రసూతి సహాయం, వారికి తగిన మంచి పరిస్థితులు కల్పించడం.

**అధికరణం (ఆర్టికల్) 45 :** పిల్లలందరికీ 14 సంవత్సరాల వయస్సు పూర్తయ్యేదాకా ఉచిత, నిర్బంధ విద్య.

**అధికరణం (ఆర్టికల్) 47 :** పుష్టికరమైన ఆహారానికి, ఆరోగ్యానికి హక్కు.

## చైల్డ్‌లైన్

"చైల్డ్‌లైన్" అనేది బాలల రక్షణ, సంరక్షణ అవసరాలకుగాను 24

గంటలు అందుబాటులో ఉండే జాతీయ ఉచిత అత్యవసర ఫోన్ సదుపాయం '1098'. వీధిపిల్లలకు, హక్కుల హరణకు, పీడనకు గురైన, విధివంచితులైన, దగాపడిన చిన్నారులకు ఆసరా అందించడం "ఛైల్డ్‌లైన్" లక్ష్యం.

తనవంతు కర్తవ్యంగా వీళ్ళను ఓ గమ్యానికో, నీడనిచ్చే చోటుకో చేర్చే వారధి. పిల్లల ఛిద్రమైన జీవితాలలో వెలుగునింపే ఓ పిలుపు "ఛైల్డ్‌లైన్". ఎలాంటి డబ్బు చెల్లించకుండానే పిలిస్తే పలికే సౌకర్యం "ఛైల్డ్‌లైన్".

మన రాష్ట్రంలో హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం నగరాలలో ఈ "ఛైల్డ్‌లైన్" సౌకర్యం ఉన్నది.

ప్రతి బిడ్డ ఓ విలక్షణమైన వ్యక్తి. తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు. అవసరాలు కలిగి వుంటాడు. వ్యక్తిత్వం యొక్క పునాది ఈ దశలో నిర్మాణ స్థితిలో వుంటుంది. తనలోని ఉద్వేగాలకు, పరిసరాల పరిస్థితులకు ఈ దశ ఎక్కువగా ప్రభావితమవుతుంది.

## బాల్యారంభదశ ప్రాముఖ్యత

పిల్లలపై పెట్టే పెట్టుబడి భావి జీవితంలో ఆరోగ్యవంతమైన, ఫలభరితమైన, బాధ్యాతాయుతమైన పౌరులను అందించటానికి నాంది. సమాజానికి సమర్థులైన బిడ్డలను అందించడం ద్వారా సుఖసంతోషాలు, సమర్థమైన కుటుంబం, సమాజం తయారుచేయటం ప్రతి తల్లిదండ్రుల, సమాజం యొక్క ప్రాథమిక బాధ్యత.

## పిల్లల అభివృద్ధిలో కీలక అంశాలు

- బిడ్డ అభివృద్ధి వంశవారంపర్యమైన జన్యువులు, వాతావరణం లేదా పెరిగే పరిసరాల పైన ఆధారపడి ఉంటుంది. తగిన ప్రేరణ కలిగించే వాతావరణం కల్పించడం ద్వారా వారి పూర్తి శక్తి సామర్థ్యాలు అభివృద్ధికి చెందడానికి సరైన పునాది పడుతుంది.
- బాల్యారంభంలో పెంపొందే భావోద్వేగ వికాసం, సాంఘికాభివృద్ధి, పోటీతత్వం, శారీరక, మానసిక అభివృద్ధి అంశాలన్నీ వారి భావిజీవితంలో విజయాలకు ఒక పునాదిగా ఉంటాయి.

## పిల్లల్లో మెదడు పెరుగుదల, అభివృద్ధి

- పిల్లల మెదడు పెరుగుదల మరియు మేధాశక్తి వికాసానికి బాల్యంలో కలిగే అనుభవాలు అత్యంత కీలకమైనవి.
- మనిషిలో 90 శాతం మెదడు అభివృద్ధి మొదటి 5 సం.ల లోపుగా జరుగుతుంది. మెదడు అభివృద్ధి చెందడంతోనే పిల్లల తెలివితేటలు, భాష, భావోద్వేగాలను అదుపులో ఉంచుకోవటం, వ్యక్తిత్వ వికాసం మొదలౌతుంది.
- పుట్టినప్పుడు శిశువు మెదడులో 1,000 కోట్ల నాడీ కణాలుంటాయి. బిడ్డకు ఆరు సం.లు వచ్చే సరికి బిడ్డ మెదడు ఇంచుమించు పెద్దవారి మెదడు స్థాయికి చేరుకుంటుంది.
- మెదడు నిర్మాణ దశలోనే సానపెట్టడానికి (పదును పెట్టడానికి), మార్చడానికి వీలు అవుతుంది. ఒకవేళ పుట్టినప్పటి నుండి ఆరు సం.ల వరకు మెదడుకు ఎటువంటి ప్రేరణ కలిగించనిచో నాడీ కణాలు ఎండిపోయి చచ్చుపడిపోతాయి. ఇది శిశువు నేర్చుకునే సామర్థ్యానికి, అభివృద్ధికి ఆటంకమౌతుంది.
- ప్రేమ, ఆప్యాయతలతో కూడిన పరిసరాలు, మంచి పోషకాహారం, బిడ్డలో జన్యువరంగా అగుపించే లక్షణాలను కూడా మార్చగలుగుతాయి. కాబట్టి ఆ బిడ్డలో మానసిక, శారీరక, తెలివితేటల అభివృద్ధిని పరిసరాలు, పోషకాహారం నిర్ణయిస్తాయి.
- వ్యతిరేకమైన వాతావరణం (పరిసరాలు) మెదడులోని కణాలను నిర్జీవం చేస్తాయి. మత్తుపానీయాలు, మాదక ద్రవ్యాలు, పొగ త్రాగటం, ఒత్తిడి, కోపం, హింస, భయానక అనుభవాల వలన ఒత్తిడిని కలిగించే హార్మోన్లు (కోర్టిసాల్) ఎక్కువగా ఉత్పత్తి అయి, మెదడు కణజాలంను నిర్వీర్యం చేసి, పిల్లలు నేర్చుకొనే సామర్థ్య లోపాన్ని కలిగిస్తాయి.

## మేధా వికాసానికి ప్రేరణ ఎలా కలిగించాలి

**క్రింది కార్యక్రమాల ద్వారా పిల్లల మేధా వికాసానికి ప్రేరణ కలిగించవచ్చును**

- తల్లిదండ్రులు, పిల్లల మధ్య అర్థవంతమైన సంబంధాలను పెంపొందించటం.
- పిల్లలను - తోటి పిల్లలతో, కుటుంబ సభ్యులతో, బంధువులతో, ప్రక్కింటివారితో, సమాజంలోని సభ్యులతో కలిసి మెలగడాన్ని ప్రోత్సహించడం.
- పిల్లలతో ఆడడం, పిల్లలు బొమ్మలతో, వస్తువులతో, స్వేచ్ఛగా ఆడుకొనేటట్లు చూడటం.
- ఇంద్రియాలకు చూపు, వినికిడి, స్పర్శ, రుచి, వాసన వివిధ అనుభవాలను కలుగచేయడం.

ఉదా: **దృష్టికి ప్రేరణ :** పిల్లలకు అందమైన, రంగురంగుల పువ్వులను, ప్రకృతి దృశ్యాలను, కళలను, వివిధ ఆకృతులను, ప్రకాశించే లైట్లను, ప్రకృతిలోని జలపాతాలను, బొమ్మల రూపంలో, ఇతర రూపాలలో చూపించటం.

**వినికిడికై ప్రేరణ :** పిల్లలను వివిధ రకాల సంగీతం, పాటలు, ప్రవచనాలు, కథలు, జానపద గేయాలు, పుస్తకాలు పైకి చదవడం, వివిధ రకాల ప్రసార సాధనాల ద్వారా వినే అనుభవాలను కల్గించటం.

- పిల్లలు వేసే ప్రశ్నలకు వారు సంతృప్తి పడేవరకు జవాబులు చెప్పటం.
- ప్రకృతిలో కనిపించే వస్తువులను, సంఘటనలను చూపిస్తూ వారిని ప్రశ్నలు అడుగుతూ, వివరిస్తూ పిల్లల ఆలోచనాశక్తిని, వివేకాన్ని పెంపొందించటం.
- పిల్లల సంతోషం, కోపం, భయం, ఉద్వేగం, బాధ వంటి అనుభూతులను అర్థం చేసుకోవాలి. పిల్లలు ఈ ఉద్వేగాలను ఎదుర్కొనడానికి సహాయపడటం.
- పిల్లలు ఎప్పుడు మంచి పని చేసినా మెచ్చుకుని, బహుమతులివ్వటం.

### పోషకాహారం

- పిల్లల పెరుగుదలకు తగినంత పోషకాహారం. ప్రేమతో కూడిన సంరక్షణ, తగిన నిద్ర అవసరం. ఇది వారి భావి జీవితంలో చురుకుగా, ఆరోగ్యంగా ఉండేటట్లు చేస్తుంది.
- కుపోషణ, సాధారణ రోగాలు సంక్రమించడం, 75 శాతం మంది పిల్లల మరణాలకు కారణం అవుతోంది.

**(ఐ.సి.ఎమ్.ఆర్ - 2008)**

| సిఫారస్సు చేయబడిన పోషక విలువలు | లభించే ఆహారం | పోషకాహార లోపం వలన కలిగే వ్యాధులు |
|---|---|---|
| క్యాలరీలు - 1690 మాంసకృత్తులు - 30 గ్రా॥ | ధాన్యాలు, చిరుధాన్యాలు పాలు, గుడ్డు, కాలేయం, మాంసం, చేపలు | పొడవు తక్కువగా, సన్నగా ఉండటం, బుద్ధి మాంద్యం |
| కొవ్వు పదార్థాలు - 25 గ్రా॥ | నూనె, వెన్న, నెయ్యి | |
| కాల్షియం - 400 మిల్లిగ్రా॥ | పాలు, పెరుగు, నట్స్, రాగులు, ఆకుకూరలు | రికెట్సు |
| ఇనుము - 18 మిల్లి గ్రా॥ | ఆకుకూరలు-మునగాకు, పాలకూర, మెంతికూర, కొత్తిమీర మొ॥ | బలహీనత, ధ్యాస లేకపోవుట, చదువులో వెనుకబడటం (నేర్చుకోలేకపోవడం) |
| విటమిన్ - ఏ - 400 మైక్రో గ్రా॥ | కారట్, పసుపుపచ్చ గుమ్మడికాయ, పండ్లు-మామిడి, బొప్పాయి, పాలు, పాలతో చేయబడిన పదార్థాలు | కంటిలో మచ్చలు (బైటాట్ స్పాట్స్) |

- దంపుడు బియ్యంలో ఉండే థయమిన్ విటమిన్, పిల్లలలో రోగ నిరోధక శక్తిని కలిగిస్తుంది. కాబట్టి మరపట్టిన (పాలిష్డ్) బియ్యానికి బదులు దంపుడు బియ్యంనే వాడాలి.
- పిల్లల బరువు, వారి ఎత్తు వారి ఆరోగ్య స్థితిని, పెరుగుదల రేటును సూచిస్తాయి. 4-6 సం.ల పిల్లల బరువు తప్పనిసరిగా 19-20 కేజి వుండాలి. ఆరు సం.ల వయస్సున్న అమ్మాయి 118 సెం.మీ. అబ్బాయి 119 సెం.మీ. ఎత్తు ఉండాలి.
- అన్ని పోషక పదార్థాలు తీసుకొనుట వలన చిన్నతనంలోగాని, తర్వాత జీవితంలో గాని ఆహార కొరత వలన వచ్చే జబ్బులను, సరిదిద్దుకోలేని అభివృద్ధి పరమైన నష్టాలను నిరోధించవచ్చును.
- పిల్లలు జబ్బుతో ఉన్నప్పుడు సరియైన ఆహారం సరిపడా తీసుకోవాలి. ఎప్పుడు ఆకలితో ఉంచరాదు. ఎక్కువగా ద్రవపదార్థాలు ఇవ్వాలి. పిల్లలకు నీళ్ళ విరోచనాలు అవుతున్నప్పుడు డీహైడ్రేషన్ అవకుండా ఓ.ఆర్.యస్., ఇవ్వాలి.

### ఆరోగ్య సంరక్షణ

- పిల్లలు జబ్బుల బారిన పడకుండా ఉండడానికి తప్పనిసరిగా పరిశుభ్రత పాటించాలి. ఆహార పరిశుభ్రత, తినడానికి ముందు చేతులు కడుక్కోవడం, శుభ్రమైన, సురక్షితమైన త్రాగునీరు తీసుకోవడం.
- పిల్లల్లో ఉన్న ధైర్యం గుణం కొన్నిసార్లు ప్రమాదాలకు దారి తీస్తుంది. ఈ ప్రమాదాలు మామూలు దెబ్బలుగా గాని, అంగవైకల్యం లేదా మరణానికి దారి తీసేవిగా గాని ఉంటాయి. కాబట్టి పిల్లలను మెట్లపై నుండి లేదా ఎత్తైన ప్రదేశాల నుండి జారిపడటం, ఇతర ప్రమాదాలు (ఆక్సిడెంట్స్) గురించి అప్రమత్తం చేయాలి.
- పిల్లలకు శాశ్వత దంతాలు 4 సం.ల నుండి వస్తాయి కాబట్టి ఆరోగ్యకరమైన దంతాల కొరకు దంత సంరక్షణను ప్రోత్సహించాలి.



## పిల్లల అభివృద్ధి పరిధి

| శారీరక అభివృద్ధి | గ్రహణశక్తి అభివృద్ధి | భాషాభివృద్ధి | సాంఘిక భావోద్వేగాభివృద్ధి |
|---|---|---|---|
| బరువు, ఎత్తు, పెరుగుదల వేగంగా ఉండటం | శ్రద్ధ, ఏకాగ్రత, గ్రహించడం, భావనలు కలిగించటం, జ్ఞాపకశక్తి సమస్యా పరిష్కారం లాంటి మేధాశక్తులను పెంపొందించడం. | పిల్లలతో మాట్లాడటం వారి ప్రశ్నలకు జవాబులు చెప్పడం ద్వారా కొత్త పదాలు, సరియైన రీతిలో వాక్యనిర్మాణం వేగవంతం చేయడం. | తోటి పిల్లలతో, ఇతరులతో ఉండాల్సిన పరస్పర సంబంధాలను ప్రోత్సహించడం. గుంపులుగా ఆడటాన్ని ప్రోత్సహించడం. ప్రతిరోజూ జరిగే సంఘటనల ద్వారా సాంఘిక నైపుణ్యాలు అలవర్చుకోవడం. |
| పెద్ద కండరాల అభివృద్ధికై పరుగెత్తడం, గెంతడం, దుమకడం, మొదలగునవి ప్రోత్సహించడం | గర్తులు ఉపయోగిస్తూ పదాలు, అంకెలు చిత్రపటాలను సైగల (సంజ్ఞ) ద్వారా పరిశీలనా శక్తిని పెంపొందించడానికి ప్రకృతి సంబంధమైన సంఘటనలను వివరించడం. | పిల్లల మాటల ద్వారా వారి అవసరాలను, భావోద్వేగాలను, ఆలోచనలను వ్యక్తీకరించేలా చేయడం. | మాట్లాడటం, సరిగ్గా ప్రవర్తించడం ద్వారా సరియైన భావోద్వేగాలను పెంపొందిచడం. |
| చిన్నకండరాల అభివృద్ధి, కంటి - చేయి సమన్వయానికై బొమ్మలు వేయడం, గుండీలు పెట్టడం, ముడులు వేయడం మొ.వి చేయించడం | వర్గీకరణ - రంగు, ఆకారం, పరిమాణం ప్రకారం వేరుపరచటం. | సమాచారాన్ని అందించడానికి భాషను ఎలా ఉపయోగించుకోవాలో ప్రత్యక్షంగా నేర్పించడం. | పిల్లలు వారి భావాలను, ఇతరుల భావాలను తెలుసుకునేలా చేయడం. |
| | ప్రత్యక్ష అనుభవం, ఆటల ద్వారా సజీవ, నిర్జీవ వస్తువుల పోలికలను, తేడాలను అర్థం చేసుకోవడం. | | పిల్లలు తమ భావాలను వ్యక్తీకరించేటపుడు ఆటంకపరచరాదు. ముఖ్యంగా ఇతరుల ఎదుట చేయరాదు. |

### 'నేను' అనే భావన అభివృద్ధి

- 'నేను' అనే భావన బాల్యారంభ దశలో అభివృద్ధి చెందుతుంది. నేను మంచి, నేను చెడ్డ అన్న భావాభివృద్ధి తల్లిదండ్రులు, అంగన్ వాడి టీచరు, తోటి వయస్సు పిల్లలు, కుటుంబ సభ్యులు వ్యక్తీకరించే భావనలను బట్టి కలుగుతుంది.
- పిల్లలను తిట్టడం, కొట్టడం, గాయపరచడం ద్వారా వారిలో ఆత్మాభిమానం తగ్గి, భావిజీవితంలో విజయాన్ని, సాధించడానికి కావలసిన ఆత్మ విశ్వాసాన్ని కోల్పోతారు.

## పిల్లల అభివృద్ధి మైలురాళ్లు (సూచికలు)

| 3 సం.ల పిల్లలు | 4 సం.ల పిల్లలు | 5 సం.ల పిల్లలు |
|---|---|---|
| సులభంగా నడవడం, | ఒంటి కాలుపై నిలబడటం | కలిసి ఆడడం |
| పరుగెత్తడం, ఎక్కడం, | చిన్న చిన్న ప్రశ్నలు వేయడం, | రకరకాల పదాలను, వాక్యాలను |
| గెంతడం. | చిన్న చిన్న సమాధానాలు | వాడడం, చిన్న కథలు చెప్పడం |
| రెండు లేక మూడు | చెప్పడం | వ్యతిరేక పదాలు అర్థం |
| పదాల వాక్యాన్ని | | చేసుకోవడం |
| మాట్లాడటం, వారిపేరు, | తనంతట తాను చేతులు | |
| వయస్సు | కడుక్కోవడం, | తన బట్టలు తానే వేసుకోవడం |
| తెలుసుకుని ఉండటం, | వివిధ భావాలను చూపించడం | |
| రంగుల పేర్లు చెప్పడం, | | 5 నుండి 10 అంకెలను |
| అంకెలను గుర్తించడం, | స్నేహితుల్ని పేరుతో | లెక్కించడం |
| తనంతట తాను తినడం, | చూపించడం, | |
| గుండ్రంగా గీయడం | చతురస్రాన్ని గీయడం | త్రిభుజాన్ని గీయడం |

- ఏ బిడ్డ అయినా ఆ వయస్సులో చేరవలసిన అభివృద్ధి మైలురాయిని చేరనపుడు, సత్వర నివారణ సేవలు అందించేందుకు గాను, తప్పనిసరిగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి లేదా రిహాబిలిటేషన్ కేంద్రానికి పంపించాలి.

**పూర్వ ప్రాథమిక విద్య**

- పిల్లలకు టీచరు పట్ల భయం లేకుండా నమ్మకం కలిగిస్తూ, తర్ఫీదు ఇస్తూ, నేర్చుకునే వాతావరణాన్ని కలిగించేట్లుగా పూర్వ ప్రాథమిక విద్య ఉండాలి.
- పూర్వ ప్రాథమిక విద్య - పిల్లలందరూ పాల్గొనే విధంగా ఆటపాటలు, కార్యక్రమాలతో కూడినదై ఉండాలి.
- పిల్లలు నిరాటంకంగా విద్యాభాసాన్ని పూర్తి చేయడానికి ఆత్మవిశ్వాసం, ఆత్మాభిమానం, నేర్చుకునే పట్టుదల, కలిసి పనిచేయగలగడం, తోటివారితో వచ్చే సమస్యలను పరిష్కరించుకోగలగడం లాంటి కీలకమైన గుణాలను బాల్యారంభ దశలోనే పెంపొందించవలసిన అవసరం ఉంది.

**ఆట**

- ఆట ద్వారా పిల్లలు 'నేర్చుకోవడం' మొదలుపెడతారు.
- ఆట అనేది చూడటం, వినడం, మాట్లాడటం, తాకడం, వాసన చూడటం, కదలికలతో కూడినదై అన్ని ఇంద్రియాలకు అనుభవాలను కలిగిస్తుంది.
- ఆడుకోవడం పిల్లల్లో సహజసిద్ధంగా ఉండే గుణం. దీని ద్వారా పిల్లలు తమ భావాలను వ్యక్తీకరించగలుగుతారు.
- ఆటలు ఇతరులతో సంబంధాలను పెంపొందించుకోవడానికి తోడ్పడతాయి.
- అంతేగాక వారిలో నిర్లిప్తంగా ఉన్న భావోద్వేగాలను వెలికి తీసుకురావడానికి తోడ్పడతాయి.
- ఆట ఉపశమనం పొందడానికి మార్గం.
- ఆట ద్వారా శారీరక, మేధా, మానసిక, సాంఘిక పరమైన ప్రయోజనాలు కలుగుతాయి.
- ఆట పిల్లల సమగ్ర వికాసానికి దోహదపడుతుంది.

**చిన్న పిల్లల్లో అభివృద్ధిని పూర్తి స్థాయిలో పెంపొందించడం**

- బాల్యారంభ దశలోనే పిల్లలకు మంచి పరిస్థితులను కల్పించడం శ్రేష్ఠం, లాభదాయకం. అలా కల్పించకపోతే తర్వాత జీవితంలో ఎదురయ్యే సమస్యల వలన కుటుంబం మొత్తం ఎంతో నష్టానికి గురి కావలసి వస్తుంది.
- తల్లిదండ్రుల విద్య, కుటుంబ తోడ్పాటు, సరైన సంరక్షణ, పూర్వప్రాథమిక విద్య, బడికి సిద్ధం చేసే తొలి యత్నాల ద్వారా ఇంటి వద్దగాని, ఇంటి బయట గాని నేర్చుకునే, ఉత్తమమైన తొలి అనుభవాలను బిడ్డకు కలుగచేస్తాయి.

**విశిష్ట పాత్ర**

- 3-6 సం.ల పిల్లల పేర్లు అన్నీ నమోదు చేయడం.
- ప్రతిరోజు పూర్వప్రాథమిక కార్యక్రమాలు - మంచి అలవాట్లు, సంభాషణ, పాటలు, ఆటలు, సృజనాత్మకత, సంసిద్ధత కృత్యాలను 2 1/2 గంటలు నిర్వహించడం.
- పిల్లల కంటే ముందుగా కేంద్రానికి వచ్చి వారిని చిరునవ్వుతో ఆహ్వానించడం. పిల్లల్ని పేరు పేరున పలుకరిస్తూ, వారితో ఓపిగ్గా మెలగడం.
- పిల్లల్ని ఆకర్షించే రీతిలో అంగన్‌వాడి కేంద్రాన్ని పెట్టుకోవడం.
- పిల్లల్లో నేను సాధించగలను అనే భావనను, ఆత్మస్థైర్యాన్ని పెంపొందించడం.
- పిల్లల్ని అప్పుడప్పుడు ప్రకృతి సందర్శనకు తీసుకెళ్ళడం, పిల్లలు చేసిన వస్తువులను ప్రదర్శించడం, పిల్లలచే సాంస్కృతిక కార్యక్రమాలను చేయించడం.
- కార్యక్రమాలను నిర్వహించడానికి కావలసిన బోధనా సామాగ్రిని (టి.ఎల్.ఎమ్.) తయారు చేసుకోవడం.

**ఐక్యరాజ్యసమితి ఆమోదించిన బాలల హక్కుల తీర్మానం (1992లో భారతదేశము సమ్మతించిన ప్రకారం)**

- విశ్రాంతి, విరామం, ఆడుకోవడం, వినోదించడం ప్రతి బిడ్డ హక్కు - ఆర్టికల్ 31.
- పిల్లల అపహరణ, అమ్మకం ఏ ప్రయోజనం కోసమైనా సరే, ఏ రూపంలో ఉన్నా సరే నేరం - ఆర్టికల్ 36.
- పిల్లలను మాదకద్రవ్యాలు, మత్తుపదార్థాలు వినియోగం నుండి రక్షించాలి. అలాంటి పదార్థాల అక్రమ తయారీలో, పంపిణీలో పిల్లలను వినియోగించటం నేరం - ఆర్టికల్ 33.
- పిల్లల అభివృద్ధికీ, ఎదుగుదలకు తల్లీ, తండ్రీ ఇద్దరిదీ ఉమ్మడి బాధ్యత - ఆర్టికల్ 18.
- బిడ్డ శారీరక, మానసిక, భౌతిక, నైతిక, సాంఘిక అభివృద్ధికి అనువుగా జీవన ప్రమాణాన్ని కలిగి ఉండటం అనేది ప్రతీ బిడ్డకూ ఉండే హక్కు - ఆర్టికల్ 27.
- విద్య ప్రతి బిడ్డ ప్రాథమిక హక్కు - ఆర్టికల్ 28.

**పోషకాహారం, విద్య, మంచి పరిసరాలు అనేవి బిడ్డ, కుటుంబం, సమాజం పెరుగుదల, అభివృద్ధికి పునాది.**

# పక్షి ప్రేమికుడు అలెన్ ఆక్టివియన్ హ్యూమ్

**భారత జాతీయ కాంగ్రెస్ స్థాపనకు ప్రేరకుడు, అలెన్ ఆక్టేవియన్ హ్యూమ్. ఈయన 1829 జూన్ 6 న ఇంగ్లండ్‌లోని సెంట్ మేంక్రీలో జన్మించాడు. తండ్రి జోసఫ్ హ్యూమ్. ఈస్టిండియా కంపెనీ వారు నెలకొల్పిన, హెయిల్‌బరి కాలేజ్‌లోను, ఆ తర్వాత యూనివర్సిటి మెడికల్ కాలేజ్ హాస్పిటల్‌లోను, మెడిసిన్, సర్జరి చదివాడు.**

**1849లో ఉత్తరప్రదేశ్‌లో ఎటావా జిల్లా అధికారిగా, 1849 నుండి 1879 వరకు ప్రభుత్వ కార్యదర్శిగా పని చేశాడు.**

ఆక్టేవియన్ భారతదేశం పట్ల గౌరవాభిమానాలు కలవాడు. ఆంగ్లేయుడైనా భారతదేశ పాలకులుగా వుండిన దొరల దురాగతాలను తీవ్రంగా విమర్శించేవాడు.

హ్యూమ్ ఉద్యోగంలో చేరిన తర్వాత 1857లో ప్రథమ భారత స్వాతంత్ర్య సమరం ప్రారంభమైంది. అతడు పని చేస్తున్న ఎటావా సమీపంలోనే యుద్ధం ప్రారంభమైంది. ఆంగ్లేయుల దౌర్జన్యాన్ని ఖండిస్తూ, భారతీయులతో సామరస్యంగా వుండమని కోరేవాడు.

హ్యూమ్ ఐ.పి.యస్ అధికారిగా ఉద్యోగ జీవితం ప్రారంభించాడు.



ఉచిత ప్రాథమిక విద్యా విధానాన్ని అమలు చేయటమేకాక, 'లోక్‌మిత్ర' అన్న పత్రికను ప్రారంభించాడు.

1853లో మేరి ఆన్‌గ్రిండల్‌ను పెళ్ళాడాడు. 1860 హ్యూమ్ పాలనా విధానాన్ని ధైర్య సాహసాలను ప్రశంసిస్తూ, ''కంపానియన్ ఆఫ్ దబాత్'' ప్రశస్తినిచ్చి ప్రభుత్వం గౌరవించింది.

భారతీయ విద్యార్థులను ఉన్నత విద్యనభ్యసించడానికి ప్రోత్సహించాడు. భారతీయులను విద్యావంతులుగా చేసి వుండిన 1857 నాటి తిరుగుబాటు వుండేది కాదన్నాడు.

తుపాకులతో బెదిరించే పాలన కంటే ప్రజల సహకారాన్ని, నైతిక విలువలు పెంపొందించే పాలన సాగించాలనేవాడు.

1863లో బాలనేరస్థుల కోసం 81 ప్రత్యేక పాఠశాలలను ప్రారంభించాడు. ఆ పాఠశాలల్లో ఇద్దరు బాలికలతో పాటు 5186 గురుబాలురు ఆ బడులలో చదువుకునేవారు. కస్టమ్స్ కమిషనర్‌గా వాయవ్య సరిహద్దు రాష్ట్రంలో పనిచేశాడు. తర్వాత కేంద్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్ జనరల్‌గా పనిచేసి, మరలా రాష్ట్రపాలనకు బదిలీ అయ్యాడు. ఉన్నతోద్యోగిగా పలుచోట్ల పనిచేసి 1882లో పదవీ విరమణ చేశాడు.

ప్రభుత్వోద్యోగిగా పెషావర్ నుండి కన్యాకుమారి వరకు పర్యటిస్తూ భారతదేశంలోని పక్షి జాతుల అధ్యయనం విస్తృతంగా చేశాడు. పక్షి జాతుల వివరాల సేకరణ కోసం 50 మంది స్వయం సేవకులను నియమించాడు.

తాను సేకరించిన పక్షి జాతుల వివరాలతో 'ద బర్డ్స్ ఆఫ్ ద ఎంపైర్' అన్న పేరుతో కొన్ని సంపుటాలను ప్రచురించాడు. భారతదేశంలోని పక్షి ప్రేమికులు సేకరించిన వివరాలతో 'ద స్ట్రే ఫెదర్స్' అనే పత్రికను 1872లో కలకత్తా నుంచి ప్రచురించేవాడు. ఆ పత్రిక హ్యూమ్ భారతదేశం నుండి వెళ్ళిన తర్వాత కూడా వెలువడుతుండేది. భారతదేశంలో వెలువడిన మొట్టమొదటి ప్రకృతి విజ్ఞాన పత్రిక 'స్ట్రే ఫెదర్స్' నేడు ముంబై నుండి ప్రచురింపబడుతున్న 'ద జర్నల్ ఆఫ్ ద నేచురల్ హిస్టరి' పత్రికకు మూలం.

తీరిక వేళలో పక్షులను పరిశీలించటమే కాక, వాటి గూళ్ళను, గుడ్లను సేకరించేవాడు. మన దేశంలో ఉద్యోగాలు చేసిన పాతికేళ్ళలో 63 వేల పక్షి ఈకలను, 19 వేల రకాల గుడ్లను సేకరించాడు. వీటి సేకరణ కోసం సొంత పైకం 20 వేల పౌండ్లు ఖర్చు చేశాడు. వీటినన్నిటినీ సిమ్లాలోని అధికార భవనంలో భద్రపరచాడు. ఆ కాలంలో ఒక వ్యక్తి సేకరించిన నమూనాల్లో కెల్లా పెద్దది హ్యూమ్ సేకరణ. తన సేకరణ వివరాలను 1873లో 'నెస్ట్స్ అండ్ ఎగ్స్ ఆఫ్ ఇండియన్ బర్డ్స్' అన్న పుస్తకంగా 'ద గేమ్ బర్డ్స్ ఆఫ్ ఇండియా' పేరుతో మూడు సంపుటాలను ప్రచురించాడు.

కొన్ని అరుదైన పక్షులకు 'హ్యూమ్స్ గౌండ్ పెక్కర్, హ్యూమ్ వీటర్, హ్యూమ్ వార్మర్' అన్న పేర్లు పెట్టాడు. 1884లో జరిగిన ఒక దుస్సంఘటన హ్యూమ్ మనసును బాగా గాయపరచింది. అతడు సిమ్లాలో నిర్మించుకొన్న రాత్నీ కాజల్‌లోని తన పక్షి సంపదను కొందరు అసూయాగ్రస్తులు దోచుకున్నారు. కుంభవృష్టి వల్ల కొన్ని నాశనమైనాయి. ఈ విధ్వంసానికి బాధపడి మిగిలిన 82 వేల పక్షులలో 75,577 పక్షుల ను బ్రిటిష్ మ్యూజియంకు అప్పగించాడు. అవి లండన్‌లోని ఒక ప్రత్యేక భవనంలో భద్రపరచాడు.

అలెన్ హ్యూమ్ అత్యంత నిజాయితీ పరుడైన అధికారి అంటూ 'ది స్టేట్స్‌మన్', 'ద పయొనీర్', 'ది ఇంగ్లీష్ నేషన్' మొదలైన అన్ని పత్రికలు ప్రశంసలతో ముంచెత్తాయి. బ్రిటిష్ పాలకుల అరాచకాలను తీవ్రంగా ఖండిస్తూ, కలకత్తా విశ్వవిద్యాలయ విద్యార్థులకు ఒక బహిరంగ లేఖ రాశాడు. ఆ లేఖ ప్రభావంతోనే 1885లో ముంబైలో జరిగిన ప్రథమ భారత జాతీయ మహాసభలో పాల్గొన్నాడు. అలెన్ అక్టేవియన్ హ్యూమ్ స్థాపించిన భారత జాతీయ కాంగ్రెస్, ప్రస్తుతం 125 ఏళ్ళు పూర్తి చేసుకొని దేశమంతటా ఉత్సవాలు జరుపుకొంటున్నది.

భారతదేశ చరిత్రలో పక్షి జాతుల పరిశీలనకు శాస్త్రీయమైన పునాదులు వేసినవాడుగానే కాక, కాంగ్రెస్ సంస్థ స్థాపనకు ప్రేరకుడుగా చిరస్మరణీయుడైనాడు. అలెన్ అక్టేవియన్ హ్యూమ్ 6-6-1829లో జన్మించి 31-7-1912లో కాలగతి చెందాడు.

*- జానమద్ది హనుమచ్ఛాస్త్రి*

# ఆంధ్రప్రదేశ్‌లో సంక్షేమ పథకాలు

**భారతదేశం పల్లెలోనే నివశిస్తుందని గాంధీ మహాత్ముడు అనేవారు. స్వాతంత్రానంతరం నగరాలు, పట్టణాలు ఎంత పెరిగినా మనదేశం ఇప్పటికీ పల్లెలోనే నివశిస్తుంది. అయితే నగర జనాభా కంటే పల్లెలో నివశించే జనాభా చాలా ఎక్కువ. అందుకే గ్రామాలు అభివృద్ధి చెందితేనే మనదేశం అభివృద్ధి చెందినట్లేనని అంటారు. కాని గ్రామాలలో ముఖ్యంగా పేదరికం, నిరుద్యోగిత, నిరక్షరాస్యత వంటి సమస్యలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. భారతదేశం లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో గ్రామాల్లో పేదరికం ఎక్కువగా వుంది. నేషనల్ శాంపిల్ సర్వే ప్రకారం భారతదేశ జనాభాలో 27.8 శాతం ఆంధ్రప్రదేశ్‌లో 15.80 శాతం పేదలు వున్నట్లు అంచనా.**

**గ్రామాల్ని అభివృద్ధి పరుచటంలో సంక్షేమ పథకాల పాత్ర :** ఆర్థిక ప్రణాళికలు ప్రారంభించినప్పటి నుండి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికై కేంద్ర ప్రణాళిక సంఘం ఇస్తున్న మార్గదర్శక సూత్రాలను అనుసరిస్తూ గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా చేసుకుని మనరాష్ట్ర సమగ్రాభివృద్ధికి అనేక ప్రత్యేక పథకాలు ప్రవేశపెట్టింది. ఉపాధి అవకాశాలు, ఆహారభద్రత, సాంఘిక భద్రత కల్పించి గ్రామాలను ఆదుకుని అభివృద్ధి పరిచే కొన్ని ముఖ్య సంక్షేమ పథకాలను మన రాష్ట్ర ప్రభుత్వం చేపడుతోంది. మన ప్రభుత్వం వివిధ రకాలైన పథకాలు అమలుచేస్తున్నప్పటికి వాటిలో కొన్ని పథకాలు మాత్రమే ప్రజలకు చేరువై, గ్రామాలను అభివృద్ధి పరిచాయనటంలో ఎటువంటి సందేహం లేదు.

### ప్రస్తుతం ప్రజలకు చేరువలో వున్న కొన్ని ముఖ్య సంక్షేమ పథకాలు

**1. ఇందిరా క్రాంతి పథం (IKP):** రాష్ట్రంలోని 22 గ్రామీణ జిల్లాలలోని పేద ప్రజల జీవన ప్రమాణాలు పెంపొందించాలనే లక్ష్యంతో డ్వాక్రా, వెలుగు లాంటి ముఖ్య పథకాలను విలీనం చేసి 2005 - 2006లో ఈ పథకాన్ని రూపొందించారు. ఈ పథకాన్ని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (SERP Society for Elimination of Rural Poverty) అమలు చేస్తున్నది. గ్రామాల్లో నివశించే పేద కుటుంబాలకు ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు ఈ పథకం ఏర్పాటైంది.

### ఇందిరాక్రాంతి పథకం క్రింద అమలు అవుతున్న పథకాలు

**పావలా వడ్డీ పథకం**

- రానున్న 4 సంవత్సరాలలో లక్షమంది పేద కుటుంబాలకు ప్రయోజనం కల్పించాలన్నేదే ఈపథక ముఖ్య ఉద్దేశ్యం.
- స్వయం సహాయక బృందాలకు, వ్యవసాయ రుణాలకు బ్యాంకుల ద్వారా పావలావడ్డీతో ఋణాలు అందజేయడం.
- ఈ పథకం ద్వారా ఇప్పటి వరకు రూ॥ 6400 కోట్లు పంపిణీ చేయబడింది.

**వృధాప్య పింఛను పథకం**

- సామాజిక సహాయ కార్యక్రమాల పథకం క్రింద ప్రభుత్వం 60 సం॥ దాటిన వృద్ధులుకు, వికలాంగులకు, వితంతువులకు ప్రతినెలా ద్రవ్య రూపంలో సహాయం అందించడం ఈ పథకం ముఖ్య ఉద్దేశ్యం.
- 65 సంవత్సరాలు వయస్సు దాటిన వృద్ధులకు నెలకు 200 రూ॥ చొప్పున అందజేయడం జరుగుతుంది.
- వికలాంగులకు రూ॥ 500 చొప్పున అందజేయడం జరుగుతుంది.

**డా॥ వై.యస్.ఆర్ అభయహస్తం**

- స్వయం సహాయక బృందాల (SHG) మహిళలు కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన పింఛన్ ఇన్సూరెన్స్ పథకమే ఈ అభయహస్తం.
- గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో 18 సంవత్సరాలు నిండిన SHG మహిళలకు వృద్ధాప్యంలో సామాజిక భద్రత అందించాలనే లక్ష్యంతో ఈ పథకం ప్రారంభించడం జరిగింది.
- దీనికి ప్రభుత్వం, మహిళలు కూడా ప్రీమియం చెల్లిస్తారు.
- ఇప్పటి దాకా ఈ పథకంలో 41 లక్షల మంది మహిళలను ప్రభుత్వం చేర్చుకోవటం జరిగింది.

ఇవే కాక ఇందిరక్రాంతి పథకంలో మహిళలకు ఆహారభ్రదత, సామాజిక పట్టుబడినిధి, బీమాపథకము, ఉపాధి కల్పన లాంటి వివిధ రకాలైన పథకాలను గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా ప్రభుత్వం చేపడుతోంది.

**2. ఆరోగ్యశ్రీ పథకం :** దారిద్ర్యరేఖకు దిగువున వున్న వారికి వైద్య సదుపాయం కల్పించాలనే ఉద్దేశ్యంతో ఈ భీమా పథకాన్ని 2004, మే 15న రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది.

- స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పథకం క్రింద 1,50,000 రూపాయలు వరకూ బీమా సదుపాయం లభిస్తుంది.
- కార్పొరేట్, ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రులలో ఉచితంగా ఈ పథకం ద్వారా చికిత్స అందజేస్తారు.

**3. మహాత్మాగాంధీ జాతీయగ్రామీణ ఉపాధిహామీ పథకం :** వర్తమాన సమస్యలైనా పేదరికం, నిరుద్యోగిత, గ్రామీణ యువతికి ఉపాధి, వలసలు నివారణ వంటి సమస్యలు తీర్చుటకు కేంద్ర ప్రభుత్వం 2005లో ప్రారంభించడం జరిగింది. అయితే మన రాష్ట్రంలో అనంతపురం జిల్లా బండ్లపల్లి గ్రామంలో 2006 ఫిబ్రవరి 2న ఈ పథకాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ పథకం రాష్ట్రంలో హైదరాబాద్ మినహా మిగిలిన 22 జల్లాలో విజయవంతంగా అమలు చేయబడుతోంది.

**ఈ పథకం ముఖ్యాంశాలు**

- గ్రామీణ ప్రాంతాలలో కూలీల బతుకులకు భద్రత
- గ్రామీణ ప్రాంతంలో ప్రతి కుటుంబానికి ఈ పథకం క్రింద ఒక ఆర్థిక సంవత్సర కాలంలో 100 రోజులు తక్కువ కాకుండా పని కల్పించడం.
- వ్యక్తిగత, ఉమ్మడి, సామాజిక, మౌలిక వనరులు అభివృద్ధి
- యంత్రాలు, కాంట్రాక్టర్లకు తావులేకాకుండా కూలీలకు పని కల్పించటం.

ఇలా వివిధ రకాలైన పథకాలే కాక వెనుకబడిన తరగతులు వారికి, షెడ్యూలు కులాలు వారికి, అల్ప సంఖ్యాక వర్గాల వారికి, గ్రామాల్లో వారి అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోంది అనడంలో ఎటువంటి సందేహం లేదు. వాటిలో ముఖ్యమైయినవి.

**1. షెడ్యూలు కులాల సంక్షేమం :** 2001 జనాభా లెక్కలు ప్రకారం రాష్ట్ర జనాభాలో 16.19 శాతం షెడ్యూల్డు కులాల ప్రజలు వున్నారు. గ్రామాల్లో షెడ్యూలు కులాల ప్రజల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాలు, ప్రయోజనాలు చేకూరేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.

- సాంఘిక సంక్షేమశాఖ షెడ్యూల్డు, కులాల వారి సంక్షేమం దిశగా విద్యారంగంలో, సామాజిక రంగంలో, ఆర్థికాభివృద్ధిలో వారి అభివృద్ధికి చర్యలు తీసుకుంటుంది.
- సామాజిక రక్షణ
- అనాథ పిల్లలకు హోమ్స్
- సామాజిక భద్రత
- వెట్టి చాకిరి నుండి విముక్తి కాబడిన వారి పునరావాసము

**2. గిరిజనాభి వృద్ధి - సంక్షేమం :** మన రాష్ట్రంలో 42 లక్షల మంది గిరిజనులుల ఏజెన్సీలతో, గ్రామీణ ప్రాంతాలలో, మైదాన ప్రాంతాల్లో నివశిస్తున్నారు. మన రాష్ట్రంలో సుమారు 33 షెడ్యూల్డు తెగలు వారు జీవిస్తున్నారు. మన ప్రభుత్వం ITDA ద్వారా గిరిజన ప్రాంతాలకు గిరిజనులను అభివృద్ధి పరిచేందుకు కొన్ని ప్రత్యేక పథకాలు రూపొందించింది.

- గిరిజన ప్రాంతాలకు రోడ్లు వేయడం
- చిన్న తరహా సాగునీటి పథకాలను అభివృద్ధి పరచడం.




- మంచి నీటి వసతి కల్పించడం
- వ్యవసాయ రుణాలు మంజూరు చేయడం.
- సమగ్ర శిశు కార్యక్రమాలు
- విద్యాభివృద్ధి
- వైద్య సదుపాయాలు
- గృహ నిర్మాణం

**3. వెనుకబడిన తరగతుల సంక్షేమం :** 1994 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వెనుకబడిన తరగతుల వారి అభివృద్ధికి, సంక్షేమానికి, వారి వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించడానికి ప్రత్యేకంగా కొన్ని పథకాలు ప్రవేశ పెట్టడం జరిగింది.

- విద్యా అవకాశాలు కల్పించడం
- వృత్తి పరంగా అనేక సౌకర్యాలు కల్పించడం
- వారి నైపుణ్యాన్ని పెంపొందించడం

**4. వికలాంగుల సంక్షేమం :** రాష్ట్ర ప్రభుత్వం వికలాంగుల సంక్షేమం కోసం 1983 సం॥ నుండి వారి అభివృద్ధికి కృషి చేస్తోంది. శారీరకంగా అంగవైకల్యం, దృష్టి లోపం, వినికిడి లోపం, మానసిక వైకల్యం, మొదలగు లోపాలు కలిగిన వారికి ప్రభుత్వం ప్రత్యేకంగా పథకాలు రూపొందించి వారి అభివృద్ధికి తోడ్పడుతుంది.

- ప్రతినెలా 500రూ॥ పింఛను (నిరుద్యోగభృతి)
- మూడు చక్రాల బళ్ళు
- కళ్ళ అద్దాలు అందించడం
- ఆర్థిక పునరావాసం.
- ఉపకార వేతనాలు

ఇలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన అనేక అభివృద్ధి పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు మరియు ఇతర పథకాల వల్ల భారతదేశంలో మిగతా రాష్ట్రంలో కంటే ఆంధ్రప్రదేశ్ గ్రామాలు అభివృద్ధి చెంది, పేదరిక స్థాయి వేగంగా తగ్గుతుందనడంలో ఎటువంటి సందేహం లేదు అని చెప్పవచ్చు.

**- యం. ప్రదీప్ కుమార్**
**రీసెర్చ్ అసోసియేట్, సి.డబ్ల్యు.యస్, అపార్డ్**

**ప్రకృతి విపత్తులు మానవాళికి కల్గిస్తున్న సమస్యల కంటే, ఆరోగ్య విపత్తులు మానవాళికి కల్గిస్తున్న సమస్యలు రాను రాను అధికం అవుతున్నాయి. ప్రకృతి విపత్తులు కంటికి కనబడతాయి కానీ ఆరోగ్య విపత్తులు కంటికి కనబడకుండా ఎక్కువ నష్టం కలిగిస్తాయి. కావున ఆరోగ్య విపత్తుల మీద అవగాహన కలిగి ఉండటం, దానికి తగిన జాగ్రత్తలు తీసుకోవటం ఎంతైనా అవసరం.**



# ముంచుకొస్తున్న ఆరోగ్య విపత్తులు – ఆస్తమాపై అవగాహన

ఉబ్బసం/ ఆస్తమా తరచూ రోగులేకాదు వైద్యులు కూడా పొరబడుతుండేటు వంటి క్లిష్టమైన సమస్య. ఆస్తమా విషయంలో మన సమాజంలో ఎన్నో అపోహలు, అనుమానాలు సిర్థపడిపోయాయి. వేగంగా నడచినా, మెట్లుఎక్కినా ఆయాసం రావటం వంటి లక్షణాలన్నీ వీరిలో కనిపిస్తుంటాయి. ఇలాంటి వారిలో చాలా మందికి ఊపిరితిత్తుల సామర్థ్య పరీక్ష చేస్తే ఊపిరితిత్తులు 25% పనిచేస్తున్నట్లు బయటపడుతుంది. దీర్ఘకాలం ఆస్తమాకు సరైన చికిత్స తీసుకోకుండా నిర్లక్ష్యం చేస్తుంటే ఊపిరితిత్తుల సామర్థ్యం ఇలా గణనీయంగా పడిపోతుంది. ఆస్తమా బాధితులు పెద్దగా ఇబ్బంది లేదని చెబుతున్నపుడు వైద్యులు పొరబడతారు. దీనివలన మందులు తగిన మోతాదులో సిఫార్సు చేయని కారణంగా ఊపిరితిత్తుల సామర్థ్యం గణనీయంగా పడిపోతుంది.

ఆస్తమా బాధితులందరిలోనూ లక్షణాల ఒకేలా ఉండవు. వీటిలో చాలా రకాలున్నాయి. వీటినే "ఫినోటైప్స్" అంటారు. కొందరు ఏ కొంచెం ఆస్తమా ఉన్నా తీవ్రమైన ఆయాసంతో, శ్వాస తీసుకోలేక ఇబ్బంది పడుతుంటారు. వీరిని పరీక్షిస్తే జబ్బు తీవ్రత ఏమంత ఎక్కువగా ఉండదు కానీ బాధలు ఎక్కువే ఉంటాయి. కొందరికి కొన్ని కొన్ని కాలాల్లో కొద్ది రోజులు మాత్రమే ఆస్తమా కనబడుతుంది. దీనిని "ఇంటర్ మీడియెట్ ఫినోటైప్స్" అంటారు. మరికొందరికి ఉన్నట్లుండి హఠాత్తుగా ఉబ్బసం ఉధృతం అవుతుంది. వీరిని ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో చేర్చి వెంటిలేటర్ అమర్చితేగానీ కోలుకోలేరు. ఇది "నియర్ ఫాటల్ ఆస్తమా" ఆస్తమా బాధితుల్లో ఎక్కువ మందికి ఏడాది పొడవుగా అప్పుడప్పుడు ఉబ్బసం బాధలు వచ్చిపోతుంటాయి. ఇళ్ళు దులిపినపుడో, దుమ్ము, ధూళిలోనికి వెళ్ళినప్పుడో వీరిలో ఆస్తమా లక్షణాలు బాధించొచ్చు. దీనిని "మోడరేట్ ఫీనోటైప్స్" అంటారు. అయితే ఏ రకం ఉబ్బసం ఉన్నా దానిని సమర్థంగా నియంత్రించేందుకు మాత్రం ఇప్పుడు సమర్థమైన చికిత్సా విధానాలు మాత్రం ఉన్నాయి.

(1) **లంగ్ ఫంక్షన్ టెస్టు :-** ఇందులో మనం ఎంతగాలి పీలుస్తున్నాం, ఎంత వదులుతున్నాం, ఎంత సమయంలో వదులుతున్నామన్నది కంప్యూటర్ సాయంతో కచ్చితంగా కొలుస్తారు. ఆరోగ్యవంతుడైన ఒక వ్యక్తి గాలి వదిలినప్పుడు తొలిసెకండులోనే 80-90 శాతం గాలి బయటకు వచ్చేస్తుంది. అదే ఆస్తమా బాధితులకు 4 సెకండ్ల కాలవ్యవధి పడుతుంది. ఇలాంటి వారికి వెంటనే "రిలీవర్" మందు ఇచ్చి 20 నిముషాల తర్వాత మళ్ళీ పరీక్ష చేస్తే మొదటిసారి పరీక్ష వదిలిన గాలి కన్నా 10-12% ఎక్కువ గాలి వదిలితే ఆస్తమా ఉన్నట్లు నిర్ధారిస్తారు.

(2) **పీక్ ఫ్లోమీటర్ :-** ప్లాస్టిక్ గొట్టంలా ఉండే దీనిలోకి గట్టిగా ఊదినప్పుడు ముల్లు కదులుతుంది. ఆ అంకెలను బట్టి గాలి వదిలిన వేగాన్ని గుర్తిస్తారు.

**(3) ఛాతి ఎక్స్‌రే :-** ఆస్తమా లక్షణాలేగాక ఇతర సమస్యలేమైనా ఉంటే ఛాతి ఎక్స్‌రేలో బయటపడతాయి.

ఆస్తమా జీవితాంతం ఉండే సమస్య. కేవలం లక్షణాలు కనిపించనంత మాత్రాన వ్యాధి లేదని అనుకోరాదు. శ్వాసనాళాల్లో ఆస్తమాకు సంబంధించిన వాపులో లోపల ఎంతో కొంత ఉంటుంది. అందుకే దీనికి నిరంతర చికిత్స అవసరం. సరైన చికిత్స తీసుకోక పోతే ఏటా 2-3% చొప్పున శ్వాసనాళాలు మూసుకుపోతాయి. ఒకసారి ఈ స్థితికి చేరితే వాటిని తిరిగి సరిచేయటం సాధ్యం కాదు. కాబట్టి ఉబ్బసం లక్షణాలు కనిపించకపోయినా మందులు వాడుతూ ఉండాలి.



**(1) ఇన్ హేలర్స్ :-** ఇవి 1970 నుంచి అందుబాటులో ఉన్నాయి. బిళ్ళలు, మాత్రల కంటే దీనితో మందు మోతాదు 1/40 వంతు తగ్గించే వీలుంది. నోటి ద్వారా పీల్చినప్పుడు వీటిలోని మందు నేరుగా ఊపిరితిత్తుల్లోకే వెళుతుంది. కాబట్టి వీటితో ఇతరత్రా దుష్ప్రభావాలు ఉండవు. అందువల్ల ఇన్‌హేలర్లు దీర్ఘకాలం వాడినా ఇబ్బంది ఉండదు. చిన్నపిల్లలకు, గర్భిణులకు కూడా నిశ్చింతగా ఇవ్వవచ్చు.

**(2) రిలీవర్స్ :-** ఇవి కుంచించుకుపోయిన శ్వాసనాళాలను వెంటనే తెరుచుకునేలా చేస్తాయి. దీనితో ఆస్తమా నుంచి వెంటనే ఉపశమనం దక్కుతుంది. కానీ వీటి ప్రభావం తాత్కాలికం. ఇవి ఆస్తమా రాకుండా నివారించలేవు.

**(3) ప్రివెంటర్లు / కంట్రోలర్లు :-** ఇవి ఆస్తమా మళ్ళీ రాకుండా నివారించేందుకు వాడతారు. ప్రివెంటర్స్‌గా ఇచ్చే మందులన్నీ స్థిరాయిడ్లు. ఇవి సురక్షితమైనవి.

### ఎందుకొస్తుంది?

మనన ఊపిరితిత్తుల్లోని శ్వాసనాళాలు చాలా సున్నితమైనవి. వీటికి ఏదైనా అలర్జీ కారకం తగిలినప్పుడు అవి ఒక్కసారిగా వాచి, ఉబ్బిపోయి, సంకోచిస్తాయి దీనితో శ్వాస తీసుకోవటం కష్టంగా మారుతుంది. ఇదే ఉబ్బసానికి మూలం. అయితే సరిపడని పదార్థాలు, అలర్జీ కారకాలన్నీ వ్యక్తి వ్యక్తికి మారిపోతుంటాయి. దీనికి జన్యుపరమైన అంశాలు కూడా కారణమవుతాయి.

### ఆస్తమా ప్రేరకాలు

(1) ఏసీలు

(2) సిమెంటు, దుమ్ము

(3) చల్లటి కూల్‌డ్రింకులు

(4) దుమ్ము, ధూళి

(5) పుప్పొడి

(6) పెంపుడు జంతువులు బొచ్చు

### గుర్తించటం

ఆస్తమా ప్రధాన లక్షణం "దగ్గు", ఎపుడైనా ఒక కోర్సు యాంటీ బయెటిక్స్ వాడినా దగ్గు తగ్గకపోతే వెంటనే ఆస్తమానేమోనని అనుమానించాలి. ఆస్తమాను గుర్తించటం కొరకు లంగ్ ఫంక్షన్ టెస్ట్ తప్పకుండా చేయించాలి. గతంలో చర్మం, ముక్కు సంబంధ అలర్జీల వంటివి ఉంటే మరింత ఎక్కువగా అనుమానించాలి.

### జాగ్రత్తలు

(1) సరైన పోషకాహారం తీసుకోవాలి. ముఖ్యంగా సూర్యరశ్మి తాకేలా చూసుకోవాలి. విటమిన్ - డి, అన్ని రకాల కూరగాయలు, పండ్లు తినాలి.

(2) పొగాకు జోలికి వెళ్ళకూడదు.

(3) క్రిమి సంహారకాలు, దోమలను తరిమే రెపలెంట్లు, కాయిల్స్, అగరుబత్తీలు, హోమాల నుండి వచ్చే పొగ ఆస్తమాకు ప్రేరకాలుగా పనిచేస్తాయి.

(4) బెడ్‌రూమ్ నందు పుస్తకాలు, పాత పేపర్లు, ధాన్యపు నిల్వలు ఉంచరాదు.

(5) వ్యాయామం చేస్తున్నప్పుడు తగిన జాగ్రత్తలు, వైద్యుల సలహాలను పాటించాలి.

**- డా॥ ఆసం నిర్మలాదేవి**

**ఫ్యాకల్టీ, విపత్తు నిర్వహణ విభాగం, అపార్డు**

**శబ్దస్వరూప పరంగానూ, అర్థపరంగానూ, మార్పులు పొందిన పదాలెన్నో తెలుగుభాషలో కలిసిపోయాయి. కాలం, సంస్కృతి, విద్య, సంప్రదాయాది కారణాల వల్ల పదాలు-పదార్థాలు మారతాయి. ఇది ఏ భాషకైనా అనివార్యం, ఆంగ్లభాషలో కూడా మిశ్రపద ప్రయోగాలు (synthetic terms) ఆధునికంగా ఏర్పడ్డాయి.**

వస్తాయి. ఉదా. Bonner - బావుటా, Project - ప్రణాళిక/నిర్మాణం, Atonomy - స్వయంప్రతిపత్తి, Satellite towns - శివారు నగరాలు, Intellegence - గూఢచర్య; Kidnapping - అపహరణ.

ఇటువంటి పదకల్పన భాషకు ఎంతో అవసరం. మూల భాషాపదాలు ఇచ్చే అర్థం స్పష్టంగా ఉండేటట్లు స్వీయభాషలో చక్కని

# ఆధునిక తెలుగు సమానార్థక పదకల్పన

**ప్రస్తుతం ఆంగ్లభాషా ప్రాబల్యం వల్ల తెలుగు పదాల వాడుక చాలా వరకూ తగ్గిపోతోంది. తెలుగులో పుట్టుకొస్తున్నా అన్యభాషాపదాలకు కొత్తపదాలను కల్పించడం వేగవంతంగా లేదు. ఈ నేపథ్యంలో తెలుగులో కొత్తపదాలను కల్పించటంలోని విధానాల వ్యాసమిది. పరిపాలనలో, కార్యాలయాలలో ఉన్నవారికీ, భాషాప్రియులకీ ఆలోచన, ఆసక్తి ఈ వ్యాసం కల్పిస్తుంది. - ఎడిటర్**

1. Brunch : breakfast కి lunch కి మధ్య స్వీకరించే ఆహారం.
2. Netizen : citizen లాగే. నెట్‌లో పనిచేసేవాడు.
3. Coca-calisation : Fastfood culture ని ఇలా వ్యవహరిస్తున్నారు.
4. Galactic suit : A suit on the other plannet
5. Yellow revolution : నూనె ఉత్పత్తులకు సంబంధించింది.
6. Eaters-coma : భుక్తాయాసం
7. Morphing : Altering some photo of a woman by graphics
8. Tera phone : A phone works without a signalling tower
9. Stagflation : Stagnation (మాంద్యం), Inflation (ఉల్బణం). వీటికి మధ్యస్థమైనది.
10. Modem : Modulation and de modulation (కలపడం విడదీయడం. ఈ రెండూ కలిపి మోడెమ్ అని వ్యవహారం)
11. Office spouse : A male and female, who work together with understanding in an office

ఈ మాటలు ఇలాగే తెలుగు వ్యవహారంలో కనిపిస్తున్నాయి. ఏ ప్రయోగమయినా వ్యవహర్తల వ్యవహారంలో నిగ్గు తేలుతుంది. ఏ శృంఖలాలు వీటిని అడ్డుకోలేవు. అసలు సిసలైన సహజరూపాలు అచ్చమైన వ్యవహర్తల వద్దనుండే పుట్టుకొస్తాయి. జాలరుల భాషలో "సబ్ మెరైన్" కు (దొంగ ఓడ) 'దొంగోడ', డ్రెడ్జర్‌కు (తవ్వు ఓడ) తవ్వోడ అనే వ్యవహారముంది. భావం స్పష్టంగా సూటిగా ఉండడం కోసం, అన్యభాషాపదాలకు సమాన భావాన్నిచ్చే పదాలు వ్యవహారంలోకి ప్రయోగాలను చేయడం వల్ల భాష పుష్టిని పొందుతుంది. తప్పనిసరైతే తప్ప అన్యభాషాపదాలను ప్రయోగించ వలసిన అగత్యమూ తప్పుతుంది. నూతనంగా ఒక జాతి జీవనంలో ప్రవేశించిన వస్తు సముదాయానికి సమీపంగా తెలుగుభాషలో ఎంత చక్కని పదాలను కల్పించారో పై వాటివల్ల గమనించవచ్చు. ఇలా సహజంగా వ్యవహారంలో ఉన్న ప్రయోగాలను గుర్తించాలంటే - ఒక భాషను వ్యవహరించే అన్ని స్థాయిల భాషావ్యవహర్తల అభివ్యక్తిని అనివార్యంగా పరిశీలిస్తూ నూతన పద నిర్మాణాన్ని ఒక వ్రతంగా చేపట్టాలి.

### సమానార్థక పదకల్పన

ఆంగ్లంలో ఉన్న పదాలకు మనభాషలో కొత్తపదాలను కల్పించుకోవాలి. మన తెలుగుభాషకే కాదు ఇది ఏ భాషకయినా అనివార్యం. ఆక్స్ ఫర్డ్ నిఘంటువును ప్రతి అయిదేండ్ల కొకసారి సవరిస్తుంటారు. ఈ సవరణ ప్రక్రియలో భాగంగా అన్యదేశ్యాలు చేర్చడం; కొన్నింటికి కొత్త పదాలను కల్పించడం, భాషావ్యవహారంలో ఒక పదానికి కలిగే కొత్త అర్థాలను స్వీకరించడం మొదలైన వాటిని జనవ్యవహారాన్ని దృష్టిలో పెట్టుకొని చేపడతారు. ఆంగ్లపదాలు తెలుగులో ఎక్కువగా ఉన్నాయి. వీటికి సమానార్థక పదాలను కల్పించుకోవడంలో ప్రయత్నలోపం తప్ప మరే కారణమూ కన్పించదు. దీనికంటే ముందుగా తెలుగులో మహానిఘంటు నిర్మాణం జరగాలి.

అంతకంటే ముందు సమగ్రమయినరీతిలో మండలిపదకోశ నిర్మాణం జరగాలి. ఇప్పటికయినా ఆ దిశగా ప్రయత్నించాలి. తెలుగులో మహానిఘంటువు ఏర్పడితే కనీసం పదేండ్ల కొకసారి దాన్ని సవరించుకోవచ్చు.

### సమానార్థక పదాలు : జరిగిన కృషి

తెలుగు భాషపై ఆంగ్లభాషా ప్రభావం పడడం ప్రారంభమయిన నాటి నుండి వ్యవహారంలోనే కాక విద్య, పరిపాలన, గ్రంథరచన, పత్రికలు వంటి అనేకరంగాలలో ఆంగ్లభాషాపదాల వ్యవహారం అనివార్యంగా మారింది. ఈ సందర్భంలో మాతృభాషా వినియోగం కోసం మహానీయులైన పాత్రికేయులు కృషి చేశారు. వివిధ శాస్త్రాలకు పారిభాషిక పదకోశాలను తయారు చేయించడం ద్వారా విద్యకు సంబంధించినంత వరకూ అకాడమీలు కృషి చేశాయి. అయితే ఆధునికంగా వచ్చిన సమాచార విప్లవం వల్ల తెలుగులో ఆంగ్లపదప్రవేశం ఎక్కువ అయ్యింది. దాన్ని నియంత్రించి, ఆంగ్లపదాలకు తగినట్లుగా తెలుగులో ప్రత్యామ్నాయాలను తయారు చేసే ప్రక్రియ జరుగుతున్నా, అది అవసరాన్ని పూర్తి చేసేంతగా లేదు.

### జర్నలిస్టులు చేసిన కృషి

సమానార్థక పదసృష్టి పూర్వం ఒక నియమంగా జరిగేది. అర్థాన్ని బట్టి మనభాషలో ఒక పదాన్ని స్థిరపరచుకొని వాడేవారు. ఇప్పుడు శీర్షికలలో కూడా ఆంగ్లపదాలను వాడుతున్నారు.

ఉదా:డ్యూటీలో మద్యం సేవిస్తూ పోలీసులకు దొరికిన డిఇ (07.07.09 ఆంధ్రజ్యోతి)

తినేసి అకౌంట్ సెటిల్ చేశారు (07.07.09)

నేడు కేవలం రాజకీయ వార్తలే కాక శాస్త్ర సాంకేతిక రంగాల విషయాలు కూడా పత్రికలలో వస్తున్నాయి. కాబట్టి ఇలాంటి వార్తలు, ప్రపంచవార్తలు రాసేటప్పుడు సమానార్థకపదాలను సృష్టించుకోవలసిన అవసరం ఎంతో ఉంది.

ఉదా: సోవియట్ యూనియన్‌లో గోర్బచెవ్ సంస్కరణలు చేసినప్పుడు ఆ వార్తలు మన పత్రికలలోనూ వచ్చాయి. అవి 1. గ్లాస్ నోస్త్ (glass noste) 2. పెరిస్త్రోయికా (peristroyica) ఈ రెండు మాటలూ రష్యన్ పదాలు. వీటిని మనపత్రికలు యథాతథంగా వాడేశాయి. అలాకాకుండా 1. గోప్యరాహిత్యం 2. పునర్వ్యవస్థీకరణ అని కొత్తపదాలను కల్పించి ఉంటే సాధారణ పాఠకులకు కూడా అర్థం అయ్యేది.

ప్రసార మాధ్యమాలలో అవసరం లేకున్నా ఆంగ్లపదాల వాడకం పెరిగింది. ('సమానార్థకాలకు ప్రయత్న లోపం' - సి. రాఘవచారి, తెలుగోడు పుట - 59)న ఆంగ్లభాషా ప్రాచుర్యం అత్యంత ప్రభావం చూపిన తొలినాళ్ళలో సమానార్థక పదనిర్మాణానికి మన పత్రికా రచయితలు కొన్ని విధానాలను రూపొందించారు.

1. ఉన్న మాటలను పరిమితార్థంలో వాడడం : సచివాలయం (Secretariat), మంత్రి (Minister)
2. ఉన్న మాటలకు కొత్త అర్థాలను కల్పించడం : ఆకాశవాణి (All India Radio), విద్యుత్తు (Current)
3. కొత్తపదాలను కల్పించడం : సాక్షరత, ప్రత్యర్పణ (Resubmission)
4. భాషానువాదం : కుటుంబనియంత్రణ (Family planning)
5. యథానువాదం : శ్వేతపత్రం (White paper)
6. అన్యదేశ్యాలను అలాగే వాడడం : బస్సు, రైలు, లైసెన్సు, వకల్తా, ఖరారు, నామా

అలాగే సరళీకరణ, ప్రపంచీకరణ లాంటి పదాల ప్రభావం వల్ల గ్లోబలీకరణ, ప్రైవేటీకరణ మొదలయిన పదాలు అర్థబోధకశక్తి ఉన్నందువల్ల వ్యాప్తిలోనికి వచ్చాయి.

విలేఖకుడు అనే పదాన్ని కాశీనాథుని నాగేశ్వరరావు ఆంధ్రపత్రికలో ప్రవేశపెట్టారు. ఆ తర్వాత వినసొంపు కోసం విలేఖరి, ఆ తర్వాత విలేకరిగానూ మారింది.

మదరాసు ఆకాశవాణిలో ప్రతిరోజూ కొత్త పారిభాషిక పదాలను గురించిన ఒక కార్యక్రమం జరుగుతుంది. క్రిందటిరోజు ఆంగ్లపత్రికలో వచ్చిన కొత్త పారిభాషిక పదాలకు తమిళంలో సమానార్థక పదాలను సృష్టించి ప్రసారం చేస్తారు. వాటిని శ్రోతలు స్వీకరిస్తున్నారు. హిందీలో భా.జ.పా, మా.క.పా మొదలగు హిందీపొడి అక్షరాలు వాడతారు. తెలుగులో ఐరాస అని కొన్నాళ్ళు పత్రికలు వాడాయి. ఈ పద్ధతిలో వాడుక కొనసాగించాలి (తల్లిబాసపై పిల్లచూపా - జి.యస్. వరదాచారి, తెలుగోడు పుట.61) హిందీ, తమిళం, కన్నడ మొదలగు పత్రికలలో ఆంగ్లపదాలు లేకుండా తమ తమ భాషలలోనే తెలుపగలుగుతున్నారు. దీనికి మన పత్రికా విలేకరులూ శ్రద్ధ తీసుకోవాలి. మన పత్రికా రచయితలు, సమానార్థక పదాలను సృష్టించకపోగా, ఉన్న తెలుగు మాటలను కూడా విస్మరించి ఆంగ్లపదాలను వాడుతున్నారు.

ఉదాహరణకు ఇటీవల స్వైన్ ఫ్లూ (swine flue) జ్వరానికి సంబంధించిన వార్తలు చాలా విరివిగా పత్రికలలో వచ్చాయి. ఈ పదాన్ని మన పత్రికలు అలాగే వాడాయి తప్ప కొత్తపదాన్ని తయారు చేయలేదు. కన్నడిగులు 'హందిజ్వర' అని తమ భాషలోకి తర్జుమా చేసుకొన్నారు. స్వైన్ ఫ్లూ లాంటి పదాన్ని అనువాదం చేయడం కష్టమే అయినా కొత్తపదాన్ని కల్పించినట్లయితే అది చక్కగా వాడుకలోనికి వస్తుంది. ఎందుకంటే ప్రజలలో ఆ విషయం పట్ల ఆసక్తి ఉంటుంది. కాబట్టి, అలా ఆసక్తి ఉన్నప్పుడు కల్పించిన పదమే త్వరగా

వ్యవహారంలోనికి వస్తుంది. ప్రయత్నిస్తే ఏదో ఒక మార్గం లభిస్తుంది. ఎందుకంటే రామాయణ మహాభారతాల వంటి ఉద్గ్రంథాలను మనభాషలో రాసుకోగలిగిన మనకు నేటి అవసరాలను తీర్చే మాటలను సృష్టించుకోవడం అసాధ్యం కాదు. (ఇది తెలుగు వారి భాషాదాస్యం - వి. ఆర్. బొమ్మారెడ్డి - తెలుగోడు పుట. 67)

కాశీనాథుని నాగేశ్వరరావు 1908లో ఆంధ్రపత్రిను వారపత్రికగా స్థాపించిన తరువాత 1938లో పారిభాషిక పదకోశాన్ని నిర్మించారు. ఈ పదకోశంలోని మాటలను కందుకూరి వీరేశలింగం వివేకవర్ధిని ద్వారా కొండా వెంకటప్పయ్య కృష్ణాపత్రిక ద్వారా ప్రచారం చేశారు నైట్రోజను - నత్రజని; నికిల్ - నిఖిలం; ఆక్సిజన్ - ప్రాణవాయువు; ఫొటోసింథసిస్ - కిరణజన్య సంయోగక్రియ; నియాన్ - న్యోనం మొదలగు మాటలను కాశీనాథుని నాగేశ్వరరావే సృష్టించారు.

తెలుగు పత్రికారంగంలో విప్లవాత్మకమయిన మార్పులను తెచ్చిన నార్ల వంటి వారిని ఆదర్శంగా తీసుకొని పత్రికా రచయితలు భాషాభివృద్ధి దిశగా పనిచేయాలి. నేటి పత్రికలలో భాషకు సంబంధించిన అంశాల కోసం స్థలాన్ని కేటాయించాలి. మాతృభాషా దినోత్సవాలు, ప్రపంచ మహాసభల సందర్భంగా అన్ని దినవార మాసపత్రికలలో కొన్ని ప్రత్యేకవ్యాసాలు భాషపై వస్తున్నాయి. ఇవి భాషాభిమానులను చైతన్యవంతులను చేయడానికి, భాషపై మమకారం కలిగించడానికి ఉపయోగపడుతుంది కాని భాషాభివృద్ధికి సరిపడ్డ కండనందివ్వదు. కనీసం తెలుగువారపత్రికలలో వాడుతున్న ఆంగ్లపదాలను గుర్తించి వాటిని ప్రత్యామ్నాయాలను సూచించే దిశగా ప్రయత్నం చేయవచ్చు. లేదా నూతన పదరూపకల్పన అనే అంశంపై పాఠకులనే అడగవచ్చు. రోజూనో, వారానికో, నెలకోకసారి ప్రజలనుండే ఆంగ్లపదాలకు తగిన మాటలను సేకరిస్తే వ్యవహారానికి దగ్గరగా ఉన్న పదాలు వ్యాప్తిలోనికి తీసుకువచ్చే అవకాశం ఏర్పడుతుంది.

**నార్ల వారు డ్రెడ్జర్ - తవ్వోడు:** సబ్ మెరైన్‌కి దొంగోడ అనే పదాలు విశాఖ మాండలికంలో జనవ్యవహారంలో ఉండడం గమనించడం వల్లనే వ్యాప్తిలోనికి తెచ్చారు. రాజకీయ సామాజికాది కారణాల వల్ల కొత్తగా పత్రికలలో ఆంగ్లపదాలనే ప్రయోగించవలసినప్పుడు వాటికి తెలుగు పదాలను విధిగా కల్పించాలని చెప్పిన వారు నార్ల.

Non-Alignment అలీనవిధానం (దీనికి విబంధ విధానమనీ, తటస్థ విధానమనీ పర్యాయంగా వాడారు కానీ అలీనవిధానమే నిలబడింది). Tenancy ని ఉపభోగాధికారం అన్నారు. ఇంకా ఉద్ఘాటన, విజ్ఞప్తి, అభ్యర్థన, ద్రవ్యోల్బణం, తీర్మానం, మూజువాణి వంటి జనవ్యవహారంలో ఉన్న పదాలను స్వీకరించి పత్రికలలో ఆంగ్లపదాలకు ప్రత్యామ్నాయంగా వాడడానికి కావలసిన చక్కని అనువాదాలు పదరూపకల్పనలు వీరే చేశారు. ఉపభోగాధికారం అనే మాట వ్యాప్తిలోనికి రాలేదు. కౌలు, మక్తా పదాలు వాడుకకెక్కాయి. కాబట్టి రెండు మూడు రకాలుగా పదాల్ని, పదబంధాల్ని కల్పించి వ్యవహారంలోనికి వదిలితే వాటిలో సర్వామోదయోగ్యమైనది నిలబడుతుంది. ఈ ప్రయత్నం నిరంతరం జరగాలి. ఏ పదమైనా వ్యవహార సౌలభ్యం, ఆవశ్యకతాపురాణం ఉంటే చాలు విరివిగా వాడుకలో ప్రాచుర్యం పొందుతుంది. తెలుగు మాటలు కాని అసలు, మామూలు, అచ్చు మొదలగు ఉర్దూ పదాలు తెలుగుమాటల్లాగే వ్యవహారంలో ఉన్నాయి. 'అమీతుమీ' అనే పదాన్ని తెలుగులోనూ ఎక్కువ వాడుతున్నాం. అది బెంగాలీ పదం. భాషలోనికి కొత్తపదాలు చొచ్చుకొస్తాయి. అది అనివార్యం. కాలానుగుణంగా ఏర్పడే పరిణామాలే అందుకు కారణం. భారతీయ స్వాతంత్ర్య సంగ్రామం వల్ల కూడా తెలుగు భాషలోనికి కొన్ని కొత్త పదాలు చేరాయి. 1857 సిపాయిల తిరుగుబాటు ఉద్యమం జరిగినప్పుడు మీరట్ నుండి ఢిల్లీకి సైనికులు 'ఢిల్లీ చలో' అనే కార్యక్రమం చేపట్టారు. అది మొదలుగా తరువాత 'చలో అసెంబ్లీ' 'చలో హైదరాబాద్'లు బయలుదేరాయి. 'వందేమాతరం - మనదేరాజ్యం' ఇదొక నినాదం. ఈ నినాదానికి పేరడీగా 'వందేమాతరం - మందే రాజ్యం' అని పత్రికలు వాడాయి.

1886లో దాదాభాయ్ నౌరోజీ స్వరాజ్యం అనే మాటను వాడాడు. అప్పటినుండీ ఆ పదం స్థిరపడింది. గుజరాతీ కవి నర్సీ మెహతా మొట్టమొదటిసారిగా హరిజనశబ్దం వాడాడు. దాన్ని గాంధీజీ స్వీకరించి 'హరిజన్' అనే పత్రికను స్థాపించారు. ఆ తరువాత హరిజనోద్యమాన్ని కూడా నడిపాడు. స్వాతంత్ర్యానికి పూర్వం 'రాష్ట్రపతి' అనే పదం 'కాంగ్రెస్ అధ్యక్షుడు' అనే అర్థంలో ఉంది.. నేడు భారతదేశ ప్రథమపౌరుడు అనే అర్థంలో వాడుతున్నాం.

భారత స్వాతంత్ర్యోద్యమ ప్రభావం వల్ల అనేక పదాలు పదబంధాలు తెలుగుభాషలోనికి ప్రవేశించాయి. గాంధీటోపీ, మద్యపాననిషేధం, అస్పృశ్యతానివారణ, పాదయాత్ర, చరఖా, ఖద్దరు, రాష్ట్రభాష (జాతీయభాష) సహకారోద్యమం, బేసిక్ విద్య, భూదానం, శ్రమదానం, వృత్తివిద్య, గ్రామపారిశుద్ధ్యం, నిరాహారదీక్ష, సేవాదళం, జిందాబాద్, ముర్దాబాద్, పతాకావిష్కరణ, పతాకవందనం, మతసామరస్యం భాషాప్రయుక్తరాష్ట్రం, అధిష్ఠానవర్గం, వారోత్సవాలు, మానసపుత్రులు, జమీందారీ వ్యతిరేకోద్యమం, రిలేనిరాహారదీక్షలు, బందులు, ధారణ (ధర్నా - అంటే ఒక ఉన్నతాశయాన్ని ధరించడం), రాస్తారోకో, జాతీయత, మాతృదేశం, భరతమాత, దొరతనం, వయోజనవిద్య, గుండ్రబల్ల సమావేశం, జాతీయవిద్య, విదేశీ వస్తుబహిష్కరం, సత్యాగ్రహం (గాంధీజీ నిజంపట్ల ఆగ్రహం, పట్టుదల) అనే అర్థంలో వాడారు. ఆగ్రహం కోపంగా అర్థవిపరిణామం చెందింది) వంటి పదాలు స్వాతంత్ర్యోద్యమ నేపథ్యంలోంచే పుట్టుకొచ్చాయి.

**- డా॥ అద్దంకి**

పంచాయతీరాజ్ సంస్థలలో ప్రజా ప్రతినిధులుగా ఎన్నికైన వార్డు మెంబర్లకు, గ్రామసర్పంచులకు, యం.పి.టి.సిలకు, మండల ప్రజా పరిషత్ అధ్యక్షులకు, జిల్లా ప్రాదేశిక సభ్యులకు, జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్‌లకు, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలపై వివిధ వ్యవధులలో శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ ప్రజా ప్రతినిధులు అపార్డు, విస్తరణ శిక్షణా తరగతుల కేంద్రా (ఇ.టి.సిలు)లలో జిల్లా స్థాయి, మండల స్థాయిలలో వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలు, వివిధ చట్టాలలో ఉన్న హక్కులు, విధుల అంశాలపై శిక్షణ పొంది గ్రామాలలో మెరుగైన సేవలను అందించడంలో, సమాజంలో ఉన్న అసమానతలు తొలగించడంలో చాలామట్టుకు సఫలీకృతమౌతున్నారు.

# పంచాయతీ రాజ్ సిబ్బందికి కూడా శిక్షణ ఎంతో అవసరం

ప్రజా ప్రతినిధులు సమాజంలో ఉన్న ఆర్థిక, సామాజిక అసమానతలు తగ్గించడంలోను, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలును ఎంతో కీలకమైన పాత్ర పోషిస్తున్నారు. పంచాయతీరాజ్ పరిపాలనా యంత్రాంగం కూడా సమాజంలో ఉన్న ఆర్థిక సామాజిక అసమానతలు తగ్గించడంలో, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో ప్రజా ప్రతినిధులకు ఎంతగానో దోహదపడుతున్నది.

ప్రజా ప్రతినిధులకు విధిగా సమయానుసారం పథకాల గురించి శిక్షణ ఇవ్వడం జరుగుతున్న రీతిలో పంచాయతీరాజ్ సంస్థలలో పనిచేస్తున్న పరిపాలనా సిబ్బందికి, అధికారులకు వారి ప్రతిభ పెంపొందించడానికి శిక్షణ కార్యక్రమాలు జరగడంలేదు. 73వ రాజ్యాంగ సవరణలో 29 అంశాలు పంచాయతీరాజ్ సంస్థలకు సంక్రమింపచేసిన తరుణంలో పంచాయతీరాజ్ సంస్థలో పనిచేస్తున్న సిబ్బందికి తదనుగుణంగా శిక్షణ అత్యవసరం. లేని పక్షంలో రాజ్యాంగ పరంగా సంక్రమింపజేసే అంశాలలో లక్ష్యాలు సాధించడం చాలా కష్టతరం. ఈ నేపథ్యంలో పంచాయతీరాజ్ సంస్థలలో పనిచేస్తున్న పరిపాలనా సిబ్బందికి ఈ దిగువ చూపిన అంశాలపై నిష్ణాతులైన, అంకితభావంగల అధికారులతో, అనధికారులతో ప్రభుత్వేతర సంస్థలద్వారా శిక్షణ నిర్వహించడం చాలా అనివార్యం. తద్వారా వారి ప్రతిభ పెంపొందుతుంది.

1. పంచాయతీరాజ్ సంస్థలలో అంటే గ్రామపంచాయతీ, మండల ప్రజా పరిషత్, జిల్లా ప్రజా పరిషత్‌లలో పనిచేస్తున్న పరిపాలనా సిబ్బందికి ప్రాథమిక శిక్షణ: ఈ ప్రాథమిక శిక్షణలో ప్రాథమిక విజ్ఞాన శాస్త్రము, ప్రాథమిక ఆరోగ్యం, పౌర శాస్త్రం, రాజ్యాంగంలో పొందుపరిచిన మౌలిక హక్కులు, విధులు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన విషయాలు, అర్థ శాస్త్రంలోని మౌలిక విషయాలు మొదలైన వాటిలో శిక్షణ వారి ప్రతిభను పెంపొందించడంలో దోహదపడుతుంది.
2. కార్యాలయంలో జరిగే ఉత్తర, ప్రత్యుత్తరాలు, రాసే విధానం.
3. ఆంగ్లబాషలోని ప్రాథమిక అంశాలు: ఆంగ్లంలో జరిగే ఉత్తర, ప్రత్యుత్తరాల గురించి అవగాహన కల్పించడం.
4. వివిధ శాఖలలో జరిగే కార్యక్రమాల ఉద్దేశ్యాల సంక్షిప్త జ్ఞానం
5. స్టేట్ ఆడిట్ అభ్యంతరాల పరిష్కారానికై శిక్షణ: ఈ శిక్షణ రాష్ట్ర శాఖలో, పంచాయతీరాజ్ శాఖలో రిటైర్డ్ అయిన అధికారులతో ఆరు మాసాలకు ఒకసారి రెండురోజుల శిక్షణ. ఈ అంశాలు చాలామట్టుకు కార్యాలయ విధులకు సంబంధించి ఉంటాయి.



ఇలాంటి దానికి సరియైన సమయంలో జవాబులివ్వనందుకు ఎంతో డబ్బు దుర్వినియోగం అయినట్టు ప్రజలలో ఒక అపోహ ఏర్పడుతున్నది.

ఇటీవల హైకోర్టులో, జిల్లా న్యాయ సేవా సంస్థలలో ఆడిట్ అభ్యంతరాల సత్వర పరిష్కారానికై కేసులు నమోదు చేయడమైనది.

6. కంప్యూటర్.
7. ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో, శాఖాధిపతి కార్యాలయంలో జరిగే పని విధానంపై కనీసం 8 రోజుల శిక్షణ.
8. పంచాయతీరాజ్ సంస్థలలో పరిపాలనాయంత్రాగంలో పనిచేస్తున్న వారు ప్రభుత్వం సంక్షేమ అభివృద్ధి పథకాలు అమలు పరచడంలో చాలా కీలకమైన పాత్ర వహిస్తారు. ఈ సంస్థల నుండి జరిగే కార్యక్రమాలకు లబ్దిపొందేవారు సమాజంలో ఉన్న అట్టడుగు, బలహీన వర్గాల ప్రజలు, ముఖ్యంగా పేదవారు ఉంటారు. వీరికి మెరుగైన సేవలు అందించడానికి పంచాయతీరాజ్‌లో పనిచేస్తున్న సిబ్బందికి ప్రజలతో వ్యవహరించే విధానంపై, మనోవిజ్ఞానంపై శిక్షణ అత్యవసరం.
9. పంచాయతీరాజ్ సంస్థలలో పనిచేస్తున్న పరిపాలనాయంత్రాంగం శిక్షణ పిదప వారి నైపుణ్యం, ప్రతిభ ఎంతవరకు పెరిగాయో ఒక మూల్యాంకనం అవసరం. వారి నైపుణ్యం, ప్రతిభ పెరగని పక్షంలో మరోసారి శిక్షణ నిర్వహించాలి.
10. అంకిత భావంతో, ఆసక్తితో పంచాయతీరాజ్ సంస్థలలో పనిచేస్తూ ప్రజల మన్ననలు, అదరణ పొందిన వారికి బహుమతులు, ప్రోత్సాహక పత్రాలు, నగదు రూపేణా ఇవ్వాల్సిన అవశ్యకత వుంది.

**టి. కృష్ణ**
**చీఫ్ అక్కౌంట్స్ ఆఫీసర్ (పంచాయితీరాజ్ శాఖ), సెక్రటేరియేట్, హైదరబాద్**



# గ్రామ అభివృద్ధికి భారత్ నిర్మాణ్ వాలంటీర్లు రూ. 30000/-విరాళం, భారత్ నిర్మాణ్ వాలంటీర్ల సహకారంతో గ్రామీణాభివృద్ధి వేగవంతం

**ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాలన్నీ నిర్దేశిత ప్రజలకు చేరేలా ప్రతీ ఒక్క భారత్ నిర్మాణ్ వాలంటీర్ కృషి చేయాలని అపార్డ్ కమీషనర్ కె. చంద్రమౌళి, ఐ.ఏ.ఎస్. అన్నారు. 19-6-2011న చిత్తూరు జిల్లా చంద్రగిరి మండలం కొటాల గ్రామంలో సర్పంచ్ మదన్ మోహన్ అధ్యక్షతన జరిగిన ప్రత్యేక గ్రామ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న అపార్డు కమీషనరు కె. చంద్రమౌళి మాట్లాడుతూ, అపార్డు ద్వారా శిక్షణ పొందిన భారత్ నిర్మాణ్ వాలంటీర్లు, కొటాల గ్రామంలో మార్పు తీసుకొని రావటానికి నడుంబిగించడం రాష్ట్రంలోని ఇతర గ్రామాలకు ఆదర్శమని అన్నారు.**

కొటాల గ్రామంలోని 29 మంది భారత్ నిర్మాణ్ వాలంటీర్లు స్వచ్ఛందంగా రూ. 1000/-ల వంతున విరాళాలు ఇచ్చి గ్రామంలో పచ్చదనం, పరిశుభ్రం పెంపొందించిన తీరు ఇతర గ్రామాలకు మార్గదర్శకం కాగలదని అన్నారు. కొటాల గ్రామంలోని ప్రజలు గత ఆరు దశాబ్దాలుగా స్ఫూర్తి దాయకంగా ఉంటున్నారని, తాను 1974లో విద్యార్థిగా ఉన్నప్పుడు ఎన్.ఎస్.ఎస్. కార్యకర్తగా గ్రామంలో పనిచేసానని, ఆ సమయంలో గ్రామ ప్రజలందరూ ఒక్క త్రాటిపై నిల్చి శ్రమదానం, ప్రజా విరాళాలు వంటి వినూత్న పద్ధతుల ద్వారా గ్రామంలోని యావత్ ప్రజానీకానికి ఉపయోగపడే పనులు చేపట్టిన తీరు ఇప్పటికీ తన స్మృతి పథంలో నుండి చెరిగిపోలేదని ఆయన అన్నారు. మళ్ళీ ఇంత కాలానికి ఈ గ్రామాన్ని మరల తన బృందం సభ్యులతో ల్యాబ్ టు ల్యాండ్ - కీ క్యాప్ కార్యక్రమంలో భాగంగా సందర్శించటం ఆనందంగా ఉందని అన్నారు. మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాం మానసపుత్రిక 'పురా' స్ఫూర్తి ఈ గ్రామంలో ప్రతిబింబిస్తోందని ఆయన అన్నారు. అపరిచిత వ్యక్తుల కోసం చేసేది సేవ అని మనకు తెలిసిన వారికోసం చేసేది బాధ్యత అని, భారత్ నిర్మాణ్ వాలంటీర్లు గ్రామ పునర్నిర్మాణానికి బాధ్యత వహించాలని ఆయన పిలుపునిచ్చారు.

గ్రామ సభకు అధ్యక్షత వహించిన సర్పంచ్ మదన్ మోహన్ మాట్లాడుతూ, ల్యాబ్ టు ల్యాండ్ కార్యక్రమంలో 'కొటాల' గ్రామం ఎంపిక కావటం గ్రామానికే గర్వకారణం అని అపార్డు తమ గ్రామంపై ఉంచిన నమ్మకానికి తగినట్లుగా రాబోయే కాలంలో మంచి పనులు చేపట్టి గ్రామాభివృద్ధిని వేగవంతం చేయటానికి కృషి చేస్తానని అన్నారు. సుశిక్షితులైన 29 మంది వాలంటీర్లు గ్రామంలో ఉన్నందువల్ల గ్రామ అభివృద్ధికి వారి సేవలు చాలా ఉపయోగపడుతాయని అన్నారు.

ఈ కార్యక్రమంలో అపార్డు ప్రొఫెసర్ ఆర్. సూర్య నారాయణ రెడ్డి మాట్లాడుతూ, గ్రామంలో ఉన్న వివిధ సామాజిక వర్గాల వారు విభేదాలను పక్కకు పెట్టి, గ్రామ సమగ్రాభివృద్ధికి నడుంబిగించాలని అన్నారు. ఫ్యాకల్టీ సభ్యుడు హెచ్. కూర్మారావు మాట్లాడుతూ, ల్యాబ్ టు ల్యాండ్ కీ - క్యాప్ కార్యక్రమం గూర్చి క్షుణ్ణంగా వివరించారు. ఇ.టి.సి. ఫ్యాకల్టీ సభ్యుడు శోభన్ బాబు మాట్లాడుతూ, కొటాల గ్రామంతో తనకు గత 12 సంవత్సరాలుగా అనుబంధం ఉందని, గ్రామస్తులలో ప్రగతిశీల భావాలు ఎక్కువ అని ప్రశ్నించే తత్వం గ్రామస్తుల నైజమని, గ్రామ నిర్మాణానికి యువత నడుంబిగించటం ముదావహమని, ప్రతి శుక్రవారం తాను ఈ గ్రామాన్ని సందర్శించి సలహాలు సూచనలు అందచేస్తానని తెలియచేసారు.

ఈ కార్యక్రమంలో ఇ.టి.సి. వైస్ ప్రిన్సిపాల్ సజ్జా సుబ్బారావు, డి.పి.ఓ. డా. శేషారెడ్డి, సి.ఇ.ఓ. నాగేశ్వరరావు, ఇ.టి.సి. ఫ్యాకల్టీ ప్రశాంతి, వెంకటరత్నం, ఎం.పి.డి.ఓ సుశీల, అపార్డు డిప్యూటీ డైరెక్టర్లు డా.కృష్ణ మోహన్ రావ్, సుభాష్ చంద్రగౌడ్, ఫ్యాకల్టీ సభ్యులు డా. శివశంకర ప్రసాద్, గ్రామ పంచాయితీ కార్యదర్శి రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

# ఆకట్టుకున్న భారత్ నిర్మాణ్ వాలంటీర్ల స్వచ్ఛంద సేవ

## కోటాల గ్రామం, చంద్రగిరి మండలం

















**అపార్డ్‌లో శిక్షణ అనంతరం తమ గ్రామాన్ని చేరుకొన్న 29 మంది భారత్ నిర్మాణ్ వాలంటీర్లు గ్రామంలో పరిసరాల పారిశుద్ధ్యాన్ని మెరుగుపర్చటానికి నడుంబిగించారు. గ్రామ పంచాయితీ సహకారాన్ని కోరగా నిధుల లేమివల్ల పంచాయితీ సర్పంచ్ తన అశక్తతను వెలిబుచ్చగా, 29 మంది భారత్ నిర్మాణ్ వాలంటీర్లు ప్రతి ఒక్కరూ రూ. 1000/-లు విరాళంగా ఇచ్చి రూ.30000/-లు నిధిని ప్రోగుచేసారు. ఈ నిధులతో 12-6-2011 కోటాల ప్రధాన రహదారి నుంచి గ్రామం వరకూ గల రహదారికిరుప్రక్కలా ఉన్న ముళ్ళ కంచెలను తొలగించారు. వ్యర్థ పదార్థాలను తరలించటానికి వాలంటీర్ల బృందంలోని వాలంటీర్లు సుధ, ఉదయభాస్కర్, దేవరాజు అనే ముగ్గురు ట్రాక్టర్లను ఉచితంగా ఇచ్చారు.**

జె.సి.బి. సహాయంతో ఈ గ్రామంలోని చెత్త చెదారాన్ని తొలగించి, అంతర్గత రహదారులను మెరక చేసారు. గ్రామ పంచాయితీ సహకారంతో అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు రంగులు వేసి నూతన శోభను తీసుకు వచ్చారు. ఇంటింటి సర్వే చేసి వ్యక్తిగత మరుగుదొడ్లు లేని వారి జాబితాను రూపొందించారు, ఇళ్ళు లేని కుటుంబాల జాబితాలను రూపొందించారు. ఇంటింటి ప్రచారం చేపట్టి పరసరాల పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. గ్రామంలో వైద్య శిబిరాన్ని నిర్వహించి మహిళలకు / పురుషులకు రక్త పరీక్షలు నిర్వహించారు.

గ్రామంలో మద్యపాన నిర్మూలనకు కూడా భారత్ నిర్మాణ్ వాలంటీర్లు రంగాన్ని సిద్ధపరుసున్నారు. ఎన్. సుధ అనే భారత్ నిర్మాణ్ వాలంటీర్ మాట్లాడుతూ, పేదరిక నిర్మూలన కోసం, గ్రామీణాభివృద్ధి కోసం అందుబాటులో ఉన్న వివిధ పథకాల గూర్చి ప్రజలకు విస్తృతంగా తెలియపరుస్తామని అన్నారు. మరొక బి.ఎన్.వి. దేవరాజ్ మాట్లాడుతూ, గ్రామాన్ని సమస్యలు లేని గ్రామంగా తీర్చి దిద్దనున్నామని అన్నారు. గ్రామానికి ఏక నాయకత్వం అవసరం అని ఈ దిశగా బి.ఎన్.వి.లు ప్రయత్నాలు ప్రారంభించామని అన్నారు. భారత్ నిర్మాణ్ వాలంటీర్లు చూపిన స్ఫూర్తిని చూసి ఇ.టి.సి. ఫ్యాకల్టీ శోభన్ బాబు, సర్పంచ్ మదన్ మోహన్, సెక్రటరీలు రఘుపతిలు కూడా రూ. 1000/- వంతున విరాళం ఇచ్చారని అన్నారు.

మరొక గ్రామస్తుడు వరదయ్యనాయుడు కూడా 1000/-లు విరాళం ఇచ్చారని బి.ఎన్.వి. దీనదయాళ్ తెలియచేసాడు. బి.ఎన్.వి.లు తరుచుగా సమావేశమై చర్యలు చేపట్టటానికి వీలుగా శ్రీ కమలాకర నాయుడు 10 కుర్చీలను అందచేసారు. భారత్ నిర్మాణ్ వాలంటీర్లు చూపిన చొరవను అపార్డు కమీషనరు కె. చంద్రమౌళి ప్రశంసిస్తూ, ఈ స్ఫూర్తి మిగిలిన గ్రామాలలోని వాలంటీర్లకు స్ఫూర్తి దాయకం కాగలదని అన్నారు.

# చీదేడులో కీ క్యాప్

# ఐ.ఇ.సి. కార్యక్రమాలు







**ఎ.యం.ఆర్. అపార్డ్ లోని నీరు మరియు పారిశుద్ధ్య శాఖ వారు కీ క్యాప్‌లో భాగంగా చీదేడు గ్రామంలో సంపూర్ణ పారిశుద్ధ్య సాధనకు గాను ఇటీవల పలు ఐ.ఇ.సి కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది.**

సమాచారం, విద్య మరియు ప్రచారం దిశగా చీదేడు గ్రామస్తులను బహిరంగ మలవిసర్జన స్థానే మరుగుదొడ్ల వాడకం దిశగా మళ్ళించే నిమిత్తం ఈ కార్యక్రమాలు జరిగాయి.

### ఐఇసి కార్యక్రమాలు

**1. బహిర్భూమికి వెళ్ళి వచ్చే మార్గంలో కార్యక్రమాలు**

తెల్లవారు జామున బహిర్భూమికి వెళ్ళి వచ్చే గ్రామస్తులను పసుపు రంగు ఆట ద్వారా బహిరంగ మలవిసర్జన వలన మన మలాన్ని మనమే తింటున్నాం, త్రాగుతున్నాం అనే విషయాన్ని వివరించడం జరిగింది. తదుపరి మల విసర్జన అనంతరం చేతులు ఎలా శుభ్రపరుచుకోవాలో నేర్పించటం జరిగింది.

**2. పారిశుద్ధ్యం పై ర్యాలీ**

గ్రామంలోని అన్ని వీధుల గుండా భారత్ నిర్మాణ్ వాలంటీర్లు, పిల్లలు, పెద్దలు, స్థానిక నాయకులతో నినాదాలు వ్రాసిన ప్లకార్డులను చేతపట్టి, నినాదాలు చేస్తూ మరుగుదొడ్లు వాడండి, ఆరోగ్యంగా ఉండండి, మరుగుదొడ్ల నిర్మాణం మన చేతుల్లోనే, చేయి చేయి కలుపుదాం, మరుగుదొడ్లు నిర్మిద్దాం అంటూ ర్యాలీ సాగింది.

**3. వీధి నాటకం**

భారత నిర్మాణ వాలంటీర్లతో "మంచిమాట" వీధి నాటకం ప్రదర్శన జరిగింది. ఈ నాటకంలో బహిరం మలవిసర్జన పర్యావరణానికి ఏవిధంగా హాని చేస్తుందో ప్రదర్శన ద్వారా వివరించడం జరిగింది.



ఇందులో పాత్రలు : బహిరంగ మల విసర్జనకు వెళ్తున్న అబ్బాయి, రహదారి, చెట్టు, గుట్టలు, మైదానం, చెఱువు, పొలాలు, మరుగు దొడ్డి.

**4. సోది రూపకం**

హోమ్ సైన్స్ విద్యార్థినులతో "సోది చెప్తానమ్మ సోది" రూపకం ప్రదర్శించారు. సోది అమ్మి, ఇంటి యాజమానురాలు, కుమార్తైల మధ్య సంభాషణ సాగుతుంది. ఈ సంభాషణ సారాంశం." బయటకు పోవాలంటే కూతురు మనసు కష్టమౌతుంది తల్లీ. ఇంత పెద్ద ఇల్లు కట్టుకున్నావు కాని మరుగుదొడ్డి లేక అది చిన్న పోతుంది. నీ కూతురి



మనసు కష్టపెట్టకే తల్లీ" - అంటూ సోది అమ్మి కొనసాగిస్తుంది. ఇది చూపరులను ఆకట్టుకుంది.

**5. పాటలు**

బొమ్మరిల్లు కడదాం రారండి అంటూ మరుగుదొడ్డి కట్టడం బొమ్మరిల్లు కట్టినంత సులభం అంటూ సాగే పాటను ఆలపించడం జరిగింది. తదుపరి చిట్టిపొట్టి బుల్లెమ్మ చెంబు పట్టుకు వెళ్దామా అంటే, అమ్మో అమ్మో నేరాను అంటూ, అందులోని కష్టాలను సున్నితంగా తెలియచేసే పాటను ఆలపించారు. వీటిని భారత్ నిర్మాణ్ వాలంటీర్లు,హోమ్‌సైన్స్ విద్యార్థినులు ఆలపించారు.

**6. శానిటరీ మార్ట్**

మరుగుదొడ్ల నిర్మాణానికి కావలసిన తలుపు,రేకు, బేసిన్, రింగులు స్థానిక నాయకులు గ్రామీణ నీటి సరఫరా అధికారుల సహకారంతో జయలక్ష్మి ఎంటర్ ప్రైజెస్, జీడిమెట్ల, హైదరాబాద్ వారినుండి సమకూర్చి వాటిని గ్రామంలో ప్రదర్శించడం జరిగింది. తద్వారా గ్రామంలో శానిటరీ మార్ట్ ఏర్పాటైంది.

## ప్రగతి

చీదేడు గ్రామంలో మొత్తం 200 కుటుంబాలకు గాను 20 కుటుంబాలు మరుగుదొడ్లు కలిగియుండగా, ప్రస్తుతం 90 కుటుంబాల వారు మరుగుదొడ్ల నిర్మాణాన్ని చేపట్టారు.

**- పి. మాధురి**

**జూనియర్ ఫ్యాకల్టీ, సి.డబ్ల్యు.ఎస్. అపార్డ్**

# ప్రపంచీకరణతో పెరుగుతున్న జనాభా సమస్య



**ప్రపంచీకరణ (గ్లోబలైజేషన్) ఫలితంగా, సమాచారం, ఉపాధి, రవాణా, మౌలిక వసతులతో ప్రధాన నగరాలు విరాజిల్లుతుండడంతో పల్లె ప్రజలలో పెద్ద ఎత్తున నగరాలపట్ల ఆకర్షితులై నగరాలకు తరలివస్తున్నారు.**

ఇదే కాకుండా పల్లె సీమలలో, అభివృద్ధి రాహిత్యం, రాజకీయ ఆధిపత్యంతో అన్యాయాలు, అణచివేతలు, మూఢనమ్మకాలు, లోపించిన వసతులు, త్రాగునీరు, విద్య ఆరోగ్యం వంటి ప్రాథమిక అవసరాల కొరత, ఉపాధి అవకాశాలు లేకపోవడం వల్ల పల్లెవాసులు నగరాలవైపు భారీగా తరలి వస్తుండడంతో పట్టణాలు అతి వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి.

ప్రపంచ భూభాగంలో 2.4 శాతం భూమిపై భారతదేశం విస్తరించి వుంటే, ప్రపంచ జనాభాలో 17.5 శాతం మంది భారతదేశంలో నివసిస్తున్నారు.

2001 జనాభా లెక్కల ప్రకారం భారతదేశ జనాభా 1,02,86,10,328 లో 72.22 శాతం మంది ప్రజలు 5,93,731 గ్రామాలలో నివసిస్తుంటే, మిగిలిన 27.78 శాతం మంది ప్రజలు 5,100 నగరాలు, శివారు పట్టణాలలో నివసిస్తున్నారు.

1991వ సంవత్సరపు జనాభా లెక్కల ఆధునీకరణ, నూతన విధానాల ఫలితంగా, నగరాలు, గ్రామీణ ప్రాంతాలలో తేడాలు ఏర్పడడం, ఫలితంగా, 2001వ సంవత్సరంలో నగరాల సంఖ్య తగ్గింది.

భారతదేశంలో అత్యధిక జనాభా కలిగిన రాష్ట్రం ఉత్తరప్రదేశ్ ప్రథమ స్థానంలో వుంటే, సిక్కిం రాష్ట్రం అత్యల్ప జనాభా కలిగి 28వ స్థానంలో వుండగా, ఆంధ్రప్రదేశ్ 5వ స్థానంలో నిలిచింది. అలాగే యూనియన్ టెర్రిటరీలలో ఢిల్లీ అత్యధిక జనాభా కలిగి ప్రథమస్థానంలో వుంటే, అత్యల్ప జనాభాతో లక్ష్య ద్వీప్ 7 వ స్థానంలో వుంది.

**భారతదేశం, ఆంధ్రప్రదేశ్‌లలోని నగరాల జనాభా వివరాలు**

| ప్రదేశం | సంవత్సరం | జనసంఖ్య | | నగరాల సంఖ్య | నగరాలలో దశాబ్ద కాలంలో జనాభా పెరుగుదల | సగటున వార్షిక పెరుగుదల |
|---|---|---|---|---|---|---|
| | | దేశం/రాష్ట్రం | నగరాలు | | | |
| భారతదేశం | 1991 | 84,63,02,688 | 21,76,11,012 | 3697 | 25.7% | 1.02% |
| | 2001 | 1,02,86,10,328 | 28,61,19,688 | 3691 | 27.8% | 1.03% |
| ఆంధ్రప్రదేశ్ | 1991 | 6,65,00,000 | 1,78,82,126 | 264 | 16.68% | 1.65% |
| | 2001 | 7,62,10,007 | 2,0808,940 | 210 | 16.34% | 1.63% |

## భారత దేశ, రాష్ట్ర మరియు యూనియన్ టెర్రిటరీల జనాభా

**(2001 జనాభా లెక్కల ప్రకారం స్థానాల నిర్ణయం)**

| రాష్ట్రం | జనాభా | | | రాష్ట్రం | జనాభా | | |
|---|---|---|---|---|---|---|---|
| యూనియన్ టెర్రిటరీ | గ్రామాలు | నగరాలు | మొత్తం | యూనియన్ టెర్రిటరీ | గ్రామాలు | నగరాలు | మొత్తం |
| *రాష్ట్రంలో* | | | | | | | |
| 1. ఉత్తరప్రదేశ్ | 131658339 | 34539582 | 166197921 | 21 త్రిపుర | 2653453 | 545750 | 3199203 |
| 2. మహారాష్ట్ర | 55777647 | 41100980 | 96878627 | 22 మేఘాలయ | 1864711 | 454111 | 2318822 |
| 3. బీహార్ | 74316709 | 8481800 | 82998509 | 23 మణిపూర్ | 1590820 | 575968 | 2166788 |
| 4. ప. బెంగాల్ | 57748946 | 22427251 | 80176197 | 24 నాగాలాండ్ | 1647249 | 348787 | 1990036 |
| 5. ఆంధ్రప్రదేశ్ | 55401067 | 20808940 | 76210007 | 25 గోవా | 677091 | 670577 | 1347648 |
| 6. తమిళనాడు | 34921681 | 27483918 | 62405679 | 26 ఉత్తరాంచల్ | 870087 | 221881 | 1097968 |
| 7. మధ్యప్రదేశ్ | 44380878 | 15967145 | 60348023 | 27 మిజోరాం | 467567 | 441006 | 888573 |
| 8. రాజస్థాన్ | 43292813 | 13214375 | 56509188 | 28 సిక్కిం | 480981 | 59870 | 544851 |
| 9. కర్నాటక | 34889033 | 17961529 | 52850562 | *యూనియాన్ టెరిటరీలు* | | | |
| 10. గుజరాత్ | 31740767 | 18930250 | 50671017 | 1 ఢిల్లీ | 944727 | 12905780 | 1385050 |
| 11. ఒరిస్సా | 31287422 | 5517238 | 36804660 | 2 పాండిచ్చేరి | 325726 | 648619 | 974345 |
| 12. కేరళ | 23574449 | 9866925 | 31841374 | 3 చండీగఢ్ | 92120 | 808515 | 900635 |
| 13. జార్ఖండ్ | 20952088 | 5993741 | 26945829 | 4 అండమాన్ | 239954 | 116198 | 356152 |
| | | | | అండ్ నికోబార్ | | | |
| 14. అస్సాం | 23216288 | 3439240 | 2665528 | ఐలాండ్స్ | 239954 | 116198 | 356152 |
| 15. పంజాబ్ | 16096488 | 8262511 | 24358999 | 5 దాద్రానాగర | 170027 | 50463 | 220490 |
| 16. హర్యానా | 15029260 | 6115304 | 21144564 | హవేలి | | | |
| 17. చత్తీస్‌ఘడ్ | 16648056 | 4185747 | 20833803 | 6 దయ్యూ డామన్ | 100826 | 57348 | 158204 |
| 18. జమ్ముకాశ్మీర్ | 7627062 | 2516638 | 10143700 | 7 లక్షద్వీప్ | 33683 | 26907 | 60650 |
| 19. ఉత్తరఖండ్ | 6310275 | 2179074 | 8489349 | | | | |
| 20. హిమాచల్ ప్రదేశ్ | | 5482319 | 495581 | 6077900 | | | |
| భారతదేశం మొత్తం | | | | | 742490639 | 286119689 | 1028610328 |

27.11.2009 మధ్యాహ్నం ఒంటిగంటకు ప్రపంచ జనాభా గడియారం సూచించిన ప్రకారం ప్రపంచ జనాభా 687,11,89,000లో భారతదేశ జనాభా 115,65,65,21,258 మంది.

2050వ సంవత్సరానికల్లా ప్రపంచ జనాభాలో 70 శాతం మంది నగరాలలో నివసిస్తారని, ఫలితంగా గ్రామాలు, పల్లెసీమలు అంతరించిపోయే ప్రమాదముందని ఐక్యరాజ్య సమితి తన నివేదికలో పేర్కొనడం జరిగింది.

ఒక పద్ధతి, ఒక క్రమం లేకుండా, అవసరాలకనుగుణంగా విస్తరిస్తున్న ఆర్గానిక్ నగరాలు పెరిగిపోతున్నాయి. ప్రజల అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ ఒక పథకం ప్రకారం అనగా ప్లాన్డ్ ఆర్గనైజేషన్ ప్రకారం ప్లాన్డ్ సిటీల నిర్మాణం నేడు ఒక్క భారతదేశంలోనే కాదు, యావత్ ప్రపంచానికి అవసరమై వుంది. మన దేశంలో 'ప్లాన్డ్ ఆర్గనైజేషన్'కు శ్రీకారం చుట్టి హంపి, విజయనగరం, జైపూర్, ఉదయపూర్ ఆధునిక కాలంలో చండీఘర్‌లు వంటి నగరాలు నిర్మితమవడం విశేషం!

ఇట్టి నగరాలలో డ్రైనేజి, ట్రాఫిక్, మంచినీటి సమస్యలు, పర్యావరణ కాలుష్య సమస్యలు తలెత్తే అవకాశాలు చాలా తక్కువ.

1990వ సంవత్సరంలో గ్లోబలైజేషన్ ప్రవేశం మూలంగా ప్రపంచమంతా ఒక వాణిజ్య స్థలంగా మారడంతో నగరాల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. ధరలు విపరీతంగా నష్టపోతున్న రైతాంగం, వ్యవసాయ భూములను అమ్మి, నగర శివార్లలో ఇళ్ళు నిర్మించుకుని నివసిస్తుండడంతో ఇళ్ళ సమూహాలు పెరిగిపోతున్నాయి. ఫలితంగా శివారు ప్రాంతాలకు రవాణా సౌకర్యాలు పెరిగి, ప్రధాన నగరాలు మెగా

సిటీలుగా మారుతున్నాయి. ఈ ప్రాంతాల వారంతా ఉపాధికోసం ప్రధాన నగరాలకు రావడంతో నగరాలలో ట్రాఫిక్ సమస్యతో పాటు, ఇంటి అద్దెలు పెరగడం, నిత్యావసర వస్తువుల ధరలు పెరగడం, డ్రైనేజి ఉత్పన్నం కావడం గృహ సమస్య, కాలుష్య సమస్యలు దినదినాభివృద్ధి చెందుతున్నాయి.

అట్టడుగు వర్గాలవారు మురికి వాడలలో అనారోగ్యంతో దుర్భర జీవితాలను గడుపుతున్నారు. నగరాలలో సాఫ్ట్‌వేర్ రంగం పరిఢవిల్లడంతోఉపాధి కోసం లక్షలాది నిరుద్యోగులు నగరాలకు తరలివస్తున్నారు. ఫలితంగా, ప్రశాంతమైన పల్లెసీమలు జనాభా తగ్గిపోయి చిన్నబోతున్నాయి.

నగరం పెద్దది అవుతున్న కొద్దీ అందుకనుగుణంగా అవసరాలను గుర్తించి, నగరాభివృద్ధి చేసే కన్నా, శాటిలైటు (ఉపగ్రహ) నగరాలను నిర్మించి, నగరాలలో వుండే సౌకర్యాలు అనగా మంచినీటి సౌకర్యం, వైద్య, ఆరోగ్యసేవలు వంటి వాటిని, ఉపాధి అవకాశాలను గ్రామాలను, శివారు టవున్‌షిప్‌లు, శాటిలైట్ టవున్లలోను కల్పించిననాడు నగరాలలో జనాభా సమస్యకు పరిష్కారం ఏర్పడుతుంది.

నగరాలు, పరిసర నివాస ప్రాంతాలలో గ్రీన్ బిల్డింగ్‌లనబడే పర్యావరణ హితమైన నిర్మాణాలు జరగాలి. అలాగే, మల్టీ నేషనల్ కంపెనీలైన సత్యం కంప్యూటరు, ఇన్ఫోసెస్, విప్రో, టి.సి.యస్ వంటివి బి.హెచ్.ఇ.యల్ వారు తమ సిబ్బందికి తమ సంస్థ ఆవరణలోనే టౌన్‌షిపులు ఏర్పాటు చేసిన విధంగా సంస్థలలో పని చేస్తున్నవారికి తమ సంస్థ ఆవరణలో లేదా దగ్గరిప్రాంతంలో నివాస వసతి ఏర్పాటు చేస్తే చిన్న, చిన్న, టౌన్‌షిప్పులు అభివృద్ధి చెంది, పట్టణాలపై భారం తగ్గుతుంది. ట్రాఫిక్ సమస్యలు కూడా తగ్గుతాయి.

అలాగే ప్రభుత్వం కూడా అన్ని పెద్ద సంస్థలకు రాష్ట్ర రాజధానిలోనే స్థావరాలనివ్వకుండా, రాష్ట్రంలోని ఒక్కొక్క పెద్దపట్టణంలో ఒక్కొక్క పెద్ద సంస్థకు స్థావరాలనేర్పరిస్తే, రాష్ట్రం అంతటా కేంద్రీకరించకుండా, అంతటా విస్తరించబడటం జరుగుతుంది.






ఐక్యరాజ్యసమితి అంచనాల ప్రకారం, మన దేశంలో 2050వ సంవత్సరానికల్లా 50 శాతం మంది ప్రజలు నగరాలలో నివసిస్తారు. పల్లెసీమలు క్రమంగా అంతరించిపోయే ప్రమాదముందని ఐక్యరాజ్య సమితి హెచ్చరించింది.




కనుక రాబోయే సమస్యలను ముందుగానే ఊహించి, సమస్యలు ఉత్పన్నమయినప్పుడే స్పందించకుండా సమస్యలు, ఉత్పన్నం కాకముందే పరిష్కార మార్గాలను సిద్ధం చేసుకోవడం తెలివైన, ఉత్తమమైన విషయంగా భావించాలి. గ్రామాలను, నగరాలతో సమానంగా అభివృద్ధి చేయడానికి, ఒక క్రమపద్ధతిలో ప్లాన్డ్ సిటీలుగా రూపొందించడానికి, లోపరహిత ప్రణాళికలతో ఆధునిక ఆర్గనైజ్డ్ నగరాల నిర్మాణానికి నేడే నాందీ వచనం పలకాలి!

అలా కాకపోతే సమస్యల విషవలయంలో తలమునకలయ్యే భావితరాలు మనలను క్షమించక మనం చరిత్రహీనులవుతాం!

*- ఎ.వి. రాజా*
*ఆంధ్రప్రదేశ్ భూగర్భజల శాఖ*



# గట్టిపోటీలో టెన్నిస్

**ప్రపంచ టెన్నిస్ రంగంలో, జూన్, జూలై నెలలు అత్యంత ముఖ్యమైన నెలలుగా నిలుస్తాయి. టెన్నిస్‌లో జరిగే నాలుగు అత్యంత ముఖ్యమైన టోర్నమెంట్లలో రెండు టోర్నమెంట్లు ఈ రెండు నెలల్లోనే జరుగుతాయి. ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్ టోర్నమెంట్లు జరిగే కాలమిది.**

ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్‌ను స్పెయిన్‌కి చెందిన రాఫెల్ నాదల్ సొంతం చేసుకున్నారు. వింబుల్డన్ ఇప్పుడు జరుగుతూ ఉంది. ఫ్రెంచ్ టైటిల్‌ను ఆరోసారి గెలవటం ద్వారా నాదల్ జోర్న్‌బోర్గ్ రికార్డును సమం చేయటంతో పాటు, తన నెంబర్ వన్ స్థానాన్ని కూడా నిలబెట్టుకున్నాడు, జోర్న్‌బోర్గ్ కూడా అతిగొప్ప టెన్నిస్ క్రీడాకారుడే.

రాఫెల్ నాదల్‌ను 'రాఫా'గా ముద్దుపేరుతో వ్యవహరిస్తుంటారు. 'మట్టి కోర్టు రారాజు'గా ఆయనకు పేరుంది. ఎందుకంటే, మట్టి కోర్టుపై ఆడినప్పుడు ఆయనకు తిరుగుండదు. ఫ్రెంచ్ ఓపెన్ జరిగేది మట్టి కోర్టుపైనే, అయితే కాలం గడిచేకొద్దీ గడ్డికోర్టు వంటి ఇతర కోర్టులతో కూడా ఆయన పైచేయి సాధించాడు. వింబుల్టన్ గడ్డి కోర్టులోనే జరుగుతుంది. దాంతో 'టెన్నిస్ రారాజు'గా రాఫా పేరు ప్రఖ్యాతులు ఆర్జించాడు. ఆయన రికార్డులను పరిశీలిస్తే, అందరూ అందుకు సమ్మతిస్తారు కూడా. 10 గ్రౌండ్ శ్లామ్ టైటిళ్లను, ఒలింపిక్ గోల్డ్ మెడల్‌ను రాఫా సాధించాడు. నాలుగు గ్రాండ్‌శ్లామ్ టైటిళ్లను సాధించిన అతిచిన్న వయస్కుడిగా కూడా రాఫా రికార్డు నెలకొల్పాడు.

ఇటీవలి సంవత్సరాల్లో టెన్నిన్‌లో పోటీ భయంకరంగా పెరిగిపోయింది. ఎంత పెరిగిందంటే, ఏ టెన్నిస్ రారాజు కాని, రారాణి కానీ తన కిరిటాన్ని ఎక్కువకాలం నిలుపుకొనే అవకాశం ఉండకపోవచ్చు. ఒకప్పుడు ఛాంపియన్‌లు తమ స్థానాలను అనేక సంవత్సరాల పాటు కాపాడుకొనగలిగేవారు.

ఆస్ట్రేలియాకు చెందిన రాడ్‌లావర్ అన్ని కాలాలకు చెందిన అతిగొప్ప టెన్నిస్ క్రీడాకారుడు. 1960ల దశకంలో టెన్నిస్ క్రీడారంగాన్ని ఆయన అత్యంతగా ప్రభావితం చేశాడు. 1970లో దశకంలో జిమ్మీకానర్స్, అమెరికాకు చెందిన జాన్‌మెక్ ఎన్‌కో, స్వీడన్‌కు చెందిన జోన్‌బోర్గ్‌ల మధ్య తీవ్రపోటీ నెలకొన్నది. బోర్గ్ గడ్డికోర్టుపై తిరుగులేని చక్రవర్తిగా ఆవిర్భవించాడు. దశాబ్దపు రెండవ అర్ధభాగంలో మట్టికోర్టుపై కూడా ఆధిపత్యం సాధించి వరుసగా 5 సార్లు వింబుల్డన్ టైటిల్‌ను గెలుచుకున్నాడు. జాన్ మెక్‌ఎన్‌రో ఆయనకు గట్టిపోటీ ఇచ్చి ఆయన స్థానాన్ని లాక్కునేంత వరకు బోర్గ్ ఆధిపత్యం కొనసాగింది. చాలా కాలం తరువాత అమెరికాకు చెందిన పీట్ సంప్రాస్ టెన్నిస్ అగ్రస్థానంలోకి వచ్చి అనేక సంవత్సరాల పాటు తన అధిపత్యాన్ని నిలుపుకున్నాడు. ఆయన మొత్తం 14 గ్రాండ్‌శ్లామ్ టైటిళ్లను సొంతం చేసుకున్నాడు. స్విట్జర్లాండుకు చెందిన రోజర్ ఫెదరర్ కొద్ది సంవత్సరాల క్రితం ఈ రికార్డును సమంచేశాడు.



కొత్త శతాబ్ధంలో రోజర్ ఫెదరర్ టెన్నిస్ రంగం పైకి దూసుకొచ్చి, 2001లో జరిగిన వింబుల్టన్‌లో పీట్‌సంప్రాస్‌కి ఘోరమైన ఓటమి చవిచూపించాడు. రెండేళ్ల తరువాత నాటికి ఫెదరర్ అగ్రస్థానానికి చేరుకుని 270 వారాల పాటు అదే స్థానంలో కొనసాగాడు. 2008లో ఫెదరర్ తన అగ్రస్థానాన్ని రాఫెల్ నాదల్‌కు వదులుకోవలసి వచ్చింది. అగ్రస్థానంలోకి చేరుకోవడానికి రాఫా రెండవ స్థానంలో 160 వారాల పాటు ఉండి వేచి చూడవలసి వచ్చింది. రాఫా చిరకాల ప్రత్యర్థి రోజర్ ఫెదరర్ మూడవస్థానంలో ఉండగా, సెర్బియాకు చెందిన నోవక్ జోవోలిక్ వీరిద్దరికి సవాలు విసురుతున్నాడు. ఫెదరర్, రాఫా చిరకాల ప్రత్యర్థులు. 25 సార్లు ప్రత్యక్షంగా తలపడ్డారు. అందరూ అనుకున్న దానికి

# రారాజులు రారాణులు





విరుద్ధంగా, రాఫా 17సార్లు గెలుపొందాడు.

ప్రస్తుతం అగ్రస్థానంలో ఉన్న 25 సంవత్సరాల రాఫా ఆధిపత్యం ఎక్కువకాలం కొనసాగుతుందని చెప్పలేం. రోజర్ ఫెదరర్ ఇప్పటికీ గట్టిపోటీ ఇచ్చే క్రీడాకారుడిగా కొనసాగుతుండగా, జోకోవిక్ నుంచి రాఫాకు తీవ్రమైన సవాలు ఎదురవుతుంది. ఈ ఏడాది మొదట్లోనే ఒక గొప్ప గెలుపుతో రంగంలోకి దూసుకొచ్చిన జోకోవిక్ జూన్‌లో జరిగిన ఫ్రెంచ్ ఓపెన్ సెమీఫైనల్‌లో రోజర్‌ఫెదరర్ ఓడించేంతవరకు అజేయంగానే ఉన్నాడు. 42 వరుస విజయాలు సాధించిన మెక్ఎన్‌కో రికార్డును జోవోలిక్ కొద్దిలో తప్పిపోయారు. అనేక సందర్భాల్లో రాఫాను, ఫెదరర్‌ను ఓడించి, తదుపరి ఛాంపియన్ తనే అనే భావాన్ని కలిగించాడు.

ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్‌ను కనుక రాఫా గెలుచుకోకపోయి ఉన్నట్లయితే, తన నెంబర్‌వన్ స్థానాన్ని జోకోవిక్‌కి వదులుకోవలసి వచ్చేది. సెమీఫైనల్‌లో జోకోవిక్‌ని ఓడించి తన అగ్రస్థానాన్ని కాపాడుకోవడానికి దోహదపడినందుకు రోజర్ ఫెదరర్‌కు రాఫా కృతజ్ఞుడై ఉండాలి. టెన్నిస్ రంగంలో తదుపరి వెలగబోయే క్రీడాకారుడు జోకోవిక్ అన్పిస్తుంది.



మహిళా టెన్నిస్‌లో కూడా అగ్రశ్రేణి క్రీడాకారిణులు మొదటి మూడు అగ్రస్థానాలను ఎక్కువ కాలం అంటి పెట్టుకోవడం కష్టంగా మారింది. గడిచిన అర్థ శతాబ్దంలో ఆస్ట్రేలియాకి చెందిన మార్గరెట్ స్మిత్, అమెరికాకి చెందిన బిల్లీ జీన్ కింగ్, (కిస్ఎవర్ట్, మార్టినా నవ్రతిలోవా, సెరెనా, వీనస్ విలియమ్స్), జర్మనికి చెందిన స్టెఫీగ్రాఫ్ టెన్నిస్ రంగంలో అగ్రతారలుగా వెలుగొందారు. ఇప్పుడా పరిస్థితి మారిపోయింది. ఇక్కడ కూడా భయంకరమైన పోటీ నెలకొన్నది. డెన్మార్క్‌కు చెందిన కరోలిన్ వొజ్నియాకి ప్రస్తుతం నెంబర్ వన్ క్రీడాకారిణిగా అవతరించింది. రెండేళ్ల క్రితం ఈమె పెద్దగా వెలుగులోకి కూడా రాలేదు. ఈ ఏడాది ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్‌ను గెలుచుకున్న చైనా సంచలనం లైనా కూడా అంతే. అకస్మాత్తుగా దూసుకొచ్చింది. ఇదే పద్ధతిలో ఇటలీకి చెందిన ఫ్రాన్సెస్కా షియావొనె 2010లో ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్‌ను గెలుచుకుంది. గ్రాండ్ శ్లామ్ టైటిల్‌ను గెలుచుకున్న మొదటి చైనా క్రీడాకారిణి అయిన లైనా నెంబర్‌వన్ స్థానంపై గురిపెట్టింది.

## డబ్బు... డబ్బు...

ఇప్పటి క్రీడాప్రియులకు ఈ విషయాలు అంతగా తెలియకపోవచ్చు, 40 సంవత్సరాల క్రితం వరకు టెన్నిస్‌ను సరదాగా, ఆటపై ఇష్టంతోనే ఆడి గెలిచేవారు. అన్ని ప్రధాన టోర్నమెంట్లలో డబ్బుకి ఏ మాత్రం పాత్ర లేదు. వింబుల్టన్ అయినా అంతే, ఫ్రెంచ్ ఓపెన్ అయినా అంతే స్వచ్ఛంద క్రీడాకారులకు ఈ పోటీలు వేదికగా ఉండేవి. ఈ టోర్నమెంట్లలో వృత్తిపరమైన క్రీడాకారులను ఆడనిచ్చేవారు కాదు.

50ల దశకంలో వింబుల్టన్ మాజీ ఛాంపియన్, అమెరికా జాతీయ ఛాంపియన్ అయిన జాక్ క్రామర్ అగ్రశ్రేణి క్రీడాకారులను అద్దెకు తెచ్చుకోవటం ద్వారా 'క్రామర్ సర్కస్' అనే దానిని ప్రారంభించాడు, వింబుల్టన్ మాజీ ఛాంపియన్లను ఇందులో జమచేసి, అమెరికా, యూరప్‌లలో ఎగ్జిబిషన్ మ్యాచ్‌లను ఆయన నిర్వహించాడడు. స్వచ్ఛంద ఛాంపియన్లు ఆడే ఆటకంటే, ఈ వృత్తిపరమైన క్రీడాకారులు ఆడే ఆట స్థాయి అత్యున్నతంగా ఉండేది. ప్రధాన టోర్నమెంట్లలో ఆడకపోయినప్పటికీ, ప్రొఫెషనల్ క్రీడాకారులుగా మారటం లాభదాయకంగా ఉందని గమనించిన క్రీడాకారులు నెమ్మదిగా అటువైపు మొగ్గు చూపడం ప్రారంభించారు.

స్వచ్ఛంద టెన్నిస్ తన ప్రాభవాన్ని కోల్పోవటంతో, ప్రొఫెషనల్ క్రీడాకారులను ఎంతోకాలం ప్రధాన టోర్నమెంట్లకు దూరంగా ఉంచలేమని నిర్వాహకులు భావించారు. దాంతో 1968లో అన్ని ప్రధాన టోర్నమెంట్లు 'ఓపెన్'గా మారాయి. స్వచ్ఛంద క్రీడాకారులతో పాటు, ప్రొఫెషనల్ క్రీడాకారులు కూడా ఇందులో పాల్గొనవచ్చని దీనర్థం.

నేడు అసలు స్వచ్ఛందగా ఆడుతున్న క్రీడాకారులే కనపడటం లేదు. ఆస్ట్రేలియాకి చెందిన రాడ్‌లావర్ ఒక స్వచ్ఛంద క్రీడాకారుడిగా, ప్రొఫెషనల్ క్రీడాకారుడిగా గ్రాండ్‌శ్లామ్ (ఆస్ట్రేలియాన్, ఫ్రెంచ్, వింబుల్టన్, అమెరికా ఛాంపియన్ షిప్‌లు) గెలుచుకున్న ఏకైక క్రీడాకారుడిగా ఘనత సాధించాడు

ఇప్పుడయితే, పెద్దమొత్తంలో డబ్బు సమకూర్చే ఆటగా టెన్నిస్ పూర్తిగా మారిపోయింది. ప్రైజ్‌మనీ రూపంలో రాఫా అందుకున్న డబ్బు 42 మిలియన్ డాలర్లు. ఫెదరర్ 63 మిలియన్ డాలర్లు అందుకున్నాడు. క్రీడాపరికరాలు, ఇతర ఉత్పత్తులకు ప్రకటనల ద్వారా వారు మరెన్నో రెట్ల డబ్బు సంపాదిస్తున్నారు.









1900లో డేవిస్‌కప్ ప్రారంభమైనప్పటి నుంచి ఆస్ట్రేలియా, అమెరికా దేశాలు సంయుక్తంగా ఆ పోటీలపై ఆధిపత్యం వహించాయి. జర్మనీ, స్పెయిన్, రష్యా, క్రొయేషియా, సెర్బియా ఈ పోటీలో ప్రవేశించే వరకు ఇది కొనసాగింది. గత 25-30 సంవత్సరాలుగా ఈ దేశాలే డేవిస్ కప్‌ను గెలుస్తూ వస్తున్నాయి. మొదటి 5 స్థానాలల్లో అమెరికాకు చెందిన ఒక్క మహిళా క్రీడాకారిణి కాని, పురుష క్రీడాకారుడు కాని లేకపోవటం ఆ దేశానికి విషాదం. గతంలో డజన్ల కొద్దీ ఛాంపియన్లను అమెరికా తయారు చేసింది.

హైదరాబాద్‌కి చెందిన సానియా మీర్జా వల్ల మనదేశంలోనూ టెన్నిస్‌కి ప్రజాదరణ పెరిగింది అయితే, తన ఆటతీరుతో కాక అందంతో ఆమె ఆకట్టుకుంది. 2003లో వింబుల్డన్‌లో బాలికల డబుల్స్ టైటిల్ గెలవటం ద్వారా ఆమె టెన్నిస్ రంగంపైకి దూసుకుని వచ్చింది. రెండేళ్ల తరువాత, ఆమె తన ఉత్తమ స్థానమైన 27వ స్థానానికి సింగిల్స్‌లో చేరుకుంది. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో సెరెనా విలియమ్స్‌తో తలపడినప్పుడు మంచి ఆటతీరు కనపరచటం ద్వారా 27వ స్థానానికి చేరుకోగలిగింది. తొలి 30 స్థానాల్లో చోటు సంపాదించిన మొదటి భారతీయురాలు సానియానే. ఆ తరువాత కాలంలో అనేక వివాదాలు, పట్టుదల లేమి, గాయాలు వంటి కారణంగా సానియా మీర్జా స్థానం సింగిల్స్‌లో 150 స్థానాలకంటే దిగువకు పడిపోయింది. ఇటీవలి ఫ్రెంచ్ ఓపెన్‌లో మహిళల డబుల్స్‌లో రష్యాకి చెందిన ఎలెనా వెస్నియాతో కలసి రన్నరప్‌గా నిలవడం ద్వారా తన స్థానాన్ని సానియా కొంత మెరుగుపరచుకోవటం శుభ పరిణామం. 2009లో ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో మహేష్ భూపతితో కలిసి ఆమె మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్‌ను గెలుచుకుంది. సానియా ప్రస్తుతం సింగిల్స్‌లో 60వ స్థానంలోనూ, డబుల్స్‌లో 14వ స్థానంలోనూ ఉంది. వచ్చే ఏడాది జరగనున్న లండన్ ఒలింపిక్స్‌లో ఆడనున్న భారతదేశపు క్రీడాకారుల్లో సానియాపై కూడా కొంతమేరకు ఆశలు నెలకొన్నాయి. సింగిల్స్‌లోనే కాకుండా, మహిళల డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ ఆడేందుకు ఆమె తన ఆటతీరును, ఫిట్‌నెస్‌ను మెరుగుపరచుకోవడానికి ప్రయత్నిస్తోంది.

**- దాసు కేశవరావు**

**(అనువాదం : వై.సరోజ)**

## అనంతపురంలో నాదల్ అకాడమీ

ఒక స్పానిష్ ఛాంపియన్ ప్రపంచంలోని అన్ని ప్రదేశాలనూ కాదనుకుని అనంతపురంలో టెన్నిస్ అకాడమీ స్థాపించడమంటే అదెంత అద్భుతమో ఊహించండి. రాఫా ఇదే పని చేశాడు. అత్యంత కరువు కాటకాలతో సతమతమయ్యే అనంతపురం జిల్లా హెడ్‌క్వార్టర్స్ ఆయన అనంతపురం పట్టణంలో టెన్నిస్ అకాడమీ నెలకొల్పాడు.

నమ్మశక్యం కాని నిజం ఇది. ప్రపంచ నెంబర్‌వన్ టెన్నిస్ స్టార్ 'రాఫా' ఎటువంటి హడావిడి, హంగు, ఆర్భాటం లేకుండా గత అక్టోబర్‌లో అనంతపురానికి వచ్చి తన పేరిట టెన్నిస్ అకాడమీని నెలకొల్పాడు. స్పెయిన్‌కు చెందిన దివంగత ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ స్థాపించిన రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ సహకారంతో 'నాదల్ టెన్నిస్ స్కూల్'ను రాఫా స్థాపించాడు. ఈ ప్రాంతంలో విన్సెంట్ ఫెర్రర్ అనేక సంవత్సరాల పాటు నివశించాడు.

పిల్లలపై రాఫాకు ఉండే ప్రేమే ఈ ఆలోచనకు దారి తీసింది. స్థానిక క్రీడాకారులను కలిసిన రాఫా అకాడమీని బాగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చాడు. అంతర్జాతీయ స్థాయి మట్టి కోర్టులతో నెలకొల్పిన ఈ అకాడమీ త్వరలో తన కార్యకలాపాలు ప్రారంభించనున్నది.

# కిశోర బాలికలు తెలుసుకోవాల్సిన విషయాలు

**మన భారతదేశంలో 190 మిలియన్ల జనాభా కిశోర బాలికలే. అంటే 11 నుండి 19 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన బాలికలు. 11 సంవత్సరాల నుండి 19 సంవత్సరాల వయసు చాలా కీలకమైనది. ఈ వయసులోనే బాలికలలో భౌతిక (శారీరక) మార్పులు, అంతర్గత మార్పులు సంభవిస్తాయి. స్తనాల ఎదుగుదల, అవాంఛిత రోమాల వృద్ధి శారీరకంగా కనిపించే మార్పులు కాగా, గర్భాశయ అభివృద్ధి, గర్భధారణకు అనువుగా గర్భాశయం రూపుదాల్చడం అంతర్గతంగా జరిగే మార్పులు. ఈ మార్పుల క్రమంలో ప్రతి 28 రోజులకొకసారి ఋతుస్రావం జరగడం, 4 నుండి 5 రోజులు వరుసగా ఋతుస్రావాన్ని భరించవలసి రావడం కిశోర బాలికలు ఎదుర్కోనే ప్రధాన సమస్య.**

ఈ సమస్యను సులభతరం చేసుకోవడం, దానిపై ఉన్న భయాలు, అపోహలను పారద్రోలి, ఆరోగ్యాన్ని పెంపొందించుకోవడం మన చేతులలోనే ఉంది. ఋతుస్రావ సమయంలో జననేంద్రియాలను శుభ్రంగా ఉంచుకోవడం, శుభ్రమైన వస్త్రాన్ని లేదా శానిటరీ నాప్‌కిన్‌ను వాడడం ద్వారా ఇన్‌ఫెక్షన్లు సోకకుండా సురక్షితంగా ఉండడం, తద్వారా ప్రత్యుత్పత్తి వ్యవస్థను దెబ్బతినకుండా చూసుకోవడం ఒక ఘట్టంకాగా, మరో ముఖ్యఘట్టం వాడిన వస్త్రాన్ని శుభ్రపరచుకోవడం ఎలా? వాడిన శానిటరీ నాప్‌కీన్‌ను ఎలా పడవేయాలి? ఆ సమయంలో బహిరంగ మల విసర్జన వలన ఎదురయ్యే ఇబ్బందులు ఏమిటి? చేతులను శుభ్రంగా ఉంచుకోవలసిన ఆవశ్యకత ఏమిటి? అనేది వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతతో ఈ అంశం ముడిపడి ఉన్నదనేది మనకు తేటతెల్లమౌతుంది.

గ్రామీణ కిశోర బాలికలు పారిశుధ్య పరంగా వెనుకబడి ఉండడం వలన జననేంద్రియాలకు ఇన్‌ఫెక్షన్స్ సోకడం, తద్వారా ప్రత్యుత్పత్తి వ్యవస్థ దెబ్బతినడం జరుగుతుందని మనకు అనేక సర్వేలలో తేలింది.



మల విసర్జనకు వెళ్ళడం ఓ సమస్యకాగా, అలా వెళ్ళినపుడు జననేంద్రియాలను, చేతులను శుభ్రపరచుకోనేందుకు సరిపడ నీరు లేక అనేక రోగాలు సంభవిస్తున్నాయనేది నిత్య సత్యం.

కిశోర బాలికల ఋతుస్రావ నిర్వహణకు సంబంధించి ఈ క్రింది విషయాలు వెల్లడి అయ్యాయి.

- కిశోర బాలికలకు శారీరకంగా సంభవించే అంతర్గత మార్పులపై సరైన అవగాహన లేదు.
- కిశోర బాలికలు అందరూ వస్త్రాన్ని ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. కాలేజీకి/ పాఠశాలకు వెళ్ళేప్పుడు మాత్రం కొందరు శానిటరీ నాప్‌కిన్స్ వాడుతున్నారు.
- ఋతుస్రావంలో ఉన్నామనే విషయం వెల్లడించడానికి కూడా ఇష్టపడడం లేదు.
- పాఠశాలలో /కళాశాలలో మరుగుదొడ్లు లేకపోవడం లేదా వాడడానికి అనుకూలంగా లేకపోవడం వలన ఆ సమయంలో వారు ఇంట్లోనే ఉండి పోతున్నారు. ఆ సమయంలో బహిరంగ మల విసర్జనకు వెళ్ళిరావడం అనేది ప్రత్యక్ష నరకం. కడుపునొప్పి, నడుం నొప్పి బాధిస్తున్నప్పుడు దూర ప్రాంతాలకు నడక చాలా కష్టం.
- చెంబెడు నీళ్ళతో పూర్తిగా శుభ్రపరచుకోవడం అనేది సాధ్యం కాదు.
- ఆ సమయంలో ఆహార నియమాలు ఏర్పరచుకోవడం వలన సరైన పోషక విలువలు గల ఆహారం తీసుకోలేక పోతున్నారు.
- కడుపు నొప్పి, నడుము నొప్పి వంటి వాటికి డాక్టరును సంప్రదించకుండానే మందు బిళ్ళలు వాడుతున్నారు.
- షాపుకు వెళ్ళి శానిటరీ నాప్‌కిన్స్ కొనుక్కోవడం, వాటిని తీసుకురావడం చాలా గోప్యంగా, అత్యంత రహస్యంగా జరుగుతుంది.
- ఆచార, సంప్రదాయాలకు విలువనిచ్చే చాలా కుటుంబాలలో నేటకీ ఆ సమయంలో ఇంట్లో కలవకుండా వేరుగదిలో ఉంచడం, కొన్ని తెగలలో ఊరికి దూరంగా ఒక ప్రత్యేకమైన పాకలో ఉంచడం జరుగుతుంది.

పై అంశాలు వ్యక్తిగత, మానసిక అభివృద్ధికి అవరోధాలుగా నిలుస్తున్నాయి. ఆత్మగౌరవం, విశ్వాసం పెంపొందించుకోవడం ముఖ్యం. అందుకు ఋతుస్రావం అనేది ఓ సాధారణంగా జరిగే కార్యకలాపం అని - ఆకలివేస్తే అన్నం ఎలా తింటున్నామో, రాత్రయితే ఎలా నిద్ర పోతున్నామో, వానలో ఎలా గొడుగు పట్టుకుంటున్నామో, కాళ్ళకు చెప్పులు ఎలా వేసుకుంటున్నామో, ఇదీ అలాగే అని గ్రహించాలి. పూర్వం ఋతుస్రావాన్ని అడ్డుకునే సరైన సాధనాలు లేక అసౌకర్యానికి గురయ్యేవారు. కానీ నేడు నాగరికత వృద్ధి చెంది, మార్కెట్‌లో పలు సౌకర్యాలు అందుబాటు లోనికి రావడం ఓ శుభపరిమాణం. అయితే వాటిని ఎలా ఉపయోగించాలో, ఎలా పడవేయాలో తెలియకపోతే లేని సమస్యలను కొని తెచ్చుకున్నట్లే అవుతుంది. వ్యక్తిగతంగా, పర్యావరణ పరంగా సమస్యలు సృష్టించిన వాళ్ళం అవుతాం.

### వ్యక్తిగత పరిశుభ్రతకు కొన్ని చిట్కాలు

- అవాంఛిత రోమాలను ఎప్పటికప్పుడు శుభ్రపరచుకోవాలి.
- రక్త స్రావానికి అడ్డుగా గుడ్డ లేదా శానిటరీ నాప్‌కిన్ ఏదైనా వాడవచ్చు. అయితే వాడేది పరిశుభ్రంగా వుండాలి.
- గుడ్డను వాడేవారు మెత్తని గుడ్డను వాడాలి.
- వాడిన గుడ్డను సబ్బుతో శుభ్రపరచి, బ్లీచింగ్/డెట్టాల్‌లో ముంచి ఎండలో ఆరవేయాలి.
- ఆరినగుడ్డను మడచి దుమ్మూ, ధూళి సోకని ప్రదేశంలో భద్రపరచాలి.

# పల్లె పల్లవిస్తూ...



ఇది అంతమూ కాదు
ఆరంభమూ కాదు
పల్లెలోని రేబవళ్ళన్నీ నిత్యం సంబరాలతోనే నిండిపోతాయి
ఏడాదికోసారి వచ్చే సంక్రాంతులూ వాగాదులూ పర్వదినాలూ
పల్లెబుగ్గపై ఆనందం చుక్కలా మెరిసేలా చేస్తాయి
ఆ సౌందర్యానికి పల్లె నిలువెట్టు ఒజ్జబంతి అవుతుంది
ఈ నాగరిక ప్రపంచంలో
చచ్చేవాళ్ళకోసం ఏడ్చేవాళ్ళుండరు
అనునిత్యం ఉపవాసగాళ్ళకి తిండి పెట్టే వాళ్ళూ దొరకరుగానీ
పల్లెకేం..
ఏడాది పొడవునా విల్లులా అందంగా విరుస్తుంది
దుఃఖాన్ని దూరంగా తరిమి కొడుతుంది
మనం మత్తు పరదాల్ని తొలగించుకొని
వేకువ కిటకీల్లోంచి
చూపుల్ని సాగదీస్తే చాలు
ఆకాశం మంచుదుప్పటిని చుట్టే దృశ్యాన్ని చూడవచ్చు
చెమటతో తడిసిన భూమినీ
చలికాచుకొచే చెట్లనీ నిద్రలేపుతూ
నిత్యం పల్లవిస్తున్న పల్లెని పలకరించి రావచ్చు
ముగ్గులలో
పురివిప్పిన రంగురంగుల వీధులన్నీ నెమళ్ళయి
వయ్యారంగా నాట్యం చేస్తూ కన్పిస్తాయి
ఈ సొగసు పల్లెలో తప్ప ఇంకెక్కడ చూడగలం?
సంప్రదాయం కదలి వచ్చేదీ
ఆనందం తాండవించేదీ
పచ్చిక బయళ్ల సింగారాలూ
నేలతల్లి బంగారలూ పూచేదీ ఒక్క పల్లెలోనే..
అందుకే పల్లెకు ప్రణమిల్లుతా..
నా పల్లె పొగచూరిపోకుండా ప్రాణాల్ని పణంగా పెడతా..

*- డా॥ అద్దంకి శ్రీనివాస్*

- శానిటరీ నాప్‌కిన్‌ను వాడేవారు ప్రతి 5 నుండి 4 గం॥లకు ఒకసారి మార్చడం శ్రేయస్కరం.
- వాడిన నాప్‌కిన్‌ను నీటితో జాడించి, డెట్టాల్‌లో ముంచి పడవేయాలి.
- మూత్రానికి వెళ్ళిన ప్రతిసారీ నీటితో జననాంగాలను శుభ్రపరచుకోవాలి
- మల విసర్జనకు మరుగుదొడ్లు వాడకం శ్రేయస్కరం.
- బహిరంగ మల విసర్జన వలన సరిపడ నీరు లేక శుభ్రపరచుకోవడం కష్టం. ఆ సమయంలో అంతదూరం నడచి వెళ్ళడం కష్టతరం. పైగా అక్కడి మల అవశేషాల నుండి బాక్టీరియా, వైరస్ వంటి వ్యాధికారక క్రిములు జననాంగాలకు చేరి ఇన్‌ఫెక్షన్‌కు దారి తీయవచ్చు.

## ఋతు స్రావ సమయానికి ప్రభుత్వ పథకం

గుడ్డను వాడడం, శుభ్రపరచడం, దానిని భద్రపరచడం, తిరిగి వాడడం కొంచెం కష్టతరమైన పని. ఏమాత్రం అజాగ్రత్తతో ఉన్నా అనారోగ్యానికి దారితీయవచ్చు. కనుక గుడ్డకన్నా శానిటరీ పాడ్ వాడకం శ్రేయస్కరం, సులభతరం, సౌకర్యం అనేది అందరం ఏకాభిప్రాయంగా ఒప్పుకునే అంశం. ఈ కోణంలో భారత ప్రభుత్వ తక్కువ ధరకు గ్రామీణ బాలికలకు శానిటరీ నాప్‌కిన్స్ అందించాలనే ఉద్దేశ్యంతో 'ఒక్క రూపాయికి శానిటరీ నాప్‌కిన్' పేరిట ఓ పథకాన్ని ప్రారంభించాలని సంకల్పించింది. ఈ పథకం 2011 ఆగష్టు మాసంలో ప్రారంభంకానున్నది.

ఈ పథకం క్రింద 6 ప్యాడ్‌లు కల ఒక్కో పాకెట్ నెలకి ఒక్కటి చొప్పున కిశోర బాలికలకు 6 రూపాయలకు విక్రయిస్తారు. తక్కువ ధరకు శానిటరీ ఫాడ్స్ లభించడం మన 'గ్రామీణ బాలికలకు శానిటరీ నాప్‌కిన్స్' అందుబాటులోనికి తీసుకురావడం, తద్వారా పరిశుభ్రమైన లైంగిక అలవాట్లను పెంపొందించి వారి ప్రత్యుత్పత్తి వ్యవస్థ దెబ్బతినకుండా చూడడం ఈ పథకం ముఖ్య ఉద్దేశం. తద్వారా ఋతుస్రావ సంబంధిత నిర్వహణ, వ్యక్తిగత పరిశుభ్రత, పర్యావరణ పరిశుభ్రత పెంపొందాలని ఆశిద్దాం.

*- మాధురి. పి*



స్వార్థం పెరిగి, మానవత్వం నశించి నైతిక విలువలు దిగజారిన నేటి సమాజంలో మనం నిత్యం దోపిడీకి గురి అవుతున్నాం. అధిక ధరలు, వాయిదాల పద్ధతిపై అమ్మకాలు, పొంతనలేని గ్యారంటీలు, అరచేతిలో వైకుంఠం చూపే డిస్కౌంట్‌లు, మందుల కంపెనీలో మోసాలు, హానికర ఔషధాలు, ఆహార పదార్థాలలో కల్తీలు, నాణ్యతలేని నకిలీ వస్తువులు, తూనికలు, కొలతలలో మోసాలు, అక్రమ వ్యాపార విధానాల వలన సామాన్యుడి నుండి సంపన్నుడి వరకు, దరిద్రుడి నుండి ధనవంతుని వరకు కష్టనష్టాలతో దిక్కుతెలియని పరిస్థితులలో జీవితాన్ని గడుపుతున్నారు. నిత్యావసర వస్తువుల కొనుగోలు విషయంలో మనం ఏదో రకంగా నిత్యం నిరంతరం దోపిడీకి గురి అవుతున్నాం. మనం చెల్లిస్తున్న డబ్బుకు తగిన విలువైన, నాణ్యమైన, స్వచ్ఛమైన వస్తువును పొందలేని పరిస్థితిలో నేడు మనం జీవన యాత్ర సాగిస్తున్నాం.

# వినియోగదారుల రక్షణ గురించి తెలుసుకుందాం

టీ పొడి, కాఫీ పొడి, పాలు, మిరియాలు, కందిపప్పు కూరలు . . . ఇలా కల్తీకి గురికాని ఏ వస్తువూ మార్కెట్‌లో కనిపించడం లేదు. మనకు వచ్చే జబ్బులలో చాలా శాతం కల్తీ పదార్థాల వల్లనే అని చెప్పవచ్చు. కల్తీ వస్తులతో పాటు, సామాన్య వినియోగదారునికి అందుబాటులో లేకుండా ఆకాశపు అంచులు తాకే ప్రయత్నంలో నేటి వస్తువుల ధరలు ఉన్నాయి. ప్రభుత్వం వినియోగదారులకు మేలు చేకూర్చే రీతిలో ఎం.ఆర్.పి.ని ముద్రిస్తున్నప్పటికీ, ఎం.ఆర్.పి. రేటు కన్నా అధిక రేటుకు అమ్మే వారు కొందరైతే, ఎం.ఆర్.పి. రేటులో 40 శాతం, 50 శాతం డిస్కౌంట్ ఇచ్చేటటువంటి వ్యాపారులు కొందరున్నారు. ఎం.ఆర్.పి. నిబంధనలను వ్యాపారస్థులు పట్టించుకోవడం లేదు. ఉత్పత్తిదారుడు ముద్రించిన ధరపైన చిల్లర వ్యాపారస్థులు తమ సొంత స్టిక్కర్లను అక్రమంగా, చట్ట విరుద్ధంగా అతికించి ధరలు పెంచుతున్నారు.

ఒక వస్తువును ఉత్పత్తి చేసేందుకు అయ్యే ఖర్చుకు ఆ వస్తువును పొందేందుకు మనం చెల్లిస్తున్న డబ్బుకు ఎంతో భేదం ఉంటుంది. తూనికలు కొలతలలో మోసాలు చెప్పాల్సినవి కావు. ప్రమాణాలకు అనుకూలంగా లేని తూకపు రాళ్ళతో వినియోగదారులను మోసం చేయటానికి కొందరు వ్యాపారస్తులు చేసే జిమ్మిక్కుల వలన వినియోగదారుడు కిలోకి 50 గ్రా నుండి 100 గ్రా వరకు నష్టపోతున్నాడు. వినియోగదారులకు పరిష్కారం మార్గం లేదా ! అంటే ఉంది!.

పై సమస్యల పరిష్కార మార్గంగా అవతరించిన మహోన్నత, మహోజ్వల ఉద్యమయే 'వినియోగదారుల ఉద్యమం'. వస్తువులను లేదా సేవలను ఉపయోగించుకున్న వారంతా వినయోగదారులే. కొన్ని వస్తువుల ఉత్పత్తిదార్లు, అమ్మకందార్లు కూడా మరికొన్ని వస్తువుల విషయంలో వినియోగదారులే అవుతారు. అంటే మానవులంతా వినియోగదారులే కనుక సర్వమానవ సంక్షేమ వర్గరహిత ఉద్యమమే వినియోగదారుల ఉద్యమం అని చెప్పవచ్చు. వ్యక్తిగా గాక, సంఘటిత శక్తిగా అన్యాయాలను ఎదుర్కొనేందుకు, హక్కులు కాపాడుకునేటందుకు, బాధ్యతలను గుర్తించేందుకు వినియోగదారుల సంఘాల స్థాపన జరిగింది.

అన్యాయాలకు, అక్రమాలకు నిరాశతో మునిగిపోయిన వినియోగదారుల పాలిట ఒక వరంగా భారతదేశంలో 1986వ సంవత్సరం నుండి అమలులోకి వచ్చింది వినియోగదారుల రక్షణ చట్టం. ఈ చట్టం ద్వారా రక్షణ పొందే హక్కు, ఎంపిక చేసుకునే హక్కు, సమాచారం పొందే హక్కు, ఫిర్యాదు చేసుకునే హక్కు, నష్టపరిహారం పొందే హక్కు, విజ్ఞానం పొందే హక్కు వినియోగదారులకు ప్రసాదింపబడినది. ఈ చట్టం వినియోగదారుల ఉద్యమానికి అండగా ఉద్యమం మరింత బలం పుంచుకోవడానికి సహాయకారి అయింది.

మన దేశంలో రక్షణ చట్టం అమలులోకి వచ్చి 24 ఏళ్ళు కాలగర్భంలో కలిసిపోయినా గ్రామాలలో "వినియోగదారుల సంఘాలు అంటే ఏమిటి" అని ప్రశ్నించే స్థితిలో నేడు మన ఉద్యమం ఉండటం ఇప్పటికీ చూస్తున్నాం. ఆశించినంతగా ఉద్యమం ఉధృతం కాకపోవడానికి గల కారణాలను పరిశీలన జరుపుకోని మహోన్నత నూతన సమాజ నిర్మాణం కొరకు వినియోగదారుల ఉద్యమ పటిష్టతకు ప్రతీ ఒక్కరూ తమ వంతు సహకారాన్ని అందించాలి. గ్రామాలలో గ్రామీణులను చైతన్యవంతులను చేయడానికి గ్రామ గ్రామాన వినియోగదారుల సంఘాల స్థాపన జరగాలి.

ఒకే ఆశయంతో స్థాపించినా, స్థాపించబడుతున్న వినియోగదారుల సంఘాలు ఐకమత్యం అనే ఒక బాటలో పయనించి ఉద్యమ పటిష్టత కొరకు నిరంతరం శ్రమించాలి. రాజకీయాలకు అతీతంగా, కుల, మత, వర్గ విభేదాలు రాకుండా వినియోగదారుల ఉద్యమం సాగాలి. వినియోగదారుల ఉద్యమం హక్కులు, బాధ్యతలను ప్రాథమిక స్థాయి

నుండి అన్ని తరగతులలో పాఠ్యాంశంగా ప్రవేశపెట్టాలి. వినియోగదారుని శ్రేయస్సే మన శ్రేయస్సని భారతమాత కలలు పండించటానికి వినియోగదారుడే రారాజని చాటి చెప్పడానికి వినియోగదారుల ఉద్యమంలో ప్రతీ ఒక్కరూ ప్రవేశించాలి.

## వినియోగదారుల రక్షణ చట్టం, 1986

ప్రపంచ వ్యాప్తంగా వినియోగదారుల రక్షణ నిమిత్తం 9 ఏప్రిల్, 1985 వ ఐక్యరాజ్య సమితి కొన్ని మార్గదర్శకాలను రూపొందించింది. అన్ని సభ్యదేశాలు ఆ మార్గదర్శక సూత్రాల ప్రాతిపదికన చట్టాలను తయారు చేసేందుకు సమ్మతి తెలిపాయి. దీని ఆధారంగా మన దేశంలో వినియోగదారుల రక్షణ చట్టం, 1986ను భారత పార్లమెంటు డిసెంబర్, 1986లో ఆమోదించింది. ఈ చట్టం జమ్ము, కాశ్మీర్ రాష్ట్రం మినహా దేశవ్యాప్తంగా 15 ఏప్రిల్, 1987 నుండి అమలులోనికి వచ్చింది. వివిధ రాష్ట్రాలు వినియోగదారుల రక్షణ విషయంలో చేసిన చట్టాలన్నీ కేంద్ర చట్టాన్ని ఆధారం చేసుకుని తయారుచేసినవే. ఈ క్రమంలో జమ్మూ, కాశ్మీర్ రాష్టం కూడా వినియోగదారుల రక్షణ చట్టాన్ని అమలులోనికి తీసుకుని వచ్చింది.

## వినియోగదారుల రక్షణ చట్టం - లక్షణాలు

- కేంద్ర ప్రభుత్వం మినహాయిస్తే తప్ప అన్ని వస్తువులకు, సేవలకు ఈ చట్టం వర్తిస్తుంది.
- ప్రభుత్వ, ప్రైవేటు రంగాలకు, సహకార సంస్థలన్నిటికీ చట్టం వర్తిస్తుంది.
- ఈ చట్టంలోని అంశాలు వినియోగదారునికి నష్టపరిహారం సమకూర్చే స్వభావం కలిగి ఉంటాయి.
- సరళమైన పద్ధతులలో, తక్కువ ఖర్చుతో సత్వరం న్యాయ సహాయం పొందడానికి ఈ చట్టం అలంబనగా నిలుస్తుంది.
- జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో వినియోగదారుల రక్షణ మండళ్ళు వినియోగదారుల వివాదాల పరిష్కార యంత్రాంగం ఏర్పాటుకు ఈ చట్టం దోహదపడుతుంది.

## వినియోగదారుల హక్కులు

- ప్రాణాలకు, ఆస్తులకు హానికల్గించే వస్తువుల మరియు సేవల మార్కెటింగ్ నుండి రక్షణ కలిగించే హక్కు.
- అక్రమ వ్యాపార పద్ధతులు జరగకుండా నిరోధించేందుకు వీలుగా వస్తువులు, సేవల పరిమాణం, నాణ్యత, ప్రభావం, స్వచ్ఛత, మన్నిక, ఖరీదుల గురించి సమాచారం పొందగల హక్కు.
- నిర్ణీత ఖరీదులకు వివిధ వస్తువులను, సేవలను పొందగలిగే సమాచారాన్ని పొందే హక్కు.
- తగిన ఫోరంలలో వినియోగదారుల రక్షణ గురించిన ఏర్పాట్లు తగు విధంగా పొందే హక్కు.
- అక్రమ వ్యాపార పద్ధతులకు లేదా నిర్బంధ వ్యాపార పద్ధతులకు లేదా వినియోగదారులు విచక్షణారహితంగా దోచుకోబడుతున్నప్పుడు అందుకు వ్యతిరేకంగా తగు నష్టపరిహారాన్ని పొందే హక్కు.
- వినియోగదారుల విద్యా విషయ హక్కు పైన చెప్పబడిన ముఖ్య ఉద్దేశ్యాలకు రక్షణ, ప్రోత్సాహం కల్పించడం కేంద్ర, రాష్ట్ర వినియోగదారుల రక్షణ కౌన్సిళ్ళ విధి.

జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలలో వినియోగదారుల వివాదాలు పరిష్కరించటానికి తర్వితగతిన, తక్కువ ఖరీదులో, సరళ న్యాయ విధానాలు కలిగిన న్యాయ యంత్రాంగం ఏర్పాటు చేయడం ద్వారా ఈ విధి నిర్వర్తించగలుగుతారు. మౌలిక విధానాలననుసరించి సహజ న్యాయ పద్ధతుల్లో ఈ ఫోరాలు, కౌన్సిళ్ళు వినియోగదారుల వివాదాలను నిర్ణయిస్తాయి. కొన్ని వివాదాలలో తగిన నష్టపరిహారం నిర్ణయిస్తాయి. ఉత్తర్వులనుల్లంఘించిన వారికి తగు విధమైన దండన ఇవ్వబడుతుంది.

## వినియోగదారుడు - వస్తువులు - సేవలు

*వినియోగదారుల రక్షణ చట్టం ప్రకారం వినియోగదారుడు అనగా-*

- ఏదైన వస్తువును లేదా సేవను కొన్న వ్యక్తి అయివుండాలి.
- అంగీకరించిన మొత్తాన్ని అమ్మకందారునికి పూర్తిగా చెల్లించడం లేదా చెల్లించడానికి వాగ్దానం చేయడం లేదా పాక్షికంగా చెల్లించి పాక్షిక మొత్తానికి వాగ్దానం చేయడం లేదా మరో విధమైన భావి చెల్లింపులు అంగీకరించడం జరిగి ఉండాలి.
- వస్తువులను తిరిగి అమ్మే నిమిత్తం లేదా మరే ఇతర వాణిజ్య అవసరాల కోసం కొనుగోలు చేసి ఉండకూడదు.
- కొన్న వస్తువులను సొంత వినియోగానికి ఉపయోగించాలి.

*వినియోగదారుల రక్షణ చట్టం ప్రకారం వస్తువులు అనగా -*

- అన్ని రకాల చరాస్థులు ఈ చట్టం ప్రకారం వస్తువులుగా నిర్వచించబడ్డాయి.
- రావలసిన పరిహారాలు, నగదు, షేర్లు, స్టాకులు వస్తువుల నుండి మినహాయించబడ్డాయి.
- సాగులో ఉన్న పంట, పశుగ్రాసం, భూమితో కలిసి ఉన్న వస్తు సంపద, సాగు భూమిలో కొంత భాగం మొదలైన వాటిని అమ్మకపు ఒప్పందంలో ఇవ్వడానికి ఒప్పుకుంటేనే వస్తువులుగా భావించాలి.

*వినియోగదారుల రక్షణ చట్టం ప్రకారం సేవలు అనగా -*

- సేవలు పొందగోరే వ్యక్తులకు వివిధ సంఘాల్లో లభ్యమయ్యే సౌకర్యాలన్నీ ఈ కోవలోకి వస్తాయి.
- నగదు చెల్లించి పొందే సేవలు మాత్రమే.

## ఫిర్యాదు పత్రం

వినియోగదారుల రక్షణ చట్టం 1986 ఏ విధమైన ఫిర్యాదు పత్రాన్ని రూపొందించలేదు. ఫిర్యాదు పత్రం ఈ విధంగా ఉండాలన్న నిబంధన ఏమీలేదు. కానీ వీలైనన్ని సమగ్ర వివరాలు ఫిర్యాదు పత్రంలో పొందుపరచాలి.

*ఫిర్యాదు పత్రంలో ఈ క్రింది వివరాలు తప్పనిసరిగా ఉండాలి*

ఎ) ఫిర్యాదుదారుని పూర్తిపేరు, చిరునామా

బి) ప్రత్యర్థి వ్యక్తులు, సంస్థల పేరు, చిరునామా ఇతర వివరాలు

సి) ఫిర్యాదు ఇవ్వడానికి గల నేపథ్యం.

డి) ఫిర్యాదుకు కారణమైన దోషం లేదా అసంపూర్ణతలపై గమనించిన వివరాలు కలిగిన కష్టాలను పరిష్కరించే దిశగా

ఫిర్యాదుదారుడు చేసిన ప్రయత్నాలు.
ఇ) ఫిర్యాదును బలపరిచే ఋజువులు
ఎఫ్) కోర్టు పరిధి వివరాలు
జి) కేసు పరిమితి ( వస్తు సేవల విలువ నగదు రూపంలో)
హెచ్) ఆశిస్తున్న పరిహారం
ఐ) స్థలం, తేదీ, సంతకం

### కోర్టు ఫీజు వివరాలు

- కేసు విలువ మొత్తం రూ. 1 లక్ష వరకు చెల్లించవలసిన ఫీజు రూ. 100
- కేసు విలువ మొత్తం రూ.1 లక్ష నుండి 5 లక్షల వరకు చెల్లించ వలసిన ఫీజు రూ.200
- కేసు విలువ మొత్తం రూ. 5 లక్షల నుండి రూ. 10 లక్షల వరకు చెల్లించివలసిన ఫీజు రూ. 400
- కేసు విలువ మొత్తం రూ. 10 లక్షలు ఆపైన చెల్లించవలసిన ఫీజు రూ. 500

### ఫిర్యాదు స్వీకరణ

ఫిర్యాదును గ్రహించిన అనంతరం జిల్లా ఫోరమ్ / రాష్ట్ర కమిషన్ / జాతీయ కమీషన్ ఆ ఫిర్యాదును తదుపరి విచారణకు తీసుకోవడం లేదా తిరస్కరిస్తూ నిర్ణయం తీసుకోవచ్చును. అయితే ఫిర్యాదును తిరస్కరించే పరిస్థితి వచ్చినప్పుడు తన వాదన వినిపించుకునేందుకు అవకాశం ఇవ్వడం జరుగుతుంది.

### ఫిర్యాదు స్వీకరణ అనంతరం పాటించే విధానం

- ఫిర్యాదు గ్రహించిన అనంతరం ఫిర్యాదును తదుపరి విచారణకు స్వీకరించాలా, తిరస్కరించాలా అనే విషయాన్ని 21 రోజులలో నిర్ధారించవలసి ఉంటుంది.
- ఫిర్యాదును స్వీకరిస్తే ఆ ఫిర్యాదు ప్రతిని ప్రత్యర్థి వ్యాపార సంస్థకు పంపించి 30 రోజుల లోపు వారి తరపున వాదన వినిపించ వలసిందిగా కోరడం జరుగుతుంది. ఈ కాల వ్యవధిని అవసరమైతే మరో 15 రోజులు పొడిగించవచ్చును.
- ఫిర్యాదుదారుని ఆరోపణను ప్రత్యర్థి అంగీకరించకపోయినా లేదా వాటితో ఏకీభవించకపోయినా అది వివాదమవుతుంది. దీనిని ఫోరమ్ తన కాల లభ్యతను బట్టి విచారించి తీర్పునిస్తుంది.
- ప్రత్యర్థి ఫిర్యాదుదారుని ఆరోపణలకు ఏ విధమైన సమాధానం ఇవ్వకపోతే ఫోరమ్ తనే స్వయంగా విచారణను కొనసాగించి అందుబాటులో ఉన్న సాక్ష్యాల ఆధారంగా వినియోగదారునికి అనుకూలంగా తీర్పునిస్తుంది.

### జిల్లా ఫోరమ్ విచారణ పరిధి

ఎ) ఫిర్యాదులో పేర్కొన్న వస్తువులు, సేవల విలువ లేదా ఆశిస్తున్న నష్టపరిహారం రూ. 20 లక్షలు దాటకుండా ఉంటే అది జిల్లా ఫోరమ్ విచారణ పరిధిలోకి వస్తుంది.
బి) వివాదం ఏర్పడిన వినియోగదారుడు (ఫిర్యాది), అమ్మకందారుడు ఫిర్యాదు అందే సమయంలో ఏ జిల్లా ఫోరమ్ విచారణ పరిధిలో వాస్తవంగా నివాసముండి తమ కార్యకలాపాలను ప్రత్యక్షంగా గాని, తమ ప్రతినిధుల ద్వారా గాని నిర్వహిస్తారో విచారణ ఆ జిల్లా పరిధిలోనికి వస్తుంది.
సి) పైన పేర్కొన్నట్లుగా నివాసాన్ని ధృవీకరించలేని సందర్భంలో వారు ఏ జిల్లా పరిధిలోకి వస్తారో సూచిస్తూ, జిల్లా ఫోరమ్ తగిన ఆదేశాలు ఇవ్వాలి.
డి) ఫిర్యాదు మూలంగా తీసుకోబోయే చర్య పూర్తిగా కాని, పాక్షికంగా గాని ఏదేని జిల్లా ఫోరమ్ పరిధిలో అమలు జరిగే అవకాశముంటే ఆ జిల్లా ఫోరమ్‌లో ఫిర్యాదు నమోదు చేయవచ్చును.



### రాష్ట్ర కమీషన్ విచారణ పరిధి

ఎ) చట్టంలో పొందుపరిచిన నిబంధనల ప్రకారం వివాదంలో ఉన్న వస్తు సేవల విలువ లేదా ఆశిస్తున్న నష్టపరిహారం రూ. 20 లక్షలు దాటి కోటి రూపాయలు మించని కేసులు రాష్ట్ర కమీషన్ పరిధిలోకి వస్తాయి.
బి) రాష్ట్ర కమీషన్ తన వాస్తవ, అప్పీల్లేట్ విచారణాధికారాలతో పాటు రాష్ట్రం లోపలే తలెత్తే వివాదాల సందర్భంగా ప్రాదేశిక విచారణ అధికార పరిధిని వినియోగించుకుంటుంది.
సి) జిల్లా ఫోరమ్ ఇచ్చిన ఉత్తర్వులకు వ్యతిరేకంగా నమోదు అయ్యే అప్పీళ్ళను (వినతి) రాష్ట్ర కమీషన్ స్వీకరిస్తుంది.
డి) జిల్లా ఫోరమ్ ఉత్తర్వులను రాష్ట్ర కమీషన్ మార్చడానికి లేదా మరోరకమైన తీరులో ఉత్తర్వులు ఇవ్వడానికి అవకాశముంటుంది.

### జాతీయ కమీషన్ విచారణ పరిధి

ఎ) ఫిర్యాదులో పేర్కొన్న వస్తుసేవల మొత్తం లేదా ఆశిస్తున్న నష్ట పరిహారం విలువ రూ. 1 కోటి రూపాయలు మించితే
బి) రాష్ట్ర కమీషన్ జారీ చేసిన ఉత్తర్వులకు వ్యతిరేకంగా అప్పీలు చేస్తే
సి) ఏదేని రాష్ట్ర కమీషన్ పరిధిలో విచారణకు నోచుకోని వివాదం ఉంటే.
డి) ఏదైనా రాష్ట్ర కమీషన్ తన పరిధిని అతిక్రమించి విచారణ ప్రక్రియ మొదలు పెట్టినా లేదా చట్ట ప్రకారంగా ఇచ్చిన విచారణాధికారాలు వినియోగించడంలో విఫలమైనా జాతీయ కమీషన్ జోక్యం చేసుకుంటుంది.

*- బొబ్బిలి బంగారయ్య, ప్రెసిడెంట్, ప.గో. జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య, ఆకివీడు,*

# పాతపుస్తకాలు

ఎ.రామకృష్ణ

**రాత్రి అమ్మనాన్నలు వాదులాడుకుంటున్నట్లు కలొచ్చింది.**

**"అయిపోయిందే! ఎనభై అయిదేళ్ళు వొచ్చాయి... రోజురోజుకి దిగజారే ఆరోగ్యమే గాని, పడుచు కుర్రాడిలా పరుగెత్తలేనుగా.. మన బాడవ పొలందాకా నడిచి రావడమే కష్టంగా వుంది. నడుస్తుంటే కాళ్ళు వొణుకుతున్నాయి. తూలు వొస్తున్నది. మహా అయితే మరో సంవత్సరం బ్రతికేది" అన్నాడు నాన్న.**

**"పసుపు కుంకుమలతో మీ కంటే ముందేపోవాలి. మరో ఆరునెలల కంటే బ్రతకను.. గుండెదడ ఎక్కువైంది.. ఇంట్లో పనులు చేయలేకపోతున్నాను.. తెల్లవారక ముందే లేచి వాకిలి వూడ్చి, కళ్ళాపి చల్లేదాన్ని, బండెడు అంట్లు తోమేదాన్ని, కడవతో చెరువు దగ్గర నుంచి నీళ్ళు మోసుకువొచ్చేదాన్ని, కాళ్ళు వాచిపోయి నడవలేకపోతున్నాను. తొందరగా ప్రాణం పోతే బావుణ్ణు!" అంది అమ్మ.**

నాన్నకు కోపం వొచ్చింది "నువ్వు ప్రక్కన లేకుండా ఒక్కరోజు కూడా వుండలేనే! నాకు చావంటే వెరుపులేదు గాని, నువ్వు చనిపోతావన్న భావన నేను తట్టుకోలేనే!" అన్నాడు ఎంతో సంవేదనతో.

మెలుకువ వొచ్చి చూస్తే వాళ్ళిద్దరూ కన్పించలేదు.

వాళ్ళను చూడాలనిపించింది. వెంటనే కార్లో హైద్రాబాద్ నుంచి పొన్నూరు ప్రయాణం మొదలయ్యింది.

* * * * *

ఆలోచనలన్నీ వాళ్ళ చుట్టూ పరిభ్రమిస్తున్నాయి.

అమ్మ చనిపోయి ఐదేళ్ళయ్యింది... నాన్న ఆరోగ్యం కూడా అంతంత మాత్రంగానే వుంది. ఆలోచనలు పంచుకోవడానికి, అనుభూతులు ఎరిక చేసుకోవడానికి తోడులేకపోవడం నాన్నకు ఇబ్బందిగానే వుంది. తాను ఎంతో ప్రేమించిన వ్యక్తి జీవించి వుండగా ఆనందం పొందిన హృదయాన్ని ఆ వ్యక్తి లేనప్పుడు ఎందుకు బాధించాలి. సంయోగంలో ఆనందాన్ని అనుభవించిన హృదయాన్ని వియోగంలోనూ దుఃఖాన్ని తట్టుకునే స్థితిలో వుంచాలి.

చావంటే కూడా నాన్నకు భయం లేదు. ఆ రోజుల్లోనే నాన్న థర్డ్‌ఫారమ్ దాకా చదువుకున్నాడు. ఎన్నో పుస్తకాలు చదివాడు. ఇంటినిండా పుస్తకాలే! టాల్‌స్టాయ్, సోమర్‌సెట్‌మామ్, ఛార్లెస్ డికెన్స్, ప్రేమానంద్, రవీంద్రనాథ్ టాగూర్, శరత్ పుస్తకాలు తిరగేస్తూ వుండేవాడు - కాలువ గట్టు మీద చింతచెట్టు క్రింద కూర్చుని. సాహిత్యం అంటే ఎంత మక్కువో, వ్యవసాయం అంటే కూడా అంత ఇష్టం.

'మృత్యువు అంటే జీవితంలో ఒక ఉజ్వలమైన భాగం మాత్రమే. బ్రతికి వుండటం సగం జీవితం మాత్రమే అవుతుంది. మరణాన్ని కలుపుకున్నప్పుడే సంపూర్ణ జీవితం అవుతుంది' సంజీవదేవ్ మాటలు ఓ పుస్తకం మొదటి పేజీలో రాసుకున్నాడు నాన్న.

తుమ్మపూడి వెళ్ళి సంజీవదేవ్‌ను కలిసి పుస్తకాలు తెచ్చుకున్నాడు నాన్న. పొన్నూరు హైస్కూలు ఆవరణలో జాషువా కవికి సన్మానం జరిగితే ఆ సభకు వెళ్ళి ఎంతో ఆనందపడిపోయాడు. చెరువుగట్టు మీది రావిచెట్టు కింద చేరిన ఊళ్ళోవాళ్ళకి జాషువా కవితల గురించి వివరంగా చెప్పేవాడు.

నాన్న వ్యవసాయం పనులు చేయడంలో కూడా దిట్టే! పంటలు బాగా పండించాడని జిల్లా కలెక్టరు బహుమతి కూడా ఇచ్చాడు. కలెక్టరు ఇచ్చిన 'వస్తుగుణ దీపిక', 'శబ్ద రత్నాకరం' పుస్తకాల్ని భద్రంగా దాచుకున్నాడు.

ఏరువాక పండుగ వొచ్చిందంటే ఎంతో సంబరపడిపోయేవాడు. నాగలికి పూజలు చేసేవాడు. జీతగాళ్ళకు కొత్తబట్టలు కుట్టించి ఇచ్చేవాడు. రెండు మూడు బస్తాల ధాన్యం దానం చేసేవాడు. ఎడ్ల కొమ్ములకు బంతిపూల దండలు కట్టేవాడు. వాటి మూపురాలపైన ఎర్రటి గులాం చల్లేవాడు.

ఓ సారి నాన్నను "ఈ మధ్య ఏరువాక పండుగ చేస్తున్నారా?" అడిగాడు.

"అవన్నీ పాతముచ్చటరా. రైతులిప్పుడు పొలం పనులు మానుకుని పొలం కౌలుకు ఇస్తున్నారు.. సొంతంగా వ్యవసాయం చేసుకుంటే గిట్టుబాటు రావడం లేదు. చేతి చమురు వొదుల్తూ వుంది. మగతాకి పొలం తీసుకుని వ్యవసాయం చేస్తున్నా చివరకు అప్పులు మిగుల్తున్నాయి. వడ్డీ కట్టలేక కౌలు రైతులు సతమతమవుతున్నారు.. ఇప్పుడు ఎడ్లను ఎవరు భరిస్తున్నారు? పశువులకు వెయ్యడానికి జనుము, పిల్లిపెసర పొలాల్లో వేసేవాళ్ళు.. ఇప్పుడు జనుము వెయ్యడమే



తృతీయ బహుమతి పొందిన గ్రామీణ కథ

మానేశారు'' చెప్పుకుపోయాడు నాన్న, రైతు ఇబ్బందుల గూర్చి.

సెల్‌ఫోన్ మోగడంతో ఆలోచన దొంతర నుండి బయటపడ్డాను.

తమ్ముడు దగ్గర్నుంచి ఫోన్.

"నాన్నకు వొంట్లో బాగుండటం లేదు.. ఊపిరి పీల్చుకోవడం కష్టంగా వుంది. చివరి రోజులే! తొందరగా వొచ్చేయ్యి!'' అన్నాడు చంద్రం.

శివాలయం దాకా కారు వెళ్ళింది.

శివాలయం శిథిలావస్థలో వుంది. ప్రహారీ గోడ వానలకు నాని చెరువులోకి కూలిపోయింది. గుడి గోపురం మీద పావురాలు కన్పించాయి.

నడుచుకుంటూ ఇంటివైపు వెళ్ళాను.

వరండాలో మంచం మీద పడుకున్న నాన్న కన్పించాడు. ఆయన కళ్ళు ఇంటి ఎదురుగా వున్న పశువుల సావిడి మీదే వున్నాయి.

''నేను పోయాక పశువుల సావిడి తీసేస్తావా?'' తమ్ముడిని అడుగుతున్నాడు.

నేను రావడం గమనించి దిగులుగా చూశాడు ''నేనెందుకు తీసేస్తాను. పాడి లేకపోతే ఇల్లు గడవొద్దూ!'' తండ్రికి భరోసా ఇస్తూ అన్నాడు చంద్రం.

"ఆవును అమ్మేస్తావా?''

అమ్మనన్నట్లు తల అడ్డంగా తిప్పాడు చంద్రం.

దొడ్లో ఆవు వుంటే శుభప్రదం అనుకుంటాడు నాన్న. పసిపిల్లలకు ఆవుపాలు పడితే జబ్బులు రావని నమ్మకం.

"అన్నయ్య వొచ్చాడు చూడు నాన్నా!'' అన్నాడు చంద్రం తండ్రితో.

పెద్దకొడుకును చూడగానే నాన్న మొహం విప్పారింది.

"పెద్దోడా! ఇప్పుడేనా రావడం'' అన్నాడు భూషయ్య తల పెద్దకొడుకు వైపు తిప్పి.

తండ్రికి లంగ్ క్యాన్సరట. శ్వాసకోశ పూర్తిగా పాడయిపోయింది. చాలా ఆసుపత్రులు తిప్పాడు. తగ్గుమొహం పట్టలేదు. కెమోథెరపీ రెండు డోసులకే మనిషి తట్టుకోలేకపోయాడు. ఇంటికి తీసుకెళ్ళమన్నారట డాక్టర్లు.

హాస్పిటల్ మెడికల్ రిపోర్టులు చూపించాడు చంద్రం.

ఊళ్ళోవాళ్ళు ఇంటికి వొచ్చి నాన్నను చూసి పోతూ వున్నారు. ఒంట్లో నొప్పులు విపరీతంగా బాధపెడుతున్నా, ఆ బాధను ఓర్చుకుంటూ మామూలుగా మాట్లాడుతున్నాడు నాన్న.

''మీ నాన్న పెద్ద పెద్ద పుస్తకాలు చదువుతుండేవాడు. రోజూ పేపరు చదివి అందులో వార్తలు అందరికీ చెప్పేవాడు. నలుగురు చేసేపని వొక్కడే చేసేవాడు. మినుముల బస్తా అవలీలగా మోసేవాడు వయస్సులో వున్న రోజుల్లో. మొన్న ఆ మధ్య మన ఊళ్ళో ఎడ్లపందాలు పెట్టారబ్బాయ్. ఉషారుగా వున్నాడు. పుటక గల ఎద్దులను, బలంగా అందంగా వున్న ఎద్దుల్ని చూసి ఎగిరి గంతేసినంత పని చేశాడు. తిరనాళ్ళకు వొచ్చినట్లు జనం వొచ్చారు. రైతులకు మళ్ళీ మంచిరోజులు వొస్తాయి.. పశువుల్ని పెంచుతారు. ప్రతి ఇంటి దగ్గర పశువుల సావిడి వుంటుంది. ప్రతి ఇంట్లో పాడి వుంటుంది' అని అందరితో అన్నాడు మీ నాన్న ఎంతో సంబరంగా''.

నాన్నను చూసి ఇంట్లో నుంచి బయటకొచ్చాక అన్నాడు ఊరు సర్పంచ్.

''మీ నాన్న భోళామనిషి. చేతికి ఎముకలేదు.. ఊళ్ళో ఏదన్నా కార్యక్రమం పెట్టుకుని చందాకోసం వొస్తే అందరికంటే ఎక్కువ ఇచ్చేవాడు. దర్జాగా బ్రతికాడు. మీ ఇల్లు కూడా చూడముచ్చటగా వుంటుంది. డబ్బుకు వెనకాడకుండా కట్టించాడు మీతాత.'' చెప్పుకుపోతూనే వున్నాడు నాన్న గురించి, తాత గురించి.

సర్పంచ్ వెళ్ళబోతూ వో మాట అన్నాడు ''మీ నాన్న ఏ లోటూ లేకుండా హాయిగా బ్రతికాడు. ఈ చివరి రోజుల్లో కూడా ఆయన మనస్సు ఆనందంగా వుండేటట్లు చూసుకోండి. నువ్వు మళ్ళీ హడావుడిగా హైద్రాబాద్ తిరిగి వెళ్ళిపోబోకు! చివరి రోజుల్లో పెద్దకొడుకు దగ్గరుంటే ఏ తండ్రికైనా మనస్సు ప్రశాంతంగా వుంటుంది. ఆయనకేం దిగుళ్ళు లేవనుకో! మీ చెల్లెలు గురించే అప్పుడప్పుడు మదనపడుతూ వుంటాడు''.

నాన్న గురించి బాగా తెలిసినాయన ఊరి సర్పంచ్. ఏ మాత్రం తీరిక దొరికినా నాన్న దగ్గరకొచ్చి మాట్లాడటం, నాన్న సలహాలు తీసుకుంటాడు. ఆయనింట్లో ఏ శుభకార్యం, అశుభకార్యం జరిగినా నాన్న అక్కడ వుండి అన్నీ పర్యవేక్షించాల్సిందే!

సర్పంచ్ వెళ్ళిపోయాక ఇల్లంతా కలయ తిరిగాను.

దాదాపు అర ఎకరం స్థలంలో ఎత్తైన మట్టి దిబ్బ మీద వుంటుంది. తమ ఇల్లు. సర్పంచ్ అన్నట్లు దర్పంగా కన్పిస్తుంది. ఇంటిచుట్టూ పెద్ద ప్రహరీగోడ. తూర్పువైపు పెద్ద ఆర్చీ. ఆర్చీ దాటుకుని వెళ్ళితే ఐదు వరసల మెట్లు, మెట్లు ఎక్కగానే ముందు కన్పించేది పెద్ద వసారా, ధాన్యపు బస్తాల దొంతర్లు కన్పిస్తాయి. మధ్య హాల్లో ఉయ్యాలబల్ల. హాల్లో గోడలకి తాత, నాయనమ్మల తైలవర్ణాల చిత్రాలు. పాతకాలం నాటి కుర్చీలు, పడక్కుర్చీ - వెనుకవైపు నాలుగు గదులు. పూజ గదిలో పెద్ద భోషాణం, పడక గదుల్లో చెక్క కావిడి పెట్టెలు - నగిషీ చెక్కిన నల్లచెక్క బీరువాలు. బీరువాల్లో పాత పుస్తకాలు కన్పించాయి.

ఇంటి చుట్టూ దట్టంగా చెట్లు. ఇంటిముందు మందార, బంతి మొక్కలు. ఆర్చీ గేటుకు అల్లుకున్న రాధామనోహరం కన్నుల పండుగా కన్పించింది.

అమ్మ వున్నప్పుడు ఇల్లు ఎంతో కళగా వుండేది. తమ్ముడి భార్య శాంతి కూడా అమ్మలాగే అన్నీ పనులు చురుగ్గా చేస్తూ వుంటుంది. తమ్ముడికి ఇద్దరు ఆడపిల్లలు. ఆడపిల్లలతో ఇల్లు కళకళలాడుతూ వుంది.

ఇల్లు ఇంత సౌకర్యంగా, ఆహ్లాదంగా వుంటుంది కాబట్టే నాన్న హైద్రాబాద్ రమ్మన్నారాడు. వచ్చినా రెండు మూడ్రోజుల కంటే ఎక్కువ వుండడు. ముళ్ళమీద కూర్చున్నట్లు వుంటాడు పట్నంలో.

* * * * *

**వా**రం రోజులు నాన్న బాగా ఇబ్బందిపడ్డాడు వొళ్ళు నొప్పులతో.

ఓ రోజు నాన్న తనను దగ్గర కూర్చో బెట్టుకున్నాడు. హాల్లో ఎవరూ లేరు. నా చెయ్యి తన చేతుల్లోకి తీసుకున్నాడు.

ఏదో ముఖ్యమైన విషయం చెప్పడానికి ఉద్యుక్తుడయ్యాడని అర్థం అవుతూనే వుంది.

"వీలునామా రాయలేదురా!'' అన్నాడాయన.

''ఇప్పుడేమంత కొంపమీదకు వొచ్చింది. నీకు తగ్గిపోతుంది. మామూలుగానే తిరుగుతావ్'' అన్నాను నాన్న అరచేతిని నిమురుతూ.

"అది కాదురా! అన్నీ నీకు చెప్పాలి కదా.. మనకు పదెకరాల మాగాణి, ఐదెకరాల మెట్ట వుందని నీకు తెలుసు గదా! నాకు వయస్సు మీద పడ్డాక వ్యవసాయం పనులన్నీ నీ తమ్ముడే చూస్తున్నాడు. నువ్వేమో చదువుకుని పట్నంలో ఉద్యోగం సంపాదించి అక్కడే స్థిరపడిపోయావ్. ఖర్చులకి వో వెయ్యి రూపాయలు పంపమని ఏనాడూ నువ్వు అడగలేదు. సొంత ఇల్లు కట్టుకున్నావు. బాగానే స్థిరపడ్డావ్. ఇన్నాళ్ళూ వ్యవసాయం చేసినా నిలవ ఏమీలేదు. మీ తమ్ముడు దుబారా చేసిందేమీ లేదు. వరదలొచ్చి పంట చేలు మునిగిపోయినప్పుడు ఆందోళనపడి సిగిరెట్లు కాలుస్తాడు. అంతే! వేరే దురలవాట్లు ఏమీలేవు వాడికి. కోడలు కూడ బుద్ధిమంతురాలు. పెద్దలంటే గౌరవం వుంది..నాకేంలోటు లేకుండా అన్ని సవర్యలు చేస్తుంది"

ఆయాసం వొచ్చి కాసేపు చెప్పడం ఆపాడు.

"అన్నీ బాగానే వున్నాయి కదా! నువ్వు హైరాన పడక పడుకో!" అన్నాను.

నా చెయ్యి వొదల్లేదు నాన్న.

"మీ చెల్లెలు సునంద ఇంటిపరిస్థితులు బాగాలేవురా! దాని పెళ్ళప్పుడు రెండెకరాలు అమ్మి డబ్బు ఇచ్చేశాం కట్నం కింద. వంద కాసుల బంగారం ముట్టచెప్తాం. అల్లుడు కూడా మంచివాడే! కష్టపడి వ్యవసాయం చేస్తున్నా అన్నీ అప్పులే! నలుగురు పిల్లలు కదా వాళ్ళకి. ఇద్దరు ఆడపిల్లలకు పెళ్ళిళ్ళు చేశాడు. వాళ్ళ వూరి దగ్గర సాగునీటి ప్రాజెక్టు కడుతున్నారట. అల్లుడిగారి పొలం ప్రాజెక్టు క్రిందపోయింది".

"నష్టపరిహారం క్రింద డబ్బు ఇచ్చి వుంటుంది కదా ప్రభుత్వం" అన్నాను.

"ఆ డబ్బు పిల్లల చదువుకి, పెళ్ళిళ్ళకూ సరిపోయింది. కౌలుకు పొలం తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు.. అన్నీ ఇబ్బందులే వాళ్ళకి" అనేసి చెప్పడం ఆపేశాడు.

ఆయన ఎందుకు చెల్లెలు విషయాలన్నీ చెబుతున్నాడో అర్థం అయ్యింది.

"సునందకు ఏ ఇబ్బందులూ రాకుండా నేను చూస్తాను గదా! నువ్వు నిశ్చింతగా వుండు! నేనున్నాను గదా!" అన్నాను ఆయన నుదురు నిమురుతూ.

ఆయన మొహంలో చోటు చేసుకున్న ఆందోళన పటాపంచలయ్యింది నా భరోసాతో.

ఆ రోజు రాత్రే నాన్న చనిపోయాడు.

* * * * *

పెద్దకర్మ అయ్యేదాకా పొన్నూరులోనే వుండాల్సి వచ్చింది.

నాన్న పుస్తకాల బీరువా ముందు నిలబడి పుస్తకాలన్నీ తిరగేస్తున్నాను. పుస్తకాల మీద నాన్న సంతకాలు కన్పించేయి. అక్కడక్కడా ఆయన అభిప్రాయాలు చిన్న చిన్న మాటల్లో కన్పించాయి.

ఆ అక్షరాలను ఆప్యాయంగా చేతితో నిమిరాను. నాన్న ప్రక్కన నిలబడి ఏవేవో విషయాలు చెబుతున్నట్లనిపించింది.

నాన్నకు వెన్నెలన్నా, సువాసన ఇచ్చే పూలన్నా ఎంతో ఇష్టం.

వెన్నెల చల్లదనం, పూల సువాసన తోడు వుంటే ఎంత పాషాణ హృదయుడైనా కరిగిపోతాడు. కోపం ఎగిరిపోయి చల్లబడిపోతాడు.

వెన్నెల దారిలో నడిచిన బాటసారి నాన్న.

గదిలోకి తమ్ముడు ఎప్పుడు వొచ్చాడో తెలియదు.

"అన్నయ్యా! పొలంవైపు వెళ్ళివొద్దామా?" అడిగాడు చంద్రం.

వాడు తనకేదో చెప్పాలనుకుంటున్నాడు. ఇంట్లో ఆ విషయాలు మాట్లాడుకోవడం ఇష్టంలేదేమో!

వాడితో పాటు పొలాలవైపు నడిచాం.

పచ్చని చేలలో నడుచుకుంటూ ఊరికి చాలాదూరం వెళ్ళాం.

చేలకు ఓ పక్కన పెద్దచెరువు కన్పించింది. చెరువులోని తామరపూలు చూసి మురిసిపోయాను.

తామరాకు మీది మంచుబొట్లు ముత్యాల్లా కన్పించేయి.

"నాన్న ఆస్తి పంపకాలు చెయ్యలేదు" అన్నాడు తమ్ముడు. తను మాట్లాడాలనుకున్న విషయానికి నాంది ప్రస్తావన చేస్తూ.

"మనకున్న ఆస్తిపాస్తుల వివరాలు నీకు తెలుసు కదా! ఆస్తిలో సగభాగం నువ్వు తీసుకో!" అన్నాను.

"మనపేరు మీద పొలం, ఇల్లు నాన్న రిజిస్టర్ చెయ్యలేదు. వీలునామా రాయలేదు. చెల్లెలు క్కూడా ఆస్తిలో వాటా వొస్తుందేమో!" అన్నాడు మనస్సులోని విషయాన్ని బయటపెడుతూ.

"చెల్లెలు క్కూడా వాటా ఇచ్చేద్దాం" అన్నాను తేలిగ్గా.

"దాని పెళ్ళప్పుడు పొలం అమ్మి నాన్న డబ్బు ఇచ్చాడు. బంగారం ఇచ్చాడు. మళ్ళీ వాటానా? చెల్లెలు మనల్ని వాటా అడగదనుకో!" అన్నాడు చంద్రం.

"అది అడక్కపోయినా ఇచ్చేద్దాం. నాన్న ఆస్తిలో సగం భాగం దానికే!"

"సగం నాకు ఇచ్చి, మిగతా భాగం చెల్లెలుకు ఇస్తే మరి నీకో?" అడిగాడు ఆశ్చర్యంగా నావైపు చూస్తూ.

"నాన్న పుస్తకాలు, పడక్కుర్చీ, అద్దాల బీరువా, పందిరి మంచం నేను తీసుకుంటాను"

"నీ వాటా వొదిలేసుకుంటావా? పాత పుస్తకాలు ఏం చేసుకుంటావ్?" అడిగాడు విస్మయంగా.

"నాన్న నన్ను చదివించాడు.. విజ్ఞాన సంపద పంచిపెట్టాడు నాకు. అది చాలు నాకు. నాకు రెక్కలు వచ్చాయి.. మరో గూడుకు ఎగిరిపోయాను. చెల్లెలు కట్టుకున్న గూడు చెదిరిపోయింది. సరిదిద్దాల్సిన బాధ్యత మన మీద వుంది".

నా భుజం మీద చెయ్యివేశాడు ఆప్యాయంగా చంద్రం.

"ఆస్తి పంపకాలప్పుడు కొడుకుల్లో పెద్దవాడికి జేష్ట్య భాగం ఇస్తారు. ఏది కావాలో ముందు కోరుకోమంటారు.. నువ్వు పాతపుస్తకాలు, పడక్కుర్చీ కోరుకున్నావ్.. పడక్కుర్చీలో కూర్చుని నాన్న పుస్తకాలు చదువుకోవాలని నీ కోరిక.. నాన్న సంతకం, నాన్న భావాలు ఎప్పుడూ నీకు తోడు వుంటాయి. నాన్న ఎప్పుడూ అంటూ వుండేవాడు.. 'పెద్దవాడు ఎటూ వ్యవసాయం చెయ్యడు.. నా వ్యవసాయం నీకు వొస్తుంది.. వాడికి నా భావాలు వాటాగా వొస్తాయి...' ఆయన మాటలు నిజం అయ్యాయి" అన్నాడు చంద్రం చెమర్చిన కళ్ళతో నావైపు చూస్తూ.

పచ్చని పొలాల్లో నడుస్తూనే వున్నాం.

☆

# కుక్క కాటుకు జాగ్రత్తలు

**ఈ సృష్టిలో అత్యంత విశ్వసపాత్రమైన జంతువు ఏది అంటే ఎవరైనా తుడుమకోకుండా చెప్పే సమాధానం 'కుక్క' అని మనం మిగిలిచ్చే నాలుగు మెతుకులు తిని, మనం కన్పించిన ప్రతిసారీ తోక ఊపుకుంటూ వినయంగా మన దగ్గరకు వచ్చి ఆప్యాయతతో పలుకరిస్తుంది.**

కుక్క ఉన్న ఇంటికి అందునా, కరిచే కుక్క ఉన్న ఇంటికి వెళ్ళాలంటే అందరికీ హడలే. "అమ్మో వాళ్ళింటికా, వాళ్ళింట్లో కుక్క ఉంటుంది, నే వెళ్ళను" ఇది సర్వసాధారణంగా వచ్చే సమాధానం. కాదు కూడదు వెళ్ళి రావల్సిందే అంటే, తప్పదా అన్నట్లు ముఖం పెట్టి, చేతిలో కర్ర పుచ్చుకొని భయం భయంగా ఇంటిబయటే నిలబడి ఇంట్లో వారిని పిలవడం సాధారణంగా కన్పించే దృశ్యాలు. ఇవీ పెంపుడు కుక్కలు ఉన్న ఇండ్ల పరిస్థితి. ఇక రెండవది వీధి కుక్కలు. ఇవి వీధుల్లో తిరుగుతూ, దొరికినది తింటూ రోడ్డుపైన వచ్చే పోయే వారిని గమనిస్తూ, రాత్రివేళ కొత్తగా ఏదైనా చూసినా వెంటనే పెద్దగా అరుస్తూ తమ పని తాము చేసుకుపోతుంటాయి.

## కుక్కలు ఎందుకు కరుస్తాయి?

* తమ విధి నిర్వహణలో భాగంగా
* మానవ తప్పిదాల వలన

పై రెండింటిలో మానవ తప్పిదాల వలన కుక్కలు కరవడాన్నే మనం ఎక్కువగా చూస్తూ ఉంటాం. అందులో ప్రధానంగా పిల్లలు కుక్కలను రాళ్ళతో, కర్రలతో, ఇతర విధానాలలో కవ్వించడం, కరిచే కుక్కలు ఉన్నప్పుడు ఆ విషయాన్ని వెల్లడి చేయకపోవడం, పగటి సమయంలో అట్టి కుక్కలను గొలుసుతో బంధించకుండా వదిలివేయడం వలన ఈ ప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తూ ఉన్నాయి.

## కుక్కలు కాటుకు చెప్పు దెబ్బ

పుండు మీద కారం చల్లినట్లు, కుక్క కరచి నొప్పితో బాధపడడమే కాదు దానికి '5' డోసుల మందు తప్పనిసరిగా తీసుకోవాలి. ఇంకా ఇప్పుడు నయం అనే చెప్పాలి. మొన్నా మధ్య వరకు కుక్క కరిస్తే 'బొడ్డు' చుట్టూ '16' ఇంజక్షన్లు చేయించుకోవలసి వచ్చేది. కుక్క కాటును ఏ మాత్రం అశ్రద్ధ చేసినా ప్రాణాలు తీసే రేబిస్ వ్యాధి పాకే ప్రమాదం ఉంది. అందుకే కుక్క కరచిన వెంటనే అది మంచి కుక్క అయినా, పిచ్చికుక్క అయినా వెంటనే ప్రభుత్వ / ప్రైవేటు వైద్యశాలకు వెళ్ళి తగిన మోతాదులో మందులను వాడాలి.

## రేబిస్ వ్యాధి ఎలా వస్తుంది?

కుక్కకు పిచ్చి పట్టినప్పుడు నోరు తెరచి చొంగకారుస్తూ, ఏమి చేస్తుందో కూడా తెలియకుండా పిచ్చి పిచ్చిగా ప్రవర్తిస్తుంది. ఈ సమయంలో కుక్కలకు నీరంటే చాలా భయం. నీటిని చూస్తేనే వణికిపోతాయి. అలా పిచ్చి సోకిన కుక్క మనుషులను, జంతువులను కరచినప్పుడు రేబిస్ వ్యాధి సంక్రమిస్తుంది. ఈ సమయంలో వెంటనే రేబిస్ వ్యాక్సిన్ తీసుకోవాలి. లేదంటే ఆ వ్యక్తికి మరణం తప్పదు.

## కుక్కలకు రేబిస్ వ్యాధి రాకుండా ఏమి చేయాలి?

పెంపుడు కుక్కలైనాగాని, వీధి కుక్కలైనా గానీ ముందుగానే వాటికి యాంటీరేబిస్ వాక్సిన్ ఇప్పించడం ద్వారా వాటికి భవిష్యత్తులో రేబిస్ వ్యాధి సంక్రమించదు. కనుక అట్టి కుక్కలు మనుషులను కరచినా ప్రాణ భయంఉండదు.



ఊరంతా ఎక్కడ చూసినా కుక్కలే? వీటిని ఎవరు నియంత్రించాలి?

ఈ విషయంగా గ్రామ పంచాయితీలకు నిర్దిష్ట అధికారాలు దాఖలు పరచబడ్డాయి. ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్ చట్టం, 1994 లోని సెక్షన్ 92 ప్రకారం 'గ్రామ పంచాయితీ తన సరిహద్దుల లోపల విచ్చల విడిగా తిరిగే లైసెన్స్ లేని కుక్కలను నాశనం చేయటానికి గ్రామపంచాయితీకి అధికారం.' ఈ అధికారాన్ని ఉపయోగించి గ్రామ పంచాయితీ పబ్లిక్ నోటీసులను జారీ చేయవచ్చు. కొన్ని సందర్భాలలో జిల్లా ముఖ్య న్యాయాధికారి పబ్లిక్ నోటీసు జారీ చేయవలసినదిగా గ్రామపంచాయితీని ఆదేశించవచ్చు.

## కుక్కలు పెంచుకోవడానికి లైసెన్స్ పొందవచ్చా?

ఎవరైనా వ్యక్తి / కుటుంబం కుక్కను పెంచుకోదలచినప్పుడు అందుకు తగిన లైసెన్స్ జారీ చేయవలసినదిగా గ్రామపంచాయితీకి అర్జీపెట్టుకోవాలి. అప్పుడు గ్రామ పంచాయితీ పబ్లిక్ నోటీసు జారీ చేసి, తీర్మానం చేస్తుంది. ఈ సందర్భంలో గ్రామ పంచాయితీ క్రింది విషయాలను పరిశీలిస్తుంది.

# రేబిస్‌పై అవగాహన

ప్రపంచంలో ప్రతి ఏటా లక్షలాది మంది కుక్కకాటుకు గురవుతున్నారు. **దాంతో 60-70 వేల మంది రేబిస్ కారణంగా మృతి చెందుతున్నారు. మృతుల సంఖ్యలో సగానికి పైగా భారత్‌లోనే ఉన్నారు. ప్రతి కుక్కకూ రేబిస్ వైరస్ ఉండదు. కానీ అది ఉన్న కుక్క ఏదో తెలియదు కాబట్టి ప్రతి కుక్కకాటును సీరియస్‌గా తీసుకోవాలి.**

లాసావైరస్ టైప్ -1 అనే వైరస్ వల్ల రేబిస్ వ్యాధి వస్తుంది. ఈ వైరస్ బుల్లెట్ల రూపంలో ఉంటుంది. కుక్కకాటు వల్లనే కాకుండా గుర్రం, కోతి, గొర్రె, మేకల లాలాజలంలోనూ రేబిస్ వ్యాధి కారక వైరస్ ఉండే అవకాశం ఉంది.

వ్యాధి తీవ్రత కుక్క ఎక్కడ కరిచింది, గాయం ఎంతలోతులో అయ్యింది, శరీరంలో ఏ ప్రాంతంలో కరిచింది, దుస్తులపై నుంచి కరచిందా, లేదా నేరుగా కరచిందా, కరచినప్పుడు ఏ మేరకు వైరస్ శరీరంలోకి ప్రవేశించింది లాంటి అనేక అంశాలపై ఆధారపడి ఉంది. కాటు తర్వాత వైరస్ శరీరంలో కండరాల్లోకి వెళ్ళి, అక్కడ అభివృద్ధి చెంది, నరాల్లోకి ప్రవేశిస్తుంది. నరాల్లో నుంచి మెదడుకు పాకుతుంది. అక్కడ నుంచి కణాల సముదాయాలలోకి, కండరాల్లోకి, ఎముకల్లోకి గ్రంథుల్లోకి వెళ్ళి లాలాజలంలో ప్రవేశిస్తుంది. శరీరంలోకి వ్యాధి కారక క్రిముల చేరాక వ్యాధి బయటపడే వ్యవధి సాధారణంగా 4 నుంచి 5 రోజులు ఉండవచ్చు.

## నిర్ధారణ

కుక్క కరచిన విషయం తెలుసు కాబట్టి, స్కిన్ బయాప్సి లేదా లాలాజలం సేకరించి ఈ వైరస్‌ను నిర్ధారణ చేయవచ్చు.

## నివారణ

రేబిస్‌కు నిర్దిష్టమైన చికిత్స లేదు. అయితే కుక్క కాటుకు గురైన సందర్భాల్లో రేబిస్ నివారణకు ఇచ్చే వ్యాక్సిన్ వల్ల ప్రాణం తప్పక నిలబడుతుంది. కాబట్టి ఈ వ్యాధి నివారణలో వ్యాక్సిన్‌కి ఎంతో ప్రాముఖ్యత ఉంది. సాధారణంగా కుక్కకాటు తర్వాత 10 రోజుల పాటు ఎలాంటి లక్షణాలు కనబడకపోతే, పెద్దగా ఆందోళన పడాల్సిన అవసరం లేదు. కరచిన 10 రోజుల్లోపు కుక్క చనిపోతే దానికి వైరస్ ఉందని భావించి తప్పక వ్యాక్సిన్ తీసుకోవాలి. తీవ్రతను బట్టి గాయాలను మూడుగా వర్గీకరించవచ్చు.

### కేటగిరి -I

పుండు, గాయం లేని చోట కుక్క నాకటం లేదా రక్తం రాకుండా గీరటం వల్ల రేబిస్ అవకాశాలు చాలా తక్కువ.

### కేటగిరి - 2

ఒకవేళ గాయం లేదా పుండు ఉన్న చోట కుక్క నాకితే లేదా రక్తం

→

* పెంచుకోదలచిన కుక్కకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేయించినట్లు ధృవీకరణ పత్రం

* అలాగే స్టెరిలైజేషన్ (సంతాన వృద్ధిని నియంత్రించే విధానం) చేయించిన సర్టిఫికెట్.

పై విషయాలలో గ్రామ పంచాయితీ సంతృప్తి చెందినట్లైతే అట్టి కుక్క పెంపకానికి లైసెన్సు బిళ్ళ / బెల్టు రూపంలో దాని మెడ భాగానికి అమర్చవలసి ఉంటుంది.

## లైసెన్స్ లేని కుక్కలను ఏమి చేయాలి?

లైసెన్స్ లేని పెంపుడు కుక్కలను / ఊర కుక్కలను నాశనం చేసే అధికారం గ్రామ పంచాయితికి ఉందనే విషయం ఇంతకు ముందే చర్చించాం. దీనికి మరో ప్రత్యామ్నాయం కూడా ఉంది. అదేమిటంటే - లైసెన్స్ లేని పెంపుడు ఊర కుక్కలకు రేబిస్ వ్యాధి సోకకుండా ముందు జాగ్రత్తగా టీకా వేయించడం, స్టెరిలైజేషన్ చేయించడం ద్వారా వాటి సంఖ్యను నియంత్రించడంతో పాటు, రేబిస్ వ్యాధిని కూడా అరికట్టవచ్చు. ఈ విషయంగా గ్రామపంచాయితీ లేక స్వచ్ఛంద సంస్థలు లేక ఎవరైనా దాతృత్వం కలవారు ఈ చర్యకు పూనుకోవచ్చు.

## ఈ దిశగా ఎవరైనా ముందుకు వస్తున్నారా?

ఇండియన్ ఇమ్యునో లాజికల్స్ లిమిటెడ్ (ఐ.ఐ.యల్) అనేది ఒక ప్రభుత్వ రంగ సంస్థ. ఈ సంస్థ ఇటీవలే రేబిస్ వాక్సిన్ డోస్‌ను రూపొందించింది. కేవలం 100 రూపాయలకే చర్మం ద్వారా శరీరంలోనికి ఇచ్చే రేబిస్ వ్యాక్సిన్‌ను రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో పనిచేస్తున్న అభయ క్లినిక్‌లలో అందుబాటులో ఉంచుతుంది. అంతేకాదు జూలై 6, 2011 న దేశవ్యాప్తంగా ఓ లక్ష ఊరకుక్కలకు రేబిస్ వాక్సిన్ వేయించే దిశగా ముందుకు సాగుతోంది.

## జూలై 6 న ప్రాముఖ్యత ఏమిటి?

జూలై ఆరవతేదీ వరల్డ్ జూనోటిక్ డే మన అంటే ''పశువుల నుండి మనుషులకు సంక్రమించే వ్యాధులపై చైతన్య పరచే దినోత్సవం'' అందుకే ఐ.ఐ.యల్ వారు ఆరోజును ఎంచుకున్నారు.

## మనమేం చేద్దాం?

ఈ దిశగా మనవంతు కృషి మనమూ చేద్దాం. మన పరిధిలోని పశుసంవర్ధక డాక్టరు గారిని సంప్రదించుదాం. ఆ విషయంగా డప్పు దండోరా వేయిద్దాం. మన గ్రామపంచాయితీ పరిధిలోని పెంపుడు కుక్కలకు, ఊరకుక్కలకు రేబిస్ వ్యాక్సిన్, స్టెరిలైజేషన్ చేయించే దిశగా చర్యలు చేపడదాం. అవసరమైతే ఐ.ఐ.యల్. వారిని సంప్రదిద్దాం. ఫోన్ నెంబరు 040-23544593, మెయిల్ ఐ.డి.www. indimmune. com అడ్రస్ - గచ్చిబౌలి స్టేడియం, ఎదురుగా, రక్షాపురం, గచ్చిబౌలి, హైదరాబాద్- 500031

*- మాధురి, ఫ్యాకల్టీ, అపార్డ్*

వచ్చేలా కుక్క గాయపరిస్తే, కాళ్ళ మీద కుక్క గిరితే దాన్ని కేటగిరి -2 అనుకోవచ్చు. దీనిలో రేబిస్ వ్యాధి వచ్చే అవకాశాలు ఎక్కువ.

### కేటగిరి-3

మెడ, ముఖం, తల, అరచేతులు, చేతి వేళ్ళ మీద కుక్క కరచినా, దాని వల్ల పెద్ద గాయం అయినా, లేదా ఒకచోట 5 కంటే ఎక్కువ గాయాలైనా మూడో కేటగిరిగా పరిగణించాలి. ఇందులో రేబిస్ వ్యాధి అవకాశాలు చాలా ఎక్కువ.

అడవుల్లో సంచరించే వారు, అడవి జంతువులు కరవటానికి అవకాశం ఉన్నవారు ముందుగానే వ్యాక్సిన్ తీసుకుంటే మంచిది.

### రేబిస్ లక్షణాలు

తలనొప్పి, ఒళ్ళునొప్పులు, గొంతునొప్పి, సాధారణ జ్వరంతోనే లక్షణాలు మొదలవుతాయి. కుక్కకాటు వేసిన చోట నొప్పి పెరుగుతుంది. ఈ లక్షణాల తర్వాత వైరస్ మెదడును తీవ్రమైన ఉద్వేగాలకు లోనయ్యేటట్లు చేస్తుంది. దాంతో రోగులు చిన్నపాటి ధ్వనినీ, కొద్దిపాటి వెలుతురునూ భరించలేరు. వీచే గాలికీ భయపడతారు. దీన్ని ఏరోఫోబియా అంటారు. నీళ్ళను చూసినా వణికి పోతారు. ఈ కండిషన్‌ను హైడ్రోఫోబియా అంటారు. గొంతులోని కండరాలు బిగుసుకుపోతాయి.

రేబిస్ వైరస్ సోకిన జంతువులన్నింటికీ ఈ వ్యాధి వచ్చినా, హైడ్రోఫోబియా అనే కండిషన్ మాత్రం కేవలం మనుషుల్లో మాత్రమే ఉంటుంది.

### చికిత్స

ఒకసారి రేబిస్ సోకిన తర్వాత మందులేమీ ఉండవు. అయితే రోగిని ప్రశాంతంగా ఉంచటానికి ఎక్కువ వెలుతురు గాలి హోరు లేని ప్రదేశాల్లో ఉంచాలి. ఎందుకంటే గాలి తగిలినా, శబ్దాలు వినిపించినా రోగికి ఫిట్స్ వచ్చే అవకాశాలతో బాటు తీవ్రమైన అశాంతికి లోనవుతాడు. అలాంటి సందర్భాల్లో మార్ఫిన్ వంటి మందులు ఇవ్వడం, కండరాలు కుంచించుకుపోతుంటే మజిల్ రిలాక్సెంట్ ఇచ్చి కృత్రిమ శ్వాస కల్పించటం చేయాలి.

### అపోహలు - వివరణ

* కుక్క కరచినపుడు గర్భిణులు, పాలిచ్చేతల్లులు, పిల్లలు, వృద్ధులు, ఇతరత్రా వ్యాధులతో బాధపడుతున్న వారు ఎవరైనా ఈ టీకాలు తీసుకోవచ్చు. ఇవి సురక్షితమైనవి.
* హెచ్.ఐ.వి. వంటి రోగనిరోధక శక్తి తక్కువగా ఉండే వారికి కుక్క కరచినపుడు కాటు ఓ మోస్తరుగా ఉన్నప్పటికీ పూర్తి కోర్సుయాంటీ రేబిస్ టీకాలతోపాటు ఇమ్యునో గ్లోబ్యులిన్లు ఇవ్వటం అవసరం.
* పెంపుడు కుక్కలు, పిల్లులకు ముందే టీకాలు వేయించినప్పటికీ అవి కరిస్తే మనకు రేబిస్ రాదని కచ్చితంగా చెప్పలేము. కాబట్టి తప్పక వ్యాక్సిను చేయించుకోవాలి.




### కుక్క కరచినపుడు ఈ జాగ్రత్తలు పాటించండి.

* కుక్క కరచిన వెంటనే గాయాన్ని సబ్బుతో గానీ, డెటాల్‌తో గానీ బాగా శుభ్రం చేయండి. వీలైనన్ని సార్లు శుభ్రం చేయండి.
* కుక్క కరచిన భాగంలో కట్లు గట్టటం, దూది పెట్టడం గానీ చేయరాదు. గాయానికి గాలి తగిలేలా ఉంచటం వల్ల రేబిస్ వృద్ధి చెందకుండా ఉంటుంది.
* వెంటనే డాక్టరు సలహాతో ఇంజెక్షన్ తీసుకోండి.
* రేబిస్ వ్యాధి ఉన్న కుక్క కరచినప్పుడు 5 డోస్\ ARV (యాంటీ రేబీస్ వ్యాక్సిన్) తీసుకోవాలి. కరచిన రోజు, తర్వాత 7వ రోజు, 14వ రోజు, 28వ రోజు తీసుకోవాలి. చివరిగా 90వ రోజు బూస్టర్ డోస్ వాడాలి.
* రేబిస్ ఉన్న కుక్క కరిస్తే వ్యాధి ఏడాది లోగా ఎప్పుడైనా సోకవచ్చు. అందుకే ARV తప్పకుండా ఇవ్వాలి.
* ఇంట్లో పెంచుకుంటున్న కుక్కలకు తప్పని సరిగా BPL (ఇనాక్టివేటెడ్ బ్రెయిన్ టిష్యూ వ్యాక్సిన్) వేయించాలి. 5ml. సింగల్ డోస్ సరి పోతుంది.
* మెడ, ఛాతీ, ముఖం తదితర భాగాల్లో కుక్క కరిస్తే వెంటనే ప్రభావం చూపించే అవకాశం ఉంది. కాళ్ళు, చేతులపై కరిస్తే మొదటి రోజు నుంచి 4 సంవత్సరంలోపు ఎప్పుడైనా రేబిస్ సోకే ప్రమాదం ఉంది. కుక్క పిచ్చిదా, రేబిస్ వ్యాధి ఉన్నదా లేదా అని మొదట తెల్చుకోవాలి.
* రేబిస్ అంటువ్యాధి. వ్యాధి సోకిన వ్యక్తి తుమ్మినప్పుడు, దగ్గినపుడు తుంపర కళ్ళలో లేదా నోట్లో పడినా రేబిస్ సోకుతుంది.
* రేబిస్ రోగి వద్ద ఉన్న సహాయకులు కూడా ప్రొఫలాక్సిన్ వ్యాక్సిన్ వేయించుకోవాలి.
* రేబిస్ వ్యాధి గబ్బిలం కరచినా వచ్చే అవకాశముందని గుర్తించాలి.

చికిత్సలేని ఈ వ్యాధికి అవగాహన ఎంతో తోడ్పడుతుంది. కావున తెలిసిన వారు తెలియని వారికి ఈ వ్యాధిపై అవగాహన కల్పించటం ఎంతైనా అవసరం.


- ఆసం నిర్మలాదేవి
ఫ్యాకల్టీ, విపత్తు నిర్వహణ విభాగం, అపార్డు

# కేరళలో ఆదర్శవంతమైన పంచాయితీరాజ్ వ్యవస్థ

**వందకోట్లకు పైగా జనాభా, భిన్న భాషలు, మతాలు, ప్రాంతాలు, సంస్కృతుల వైవిధ్యం కల్గిన సువిశాల భారతదేశంలో, జాతీయ స్థాయిలో పార్లమెంట్, రాష్ట్ర స్థాయిలో అసెంబ్లీ చేసిన తీర్మానాలు, శాసనాల ద్వారా మాత్రమే పరిపాలన సాధ్యంకాదని 1990వ దశకం వరకు కొనసాగిన కేంద్రీకృత ప్రణాళిక, ప్రభుత్వ యంత్రాంగం తేల్చి చెప్పింది.**

1990వ దశకంలోనే సుమారు 70 ఏళ్ళ పాటు సోవియట్ యూనియన్, తూర్పు ఐరోపా దేశాలలో 'సామ్యవాదం' పేరుతో కొనసాగిన కేంద్రీకృత పరిపాలన, ఉత్పత్తి, ప్రణాళిక యంత్రాంగాన్ని అక్కడి ప్రజలు తిరస్కరించిన తర్వాత ప్రపంచవ్యాప్తంగా కూడా 'వికేంద్రీకృత పరిపాలన' ప్రత్యామ్నాయ వ్యవస్థగా ముందుకు వచ్చింది.

వికేంద్రీకృత పరిపాలనకు భారతదేశంలో మూడు వేల సంవత్సరాలకు పైగా చరిత్ర వున్నప్పటికీ, ఆధునిక ప్రజాస్వామ్య వ్యవస్థలో 73, 74వ రాజ్యాంగ సవరణ ద్వారా 'రాజ్యాంగ బద్ధతను' పొందగలిగింది. ఇందులో అత్యంత కీలకమైంది 'గ్రామసభ'.

ఒక ప్రక్క కేంద్ర ప్రభుత్వం గ్రామసభకు రాజ్యాంగబద్ధతను కల్పించగా, రాష్ట్ర ప్రభుత్వాలు 'పంచాయితీ చట్టాల' ద్వారా చట్టబద్ధతను కల్పించాయి. అదే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టే ప్రతి అభివృద్ధి కార్యక్రమంలో 'గ్రామసభ' ఆమోదం అనివార్యమని చెప్పి రాజ్యాంగాన్ని గౌరవిస్తున్నాయి.

11వ పంచవర్ష ప్రణాళిక, రెండవ పరిపాలనా సంఘం చేసిన సిఫార్సులలో కూడా 'గ్రామసభ'ను భారత ప్రజాస్వామ్యానికి బలమైన కేంద్ర బిందువును చేయాలని సూచించాయి.

1990వ దశకం నుంచి దేశంలో 'గ్రామసభ' నిర్వహణకు కావలసిన అనుకూల పరిస్థితులు ఏర్పడటం వల్ల, కేరళ వంటి రాష్ట్రాలు ప్రత్యేక శ్రద్ధ చూపడం వల్ల ప్రజల భాగస్వామ్యం, సూక్ష్మ ప్రణాళికలు, నిధులు, విధులు, అధికారాలను స్థానిక సంస్థలకు ఇవ్వడం వల్ల అతి తక్కువ కాలంలోనే గణనీయమైన మానవ, సామాజికాభివృద్ధిని సాధించి ఆదర్శంగా నిల్చింది. అందుకని ప్రపంచ బ్యాంకు మానవాభివృద్ధి నివేదికలో కూడా వికేంద్రీకృత సేవలు అందించిన చోట వేగవంతంగా మానవాభివృద్ధి జరిగింది. కేంద్రీకృతమైన యంత్రాంగం వున్న చోట అభివృద్ధి కుంటుపడింది అని సూత్రీకరించింది.



కేరళలో శాస్త్రీయమైన వికేంద్రీకృత పరిపాలన ఏర్పడడానికి అనేక కారణాలు వున్నాయి. స్వాతంత్ర్యానికి పూర్వం నుంచి స్వదేశీ సంస్థానాలలో అక్షరాస్యతను ప్రోత్సహించడం, ప్రపంచంలోనే అత్యున్నతమైన శ్రీ నారాయణ ధర్మ పరిపాలనా అనే గొప్ప సామాజిక ఉద్యమం కొనసాగడం, దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మొట్టమొదటిగా దూరదృష్టి కల్గిన శ్రీ ఇ.యం.యస్. నంబూద్రిపాద్ వంటి వారు ముఖ్యమంత్రిగా ప్రభుత్వం ఏర్పడడం, భూసంస్కరణలను సమర్థవంతంగా అమలుచేయడం, సంపూర్ణ అక్షరాస్యత, ప్రజా ప్రణాళికల ఉద్యమాలు కొనసాగడం, చిత్తశుద్ధితో పనిచేసే ప్రభుత్వ యంత్రాంగం వంటివి తోడ్పడ్డాయి.

## గ్రామ సభ - గ్రామీణాభివృద్ధి - 3

1990వ దశకంలో ఒక ప్రక్క ప్రజల ప్రణాళికల ఉద్యమం జరుగుతున్న క్రమంలోనే, రాష్ట్ర వ్యాప్తంగా వున్న ఒక్కొక్క గ్రామపంచాయితీ రూ. 10,000 చొప్పున మొత్తం రూ. 10 కోట్లు ప్రోగు చేసి స్థానిక సంస్థలకు ఎన్నికైన ప్రజాప్రతినిధులకు, సిబ్బందికి నిరంతరం శిక్షణ యిచ్చేందుకు కేరళ ఇనిస్టిటూట్ ఆఫ్ లోకల్ అడ్మినిస్ట్రేషన్ (Kerala Institute of Administration), [KILA])ను నిర్మించుకున్నారు. అందుకే ఈనాడు ఆ రాష్ట్రంలోని ప్రతి గ్రామ పంచాయితీకి కూడా ఆ శిక్షణా సంస్థలో భాగస్వామం ఉంది. ఫలితంగా స్థానిక సంస్థలలో పనిచేసే ప్రజాప్రతినిధి అయినా, సిబ్బంది అయినా శిక్షణ పొందడం వారి హక్కుగా భావించి డిమాండ్ చేస్తారు.

### శిక్షణ ముఖ్య ఉద్దేశాలు

* స్థానిక సంస్థల రాజకీయాలంటే కేవలం వ్యక్తిగత లాభాపేక్ష, అధికారాన్ని చెలాయించడం కాదు, సమాజాభివృద్ధిని కాంక్షించడం.
* వికేంద్రీకృత పరిపాలన, అభివృద్ధి విధానాన్ని అర్థం చేసుకోవడం.
* స్థానిక అభివృద్ధికి సంబంధించి ప్రణాళికలు తయారు చేయడం, అమలు చేయడం, పర్యవేక్షణ చేసేందుకు అవసరమైన నిపుణులను తయారు చేయడం.
* గ్రామసభ, కార్యనిర్వాహక, పర్యవేక్షక, సాంకేతిక సమితులను బలోపేతం చేయడం.
* స్థానిక పరిపాలనా సంస్థలను బలోపేతం చేసేందుకు అవసరమైన నైపుణ్యాన్ని పెంపొందించడం.
* ప్రజాప్రతినిధులు స్థానిక సంస్థల్లో తమ విధులు, బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన శక్తి సామర్థ్యాలను పెంపొందించడం.

### శిక్షణలో కీలకాంశాలు

కేరళ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ (KILA) ఐక్యరాజ్యసమితి హేబిటాట్ వారి శిక్షణ మాన్యువల్స్ ఆధారంగా 12 కీలకమైన శక్తి

సామర్థ్యాలను పెంపొందించే అంశాలను అభివృద్ధి చేసింది. వాటి ఆధారంగా స్థానిక సంస్థలలో పనిచేసే వారందరికీ శిక్షణ యిస్తున్నారు.

* ప్రజాప్రతినిధి ప్రజల హక్కులకు, అవసరాలకు ప్రతినిధి.
* సరి అయిన సమాచారాన్ని యిచ్చి పుచ్చుకోవడం.
* వివాదాల పరిష్కారానికి అనుసంధానకర్త.
* అధికారాన్ని సుపరిపాలన కోసం ఉపయోగించడం.
* సత్వర, ఆమోదయోగ్యమైన నిర్ణయాలు తీసుకోవడం.
* సమర్థవంతమైన పాలనకు సరైన విధానాలు రూపొందించడం.
* జన జీవితానికి అనుకూలమైన పరిస్థితులను కల్పించడం.
* సమస్యలను చర్చించి పరిష్కరించుకొనే సంస్కృతిని పెంపొందించడం.
* ఆర్థిక వ్యవహారాల నిర్వహణ.
* పర్యవేక్షణ.
* సంస్థల నిర్మాణం.
* సమర్థవంతమైన నాయకత్వం.

పైన వివరించిన 12 అంశాలను దృష్టిలో ఉంచుకొని స్థానిక సంస్థల ప్రతినిధులకు, అధికారులకు, స్వచ్ఛంద సేవా సంస్థలకు, మహిళా సంఘాలకు శక్తి సామర్థ్యాలను పెంపొందిస్తున్నారు.

### శిక్షణ విషయాలు

కేరళ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ (KILA) కేస్ స్టడీస్, భాగస్వామ్య పద్ధతులు, అనుభవాలను పంచుకోవడం, క్షేత్ర పర్యటన పద్ధతుల ద్వారా ప్రధానంగా ఈ క్రింది విషయాలపై శిక్షణ ఇస్తుంది.

* పంచాయితీరాజ్ సంస్థలు -సాధారణ పరిపాలన
* వికేంద్రీకృత స్థానికపాలన
* పబ్లిక్ వర్క్స్
* సంక్షేమ అభివృద్ధి పథకాలు

పై విషయాలకు సంబంధించి సూక్ష్మ స్థాయిలో పరిజ్ఞానాన్ని అందిస్తారు. ఈ విధమైన శిక్షణ యివ్వడం ద్వారా ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు స్థానిక సంస్థలపై మంచి అవగాహన ఏర్పడుతుంది. అయితే ఇటువంటి శిక్షణను ఎన్నికలు పూర్తయిన మూడు నెలల్లోపే పూర్తి చేసి 5 సంవత్సరాలలో మధ్య మధ్యలో కూడా శిక్షణ యిస్తారు.

2010లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలల్లో ఎన్నికైన ప్రజా ప్రతినిధులకు మాత్రమే కాకుండా, ముఖ్యంగా మహిళా ప్రతినిధుల కుటుంబ సభ్యులకు కూడా స్థానిక సంస్థలపై శిక్షణ యిస్తారు. ఎందుకంటే కేరళలో స్థానిక సంస్థలు అధికారంలో వున్న రాజకీయ పార్టీ అభీష్టం, దయాదాక్షిణ్యాల మేరకు కాకుండా, స్థానిక ప్రజల అభీష్టం మేరకు పనిచేస్తుంది. ప్రజల అభీష్టం మేరకు పనిచేయడం వల్ల ఏ పార్టీ అధికారంలో వున్నా స్థానిక సంస్థలను బలోపేతం చేసేందుకు పని చేస్తాయి. అందుకే కేరళలో పంచాయితీరాజ్ వ్యవస్థ చాలా బలంగా పనిచేస్తూ దేశంలోనే ఆదర్శంగా నిల్చింది. ఇంత బలంగా పని చేయడానికి అనేక అంశాలు తోడ్పడ్డాయి.

### నిధులు, విధులు సిబ్బంది వికేంద్రీకరణ

(a) **నిధులు**: నిధుల వికేంద్రీకరణకు సంబంధించి కేరళలో 73వ రాజ్యాంగ సవరణకు ముందు నుండి కూడా చరిత్ర వుంది. ముఖ్యంగా స్థానిక సంస్థలు సొంత నిధులను సమకూర్చుకోవడంలో చాలా సమర్థవంతంగా పనిచేస్తాయి. సొంత నిధులను సమకూర్చుకోవడానికి అనేక ఆధారాలు ఉన్నాయి.

i. ***ఆస్థిపన్ను***: ఆస్థి పన్ను పంచాయితీలకు, మున్సిపాల్టీలకు ప్రధానమైన వనరు. ప్రతి ఆర్థిక సంవత్సరం సుమారు పంచాయితీలకు రూ. 37 కోట్లు, స్థానిక నగరపాలనకు, సంస్థలకు రూ. 227 కోట్లు సమకూరుతున్నాయి. ఆస్థి పన్ను వసూలు చేయడంలో భాగంగా క్రింది విధంగా పన్నులు విధించబడతాయి.

ii. ***వృత్తి పన్ను:*** వృత్తి పన్ను నుండి ప్రతి ఆర్థిక సంవత్సరం గ్రామపంచాయితీలకు రూ. 69.19 కోట్లు, నగరపాలక సంస్థలకు రూ. 65.43 కోట్లు వసూలు అవుతుంది. వృత్తి పన్ను వసూలు పట్టికలో వివరించినట్లు ఉంటుంది.

iii. ***వినోదపు పన్ను:*** వినోదపు పన్ను క్రింది ప్రతి ఆర్థిక సంవత్సరం గ్రామపంచాయితీలకు రూ. 5 కోట్లకు పైన, అదే విధంగా నగర పాలక సంస్థలకు రూ. 40 కోట్లకు పైగా వస్తుంది.

పై స్థానిక పన్నులతో పాటు ఇంకా ప్రకటనల పన్ను, జంతువులు, వస్తు, వాహనాలపై పన్ను, కలపపై పన్ను విధించడంతో పాటు, పన్నుయేతర ఆదాయ వనరులు కూడా వున్నాయి.

పన్నుయేతర ఆదాయ వనరుల్లో ముఖ్యమైంది లైసెన్సు ఫీజ్, రిజిస్ట్రేషన్, పర్మిట్, గేట్‌ఫీజులు, వినియోగ ఛార్జీలు, ఉత్సవాలు, సంతలు, తిరునాళ్ళు, అపరాధ రుసుం మొదలైనవి.

iv. ***సాధారణ, నిర్వహణ, అభివృద్ధి నిధులు:*** రాష్ట్ర ఆర్థిక సంఘం సిఫారసు మేరకు స్థానిక సంస్థలకు నిధులు ఇస్తున్నారు. 2008-09 ఆర్థిక సంవత్సరంలో సాధారణ నిధుల క్రింద గ్రామపంచాయితీలకు రూ. 265.58 కోట్లు, పంచాయితీ సమితులకు రూ. 14.77 కోట్లు, జిల్లా పంచాయితీలకు రూ. 9.90 కోట్లు ఇచ్చారు.

నిర్వహణ పద్దుల క్రింది 2008-09 ఆర్థిక సంవత్సరంలో గ్రామ పంచాయితీలకు రూ. 248.28 కోట్లు, పంచాయితీ సమితులకు రూ. 25.77 కోట్లు, జిల్లా పంచాయితీకి రూ. 51.35 కోట్లు ఇచ్చారు.

అభివృద్ధి నిధుల క్రింది 2008-09 సంవత్సరం గ్రామ పంచాయితీలకు రూ. 943.44 కోట్లు, పంచాయితీ సమితులకు రూ. 240.08 కోట్లు, జిల్లా పంచాయితీలకు రూ. 243. 67 కోట్లు ఇవ్వడమైంది.

కేంద్ర ప్రభుత్వ పథకాల క్రింది 2008-09 ఆర్థిక సంవత్సరంలో గ్రామపంచాయితీలకు రూ. 500.42 కోట్లు, పంచాయితీ సమితులకు రూ. 222.61 కోట్లు, జిల్లా పంచాయితీకి రూ. 8.49 కోట్లు కేటాయించి అమలు చేసింది.

పైన యివ్వబడిన నిధులతో పాటు రాష్ట్ర ప్రభుత్వం 2008-09 ఆర్థిక సంవత్సరంలో ప్రణాళికేతర వ్యయం కింద ఈ కింది వాటిపై ఖర్చు పెట్టేందుకు రూ. 451.82 కోట్లు యిచ్చింది. వీటిని విద్య, ఆరోగ్యం, వైద్యం, ఉపాధి, సాంఘిక సంక్షేమం, భద్రత, దళిత, ఆదివాసి, వెనుకబడిన తరగతుల సంక్షేమం, పంటల బీమా, భూసార పరిరక్షణ, వ్యవసాయ పరిశోధన, పశుపాలన, చిన్నతరహా పరిశ్రమలు, మొదలైన ఆదాయ వనరులు, నిధులతో పాటు, స్థానిక సంస్థలు కేంద్ర రాష్ట్ర సంస్థల నుండి ఋణాలు తీసుకొనవచ్చు.

### (ఎ) విధులు, సిబ్బంది బదలాయింపు:

999 గ్రామ పంచాయితీలు, 152 పంచాయితీ సమితులు, 14 జిల్లా పరిషత్‌లు, 53 మున్సిపాల్టీలు, 5 కార్పొరేషన్లు కల్గిన కేరళలో

స్థానిక సంస్థలకు విధులు, సిబ్బందిని కూడా బదలాయించింది. ఈ వివరాలను పట్టిక-3లో చూడవచ్చు.

**స్థానిక సంస్థల విధులు** : కేరళ పంచాయితీరాజ్ చట్టం ప్రకారం మూడు అంచెల పంచాయితీరాజ్ సంస్థలు నిర్వహించవలసిన విధులను స్పష్టంగా చర్చించింది.

*(1) గ్రామపంచాయితీ:* గ్రామపంచాయితీ ప్రధానంగా మూడు రకాల విధులు నిర్వహిస్తుంది.

(a) **చట్టబద్ధంగా చేయవలసిన పనులు**

i. భవన నిర్మాణాల క్రమబద్దీకరణ
ii. దురాక్రమాల నుండి ప్రభుత్వ భూమిని పరిరక్షించడం
iii. సాంప్రదాయబద్ధమైన త్రాగునీటి వనరులను కాపాడడం
iv. చెరువులు, కుంటలు వంటి నీటి నిల్వ ఆధారాలను రక్షించడం
v. కాల్వలు, నీటి ప్రవాహ సాధనాలను నిర్వహించడం
vi. మలమూత్ర విసర్జితాలను, ప్రోగుచేయడం, అనుకూలమైన ప్రాంతాలలో వదలడం
vii. మురికి కాల్వలను శుభ్రంగా వుంచడం, వ్యాధులను నివారించడం
viii. పర్యావరణాన్ని పరిరక్షించడం
xi. మార్కెట్ల నిర్వహణ
x. జంతు విక్రయ కేంద్రాలను, మాంసం, చేపల దుకాణాలను క్రమబద్ధం చేయడం
xi. హోటళ్లను క్రమబద్ధం చేయడం, కల్తీ ఆహారాలను అరికట్టడం
xii. రహదారులు, ఇతర ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ
xiii. వీధిలైట్లు, బహిరంగ స్థలాల్లో మరుగుదొడ్ల నిర్వహణ
xiv. జనన మరణాల రిజిస్ట్రేషన్
xv. శ్మశాన వాటికలు, శవాలను దహనం చేసే కేంద్రాలను ప్రారంభించి, నిర్వహించడం
xvi. పల్స్ పోలియో, వ్యాధుల పరిరక్షణకు గాను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన కార్యక్రమాలను అమలు చేయడం
xvii. స్నాన వాటికలు, చాకిరేవులు ఏర్పాటు చేయడం
xvii. వాహనాలు నిలిపేందుకు అవసరమైన స్థలాలను ఏర్పాటు చేయడం. ప్రయాణికుల సౌకర్యార్థం వేచి ఉండే షెడ్లను ఏర్పాటు చేయడం.
xix. క్రమం తప్పకుండా సంతలు, ఉత్సవాలు నిర్వహించడం.
xx. పెంపుడు కుక్కలకు, వ్యాపారులకు లైసెన్సులు యివ్వడం.

(ఎ) సాధారణ విధులు

అవసరమైన గణాంకాలను సేకరించడం, స్వచ్ఛంద శ్రమదాన కార్యక్రమాలు నిర్వహించడం, పొదుపు సంఘాలకు ప్రచారం చేయడం, గృహహింస, వరకట్నం, త్రాగుడు వంటి వ్యసనాలకు వ్యతిరేకంగా జనాన్ని జాగృతి చేయడం. అన్ని అభివృద్ధి కార్యక్రమాలలో ప్రజలు పాల్గొనే విధంగా చూడడం, ప్రకృతి వైపరీత్యాల సమయంలో సహాయ పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయడం, పర్యావరణ పరిరక్షణపై చైతన్యం చేయడం, సహకార సంఘాలను ప్రోత్సహించడం, మత, కుల, వర్గ సామరస్యాలను పెంపొందించడం, డబ్బు వస్తు రూపంలో ప్రజల నుండి విరాళాలను సేకరించడం, బలహీన వర్గాలలో హక్కుల చైతన్యాన్ని కల్పించడం, ఆర్థిక నేరాలకు వ్యతిరేకంగా ప్రచారం చేయడం, పౌరవిధుల పట్ల ప్రజలలో బాధ్యతలను పెంచడం.

(c) **సేవలు, వివిధ రంగాలకు సంబంధించిన విధులు**

గ్రామపంచాయితీలు వ్యవసాయం, పశుపాలన, పాడిపరిశ్రమ, చిన్న నీటిపారుదల, చేపలు, సామాజిక వనాలు, చిన్నతరహా పరిశ్రమలు, గృహనిర్మాణం, త్రాగునీరు, విద్యుత్తు, సౌరశక్తి, విద్య, ప్రజాపనులు, ప్రజా ఆరోగ్యం, సాంఘిక సంక్షేమం, పేదరిక నిర్మూలన, దళిత, గిరిజన, వెనుకబడిన తరగతుల సంక్షేమం, ఆటలు, సాంస్కృతిక వ్యవహారాలు, ప్రజాపంపిణీ, ప్రకృతి వైపరీత్యాలు, సహకార సంఘాలు తదితర అంశాలకు సంబంధించిన విధులు.

*(2) పంచాయితీ సమితుల విధులు*

పంచాయితీ సమితిస్థాయిలో గ్రామపంచాయితీలకు సాంకేతిక సేవలందించడం, గ్రామపంచాయితీల ప్రణాళికలను సేకరించి సమితి స్థాయి ప్రణాళికను తయారు చేయడం. గ్రామస్థాయిలో రైతుల కొరకు అమలు చేయవలసిన కార్యక్రమాలపై శిక్షణ, వ్యవసాయ ప్రదర్శనలు ఏర్పాటు చేయడం, వ్యవసాయ ఋణాలు, పనిముట్లు, ఎరువులు, విత్తనాలు అందించడం. పశుపాలనకు అవసరమైన సేవలు అందించడం. ఒక గ్రామపంచాయితీ కన్నా ఎక్కువ గ్రామపంచాయితీలతో సంబంధం వున్న చిన్న నీటిపారుదల పనులను చేపట్టడం. చిన్నతరహా పారిశ్రామిక వాడల ఏర్పాటు, తక్కువ ఖర్చులతో కూడా ఇళ్ళనిర్మాణానికి సంబంధించి ప్రచారం, గృహ సహకార సంఘాలను ప్రోత్సహించడం, సాంప్రదాయేతర ఇంధన వనరులను పెంపొందించడం, పారిశ్రామిక శిక్షణ సంస్థల నిర్వహణ, గ్రామపంచాయితీల మధ్య రహదారులు, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాల నిర్వహణ, పేదరిక నిర్మూలన, సాంఘిక సంక్షేమ కార్యక్రమాలను పంచాయితీ సమితి స్థాయిలో పర్యవేక్షించడం.

*(3) జిల్లా పంచాయితీ*

గ్రామ పంచాయితీ, పంచాయితీ సమితి, మున్సిపాల్టీలకు సాంకేతిక సేవలందించడం, జిల్లాస్థాయిలో అన్ని గ్రామపంచాయితీలు, పంచాయితీ సమితుల ప్రణాళికలను అనుసంధానం చేస్తూ సమీకృత జిల్లా ప్రణాళిక పనులు తయారు చేస్తుంది. ఇటీవల కేరళ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ అడ్మినిస్ట్రేషన్ (KILA)లో జాతీయస్థాయి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అప్పుడు దేశంలోని వివిధ రాష్ట్రాల నుండి జిల్లా పరిషత్ ఛైర్మన్లు హాజరయ్యారు. అందులో ఒరిస్సా నుండి వచ్చిన జిల్లా పరిషత్ ఛైర్మన్ ఒక జిల్లా పరిషత్ కార్యాలయాన్ని చూడగానే 'నా ఆరోగ్యం కుదుట పడింది' అన్నాడు.

వ్యవసాయం, పశుపాలన, చిన్న నీటిపారుదల, చేపలు, చిన్నతరహా పరిశ్రమలు, గృహనిర్మాణం, త్రాగునీరు, విద్యుచ్ఛక్తి, సాంప్రదాయేతర ఇంధనం, విద్య, ప్రజాపనులు, ప్రజా ఆరోగ్యం, సాంఘిక సంక్షేమం, పేదరిక నిర్మూలన, ఆటలు, సాంస్కృతిక వ్యవహారాలు, సహకార రంగం వంటి సంస్థల నిర్వహణ, శిక్షణ, శిక్షణ సంస్థలు మొదలైన వాటి అన్నింటికీ వున్న కార్యక్రమాల అమలుకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, పంచాయితీల మధ్య తలెత్తే వివాదాల పరిష్కారం, పర్యవేక్షణ, పారదర్శకంగా ప్రజలకు సమాచారాన్ని అందించడం వంటి విధులను జిల్లా పరిషత్ నిర్వహించి వికేంద్రీకృత పరిపాలనకు ఆదర్శంగా వుంటున్నది.

***- డాక్టర్ ఇ. వెంకటేష్***
*అసిస్టెంట్ ప్రొఫెసర్, పంచాయితీరాజ్ కేంద్రం,*
*జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ (NIRD)*

# విజన్-2040

రామరాజు

**2040 సంవత్సరం - ప్రపంచ జనాభా చీమల దండులాగ పెరిగిపోయింది. ఎక్కడ చూసినా జనమే - జనం. చైనాలో అయితే ప్రతి ఒక మనిషి- వేరే మనిషిని తన భుజాలపైన కూర్చో బెట్టుకొని రోడ్డు మీద వెళుతున్నారు. కార్లు, రైళ్లు తిరిగే ఖాళీ లేక మూలన పడిపోయాయి. మన భారతదేశంలోనూ ఇంచుమించు అదే పరిస్థితి. ఎక్కడ ఏ హాస్పిటల్‌లో చూసినా డెలివరీ కేసులే. పాల డబ్బాలకి, పిల్లల ఆట బొమ్మలకి రేషన్ తప్పని సరి అయింది. మిలటరీని పెట్టి మరీ అమ్మించవలసివస్తోంది. వాటి కోసం జనం పడిగాపులు పడి, పడరాని పాట్లు పడుతున్నారు.**

చిన్నపిల్లల డాక్టర్లయితే మేడలూ, పొలాలూ కానీ కొనీ. ఇంక కొనడానికి భూములు లేక నోట్ల కట్టలతో పరుపులు కుట్టించుకుని వాటిపైనే నిద్రపోతున్నారు. సామాన్య ప్రజలు తిండి దొరక్క గడ్డీ, చెట్ల ఆకులు తింటూ అప్పుడప్పుడూ పిల్లలకి మాత్రం అన్నం పెడుతున్నారు. గడ్డి ప్రభావం వల్ల మనుషులకి కొమ్ములూ, తోకలూ వచ్చేశాయి. పశువులు అయితే తమ జాతికి మానవులకి తేడా తెలియక తికమక పడిపోతున్నాయి. పసిపిల్లలు అయితే తల్లిదండ్రులు అనుకొని గేదెలు, ఆవుల దగ్గరకి వెళ్ళిపోతున్నారు.

ప్రపంచం అంతా ఇలా ఉంటే- అదే 2040 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. పిల్లల డాక్టర్లు ప్రాక్టీస్ లేక ఉన్న ఆస్తులు అయిన కాడికి అమ్ముకొని ప్రక్క రాష్ట్రాలకి వలసపోతున్నారు. బొమ్మలు అమ్మేవాళ్ళు, కొనేవాళ్ళు లేక బూజులు దులుపుకుంటున్నారు. పాల డబ్బాలు ఎక్స్‌పైరైపోయి వ్యాపారస్తులు దివాళా తీసేశారు. స్త్రీల రీప్లానింగ్ డిపార్ట్‌మెంట్ పూర్తిగా మూతబడిపోయింది. అందులో మగ ఉద్యోగులు పేకాట, ఆడవాళ్ళు గచ్చంకాయలు ఆడుకుంటూ కాలం గడిపేస్తున్నారు. కాన్వెంట్‌ల పరిస్థితి చెప్పనవసరం లేదు. అన్నీ వృద్ధాశ్రమాలుగా మార్చేశారు. గైనకాలజిస్టులు కూడా పిల్లల డాక్టర్ల బాట పట్టేశారు. వలసపోలేని వాళ్ళు గోళ్ళు గిల్లుకుంటూ వర్షం కోసం ఎదురు చూసే రాయలసీమ రైతుల్లాగా కేసుల కోసం ఎదురు చూస్తున్నారు.

2010 సంవత్సరంలో సుమారు 9 కోట్లు ఉన్న ఆంధ్రప్రదేశ్ జనాభా 2040 నాటికి 4 కోట్లకి పడిపోయింది. చావులు తప్ప, అసలు పుట్టుకలు లేని దుస్థితి దాపురించింది. ఎక్కడో ఒకటో, అరో జననాలు జరిగినా ఆ పిల్లల తల్లిదండ్రులు తప్పకుండా గుడ్డివారో, చెవిటివారో అయి ఉంటున్నారు. ఈ వింత పరిణామానికి ప్రపంచం అంతా ఆశ్చర్యపోయింది. రాష్ట్ర ముఖ్యమంత్రి దేశ ప్రధాని, రాష్ట్రపతి ఈ వింతకి కారణం తెలుసుకోవడానికి ఎన్నో కమిటీలు వేశారు. సి.బి.ఐ ని కూడా నియమించారు. అయినా ఎలాంటి ఫలితం దక్కలేదు. ఎవరూ కారణం కనిపెట్టలేకపోయారు. మన రాష్ట్ర ముఖ్యమంత్రి అయితే రాష్ట్రానికి దాపురించిన ఈ దుస్థితికి బెంగ పెట్టుకొని చిక్కిశల్యం అయిపోయాడు.

**తృతీయ బహుమతి పొందిన హాస్య కథ**

ఇలాంటి విపత్కర పరిస్థితిలో పురుగు మీద పుట్టలా, మూలిగే నక్కమీద తాటిపండు పడ్డట్టు భయంకరమైన తుఫాను ఆంధ్ర, తెలంగాణ, రాయలసీమ అన్న తేడా లేకుండా అంగుళం అంగుళం కుదిపివేసింది. చెట్లు నేలకూలిపోయాయి. ఇళ్లు పడిపోయాయి. కరెంట్ స్థంబాలు పడిపోయాయి. రాష్ట్రం అంతా కరెంట్ బంద్ అయి పోయింది. ఫోన్‌లు, సెల్‌లు మొత్తం మౌనవ్రతం పట్టాయి. పది రోజులు రాత్రీ, పగలూ, శ్రమపడి గవర్నమెంట్, మిలట్రీ, స్వచ్ఛంద సంస్థలు కలసి రాష్ట్ర పరిస్థితిని చక్కదిద్దాయి. ఇది జరిగిన 3 నెలలకి ఆంధ్రప్రదేశ్ అంతటా ఏ ఇంట్లో చూసినా పెళ్ళయిన ఆడవాళ్ళకి వాంతులు అవ్వడం మొదలైంది.

ముఖ్యమంత్రి ఈ విషయం తెలిసి హారి భగవంతుడా! మొన్నకి మొన్న తుఫాను. ఇప్పుడేమో ఈ ఫుడ్ పాయిజనింగ్. ఇదంతా చూస్తుంటే ఇందులో ఏదో విదేశీ హస్తం ఉన్నట్లుగా ఉందని తలపట్టుకుని కూలబడ్డాడు. హోంసెక్రటరీ ముఖ్యమంత్రితో... "ఫుడ్ పాయిజనింగ్ అయితే మగవాళ్ళకి కూడా వాంతులు అవ్వాలి కదా ఆడవాళ్ళకి మాత్రమే అవుతున్నాయంటే ఇది ఖచ్చితంగా ఫుడ్ పాయిజనింగ్ కాదు" అన్నాడు.

ప్రక్కనే ఉన్న ఐ.జి. కూడా "అవును నెలకి పైగా పెళ్ళయిన ఆడవాళ్ళకి మాత్రమే వాంతులు అవుతున్నాయి. కారణం కనుక్కోవడానికి మనస్టాఫ్, రాష్ట్రం నలుమూలలకి వెళ్ళారు. కొద్ది సేపట్లో రిపోర్టు వస్తుంది" అన్నాడు. ఇలా ఇంటిలిజెన్స్ రిపోర్టు పట్టుకొని డి.ఐ.జి. ముఖ్యమంత్రి ఛాంబర్‌లోకి వచ్చి శాల్యూట్ చేసి "గుడ్‌మార్నింగ్ &



గుడ్ న్యూస్ సార్" అన్నారు.

"ఏం గుడ్ అయ్యా, మా పరిస్థితి గాడిద గుడ్డులా ఉంది. రాష్ట్రానికి ఏదో శని పట్టిన్నట్లుంది. వరుసగా కష్టాలు వచ్చేస్తున్నాయి" అన్నారు ముఖ్యమంత్రి.

"మన కష్టాలు తీరిపోయాయి సార్, ఇప్పుడు జరిగింది ఫుడ్ పాయిజనింగ్ వల్ల వచ్చిన వాంతులు కావు. పెళ్ళయిన ఆడవాళ్ళు అందరూ నెలతప్పారట. రాష్ట్రం అంతటా పండుగ వాతావరణం నెలకొంది. ఏ యింట్లో చూసినా సందడే సందడి" అన్నారు డి.ఐ.జి.

ఇది విన్న ముఖ్యమంత్రి, మిగతా అందరూ ఆనందం పట్టలేక "యురేకా" అని, గట్టిగా అరిచి ఎగిరి గంతేశారు.

ముఖ్యమంత్రి ఆనందంతో నవ్వుకుంటూ "అదే చాలా వింతగా ఉంది. దీనికి కారణం ఏమిటో నాకు వెంటనే తెలియాలి. క్విక్ అందరూ వెళ్ళి రేపు ఉదయానికల్లా పూర్తి వివరాలతో నాకు రిపోర్ట్ అందజేయండి" అని ఆర్డర్ పాస్ చేసి మరోసారి "యురేకా" అనబోయి తన పెద్దరికం గుర్తుకు వచ్చి తమాయించుకొని ముసిముసిగా నవ్వుకుంటూ, నవ్వుకుంటూ గతంలోకి వెళ్ళిపోయాడు.

అది రాష్ట్ర ముఖ్యమంత్రుల సమావేశం, ఆ సమావేశంలో ప్రక్క రాష్ట్రాల ముఖ్యమంత్రులు తన వంక హేళనగా చూడ్డం, మన రాష్ట్రంలోని మగవాళ్ళ గురించి చులకనగా మాట్లాడుకోవడం గుర్తుకువచ్చి అప్పుడు సమాధానం చెప్పలేక తను పడ్డ బాధ తలచుకొని పళ్ళు పట... పటా... కొరికాడు.

"ఏంటి సార్ ఈ శుభసందర్భంలో మీరొక్కరే బఠానీలు తింటున్నట్టున్నారు నాకు కూడా కొంచెం పెట్టండి" అని డి.ఐ.జి. అడిగారు.

దాంతో వర్తమానంలోకి వచ్చిన ముఖ్యమంత్రి "బఠానీలు కాదు, బందరు లడ్డులూ కాదయ్య తింటున్నది. పళ్లు కొరుకుతున్నాను" అని గతంలో విషయం చెప్పాడు.

"నిజమే సార్. మిగతా రాష్ట్రాల వాళ్ళకి సరైన సమాధానం చెప్పే అవకాశం ఇన్నాళ్ళకి మనకివచ్చింది" అన్నారు డి.ఐ.జి.

ఆ రాత్రంతా ఎప్పుడు తెల్లవారుతుందా? ఎప్పుడు పూర్తి సమాచారం అందుతుందా అని ఆత్రుతతో కంటి మీద కునుకు లేకుండా ముఖ్యమంత్రి గడిపేశారు.

ఉదయాన్నే డి.ఐ.జి. వచ్చి "సార్ మన రాష్ట్రానికి వచ్చిన ఈ సమస్యకి అసలు కారణం పూర్తిగా తెల్సిపోయింది" అన్నాడు.

"త్వరగా చెప్పవయ్యా ఈ వార్త కోసమే రాత్రంతా కంటిమీద కునుకు లేకుండా గడిపాను" అన్నాడు ముఖ్యమంత్రి.

"సార్ మూడు నెలల క్రితం మన రాష్ట్రానికి తుఫాను వచ్చినప్పుడు వారం రోజులపాటు రాష్ట్రమంతటా కరెంట్ బంద్ అయిపోయింది. ఆ వారం రోజులూ ఎక్కడా టి.వి.లు పనిచెయ్యలేదు. అందుకని భార్యభర్తలు టి.వి. చూసే అవకాశం లేక సంసారాలు చేసుకున్నారు. దాని ఫలితంగానే మన రాష్ట్రంలో పెళ్ళయిన ఆడవాళ్ళకి నెల తప్పి ఇలా వాంతులు అవుతున్నాయి" అన్నాడు డి.ఐ.జి

"అంటే ఇంతకాలం మనరాష్ట్రంలో దంపతులు సంసారం..." అని అనుమానంగా అన్నాడు ముఖ్యమంత్రి.

"మీ అనుమానం నిజమే సార్. ఉదయం లేచింది మొదలు అర్ధరాత్రి వరకూ ఎన్నో ఛానళ్ళలో ఏక ధాటిగా వస్తున్న ఏడుపుగొట్టు డైలీ సీరియల్స్ చూస్తూ, చూస్తూ, ఆడ మగా ఏడుస్తూ, సంసారాలు చేసుకోవాలన్న ధ్యాసే మర్చిపోయి విడివిడిగా నిద్రపోతున్నారు. పొరపాటున ఎప్పుడైనా ఆలుమగలలో ఎవరికైనా సంసారం చేసుకోవాలనే కోర్కె కలిగినా, రెండవ వారు సీరియల్స్ ప్రభావం వల్ల నీరసంతో, నిస్సత్తువగా ఉండి సహకరించకపోవడం వల్ల మన రాష్ట్ర జనాభా ఇంత దారుణంగా పడిపోయి. చావులే గాని పుట్టుకలు లేని వింత పరిస్థితి వచ్చింది" అని డి.ఐ.జి. చెప్పారు.

'ఔరా ఇంతటి ప్రభావం చూపెట్టిన ఆ దిక్కుమాలిన డైలీ సీరియల్స్‌ని పెళ్ళయిన వాళ్ళు కనీసం ఒక బిడ్డ పుట్టేదాకానైనా చూడకూడదని కఠినమైన చట్టం ఈ రోజే అసెంబ్లీలో చెయ్యాలని' ముఖ్యమంత్రి గట్టిగా నిర్ణయించుకున్నాడు. రాష్ట్ర పరిస్థితిని ప్రధానికి, రాష్ట్రపతికి స్వయంగా వివరించడానికి ముఖ్యమంత్రి సాయంత్రం బయలుదేరి ఢిల్లీ వెళ్ళారు.

మర్నాడు ఢిల్లీలో ప్రధానిని కలసి, ఆయనతో పాటు రాష్ట్రపతి వద్దకు వెళ్ళాడు. రాష్ట్రపతి విషయం అంతా తెలుసుకొని వెంటనే తెలుగు డైలీ సీరియల్స్ అన్నింటినీ అన్ని భారతీయ భాషలలోకి డబ్ చేసి అర్జంట్‌గా అన్ని కార్యక్రమాలు క్యాన్సిల్ చేసి, వీటిని టెలికాస్ట్ చేసేలా చర్యలు తీసుకోమని, ఇంతకంటే జనాభాని అరికట్టే మార్గం లేదని, అంతేకాకుండా, తెలుగు టి.వి.రచయితల్ని, దర్శకుల్ని, నటీనటుల్ని, ఛానళ్ళ వాళ్ళని ఒకే చోట చేర్చి ఎక్కడా గ్యాప్ లేకుండా 24 గంటలూ ప్రసారం అయ్యేలా డైలీ సీరియల్స్‌ని తయారు చెయ్యమని ఆర్డర్ పాస్ చేసి, మన రాష్ట్రానికి మాత్రం ముఖ్యమంత్రి కోర్కె మేరకు కొత్త దంపతులు బిడ్డ పుట్టే దాకా సీరియల్స్ కాదు అసలు టి.వి.యే చూడకూడదని ఉత్తర్వులిచ్చారు.

ఇంతలో సి.బి.ఐ. డైరెక్టర్ కంగారుగా సమావేశం వద్దకు వచ్చి, రాష్ట్రపతికి, ప్రధానికి సెల్యూట్ కొట్టి "ఘోరం జరిగిపోయింది సార్" అన్నాడు.

"ఏంటయ్యా! పాకిస్థాన్ వాళ్ళు వార్నింగ్ లేకుండానే బాంబు వేశారా?" అని ప్రధాని రాష్ట్రపతి అడిగారు. అది కాదు సార్, ఆంధ్రప్రదేశ్ జనాభా పెరగడానికి కారణం తెల్సుకున్న 'చైనా సీక్రెట్ సర్వీసు' వాళ్ళు మొత్తం తెలుగు టి.వి. సీరియల్స్ రచయితల్ని, దర్శకుల్ని నటీనటుల్ని అందరినీ గంపగుత్తగా కిడ్నాప్ చేసి తమ దేశం తీసుకుపోయారు" అన్నారు.

'హతవిధీ!' ఇప్పుడేం చెయ్యాలని రాష్ట్రపతి, ప్రధాని తలలు పట్టుకున్నారు.

"మీరేం కంగారు పడకండి సార్. వారం తిరగకముందే మా రాష్ట్రంలో వేరే రచయితలు, దర్శకులు, నటీనటులు కోకొల్లలుగా తయారైపోతారు. పైగా ఈ మధ్యన మా రాష్ట్రంలో 'జీళ్ళ' పరిశ్రమ పూర్తిగా మూత పడిపోయింది. వాళ్ళందరూ ఖాళీగానే ఉన్నారు వాళ్ళతో టి.వి. డైలీ సీరియల్స్ రాయిద్దాం. సాగదీసుకుంటూ పోతారు" అని మన ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు.

"అబ్బ ఎంత చల్లని మాట చెప్పావయ్యా. వెళ్ళు, వెళ్ళి త్వరగా ఆ ఏర్పాట్లు చూడు" అని రాష్ట్రపతి ముఖ్యమంత్రి భుజం తట్టి పంపించారు.

ముఖ్యమంత్రి రాష్ట్రపతి దగ్గరా, ప్రధాని దగ్గరా శెలవు తీసుకుంటూ "ఆ మర్చేపోయాను సార్. ఓ ముఖ్యవిషయం. ఎంత కష్టం అయినా సరే మన దేశంలో 24 గంటలూ కరెంట్ పోకుండా, అందరూ టి.వి. చూసేలా చేస్తేనే మన సమస్యకి పరిష్కారం లభిస్తుంది. అలా ఏర్పాటు చేసే బాధ్యత మీదే" అని చెప్పి హైదరాబాద్ విమానం ఎక్కేశారు.

☆

# స్వాతంత్ర్య సమరయోధులు - పరిపాలనా దక్షులు



## శ్రీ జలగం వెంగళరావు

**హైదరాబాదు సంస్థాన విమోచనోద్యమంలో, ప్రముఖపాత్ర వహించిన స్వాతంత్ర్య సమరయోధులు జలగం వెంగళరావు. స్వాతంత్ర్య సముపార్జనానంతరం జిల్లా స్థాయి నుండి జాతీయ స్థాయివరకు ప్రధాన పదవులను అత్యంత దక్షతతో నిర్వహించి గొప్పపేరు గడించిన ప్రజానాయకులు.**

వెంగళరావు 1922 మే 4న జన్మించారు. విద్యాభ్యాసం కృష్ణా జిల్లా గన్నవరంలో జరిగింది. వీరు కుటుంబంతో బోయన్నగూడెంలో స్థిరపడినారు. సర్దార్ జమలాపురం కేశవరావుగారి నాయకత్వంలో ఆంధ్ర మహాసభ కార్యక్రమాల్లో పాల్గొని గ్రామీణ ప్రజల్లో చైతన్యం కలిగించటానికి విశేషంగా కృషి చేశారు.

1947లో నిజాం నిరంకుశాధికారానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో క్రియాశీలకపాత్ర వహించారు. హైదరాబాదు సరిహద్దు పోరాటంలో పాల్గొన్నారు. పోలీస్ చర్య తర్వాత మధిర తాలూకాలోని భూస్వాములకు వ్యతిరేకంగా న్యాయపరమైన హక్కులకోసం పోరాడారు. 1952 సాధారణ ఎన్నికలో స్వతంత్ర అభ్యర్థిగా వేంసూరు నియోజకవర్గం నుండి శాసనసభకు పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 1975లో జిల్లా సరిహద్దులు ఏర్పడినపుడు ఖమ్మం జిల్లా పరిషత్తు అధ్యక్షులుగా ఎన్నికై, జిల్లా అభివృద్ధికి ఎంతో కృషి చేశారు.

1962లో వేంసూరు నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి శాసన సభ్యులయ్యారు. 1962లో ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య మంత్రి వర్గంలో పంచాయితీరాజ్ మంత్రిగా పనిచేశారు. 1967లో తిరిగి శాసనసభకు ఎన్నుకోబడి, బ్రహ్మానందరెడ్డి మంత్రివర్గంలో కొంతకాలం హోంశాఖ మంత్రిగా, 1972లో పి.వి.నరసింహారావు మంత్రివర్గంలో పరిశ్రమల శాఖ మంత్రిగా పనిచేశారు. ప్రత్యేక ఆంధ్రరాష్ట్రోద్యమ కారణంగా పి.వి. నరసింహారావు గారు రాజీనామ చేశారు.

వెంగళరావు 1973 డిసెంబరు 10 న రాష్ట్ర ముఖ్యమంత్రిగా పదవి స్వీకరించారు. మొట్టమొదటి ప్రపంచ తెలుగు మహా సభలను, విద్యాశాఖమంత్రి శ్రీ మండలి వెంకటకృష్ణారావుగారి సహకారంతో అత్యంత వైభవంగా జరిపారు. వివిధ జల విద్యుత్ ప్రాజెక్టులను, నీటి పారుదల ప్రాజెక్టులను నిర్మింపచేశారు.

1977లో జరిగిన ఎన్నికలలో శాసనసభ్యులయ్యారు. కాని విమదలాల్ కమీషన్ నివేదిక దృష్ట్యా శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. పార్లమెంటుకు ఎన్నుకోబడినారు. 1986లో రాజీవ్‌గాంధీ మంత్రి వర్గంలో పరిశ్రమల శాఖ మంత్రిగా పనిచేశారు. 1989లో రెండవసారి పార్లమెంటుకు ఎన్నుకోబడినారు. 1991లో జరిగిన ఎన్నికలలో పోటీచేయలేదు.




వెంగళరావు నక్సలైట్ ఉద్యమాన్ని కఠినంగా అణచివేశారు. నక్సలైట్ బాధలకు గురైన వారికి ఎన్నో సదుపాయాలు కల్పించి ఆదుకొన్నారు. గిరిజనుల అభివృద్ధికెంతగానో కృషిచేశారు.

వెంగళరావు గారు ముఖ్యమంత్రిగా వున్నపుడు, కాకతీయ, నాగార్జున, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ప్రారంభించారు. ప్రాంతీయ సంకుచిత భావాలకు అతీతంగా మూడు ప్రాంతాలలో విశ్వవిద్యాలయాలు స్థాపించారు.

పరిపాలనాదక్షులైన వెంగళరావు 1999 జూన్ 12న కన్నుమూశారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లో వారిపేర, జలగం వెంగళరావు పార్కు ఏర్పడింది. ఆ ప్రాంతంలోనే వెంగళరావు నగరం ఏర్పడింది.

*- జానమద్ది హనుమచ్ఛాస్త్రి*

**నె**ల్లూరు జిల్లాలోని చిట్ట చివరి మండలం సీతారామపురంలోని మారుమూల చిన్న పల్లె. బయట ప్రపంచానికి అంతగా తెలియని ఆ పల్లె ఎందరో దేశ భక్తులకు మాతృమూర్తిగా, ఎందరో పోలీసులకు జన్మభూమిగా మారింది, మనదేశాన్ని కాపాడే జవాన్లకు ఈ పల్లె కల్పవల్లి అదే. కుగ్రామమైన 'దేవిశెట్టి పల్లె'. ఈ పల్లె కెళ్ళి పరిశీలిద్దాం.

**నెల్లూరు జిల్లాకు సుమారు 130 కి.మీ దూరంలో గల సీతారామపురం మండలానికి 10 కి.మీ దూరంలో ఇసిరివేసినట్లు అడవి తల్లిని అనుకోనే ఉండే ఈ పల్లె జనాభా 750. ప్రస్తుతం (వలసలు వెళ్ళినవారు కాకుండా) 642 మంది గ్రామంలో నివసిస్తున్నారు. మిగిలిన వారు ఉద్యోగ రీత్యా వెళ్ళిపోయి అప్పడప్పుడు వస్తుంటారు.**

మొత్తం కుటుంబాల సంఖ్య 125. గత 20 సంవత్సరాలుగా పంచాయితీ ఎన్నికలు ఏకగ్రీవం. సర్పంచ్ అభ్యర్థి, వార్డుమెంబర్లు సైతం ఎవ్వరు పోటీకి ఆసక్తి చూపకుండా రచ్చబండపై చర్చించుకొని ఏకగ్రీవానికి వస్తారు. ఆ గ్రామంలో తెలుగుదేశం, కాంగ్రెస్ పార్టీలు ఉన్నాయి. స్థానిక ఎన్నికల్లో మాత్రం ఎవ్వరు రాజకీయాలు చెయ్యరు. పెద్దల మాట సద్దెమూటలా అంగీకరిస్తారు.

# దేశ భక్తుల కల్పవల్లి - దేవిశెట్టి పల్లె

గత 20 సంవత్సరాలుగా గ్రామంలో నుంచి 'మద్యపానం' షాపుల ను తరిమేశారు. సంపూర్ణ నిషేధం పాటించారు. తద్వారా గ్రామం ఐకత్యకు నిలయంగా, నిత్యం శాంతియుతంగా ఉండే 'దేవిశెట్టి పల్లె'' యువకులను కదిలిస్తే వీరంతా ఆదర్శవంతులుగానే ఉంటారు.

మద్యపాన నిషేధంలో గ్రామ యువకులు కీలకపాత్ర పోషించారు. ఇక యువకులేమి చేస్తున్నారంటే, అందరూ జవాన్లే లేదా పోలీస్‌లు వేరే ఉద్యోగాల కన్న దేశాన్ని రక్షించే జవాన్లుగా అందరు ఆర్మీకి వెళ్తారు. నేడు ఈ పల్లె ప్రతి ఇంటిలో ఒక జవాన్ ఉన్నాడంటే భారతమాత మురిసిపోతుంది. ఇందుకు చక్కటి నిదర్శనం నేటికి 56 మంది ఆర్మీ జవాన్లు. అందులో ఒకరు మేజర్, 9 మంది పోలీసులు ఉండటమే. వీరంతా ఎక్కువగా గోవా, ఒరిస్సా రాష్ట్రాలలో సరిహద్దుల్లో రక్షణ బాధ్యతల్లో పనిచేస్తున్నారు.

ఎన్ని ఉద్యోగాలు వస్తున్నా జవాన్ల గానే ఎందుకెళుతున్నారనే ప్రశ్నకు అక్కడ సమాధానం దేశరక్షణ కోసమని. తనకన్నా సీనియర్స్ ప్రోత్సాహం, దేశభావాల స్ఫూర్తిగా యువకులు చెప్పుకుంటారు.

ఇక తల్లిదండ్రుల పాత్ర ఏమిటంటే గర్వంగా బ్రతకటం, తన బిడ్డ భారతమాత ముద్దు బిడ్డగా నలుగురికి చెప్పుకొనే సంతోషించడం. ఈ పల్లెలో ఏమంటూ ఆర్మీ ఉద్యోగాలలో చేరారోకాని ప్రతి పౌరుడు ప్రథమ స్థానం ఆర్మీ 'జవాన్' కే ఇవ్వటం విశేషం. వీరంతా ఏడాదికోసారి ముఖ్యమైన పండుగలు, పెళ్ళిళ్లకు వస్తూ, గ్రామాభివృద్ధిని కాంక్షిస్తూ గ్రామంలో ఉన్నవారిని ప్రోత్సహిస్తూ ఐక్యంగా ఉండాలని ఉద్ఘాటిస్తారు .అందుకే ఈ పల్లె కక్షలకు, మోసాలకు, కుట్రలకు, రాజకీయాలకు దూరంగా, ఐక్యతకు, అభివృద్ధికి బాటగా స్ఫూర్తిగా మారింది.

దేవిశెట్టి పల్లె గ్రామ వాతావరణం, రాజకీయ, ఆర్థిక సామాజిక అంశాలను గమనిస్తే, ఇక్కడ తెలుగుదేశం, కాంగ్రెస్ పార్టీలున్నాయి. కుట్రలు లేని నిష్పక్షపాతమైన, పారదర్శకమైన రాజకీయాలున్నాయి. తద్వారా ఎటువంటి వివాదాలు, కక్షలు లేవు, ఎవరి ఓటు వారు స్వచ్ఛందంగా వేస్తారు.

పంచాయితీ పాలన విషయాలకొస్తే ఏ పార్టీ అనుచరులు సర్పంచ్, ఎం.హెచ్.సి. వార్డు మెంబరైనా గ్రామం సహకరిస్తుంది, ఇంటి పన్ను 100 శాతం, మంచినీటి పథకాలు 100 శాతం అమలు, బెల్ట్ షాపులు 100 శాతం నిషేధం, శానిటేషన్ అమలు 90 శాతం. ఊరంతా 52 కొళాయిలు, వాటర్ ట్యాంక్ సామర్థ్యం 600 లీటర్లు, పారిశుధ్యం 80శాతం, హౌసింగ్ 90 శాతం, పూరిళ్లు 9 మాత్రమే. ఊరంతా సిమెంట్ రోడ్లు 100 శాతం పూర్తి.

ఈ గ్రామానికి నిర్మల్ పురస్కారాలు 2 సార్లు (1995లో 2001 లో) అందాయి. మొత్తం మీద స్థానికపాలనలో ప్రజల భాగస్వామ్యం ద్వారా లబ్ధిదార్లను ఎంపిక చేయటం జరుగుతుంది. అయితే అవగాహన లేదు. గ్రామసభల నిర్వహణలో కాస్త వెనుకబడి ఉన్న ప్రజల అభిప్రాయం మేరకు ప్రజాప్రతినిధులు నడుచుకోవటం విశేషం.

ఇప్పటి వరకు ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్ ఎంపి.టి.సి. వార్డు మెంబర్లు అభివృద్ధికి పాటు పడ్డారే తప్పా, డబ్బుల కోసం కాంట్రాక్టు పనుల కోసం ప్రాకులాడలేదని ప్రజలు వివరిస్తున్నారు.

గ్రామ వ్యవసాయ రంగాన్ని పరిశీలిస్తే మొత్తం సాగు భూమి 260 ఎకరాలు. వరి 60, శనగ 100, ప్రొద్దు తిరుగుడు 50 ఎకరాలలో పంటలు సాగు చేస్తారు. ఏడాదికి 2 పంటల ద్వారా ఇక్కడ ఉన్న రైతులు, వగ్గం సాగు నీటి ద్వారా మోటార్ల బావుల ద్వారా సాగునీటి వనరులను సద్వినియోగం చేసుకుంటూ గ్రామం చుట్టూ 12 చెక్ డ్యామ్‌లు కట్టి నీటివనరుల అభివృద్ధికి కృషి చేశారు. నేడు ఈ గ్రామం సస్యశ్యామలంగా ఉంది. గ్రామంలో డ్రైనేజి, పారిశుధ్యం 80 శాతం వరకు పాటిస్తున్నారు.

గ్రామంలో ఏ చిన్న సమస్య వచ్చినా పెద్దలు కలసి పరిష్కారం చేసుకుంటారు తప్పా, పోలీసులు కోర్టులకు దూరంగా ఉంటారు. ప్రస్తుత కలుషిత రాజకీయాల నేపథ్యంలో స్థానిక ఎన్నికల్లో సమర్థుల ను అందరి ఆమోదయోగ్యంతో ఎంపిక చేసుకుంటూ ఆ పల్లె మల్లె పువ్వులా వికసిస్తోంది. ఆ గ్రామంలోని యువకులు, జవాన్లుగా చేరి మహాత్మా గాంధీ కన్న కలలు నిజం చేస్తున్నారు.

''దేశమంటే మనుష్యులోయ్, దేశమంటే మట్టికాదోయ్'' వంటి గురజాడ మాటలు, 'పల్లెలో అభివృద్ధి-దేశాభివృద్ధి' అనే గాంధీజీ మాటల స్ఫూర్తి ఈ పల్లెలో గడప గడపలో ఓ భారతమాత ముద్దు బిడ్డ నోట వినిపిస్తుంది. పల్లెలన్నింటికి ఈ పల్లె స్ఫూర్తి నిస్తుంది.

*- ఎ.వై. శివ, మేనేజర్, ట్రైనింగ్ సెల్*
*జిల్లాపరిషత్, నెల్లూరు*

# వాతావరణ కాలుష్యం-భవిష్యత్ పరిణామాలు తీసుకోవలసిన జాగ్రత్తలు

**భూగర్భంలో జరిగే పరిణామాలు, అధిక ఉష్ణోగ్రతతో పాటుగా వాతావరణంలో జరిగే మార్పులతో సునామీ, భూకంపాలు, అతివృష్టి, అనావృష్టి, వడగండ్ల వానలు, పర్వతాల నుండి అగ్ని, లావా లాంటి విపత్కర విపత్తులు సంభవించటంతో జనజీవన, ఆస్తి, పంటల నష్టం సంభవిస్తే సమస్త జీవజాతి ఇబ్బందులకు గురికావలసి ఉంటుంది.**

**మానవుడు అభివృద్ధితో పాటు కాలుష్యాన్ని వాతావరణంలోకి వదిలిపెడ్తున్నాడు. దీంతో ఉష్ణోగ్రత పెరిగిపోతూ వాతావరణ సమతుల్యం దెబ్బతిని అకాల కుంభవృష్టి వర్షాలు, అనావృష్టి లాంటివి సంభవించి ఆహార సమస్యతో పాటుగా, త్రాగునీటి సమస్య, అనారోగ్య సమస్యలు ఏర్పడి మానవజాతి ముందు ముందు ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదముంది.**

ఇటువంటి విపత్తులు సంభవిస్తే, ఆ సమయంలో ఆ ప్రాంతంలో ఉండే ప్రజలందరూ బాధితులయినప్పటికీ ముఖ్యంగా పేదవారు, రైతులు, తీరప్రాంతంలో ఉండే మత్స్యకారులు, పట్టణాలలో మురికి కాలువల ప్రక్కన నివాసముండే వారు నిరాశ్రయులై ఇండ్లు, పంటలు పూర్తిగా దెబ్బతిని తిరిగి కోలుకోని విధంగా ఉండి ఇతరుల సాయం కొరకు ఎదురుచూసే దీన పరిస్థితి ఉంటుంది.

ఇట్టి విపత్తులను ఏ మానవశక్తి, యుక్తి, మేధస్సు ఆపలేవు. చేయవలసిందల్లా ఎప్పుడో ఒకప్పుడు తప్పనిసరిగా ఇలాంటివి సంభవిస్తాయని ఊహిస్తూ జన, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు గైకొనవలసిన అవసరముంది. అలాగే వాతావరణ కాలుష్య నివారణ చర్యలు కూడా తీసికోవలసి ఉంటుంది.

శాస్త్రజ్ఞుల అభిప్రాయం ప్రకారం యాభై వేల సంవత్సరాల క్రితం వరకు భూభాగం పూర్తిగా మంచుతో కప్పబడినట్లుగా, తరువాత వాతావరణ పరిస్థితులలో వచ్చిన మార్పులతో మంచు కరగటం మొదలవటంతో పదిహేను వేల సంవత్సరాల నుండి నీటిలో, భూమిలో జీవం గల కదలలేని రకరకాల మొక్కలు, వృక్షాలు అలాగే చలనం గల రకరకాల క్రిమికీటకాలు, చిన్న చీమ నుండి భారీ ఆకారం గల వివిధ జాతుల జంతువులు, మానవులు ఉద్భవించి ఆహారానికి, అవసరానికి ఒక దానిపై ఒకటి ఆధారపడి ఆడ మగ కలయికలతో పునరుత్పత్తి చేసుకుంటూ జనన మరణాలతో సృష్టిలో జీవనం కొనసాగిస్తున్నాయి.

ఆలోచన తెలివిగల మానవుడు రక్షణ అవసరాలను గుర్తించి పైరులను వృక్షాలను పెంచుకుంటూ అవసరమైన జంతువులను, పక్షులను చెంతన చేర్చుకుని సురక్షిత ప్రాంతాలలో నివాసం చేసుకుంటూ వాతావరణానికి అనుకూలంగా పైరులు సాగుచేస్తూ సామూహికంగా జీవనం కొనసాగిస్తున్నాడు. క్రమేపీ జనాభా పెరిగి పోతుండటంతో ఆహార అవసరాలకు, సౌకర్యాలకు అడవులను నరికి వేస్తూ పర్యావరణ సమతుల్యాన్ని దెబ్బతీయటానికి నాంది పలకడం మొదలుపెట్టాడు.

అడవులు భూమిపై వాతావరణంలో ఉష్ణోగ్రత పెరగకుండా ఉంచుతూ, వర్షాలను ఆకర్షిస్తూ భూసారం పెంచే విధంగా అలాగే భూమి కోతకు గురికాకుండా నిరోధిస్తూ వాతావరణంలోని చెడుగాలిని పీల్చుకుని జన జీవనానికి అవసరమయ్యే ప్రాణవాయువును వదులుతూ, పర్యావరణాన్ని సమతుల్యంగా ఉంచుతూనే ఎన్నో అడవి జంతువులకు, పశుపక్షాదులతో పాటుగా ఎన్నో జీవరాశులకు నిలయంగా ఉంటూ రక్షణనిస్తున్నాయి.

మన భూభాగంలో 30% మేర అడవులుండగా, విచక్షణారహితంగా, మూర్ఖంగా అడవులను నరికివేయటం వలన ఇప్పుడు 20% వరకే ఉంది. దీంతో పర్యావరణ సమతుల్యం దెబ్బతినటంతో పాటుగా అడవులలో నివాసముండే పక్షులు, జంతువులు ఇతర జీవరాశి అడవులను వదిలి ఆకలిని తీర్చుకోటానికి పంట పొలాలపైకి, అలాగే గ్రామాలకు వచ్చి మానవునికి ఆహార సమస్యతో పాటుగా ఇతర సమస్యలు తెచ్చిపెడుతున్నాయి.

మానవుడు అభివృద్ధిలో భాగంగా గృహాలు, రోడ్లు, పరిశ్రమల నిర్మాణాలు చేపట్టడం, తన సుఖ సౌకర్యాల కోసం ఏ.సి.లు, రిఫ్రిజిరేటర్లు, యంత్రాలు, విద్యుత్ వినియోగం పెంచటం ఇవన్నీ వాతావరణంలో ఉష్ణోగ్రత పెరగటానికి దోహద పడుతున్నాయి. వీటితో పాటుగా వాహనాల వినియోగం పెరగటం వాటి నుండి, పరిశ్రమల నుండి వెలువడే పొగ, ధూళి, గాలి వాతావరణాన్ని కలుషితం చేస్తూ ఉష్ణోగ్రతను ఇంకా ఎక్కువగా పెంచేందుకు దోహదపడుతున్నాయి.

పారిశ్రామికంగా బాగా అభివృద్ధి చెందిన ఇంగ్లాండ్ దేశం 1950 సంవత్సరం వరకు తీవ్ర కాలుష్య ప్రచారంతో ఉండగా తరువాత నివారణా చర్యలు గైకొనటంతో కాలుష్యం తగ్గుముఖం పట్టింది. అదే భారతదేశం 1950 వరకు కాలుష్య రహితంగా ఉన్నటువంటిది ప్రస్తుతం అధిక కాలుష్యంతో సమస్యలు ఎదుర్కొనవలసి వస్తున్నది.

ప్రపంచ వాతావరణ కాలుష్యంలో సగభాగం అభివృద్ధి చెందిన అమెరికా దేశానికే పర్యావరణ కాలుష్యం వలన ఉష్ణోగ్రత పెరిగి వాతావరణంలో పలుమార్పులు సంభవించి వర్షపు దినాలు తగ్గి స్వల్ప సమయంలో కుంభవృష్టి, అనావృష్టి, అలాగే ఉత్తర, దక్షిణ ధృవ ప్రాంతాలలో గల సముద్రంలోని మంచు కరగటంతో సముద్రపు నీటిమట్టం ఏటా ఒక మి.మీ. పెరుగుతూ, 2100 సంవత్సరం వరకు రెండు మీటర్ల ఎత్తులో పెరిగే అవకాశముంది.

దీంతో మాల్దీవులు లాంటి చాలా దీవులు కనుమరుగయ్యే ప్రమాదంతో పాటుగా బంగ్లాదేశ్ లాంటి దేశంలోని తీర ప్రాంతంలో చాలా భూభాగం ముంపునకు గురయి చాలా మంది ప్రజలు జీవనం కొరకు ఇతర ప్రాంతాలకు, పక్క దేశాలకు వలసలు వెళ్ళే అవకాశముంది.

అటువంటి వారి వలసలు అరికట్టలేక వచ్చిన వారికి పునరావాసం కల్పించలేక మన దేశానికి అత్యంత సమస్యాత్మకంగా తయారవుతుంది.

ఉష్ణోగ్రత పెరగటంతోనూ అలాగే కాలుష్యం వలన మనుష్యులకు అంతుపట్టని అనారోగ్య సమస్యలు అలాగే పంటలపై తెగుళ్ళు, పురుగుల బెడద సమస్యలు వచ్చే అవకాశముంది.

ప్రజలకు రవాణా సౌకర్యార్థం మోటారు వాహనాల వినియోగం రోజు రోజుకు గణనీయంగా పెరిగిపోతోంది. ఒక హైదరాబాద్ పట్టణంలోనే 20 లక్షలకు పైగా వాహనాలుండగా, ప్రతిరోజూ నాలుగు వందలకు పైగా వాహనాల అమ్మకాలు జరుగుతున్నాయి. వాహనాల నుండి వచ్చే పొగ వాతావరణాన్ని కాలుష్యం చేయటంతో ఉష్ణోగ్రత పెరగటంతో పాటుగా అనారోగ్య సమస్యలు సృష్టిస్తున్నాయి. కనుక ఇటువంటి నగరాలలో వీలయినంత ఎక్కువగా మెట్రో రైలు సదుపాయం ప్రవేశపెడితే వాహనాల వినియోగం గణనీయంగా తగ్గి కాలుష్యం తక్కువయే అవకాశముంది. శ్రమజీవి రథచక్రం మానవుని శక్తితో నడిచే సైకిళ్ళ వినియోగాన్ని ప్రోత్సహిస్తే ఖర్చు, కాలుష్యం తగ్గుతుంది. శ్రమచేయని వారు సైకిల్ స్వారీ చేస్తే ఆరోగ్యం కలుగుతుంది.

విద్యుత్ ఉత్పాదనకు సౌరశక్తి, జలశక్తి, వాయుశక్తిని ఉపయోగిస్తే, ఉష్ణోగ్రతతో పాటుగా కాలుష్యం తగ్గుతుంది. వర్షాలు సరైన సమయంలో రాక రైతులకు ఇబ్బందిగా ఉంది. వర్షపు దినాలు 90 రోజులు ఉండేవి. ఇప్పుడు 50 రోజులకు తగ్గిపోయాయి.

కొద్దిసమయంలో కురిసే భారీవర్షం వలన ఒకవైపు ఆస్తి, పంట నష్టం మరోవైపు భూమిలోకి నీరు ఇంకే అవకాశం లేక వాగులు, వరదలలో, నదులలో కలిసి వృధాగా సముద్రం పాలు కావలసి వస్తున్నది. ఒకవైపు నిత్యావసరాలకు, పరిశ్రమలకు అలాగే పంటలకు నీటి వినియోగం పెరగటంతో రోజురోజుకు భూగర్భ నీటిమట్టం తగ్గిపోతుండంతో ముందు ముందు తీవ్ర నీటి సమస్య ఎదురయ్యే అవకాశముంది.

హైదరాబాద్ నగరంలో గత రెండు నెలల్లో రెండు మీటర్ల లోతు వరకు భూగర్భ నీటిమట్టం తగ్గిపోయింది. ఇవన్నీ దృష్టి యందుంచుకుని నీటిని పొదుపుగా వాడడాన్ని ప్రోత్సహిస్తూ, వర్షపునీటి సంరక్షణ చర్యలను చేపడుతూ, పట్టణాలు, నగరాలలో వర్షపునీరు భూగర్భంలోకి వెళ్ళేవిధంగా ఇంకుడు గుంతలను ఏర్పాటును ప్రోత్సహించాలి. చెన్నై లాంటి నగరంలో ఇంకుడు గుంతలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోటానికి చట్టం తీసుకురావటంతో నగరంలో భూగర్భ నీటిమట్టం పెరిగింది.

పంటల దిగుబడులకై ఉష్ణోగ్రత హెచ్చుతగ్గుల ప్రకారం చాలా ఉంటుంది. ఒక సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రత పెరిగితే 5% దిగుబడులు తగ్గే అవకాశముంది. కాలుష్యం వలన 2100 సంవత్సరం వరకు 5 ఐదు సెంటిగ్రేడ్‌ల ఉష్ణోగ్రత పెరిగే అవకాశం ఉండటంతో దిగుబడులు గణనీయంగా తగ్గి ఆహారభద్రత ముప్పు వాటిల్లే అవకాశముంది.

జనాభా పెరుగుదల సమస్య కూడా కాలుష్యం పెరగటానికి కారణమవుతుంది. భారతదేశ జనాభా ప్రతి సంవత్సరం ఆస్ట్రేలియా ఖండపు మొత్తం జనాభాతో సమానంగా పెరుగుతున్నది. 2050 సంవత్సరం వరకు దేశ జనాభా 300 కోట్లకు చేరవచ్చుని, ఆ జనాభాకు 300 మిలియన్ మెట్రిక్ టన్నుల ఆహార ధాన్యాల అవసరముందని అంచనా.

వాతావరణ కాలుష్యం వలన ఆహారధాన్యాల దిగుబడులు తగ్గి ముందు ముందు తీవ్ర ఆహార కొరత ఉండే ప్రమాదముంది. ఆహార, నీటి కొరతలు తీవ్ర రూపం దాల్చితే శాంతిభద్రతల సమస్య ఉత్పన్నమై అందరికీ భద్రత లేకుండా ఉండి తీవ్రవాదుల సమస్యలు కూడా వచ్చే అవకాశముంది.

ప్రభుత్వం విపత్తుల వలన ప్రజలు నష్టపోకుండా ఉండటానికి దేశంలోని అన్ని ప్రాంతాలలో వాతావరణ సూచన కేంద్రాలను ఏర్పాటు చేసి వార్తాపత్రికల ద్వారా టి.వి. రేడియో ప్రసార సాధనాల ద్వారా అలాగే రైతులకు ప్రత్యేకంగా కొన్ని సంస్థలు ఫోన్‌లో యస్.ఎమ్.యస్.ల ద్వారా, సలహాలు, సూచనలిస్తూ ఎప్పటికప్పుడు వాతావరణ విశేషాలను తెలుపుతూ అప్రమత్తం చేస్తున్నది.

పగటి ఉష్ణోగ్రతలను మధ్యాహ్నం రెండు గంటలను, రాత్రి ఉష్ణోగ్రత తెల్లవారు జామున 5 గంటలకు ప్రామాణికంగా తీసికొంటారు. రైతులకు పంటల బీమా, వాతావరణ బీమా సౌకర్యం కలిగించి విపత్తుల వలన కలిగిన పంట నష్టం కోసం పరిహారం చెల్లిస్తూ, ప్రభుత్వం ఆదుకుంటుంది.

విపత్తులు సంభవించినప్పుడు బాధితులను ఆదుకోవటానికి మరమ్మతులకు తక్షణ సహాయ చర్యల కోసం ప్రత్యేకంగా జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిలో ప్రత్యేక నిధులు నిలువ ఉంచుతారు.

తీర ప్రాంతాలలోని బాధితులకు పునరావాసం కల్గించటానికి అదే ప్రాంతాలలో ప్రభుత్వ కార్యాలయాలు, వసతి గృహాలు, పాఠశాలలు, భవనాలను దృఢంగా, ప్రత్యేకంగా ఎత్తులో నిర్మించటానికి నిర్మాణ ఖర్చులకు అదనంగా నిధులు సమకూర్చుతుంది.

పంటలు ఇండ్లు నష్టపోయిన రైతులు, ఇతర ప్రజలు తిరిగి కోలుకోవటానికి తక్షణమే పరిహారం చెల్లిస్తుంది.

గత తరం వారు అష్టకష్టాలుపడి మనల్ని బానిస బతుకుల నుండి విముక్తి చేసి స్వాతంత్ర్యం తెచ్చి మంచి మానవతా విలువలను, ధర్మాన్ని నేర్పి స్వచ్ఛమైన నీటిని, గాలిని, సారం గలిగిన నేలను మన తరానికిస్తే వాటిని అనుభవిస్తూ మనం, ఒకవైపున ముందు తరాలకు ఆస్తులను వసతులను కల్పిస్తూనే, అత్యాశతో అనాలోచిత చర్యలతో ఇంకొకవైపున వాయువుని, నీటిని, నేలను, ఆఖరికి ధ్వని కాలుష్యానిస్తూ ఆహార, నీటి కొరతతో పాటుగా అనేక అనారోగ్య సమస్యలు కల్గించే విధంగా ఈ తరం వారు చేస్తున్నారు.

ముందు ముందు తరాలవారు మన కన్నా సుఖంగా, ఆరోగ్యంగా ఉండాలంటే అభివృద్ధితో పాటుగా అన్ని రకాల కాలుష్య నివారణ చర్యలు చేపట్టివలసిన బాధ్యత, ధర్మం మనందరి మీదా ఉంది.

*'వృక్షో రక్షతి రక్షితః'*

వృక్షాలను పెంచు, రక్షించు, అవి నిన్ను కాలుష్యం నుండి వర్షాభావ పరిస్థితుల నుండి ఆహార, ఆరోగ్య సమస్యల నుండి కాపాడుతాయి.

ఒకప్పుడు చెట్ల మధ్య నివాసాలు. ఇప్పుడు మన మధ్యన చెట్లు, పట్టణాలు, పల్లెలు తేడా లేకుండా ఇంటి ప్రక్కన, రోడ్డు ప్రక్కన, చేను ప్రక్కన, కాలువల ప్రక్కన ఎక్కడ చూసినా చెట్లు పెంచాలి.

అటవీశాఖ చెట్లను సంరక్షించటానికి, పెంచటానికి ప్రతి సంవత్సరం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నది. వారికి సహకరిద్దాం. వారి సహాయ సహకారాలు తీసుకుందాం. చెట్లను పెంచి రక్షించి వాతావరణ కాలుష్యాన్ని కాపాడుదాం. బావితరాలకు బంగారుబాట వేద్దాం.

*- దన్నపునేని అశోక్‌కుమార్*

# ఆహార భద్రతతోనే ప్రగతి

**ధనిక, పేద వర్గాల భేదాల కనుగుణంగా, వారు భుజించే ఆహారంలో భేదాలుండవచ్చు కానీ, యావత్ మానవ జాతి మనుగడకు 'ఆహారం' కు మించిన అవసరం మరొకటి వుండదు! అటువంటి ఆహారం నేడు విశ్వవ్యాప్తంగా సంక్షోభంలో పడింది.**

1996వ సంవత్సరంలో రోం నగరంలో జరిగిన ప్రపంచ శిఖరాగ్ర సమావేశంలో ఆహార భద్రతపై ఆమోదించిన డిక్లరేషన్ ప్రకారం ఆరోగ్యకరమైన ఆహారాన్ని వారి ఆర్థిక స్థోమతతో ప్రజలందరూ కొనుక్కోగలిగే అవకాశం వున్నప్పుడే ఆహారభద్రత సాధ్యపడ్తుంది. ఆహార భద్రతే అభివృద్ధి ప్రణాళికలకు మూలం కావాలని, అదే అభివృద్ధికి కొల మానమని, 1994వ సంవత్సరంలో అలీన దేశాల శిఖరాగ్ర సమావేశం అభిప్రాయ పడింది. ఆహార భద్రత అంటే ఆహార ధాన్యాల లభ్యత కాదు. అది పోషకాలతో కూడుకున్న సంపూర్ణ ఆహారమైతేనే ఆహారభద్రత లభించినదిగా భావించాలి.

భారతదేశంలో వ్యవసాయ రంగం తనకు గల ఉపాధికల్పనా సామర్థ్యం కన్నా, అత్యధికంగా కల్పిస్తుండం వలన, అవసరానికి మించి అధికంగా పనిచేస్తున్న వారిని, పేదరికం నుంచి బయట పడవేయడానికి, వారిని వ్యవసాయ రంగం నుంచి తప్పించి పరిశ్రమలలో వారికి ఉపాధి కల్పించాలని భారత ప్రధాని మన్మోహన్ సింగ్ అభిప్రాయ పడ్డారు.

పారిశ్రామికంగా అభివృద్ధి పథంలో పయనిస్తున్న అమెరికాను ఆదర్శంగా తీసుకుని, దారిద్ర్యనిర్మూలనకు భారతదేశం పారి శ్రామీకరణను అభివృద్ధి పరచాలి.

తగ్గిపోతున్న ఆహార ధాన్యాల లభ్యత, అదుపు తప్పి పెరిగిపోతున్న జనాభాకు పరిష్కారం కేవలం యం.యస్.స్వామినాథన్ సిఫార్సులు అమలు మాత్రమే!

రైతుకు మద్దతు ధరలను నిర్ణయించాలి. సామర్థ్యానికి, దిగుబడులకు మధ్య వ్యత్యాసాలను భర్తీ చేయాలి. సమాజంలో నిస్సహాయులైన అట్టడుగు వర్గాల వారికి ఉచితంగా తిండి గింజలు సరఫరా చేయాలి. మిగిలిన పేదలకు 2 రూపాయలకే కిలో బియ్యం సరఫరా చేయాలి. బహుళ జాతి సంస్థలకు, కార్పోరేట్ సంస్థలకు ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలతో పోలిస్తే, అట్టడుగు వర్గాల వారికి, పేదవారికి కల్పించే ఇట్టి రాయితీలు కల్పించడం పెద్ద సమస్య కాదు. అందుకు పరిష్కారంగా చట్టం తేవాలి.

1986వ సంవత్సరంలో ఐక్యరాజ్య సమితి తీర్మానం ప్రకారం ఆహారం అడిగే హక్కు ప్రజలకు, ఆహార భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానికీ వుంది.

అయితే ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి మూలంగా, దేశంలో ఆహార ధాన్యాల నిల్వలు భారీగా గోదాములలో పెరిగి ముక్కిపోతున్నాయి. ధాన్యపు నిలువలను వృధా పరిచే బదులు పేదలకు ఉచితంగా అందజేయమని భారతదేశపు సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది.

2009-10 లో ఆహార ధాన్యాల నష్టాలు 228.39 కోట్ల రూపాయలు, రవాణా నష్టాలు 182.46 కోట్ల రూపాయలు. మొత్తం 410.85 కోట్ల రూపాయల నష్టం జరిగింది.

అంతర్జాతీయ ఆహార పరిశోధనా సంస్థ(Inter national Food Researed Institute) వారి 2010వ సంవత్సరపు అంతర్జాతీయ ఆకలి సూచిప్రకారం, అభివృద్ధి చెందుతున్న 84 దేశాల పట్టికలో భారతదేశానిది 67వ స్థానం. ఆకలి మంటలతో పాటు, పోషకాహార లేమితో బాధలకు గురవుతున్న పిల్లలు, మహిళలు, అత్యధికంగా వున్న 29 దేశాలలో భారతదేశం కూడా స్థానం సంపాదించింది.

ఆహార భద్రత కోసం 'జాతీయ సలహామండలి'' కేంద్ర ప్రభుత్వానికి చేసిన సిఫార్సులు అమలు జరిగితే, దేశంలో 80 కోట్ల మంది, మధ్య తరగతి, అల్పాదాయ, పేద వర్గాల వారికి ప్రయోజనం కలుగుతుంది. ఇది ఒక చారిత్రాత్మకమైన సిఫార్సు.

ఈ సిఫార్సులు అమలు జరిగిన నాడు పేదలకు 3 రూపాయలకు ఒక కేజి చొప్పున నెలకు 35 కేజీల బియ్యం, మధ్యతరగతి వారికి సగం ధరకు నెలకు 20 కేజీల బియ్యం లభిస్తాయి. అలాగే పేదవారికి జొన్నలు ఒక రూపాయికి, కేజి గోధుమలు 2 రూపాయలకు అందుతాయి.

అక్టోబర్ 10, 2010న సోనియా గాంధీ అధ్యక్షతన జరిగిన జాతీయ సలహామండలి ఆరవ సమావేశంలో జాతీయ సలహామండలి చేసిన సిఫార్సులను కేంద్ర కేబినెట్ ఆమోదం తరువాత ఆహార భద్రత పేరుతో బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టడం జరగుతుందని, ఈ సిఫార్సులలో పిల్లలు, గర్భిణీ స్త్రీల పౌష్టికాహార ప్రస్థావన, అనాధలకు సామాజిక వంటశాలల ఏర్పాటు అంశం కూడా వుందని, 2011-12 ఆర్థిక సంవత్సరంలో ప్రారంభమయ్యే ఈ పథకం 2014 సంవత్సరానికల్లా దేశంలో పూర్తిగా అమలులోనికి వస్తుందని జాతీయ సలహామండలి సభ్యుడు నరేంద్ర జాదవ్ విలేకరుల సమావేశంలో తెలియజేసారు.

పైన పేర్కొన్న ఆహార ధాన్యాల ధరలలో 12వ పంచవర్ష ప్రణాళికాంతం వరకు మార్పులుండవు

ఇకపోతే సబ్సిడిపై కేజీ 3 రూపాయల చొప్పున 35 కేజీల బియ్యం నెలకు అందజేస్తే సబ్సిడి భారం అత్యధిక మవుతుందని ప్రణాళికా సంఘం వాదన.

ఇప్పటి వరకు అందిస్తున్న 50 వేల కోట్ల రూపాయలకు ఇప్పుడు అదనం ఇచ్చేది 70 వేల కోట్ల రూపాయలని, అనగా మొత్తం 1,20,000 కోట్ల రూపాయల ఖర్చు అని, ఇది జి.డి.పి (జాతీయ స్థూల ఉత్పత్తి)లో కేవలం 1.5 శాతానికి సమానమని, సమాజంలో తిండిలేక, తిండిగింజలు కొనుక్కోలేని దౌర్భాగ్య స్థితిలో ప్రజలు ఉండకూడదని, పారిశ్రామిక సంస్థలకు, కార్పోరేట్ సంస్థలకు అందించే పన్ను రాయితీలకు ఇతర ఆర్థిక పరమైన సౌకర్యాల కల్పన కోసం అందజేసే 3 లక్షల కోట్ల రూపాయలతో పోల్చితే, అన్నార్తుల ఆకలి తీర్చడానికి అందచేసే 70 వేల కోట్ల సబ్సిడి ఏ మూలకు వస్తుంది? అని ఈ అంశాన్ని అధ్యయనం చేసిన ప్రముఖ ఆర్థిక శాస్త్రవేత్త జయతీఘోష్ అన్నారు.

*- ఎ.వి.రాజా*

# సాధికారత దిశగా మహిళ అడుగులు - ఆటంకాలు

**ఆధునిక మహిళ ఎంతమేరకు సఫలమైందని సమీక్షిస్తే ఎన్నోన్నో వెలుగు రేఖలు మన కంటిని కాంతివంతం చేస్తాయి. మహిళా సమగ్ర వికాస సాధనలో ఎన్ని విజయాలు సాధించాము. ఎంత సాధికారత శిఖరారోహణలో ఎన్ని మెట్లు ఎక్కారని గాని, గమ్యం ఇంకా ఎంత దూరం వుందని గాని, గమ్యం చేరడానికి ఎంతకాలం పడుతుందని గాని, అడిగితే సమాధానం చెప్పడం సాధ్యం కాకపోవచ్చు కాని స్వాతంత్ర్యం వచ్చినప్పటి నాటికంటే గడిచిన 61 సంవత్సరాలలో మహిళలు అన్ని రంగాలలోనూ అభివృద్ధి సాధించారని నిస్సందేహంగా చెప్పవచ్చు.**

పురుషాధిక్య ప్రపంచంలో, అన్నింటితో తీవ్ర వివక్షకు గురి అవుతూ ఎన్నెన్నో ఆంక్షల మధ్య జీవిస్తూ వంటింటికే పరిమితమయిన పూర్వ స్థితిని దృష్టిలో వుంచుకుని చూస్తే విద్యాపరంగా, ఉద్యోగపరంగా, సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అనేక రంగాలలో ఈనాటి మహిళలు సాధించిన విజయాలను ఎవ్వరూ తక్కువ అంచనా వేయలేరు అని చెప్పవచ్చు.

### మహిళ విద్యాపరంగా సాధించిన విజయాలు

ఆలోచనకు పదునుపెట్టి చైతన్యానికి, ఉద్యమానికి దోహదం చేసే విద్య ఆనాడు స్త్రీలకు అందుబాటులో లేదు. అయితే దానికి ఈనాడు పూర్తిగా వ్యతిరేకం అని చెప్పవచ్చు. 1805 సంవత్సరంలో విశాఖపట్నంలో ప్రారంభమయిన క్రైస్తవ మిషనరీ పాఠశాలే మన రాష్ట్రంలో బాలికల విద్యకోసం ఏర్పాటైన మొట్టమొదటి పాఠశాల.

1881 నాటికి బాలికల పాఠశాలల సంఖ్య 67. వాటిలో నాడు చదువుకున్న బాలికల సంఖ్య కేవలం 2569. అంటే జనాభాలో నాటి స్త్రీల సంఖ్యతో అక్షరాస్యులైన సంఖ్య పోల్చుకుంటే ఒక్కశాతం కూడా లేదు అని చెప్పుకోవచ్చు. ఆ స్థితి నుండి క్రమంగా పెరుగుతూ, ప్రస్తుతం 2001 జనాభా లెక్కల ప్రకారం, భారతదేశంలో 49 కోట్లున్న స్త్రీల జనాభాలో 54.16% శాతం మంది అక్షరాస్యత సాధించ గలిగారు. అంటే ఇది సామాన్యమయిన విజయం కాదు. ఒకప్పుడు ఆడపిల్లకు చదువెందుకులే అనే రోజులతో పోల్చుకుంటే ఈ విజయం గొప్ప విజయం అని చెప్పుకోవచ్చు. మహిళలు అత్యున్నత విద్యను అభ్యసిస్తూ విజ్ఞానాన్ని సంపాదిస్తున్నారని. చెప్పడంలో సందేహం లేదు. విజ్ఞాన ప్రపంచంలో పరిస్థితిని సమూలంగా మార్చివేయగలిగేది అక్షరమే కాబట్టి, ఈనాటి మహిళలు అక్షరాస్యత వల్ల నేల నుంచి నింగి దాకా





అన్ని రంగాలులో ముందంజ వేస్తున్నారు అని ఖచ్చితంగా చెప్పవచ్చు. ఆడపిల్లకి చదువులు అక్కర్లేదనే దశనుంచి, పోటీ పరీక్షల్లో ఆడపిల్లల్ని ఎదుర్కోవటం మగ పిల్లలకి అంత తేలిక కాదని రుజువయ్యేంత దూరం వరకు చరిత్ర చాలా ముందుకు వెళ్ళింది.

### ఉద్యోగ, ఉపాధి రంగాలలో మహిళ ముందంజ

ఉద్యోగ ఉపాధి రంగాలలో కూడా మహిళలు చెప్పుకోదగ్గ విజయం సాధించగలిగారు. ఉద్యోగ ఉపాధి సాధించడంలో మహిళలు ముందుకు పోవటానికి మహిళలు అక్షరాస్యత సాధించడం ఒక కారణం అని కూడా చెప్పవచ్చు. గడిచిన కొన్నేళ్ళుగా మహిళలు అన్ని ఉద్యోగాలలో విజయం సాధించారు. మన దేశంలో ఉధృతంగా సాగుతున్న మహిళా స్వయం సంఘాల ఉద్యమం గ్రామీణ మహిళలకు ఉపాధి కల్పించడంలో ముఖ్య పాత్ర వహించింది. స్వయం ఉపాధి పొందడంలో పురుషుల కంటే స్త్రీలు అధికంగా వున్నారు.

మహిళలకు పట్టణాలలో ఇటీవల అన్ని రంగాలలోను పురుషునితో సమానంగా ఉద్యోగ అవకాశాలు మెరుగయ్యాయి. ముఖ్యంగా విద్య, ఉద్యోగ రంగాలలో మహిళలకు కల్పించిన 33% రిజర్వేషన్‌లు మహిళలకు ఉద్యోగ, విద్య, ఉపాధి రంగాలలో ముందుకు పోవటానికి ఎంతో ఉపయోగపడింది అని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదు.

### రాజకీయ రంగంలో ముందజ

ప్రస్తుత రాజకీయాలలో మహిళలు మన దేశాన్ని ముందుకు నడిపిస్తున్నారు అని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదు. ఒకప్పుడు బయటకు వెళ్ళడానికి భయపడే మహిళలు ఈ రోజు రాజకీయ రంగంలో అన్ని రకాలైన పదవులను చేపట్టారు. దేశంలో రాష్ట్రపతి, స్పీకర్, ప్రభుత్వ ఛైర్‌పర్సన్ వంటి కీలకమయిన పదవులలో ప్రస్తుతం మహిళలు వుండటం మామూలు విషయం కాదు. మహిళలు రాజకీయ రంగంలో ముందుకు సాగుతున్నారు అనడంలో సందేహం లేదు. స్థానిక సంస్థలలో మహిళలకు 50% శాతం రిజర్వేషన్‌లు కల్పించడం వల్ల దిగువస్థాయి రాజకీయధికారంలో కూడా మహిళల ప్రాతినిధ్యం పెరగటం నిస్సందేహంగా గొప్ప పరిణామమే.

ఈ విధంగా మహిళలు ఒక రంగంలోనే కాక అవకాశం వస్తే, ఏ రంగంలోనూ తాము ఎవరికీ తీసిపోమని నిరూపిస్తున్నారు. నిజానికి అవకాశం తమదాక వచ్చే వరకు వారు వేచి చూడటం లేదు. ముందు కురికి అందుకుంటున్నారు. మునుపటి కంటే ముందుకు సాగుతూ పురుషులకు సొంతమనుకునే అన్ని రంగాలలోను దుసుకెళుతూ

సాధికారదిశగా అడుగులు వేస్తున్నారని చెప్పడంలో సందేహం లేదు.

ఇప్పుడు మనం తీసుకున్నదంతా నాణానికి ఒక వైపు మాత్రమే. మరొక వైపు దీనికి పూర్తి భిన్నంగా జరుగుతుంది. ఆడపిల్లను కని, పోషించి, చదివించి, చివరకు కట్నకానుకలతో ఒకయ్య చేతిలో పెట్టడం నష్టదాయకమయిన పనిగా భావించే వారు ఇంకా సమాజంలో వున్నారు అనడంలో ఏమాత్రం సందేహం లేదు.

### ఆడ పిల్లకు చదువు ఎందుకులే అనే ధోరణి

విద్యా ఉపాధి, రాజకీయ రంగాల్లో సాధికారత సాధించామనుకున్నా, విద్య, ఉపాధి రంగాల్లో మహిళలకు 33% శాతం రిజర్వేషన్లు కల్పించినా, ఇంకా ఆడపిల్లకు చదువెందుకులే అనే భావనలో కొంతమంది తల్లిదండ్రులు వున్నారు. ఇంకా దాదాపు మనదేశంలో సగం మహిళా జనాభా నిరక్షరాస్యలేనన్నది మనం నమ్మక తప్పదు.

### ఇంకా కొనసాగుతున్న వరకట్నం

ఆడపిల్లలను బలిపీఠంపై నిలుపుతున్న మరో సమస్య వరకట్నం. అది కన్యాశుల్కమైనా, వరకట్నమయినా, పేరు ఏదైనా అది ఆడపిల్ల మెడకు ఉరి బిగిస్తున్నది. ఇటు పుట్టింటికి భారమనే భావనకు, అటు మెట్టనింటిలో తీరని గృహహింసకు వరకట్నమే ప్రధాన కారణమవుతుంది. నాటి వరకట్న నిషేధ చట్టం నుంచి నేటి గృహహింస చట్టం దాకా మహిళా సంరక్షణ చట్టాలు ఎన్ని వచ్చినా వరకట్న మరణాలు ఆగటం లేదు.

### ప్రేమోన్మాదులు, కామోన్మాదుల చేతుల్లో బలి

'స్త్రీలు కూడా పురుషులలో సమానంగా హక్కులు, అవకాశాలు పొందగలిగిన భారతదేశమే తాను కలలుకన్న భారతదేశమని, అర్ధరాత్రి సమయంలో కూడా స్త్రీ నిర్భయంగా బయట సంచరించగలిగి నప్పుడే దేశానికి పూర్తి స్వాతంత్ర్యం వచ్చినట్లని' గాంధీ మహాత్ముడు స్పష్టం చేశాడు. కాని స్వాతంత్రం వచ్చి 62 ఏళ్ళు గడిచినా మహిళల పై యాసిడ్ దాడులు.... కోరిక తీర్చనందుకు హత్యలు, ఆడపిల్లను కన్నందుకు హింస... ప్రేమను ఒప్పుకోనందుకు సజీవ దహనాలు, కట్నం ఇవ్వనందుకు అఘాయిత్యాలు, పనిచేసే చోట లైంగిక వేధింపులకు ఈనాటి మహిళలు గురి కావడం మనం చూస్తూనే వున్నాము. వీటికి ఉదాహరణగా ఈ మధ్య మన రాష్ట్రంలో జరిగిన ఉ దాంతాలలోకి వెళితే విజయవాడలోని ఒక కళాశాలలోని శ్రీలక్ష్మిని ప్రేమ పేరిట దారుణంగా నరికి చంపటం, అదే నగరంలో ఒక టి.వి యాంకర్, అయేషా హత్యలు, వరంగల్‌లో ప్రణీత, స్వప్నికపై యాసిడ్ దాడి, రాజమండ్రిలో ప్రేమించటం లేదని అనూష తల్లిదండ్రులను నరికి చంపిన సంఘటన, గత కొద్ది రోజుల ముందు అమలాపురం సమీపంలో ఎనిమిదో తరగతి చదువుతున్న హేమ మాధురి ప్రేమించలేదని తలుపులు బిగించి కిరోసిన్ పోసి నిప్పు అంటించిన సంఘటన వంటి వాటిని మనం తలుచుకుంటే రోజుకి ఎక్కడో ఒక చోట ఇటువంటి అఘాయిత్యాలు జరుగుతూనే వున్నాయి. ఇలా తల్లి గర్భంలో పిండంగా అవతరించిన దగ్గర నుండి కాటికిపోయే దాకా మహిళ రకరకాల హింసలకు గురి అవుతూనే వుంది.

### రాజకీయ రంగంలో అడ్డుపడుతున్న ఆటంకాలు

ప్రపంచంలో అతిపెద్ద దేశంగా, ప్రజాస్వామ్య చెప్పుకునే భారతదేశంలో మహిళలు రాజకీయ సాధికారత ఇంకా అభివృద్ధి చెందవలసి వుందని చెప్పవచ్చును. ఎందుకంటే, ప్రస్తుత కాలంలో రాజకీయ పలుకబడివున్న




రాజకీయ వారసత్వ కుటుంబాలకు చెందిన మహిళలు మాత్రమే రాజకీయ రంగంలో రాణించగలుగుతున్నారు. మిగిలిన స్త్రీలకు అవకాశం అందటం లేదు. ఇంకా అనేక చోట్ల మహిళలు పదవుల్లో వున్నా పేరుకు ప్రేక్షక పాత్రకు పరిమితం చేసి వారి కుటుంబ సభ్యులో లేదా పెత్తందారులో చక్రం తిప్పుతుంటారు.

### ముందుకు సాగాని మహిళా బిల్లు

మహిళలకు పూర్తి రాజకీయ సాధికారత అందించాలనే భారత ప్రభుత్వం చట్ట సభల్లో 33% శాతం రిజర్వేషన్లు కల్పించడానికి ఉద్దేశించిన మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంటులో ఎన్నిసార్లు ప్రవేశపెట్టినా ఇంకా వెనకడుగు వేస్తూనే వుంది. ఈ బిల్లును మొట్టమొదటి సారిగా 1996 సంవత్సరంలో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడం జరిగింది. అప్పటి నుండి ఇప్పటివరకూ జైల్లో యావజ్జీవ శిక్ష అనుభవిస్తున్న ఖైదీలా ఈ బిల్లు ముందుకు సాగకుండా దీనిపై చర్చలు కొనసాగుతూనే వున్నాయి.

ప్రస్తుతం వున్న 15వ లోక్‌సభలో 545 మంది సభ్యులకుగాను, కేవలం 58 మంది మహిళా సభ్యులున్నారు. అంటే వారి పాతినిధ్యం ఇందులో కేవలం 10.68% శాతంగా మాత్రమే వుంది. అలాగే ప్రస్తుతం మన రాష్ట్ర శాసన సభలో 294 మంది సభ్యులకు గాను కేవలం 36 మంది మహిళా శాసనాసభ్యులు వుండటం దురదృష్టకరం. అంటే మనదేశంలో 1952లో 4.4% మహిళా సభ్యత్వం వుండగా, 1998 నాటికి కేవలం 7.9కి పెరిగింది ఈ శాతం పెరగటానికి 46 సం॥లు పట్టింది. ఈ బిల్లు ఆమోదం పొందకుండా ఈ రేటునే పెరుగుతుంటే 35శాతానికి పెరగడానికి సుమారు 360 సంవత్సరాలు పట్టవచ్చు. కాగా, ఈ బిల్లు ఆమోదం పొందితే మన పార్లమెంటులో (లోక్‌సభ) 180 మంది మహిళా సభ్యులు మన రాష్ట్ర శాసన సభలో 97 మంది మహిళా శాసన సభ్యులు ప్రాతినిధ్యం వహిస్తారు. ఈ విధంగా చూస్తే రాజకీయాలలో మహిళల ప్రవేశానికి ఎన్ని అడ్డంకులు వున్నాయో అర్థం చేసుకోవచ్చు.

ఇటువంటి కొన్ని రకాలైన అడ్డంకులు ఎదురైనప్పుడు వర్తమాన మహిళ నిజంగా సాధికారత సాధించగలదా అని మనకు సందేహం కలగవచ్చు. అయితే కొన్ని ఫలితాలు ఆశించినంత వేగంగా సాగక పోవచ్చు. అంత మాత్రాన విచారించనవసరం లేదు. సమైక్యంగా, సమన్వయంగా పట్టుదలతో కృషిచేస్తే ఆధునిక స్త్రీ చరిత్రను తిరగ రాస్తుందనే గురజాడ కన్న కలలు నిజమయ్యే రోజులు మరి ఎంతో దూరంలో లేవు.

- *యం. ప్రదీప్ కుమార్*
*రీసెర్చ్ అసోసియేట్, సి.డబ్ల్యు.యస్, అపార్డ్*

# సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం – అమలు తీరు – ఒక పరిశీలన





**భావి భారత నిర్మాణానికి పునాదులు వేసేబాలలు సమగ్రాభివృద్ధికి చేపట్టిన అతిపెద్ద ఏకైక కార్యక్రమం సమగ్రబాలల అభివృద్ధి సర్వీసుల పథకం (ICDS). గ్రామీణ, గిరిజన, పట్టణ మురికి వాడల్లోని పిల్లల సక్రమ ఎదుగుదల, అభివృద్ధికి వీలుగా తల్లులకు వారి ఇంటి గుమ్మం వద్దనే సేవలందించాలనే ధ్యేయంతో ఈ పథకాన్ని ప్రారంభించారు. ఐసిడిఎస్ పథకం 1975వ సంవత్సరం అక్టోబర్ 2న ఆదిలాబాద్ జిల్లాల్లోని గిరిజన ప్రాంతమైన ఉట్నూర్‌లో, ప్రారంభించబడింది. తెలంగాణలో అత్యధికంగా వెనుకబడిన జిల్లాల్లో ఆదిలాబాద్ ఒకటి. అందువల్ల ఈ ప్రాంతంలో అన్ని రంగాల్లో మరింత వెనుకబడిన స్త్రీల అభివృద్ధికై ఏర్పరచబడిన ICDS అమలు తీరును తెలుసుకోవడమే ఈ వ్యాసం ముఖ్య ఉద్దేశ్యం.**

### ఆదిలాబాద్‌లోని ఐసిడిఎస్ పథకం

**ఆదిలాబాద్ భౌగోళిక పరిస్థితులు :-** ఆదిలాబాద్ సరిహద్దున మహారాష్ట్రలోని యువతేమాలే, చంద్రపూర్ జిల్లాలు ఉత్తరాన కరీంనగర్, నిజామాబాద్, జిల్లాలుఎడమవైపు నాందేడ్ జిల్లాలు ఉన్నాయి.

**సమగ్ర అభివృద్ధి పథకం ఐసిడిఎస్ :-** సమగ్ర శిశు అభివృద్ధి పథకం మొట్టమొదటిగా 1975 సం॥లో ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం, అనంతపూర్, ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్‌లో ప్రారంభమైంది. ఈ పథకం ద్వారా 0-6 మధ్యగల పిల్లలకు అనుబంధ పోషక ఆహారం అందించబడుతుంది. బాల బాలికలకు ప్రాథమిక విద్యతో పాటు, ఆటపాటలతో మానసిక ఎదుగుదలకు తోడ్పడటం, ఆరోగ్యం, టీకాలు, గర్భిణీ స్త్రీలు, బాలింతలకు పోషకాహారం అందజేయడం జరుగుతుంది.

**ఐసిడిఎస్ ఉద్దేశ్యాలు :**

1. 0-6 సం॥ల వయస్సులోపు పిల్లలకు పోషణ మరియు ఆరోగ్య స్థాయి మెరుగు పర్చడం.
2. బిడ్డ మానసికంగా, శారీరకంగా, సామాజికంగా సరియైన రీతిలో పెరగడానికి చక్కటి పునాది వేయటం.
3. చంటి బిడ్డల మరణాలను, అనారోగ్య పరిస్థితులను కుపోషణను, పాఠశాల మానివేతను తగ్గించడం.
4. బిడ్డను ఆరోగ్యంగా పెంచడంలోనూ, పిల్లల పోషక అవసరాలకు అనుగుణంగా సరియైన పోషణను సమకూర్చడంలోనూ, తల్లికి

తగిన శిక్షణను ఇచ్చి తల్లులు తమ బిడ్డలను పెంచే తీరును (పోషణ నైపుణ్యాన్ని) మెరుగు పరచడం.

ఈ పథకాన్ని విజయవంతంగా అమలు పరచడానికి పిల్లల అభివృద్ధికై కృషి చేస్తున్న శాఖలన్నింటిని సమన్వయ పర్చడం.

పై ఉద్దేశ్యాలను నెరవేర్చడానికి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఈ క్రింది సేవలను అందించడం జరుగుతుంది.

1. అనుబంధ పోషకాహారం
2. వ్యాధి నిరోధక టీకాలు
3. ఆరోగ్య పరీక్షలు
4. ప్రాథమిక ఆరోగ్య రక్షణలో సలహా సంప్రదింపులు
5. పోషక ఆరోగ్య శిక్షణ, విద్య
6. పూర్వ ప్రాథమిక విద్యపై సేవలను అందించడం కొరకు ఆదిలాబాద్ జిల్లాలో మొత్తం 15 ప్రాజెక్టుల ఆధ్వర్యంలో 3431 అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయబడ్డాయి. వీటి వివరాలు ఈ క్రింది పట్టికలో పొందు పరచబడ్డాయి.

ఆదిలాబాద్ జిల్లాలో మంజూరు అయిన అంగన్‌వాడీలు 3431 అయితే, వాటిలో 3153 మాత్రమే పనిచేస్తున్నాయి. అదే విధంగా 475 మినీ అంగన్‌వాడీలు మంజూరు కాగా, కేవలం 314 మాత్రమే పనిచేస్తున్నాయి. ఈ అంగన్ వాడీ కేంద్రాల్లో సొంత భవనాలు ఉన్నవి కేవలం 683 మాత్రమే. మిగిలిన వాటిలో 160 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో, ఇతర ప్రభుత్వ కార్యలయ ఆవరణల్లో ఉండగా, 2404 అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె ఇళ్ళలో అరకొర వసతులతో కునారిల్లుతున్నాయి. (సొంత, భవనాల లేమితో పాటు, అంగన్‌వాడీల్లో సేవలందించడానికి ఉద్దేశించిన ఉద్యోగులు కూడా తక్కువగా ఉండడం ఈ పథకం విజయవంతం కాకపోవడానికి మరో ముఖ్య కారణం.

ఆదిలాబాద్‌లోని సమగ్ర శిశు అభివృద్ధి పథకంలోని ఉద్యోగుల వివరాల పట్టిక రెండులో చూపబడింది.

**ఉద్యోగుల వివరాలు**

| క్రమ సంఖ్య | ఉద్యోగులు | మంజూరు అయినవి | నంబర్ ఇన్ పొజిషన్ | ఖాళీల సంఖ్య |
|---|---|---|---|---|
| 1 | సమగ్ర శిశుఅభివృద్ధి అధికారి (CDPO) | 15 | 12 | 03 |
| 2 | సహాయ శిశు అభివృద్ధి అధికారి (ACDPO) | 17 | 02 | 15 |
| 3 | పర్యవేక్షకులు | 148 | 64 | 84 |
| 4 | అంగన్‌వాడీ కార్యకర్తలు | 3431 | 3153 | 243 |
| 5 | అంగన్‌వాడీ ఆయాలు | 3431 | 2918 | 478 |

**సేకరణ : మహిళాభివృద్ధి శిశు సంక్షేమశాఖ, ఆదిలాబాద్**

మంజూరు అయిన పోస్టులలో అత్యధిక సంఖ్యలో పర్యవేక్షకుల నియామకం జరగకపోవడం వల్ల అంగన్ వాడీ కేంద్రాల్లో పర్యవేక్షణలోపించి, అంగన్‌వాడీల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. 243 అంగన్‌వాడీ కేంద్రాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, 478 కేంద్రాల్లో అంగన్‌వాడీ ఆయాలు లేకపోవడం అంగన్ వాడీ కేంద్రాల్లో సక్రమ నిర్వహణలేదని స్పష్టమవుతుంది.

### ఆదిలాబాద్ జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల కార్యక్రమాలు

**పూర్వప్రాథమిక విద్య:-** పిల్లలకు టీచరు పట్ల భయం లేకుండా నమ్మకం కలిస్తూ నేర్చుకునే వాతావరణాన్ని కల్పించడానికి 3-6 సం॥ల పిల్లల మానసిక, శారీరక, సామాజిక అభివృద్ధికై పూర్వ ప్రాథమిక విద్యనందించడం జరుగుతుంది. పూర్వ ప్రాథమిక విద్యకై నమోదు చేసుకున్న పిల్లల సంఖ్యకు హాజరవుతున్న పిల్లల సంఖ్యకు ఎక్కడా పొంతన కుదరక పోవడమే కనిపిస్తుంది. దానికి ప్రభుత్వ విద్యావిధానం ఒక కారణమైతే, ఐసిడిఎస్‌లో ఉన్న మానవ వనరుల నిర్వహణ సక్రమంగా లేకపోవడం పెద్దలోపం.

### పోషణ, మరియు ఆరోగ్య విద్య

ప్రతి అంగన్ వాడీ కేంద్రం నందు ఆ కేంద్రం పరిధిలోని పిల్లలందరికీ వ్యాధి నిరోధక టీకాలు వేయించడం, పోషకాహారాన్ని అందించడం, గర్భిణీ స్త్రీలకు పరీక్షలు జరిపించడం, పెరుగుదలను పర్యవేక్షించడం, పోషణ, ఆరోగ్య విద్య, గర్భిణీ స్త్రీలకు బాలింతలకు, కిశోర బాలికలకు అందించేలా చూడటం.

### కిశోర బాలికల కార్యక్రమాల (యుక్త వయస్సు బాలికలు)

కుటుంబంలోపల, బయట బాలికల పట్ల కొనసాగుతున్న వివక్షను రూపుమాపేందుకు వారి హక్కుల పరిరక్షణకు కావలసిన చర్యలు తీసుకోవడం అవసరం. అందువల్ల యుక్త వయస్సు బాలికలకు ఆరోగ్య విషయంలో వారి పెరుగుదల అలవాట్లు, వ్యక్తిగత పరిశుభ్రతలమీద వారికి పోషణ, ఆరోగ్య విద్య తరగతులు నిర్వహించడం జరుగుతుంది. యుక్త వయస్సున్న బాలికలు కాబోయే తల్లులు కాబట్టి వారికి పోషణ, అభివృద్ధి జరిగేలా (నేషనల్ ప్రోగ్రాం ఫర్ అడోలెసెంట్) NPAG పథకం ద్వారా కిశోర బాలికలకు 2002 -2003 నుండి 35 కేజీలు బరువుకన్న తక్కువ ఉన్న యుక్త వయస్సు బాలికలకు నెలకు 6 కేజీలు చొప్పున బియ్యం పంపిణీ చేయడం జరుగుతుంది. NPAG పథకం కింద 2,86,713 యుక్త వయస్సు బాలికలు లబ్ధి పొందుతున్నారు. యుక్త వయస్సు బాలికలకు వృత్తి నైపుణ్యాల మీద 2007 నుంచి శిక్షణ తరగతులు నిర్వహించటం జరుగుతుంది. 1519 కిశోర బాలికలకు టైలరింగ్, బ్యూటీషియన్, కంప్యూటర్ అప్లికేషన్, శారీ రోలింగ్, మగ్గం వర్క్, శానిటరీ, నాప్‌కిన్స్, తయారు చేయడం వంటి వాటిలో

వృత్తిపరమైన శిక్షణ ఇవ్వడం జరుగుతుంది.

స్త్రీలకు సంబంధించి సాంఘిక సమస్యలైన వరకట్న నిషేదచట్టం అత్యాచారాలను సిటీ పరిశీలించడం కొరకు ఆదిలాబాద్ జిల్లాలో అంటే ట్రాఫికింగ్ కమిటీలు ఏర్పాటయ్యాయి. ఈ కమిటీల ద్వారా ప్రతి 3 నెలలకొకసారి సమావేశాలు నిర్వహించబడుతాయి. 2003-04 నుండి 15 మంది బాధిత స్త్రీలు, మైనర్ బాలికలకు అత్యాచారాలకు సరైన వారికి రూ॥4,40,000/- నిధులు మంజూరు చేయడం జరిగింది. ఇవే కాక బాల్యవివాహాలను రూపుమాపేలా ప్రయత్నించడం గృహహింస రక్షణ చట్టం (2005) ప్రకారం హింసకు గురయిన బాధితుల పక్షాన నిలబడి వారిచేత కేసు నమోదు చేయించడం కూడా వీరి విధుల్లోని భాగమే. ఇవేకాక స్త్రీల కుటుంబ సమస్యలనేకం. వీరు వీలైనంతగా పరిష్కరించే ప్రయత్నం చేస్తారు.

ప్రైవాటితో పాటు ఆదిలాబాద్ జిల్లాలో అనాధ శిశువులకై 2005 సం॥లో శిశు గృహం ఏర్పాటు చేయడం జరిగింది. దీనిలో ఇప్పటి వరకు 38 మంది పిల్లలను చేర్పించారు. ఇందులో 24 మంది బాలికలు, 14 మంది మగ పిల్లలున్నారు. వారిలో దత్తత ఇచ్చిన వారి సంఖ్య 25 మంది. ప్రత్యేకించి ఆడపిల్లలను పెంచడం, కోసం నాలుగు బాల సదన్‌లు ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, ఆసిఫాబాద్‌లలో ఏర్పాటయ్యాయి. మొత్తం 60 మంది పిల్లలను దీనిలో చేర్చడం జరిగింది. ఈ సదనాల్లో 1 వ తరగతి నుండి 10వ తరగతి వరకు ఉచిత విద్య అందించబడుతుంది. శిశు విక్రయాలను అపడంతో పాటు బాలకార్మిక నిర్మూలన కూడ వీరి విధుల్లో భాగమే.

## అంగన్ వాడీలు సమస్యలు

మహిళను, శిశువులను, శారీరకంగా మానసికంగా, సంరక్షించే బాధ్యతలను చేపడుతున్న అంగన్‌వాడీలు అనేక సమస్యలతో సతమతమవుతున్నాయనడం నిస్సందేహం. అంగన్‌వాడీ కార్యకర్తలు స్త్రీ, శిశు, బాలికా సంరక్షణలో భాగంగా పూర్వ ప్రాథమిక విద్యతో పాటు, గృహ సందర్శన, రికార్డులను రాయడం లాంటి విధులతో పాటు, ఆయా ప్రభుత్వ శాఖల పనులు అదనంగా వీరికి అప్పగించడం జరుగుతుంది. ఈ అదనపు పనికి అదనపు రెమ్యూనరేషన్ లేకపోగా, ఈ పనులు చేస్తున్నంత కాలం పూర్వ ప్రాథమిక విద్యతో పాటు రోజు వారీ చేసే ఇతర పనులు కూడా కుంటుపడడం జరుగుతుంది. ఈ విధమైన పనులు అంగన్‌వాడీ కార్యకర్తలకు మరింత భారంగా మారుతున్నాయి.

## అంగన్ వాడీల డిమాండ్‌లు

ఆకాశంలో సగభాగమైన స్త్రీలు భావిభారత పౌరులైన పిల్లల భాధ్యతలను చేపట్టిన అంగన్‌వాడీల సమస్యలు మూడున్నర దశాబ్దాలుగా పరిష్కారానికి నోచుకోవడంలేదు. ఎదుగూ బొదుగూ లేని జీతం, సకాలంలో అందీ అందని వేతనాలతో సతమతమవుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 70 వేల మంది ఉండగా, ఆదిలాబాద్ జిల్లాలో 6071 మంది ఉన్నారు. వీరిలో అంగన్‌వాడీ వర్కర్లకు రూ॥ 2200/- హెల్పర్లకు రూ 1250/- వేతనాలు మాత్రమే చెల్లిస్తున్నారు. నిత్యావసర ధరలు నింగినంటిన ఈ రోజుల్లో కనీస వేతనాల చట్టానికి బహుదూరంగా వేతనాలు పొందుతూ, సమస్యలతో సహజీవనం కొనసాగిస్తున్నారు. ఐసిడిఎస్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం జీతాల్లో 75% భరిస్తుండగా, కేవలం 25% మాత్రమే రాష్ట్రప్రభుత్వం ఇస్తున్నది. అంగన్‌వాడీ కార్యకర్తలకు కాన్ని హెల్పర్లకు కాని రిటైర్‌మెంట్ లేదు. అందువల్ల 70-80 ఏళ్ళ వయసున్న వారు కూడా చేతనయినంతవరకు పనిచేయాలనే ఉద్దేశంతో వయస్సు మీద పడడంతో నామమాత్రంగా పనిచేస్తున్నారు. ఫలితంగా అంగన్‌వాడీ కేంద్రాలు మూతపడి వుండటం సర్వసాధారణ మవుతుంది. పక్క రాష్ట్రమైన తమిళనాడుతో పాటు, గోవాలో అంగన్‌వాడీ ఉద్యోగులందరికీ ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణిస్తూ పేస్కేలు వర్తింపజేస్తున్నారు. అదే విధంగా పించన్ సౌకర్యం కల్పించారు. ఇదే విధానాన్ని రాష్ట్రంలో వర్తింపచేయాలని అంగన్‌వాడీలంతా డిమాండ్ చేస్తున్నారు.

## వారి ప్రధాన డిమాండ్లు

1. అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్ల అందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి.
2. పదేళ్ళ సర్వీసు పూర్తిచేసిన వారికి ఐసిడిఎస్‌లో పర్యవేక్షకులుగా పదోన్నతి కల్పించాలి. సర్వీసులను క్రమబద్ధీకరించాలి.
3. అంగన్ వాడీ కార్యకర్తలకు రూ॥ 5500/-, హెల్పర్లకు రూ॥ 2750/- కనీస వేతనంగా చెల్లించాలి.
4. పదవీ విరమణ పొందిన కార్యకర్తలకు రూ॥ లక్ష, హెల్పర్లకు రూ॥ 50,000/- నగదు చెల్లించాలి.
5. సెకండరీ గ్రేడ్, సూపర్ వైజర్ పోస్టులను సృష్టించాలి.

ఉద్యోగులకు కావలసిన సరిఅయిన వసతులను కల్పించి, వారి ఉద్యోగ పరిస్థితులు సరిదిద్దినపుడు మాత్రమే ఐసిడిఎస్ పని తీరు మెరుగు పరచడం సాధ్యమవుతుంది. వారి డిమాండ్‌లను పరిశీలించి, వాటిలో న్యాయపరమైనవివాటిని గుర్తించి నెరవేర్చడం అత్యంత అవసరం. అప్పుడే పిల్లలకు ఆరోగ్య వంతమైన ఉజ్వల భవిష్యత్తును అందించే అవకాశముంటుంది.

**- డా॥ టి.వి. సుజాతా కుమారి...**
అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ పాలనాశాస్త్రం
ఆర్ట్స్ & సైన్స్ కళాశాల, సుబేదారి, వరంగల్

"ప్రకృతి ప్రసాదించిన సహజవనరులు, మానవోపయోగానికి అనువుగా వాడుకోవటంలో నిర్లక్ష్యం, ఉదాసీనత పెరిగితే ఆ దోషం ప్రకృతిది కాదు. ఆ దోషం మానవులదే"

– సర్ ఆర్థర్ కాటన్

# నీరు-నీరు-నీరు

**నీరే ప్రాణాధారం - నీరు సర్వాంతర్యామి - మనిషి శరీరంలో 65 శాతం నీరు - మనిషి జీవితకాలంలో 60,600 లీటర్ల నీరు తాగుతాడు. జంతువుల్లో ఏనుగు శరీరంలో 70 శాతం నీరు, ఆలుగడ్డలో 80 శాతం నీరు టొమోటోలో 95శాతం నీరు.**

పంచభూతాలు భూమి, నీరు, గాలి, అగ్ని, ఆకాశంలో నీరు రెండో స్థానంలో వుంది. ప్రకృతి ప్రసాదించిన అపారమైన సంపద నీరు. అపారంగా వున్నదని సంపదను ఇష్టం వచ్చినట్లు వినియోగించినప్పుడు సంపద తరుగుతుంది. మానవుల అత్యాశ దురాశ కారణంగా నిత్యహరిత వనాలు బీళ్ళుగా మారాయి. నేలలోని నీటికి, లోనున్న నీటికే ఆధారం వాన నీరు. రెండు, మూడు దశాబ్దాల క్రితం దాక ఎక్కడ తవ్వినా 4,5 మీటర్ల లోతులో నీరుండేది. 1960-65 ప్రాంతంలో దొంగలచెరువు దొంగలచెరువుగా వున్నపుడు, కడపబావుల్లో నీరు సమృద్ధిగా వుండేది.

వ్యవసాయానికి ఉపయోగపడే నీరు సమృద్ధిగా వుండేది. నీటికొరత ఏర్పడినపుడు అంతర్జల వినియోగానికి కృషి ప్రారంభవుతుంది. అమెరికా, థాయ్‌లాండ్, ఇంగ్లండ్ మొదలగు దేశాల్లో భూగర్భజలాల ను వినియోగించేందుకు ఆ ప్రభుత్వాలు చట్టాలు చేశాయి. ఫ్రాన్స్‌లో గంటకు 8 ఘనపుటడుగులకు మించి వినియోగించే వీల ులేదు. బెల్జియంలో రోజుకు 96 ఘనమీటర్లకు మించి నీటిని వాడుకొనే వీలులేదు. రష్యాలో తాగటానికి మాత్రమే భూగర్భజాలాలు వినియోగించాలన్న నిబంధన వుంది. గుజరాత్, మహరాష్ట్ర, మధ్యప్రదేశ్‌ల్లో భూగర్భజలాల వినియోగానికి కచ్చితమైన చట్టాలున్నాయి. రెండు బోర్ బావుల మధ్య కనీసం 250 మీటర్ల ఎడం వుండాలన్న నియమం ఉంది. భూగర్భ జలాల అభివృద్ధి కోసం ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారు. భూగర్భజలాల కాలుష్యం ఈనాడు ప్రపంచదేశాలను పీడిస్తూ వుంది. అమెరికా, కెనడా, జపాన్ వంటి అభివృద్ధి చెందిన దేశాలు కూడా అంతర్జల కాలుష్య సమస్యను ఎదుర్కొంటున్నాయి. పరిశ్రమలు, పట్టణాలు, వ్యవసాయంలో వినియోగించే రసాయనాల వల్ల వచ్చే కలుషిత పదార్థాల వల్ల నీరు కలుషితమవుతూవుంది.

1981 నాటి గణాంక వివరాల ప్రకారం, మనదేశంలో రోజుకు 74529 మిలియన్ లీటర్ల మురుగునీరు ఉత్పత్తి అవుతుంది. ఒక ఢిల్లీ నగరమే రోజూ 100 మిలియన్ లీటర్ల మురుగునీటిని యమునా నదిలోకి ప్రవహింపచేస్తున్నది.

2000 సంవత్సరంలో మన దేశంలో 1,10,000 మిలియన్ మురుగునీటిని ఉత్పత్తి చేయనున్నట్లు శాస్త్రవేత్తల నివేదిక. ఇప్పుడు మన దేశంలోని నదులు 70 శాతం కాలుష్యంతో వున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని నల్గొండ, రంగారెడ్డి జిల్లాలోని భూగర్భ జలాల్లో ఫ్లోరైడ్ శాతం ఎక్కువగా వుంది. మనదేశంలో 5 మిలియన్ల జనాభా ఫ్లోరైడ్ నీటిని తాగుతూ, ఫ్లోరోసిస్ వ్యాధికి గురి అయ్యారు. కలుషితమైన నీటిని వాడటం వల్ల స్థానిక ప్రజల ఆరోగ్యం ఎలా దెబ్బ తింటుందో, వైద్యానికి ఎంత ఖర్చు అవుతుందో ప్రజలకు తెలియజేయాలి.

### ఇంక మంచినీటికి కటకట

మన భూభాగం 71 శాతం వుంది. పెరుగుతున్న జనాభా, పట్టణాల్లో కేంద్రీకృతమవుతున్న ప్రజల సంఖ్య వల్ల మంచినీటి కొరత మరింత జటిలం అవుతుంది. 1950 లో మనదేశంలో 10 లక్షల జనాభా దాటిన పట్టణాలు 100 వుండేవి. 2025 నాటికి 10 లక్షల జనాభా దాటిన పట్టణాలు 650 అవుతాయి. నీరు వృథా కావటం ప్రధాన సమస్య. గృహారంగంలో 16 నుండి 24 శాతం వృథా అవుతుంది.

వరల్డ్ వాచ్ ఇన్‌స్టిట్యూట్ సర్వే అంచనా ప్రకారం, 50 శాతం ఇరిగేషన్ నీరు వృథా అవుతుంది. ఒక బొట్టు నీరు సెకెండుకు కారుతూ వుంటే రోజుకు 15 లీటర్ల నీరు వృథా అవుతుందని, సంవత్సరానికి 5320 లీటర్లు నీరు ఒక బొట్టు రూపంలో వృథా అవుతుందని తెలుస్తుంది. నదులు నీటి వనరుల కాలుష్యం వల్ల, అతిసారం, ఉదరసంబంధ వ్యాధులు, హెపటైటిస్ వంటి వ్యాధులు వస్తున్నాయి.

ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం 21.5 అంటురోగాలలో 11.5 శాతం జలకాలుష్యం వల్ల వస్తుంది. ఇళ్ళలో నీటి దుర్వినియోగం అరికట్టాలి. నీటిని పొదుపుగా వాడే విధానాలు ప్రజలకు తెలపాలి. నీటిని శుద్ధి చేయడం ఖర్చుతో కూడిన పని.

నీటికి- నాగరికతకు అన్యోన్య సంబంధం వుంది. భారతదేశ పర్యావరణ పరిస్థితులపై అధ్యయనం చేసిన అమెరికన్ శాస్త్రవేత్త ఇలా అన్నారు అభివృద్ధి చెందిన దేశాల్లో అతి త్వరగా పెరుగుతున్న పరిశ్రమల వల్ల పరిసరాలు, నీరు, గాలి, నేల, ప్రాణాంతక స్థితికి దరిదాపున ఉన్నాయి.

ఈ రంగంలో 14 ఏళ్ళపైగా పరిశోధన సాగించిన డేవిడ్ నెల్సన్, భారతదేశాన్ని రెండు మార్లు దర్శించి, మనదేశంలో భూగర్భ జలకాలుష్యం, విషపదార్థాలను నదులలో వదలటం, వ్యర్థపదార్థాల నిర్వహణ పథకాలు ప్రపంచదేశాలన్నిటి కంటే అత్యంత హీనంగా వున్నాయన్నారు. జీవనాధారమై జలసంపద కోసం యుద్ధాలు సంభవించే ప్రమాదం వుందటున్నాడు డేవిడ్ నెల్సన్.

గ్రామ ప్రాంతాల్లో ఇంకా మూఢనమ్మకాలు అజ్ఞానం కులతత్వం-సాంఘిక దురాచారాలు ఉన్నాయి. పాతతరం నాయకత్వం-యువతరాన్ని ఎదగనివ్వటం లేదు. అభివృద్ధి నిరోధక రాజకీయ భావాలుగల వారు గ్రామప్రాంతాల అభివృద్ధికి అవరోధాలు కల్గిస్తున్నారు. గ్రామీణ యువతీయువకుల శక్తిని నిర్మాణాత్మక కార్యక్రమాలకు మళ్ళించాలి. స్వచ్ఛందకృషి పట్ల వారిలో ప్రేరణ కల్గించాలి.

పర్యావరణం పరిరక్షణ ప్రభుత్వం మాత్రమే చేయజాలదు. స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వం సమష్టిగా కృషి చేయాలి. వివిధ రూపాల్లో జరుగుతున్న కాలుష్యనివారణకు సమిష్టి కృషి అత్యవసరం.

– జానమద్ది హనుమచ్ఛాస్త్రి

**తగినంత ఆహారం లేకపోయినా మనిషి నెలరోజుల వరకు జీవించగలడు కాని నీరు లేకుండా మనిషి మూడురోజుల కన్నా ఎక్కువ బతకలేడు. పెద్దవారిని ఆరోగ్యంగా ఉంచడానికి నీరు 50 నుండి 70 శాతం ప్రధాన పాత్రవహిస్తుందని వైద్య పరిశోధకులు చెబుతున్నారు.**

**మనిషి మానసిక వికాసానికి, ఆలోచనా శక్తికి కేంద్రమైన మెదడు పనితీరు సేవించే నీటిపై ఆధారపడి ఉంటుంది. తాగేనీరు తేడా వస్తే మనిషి అనారోగ్యం పాలవడం మనందరికీ తెలిసిన విషయమే.**

రక్తపోటు స్థిరంగా ఉంచడంలో, గుండె ఆరోగ్యంగా పనిచేయడంలో, శరీరంలోని వ్యర్థాలను విసర్జనావయవాల ద్వారా బహిష్కరించడం. కీళ్లను వదులుగా ఉంచడం, జీర్ణక్రియ సక్రమంగా జరగడంలో నీటి పాత్ర చాలా ప్రధానమైంది.

## నీటితో లాభాలు

జీవనాధారమైన నీరు మనిషికి అందాన్ని, ఆరోగ్యాన్ని ప్రసాదిస్తుంది. శుభ్రమైన మంచినీటితో స్నానం చేయడం వల్ల చర్మం ఆరోగ్యంగా, అందంగా కన్పిస్తుంది. చర్మంపై మచ్చలు వంటివి, పుళ్లువంటివి ఈ రకమైన మంచినీటి స్నానంవల్ల అదృశ్యం అయిపోతాయి. అపరిశుభ్రమైన నీటితో ఎన్నెన్నో వ్యాధులు వ్యాప్తిచెందుతాయి.

ఆటగాళ్లు శ్రమించడం వల్ల శరీరాల్లోని నీటిస్థాయి తగ్గ ముఖంపట్టి డీహైడ్రేషన్ వల్ల తీవ్రమైన అలసటకు గురై వేడివల్ల సొమ్మసిల్లి పోతారన్న వాదనను ఈ పరిశోధకులు అంగీకరించడం లేదు. శరీరంలోని నీటి స్థాయి తగ్గిపోవడంవల్ల వారు కళ్లు తిరిగిపడిపోరని, తీవ్రంగా శ్రమించడం వల్ల క్రీడాకారుల శరీరంలోని రక్తమంతా వారి కాళ్లల్లోకి, పాదాల్లోకి చేరిపోవడం వల్ల... రక్తపోటు బాగా తగ్గి సొమ్మసిల్లి పోతారని ఈ పరిశోధకులు వివరణ ఇస్తున్నారు. ఇదొక తాజా పరిశోధనాంశం కాబట్టి ప్రస్తావించవలసివచ్చింది.

### *రోజుకి ఎన్ని నీళ్లు తాగాలి?*

ఆరోగ్యమైన మనిషి సగటున రోజుకి రెండు లీటర్ల నీటిని తాగాలి. శారీరక శ్రమ చేసేవారు, చెమట ఎక్కువ పట్టేవారు మరికొంత అధికంగా నీరు తీసుకోవాలి. పాలుతాగే శిశువులకు కూడా అప్పుడప్పుడు రెండు మూడు చెమ్చాల నీళ్లు పట్టించడం మంచిది.

ప్రతివ్యక్తి తనకు సరిపడినన్ని నీళ్లు సేవిస్తున్నది లేనిది తెలుసుకోవడం ఎలా? మనిషి విసర్జించే మూత్రం పసుపురంగులో ఉందంటే అతడు తగినన్ని నీళ్లు త్రాగడం లేదని తెలుసుకోవాలి. మనిషి అతిగా మంచినీళ్లు తాగితే అవాంఛనీయ పరిస్థితులు ఎదురుకోవడమేగాక, చివరకు మరణం కూడా సంభవిస్తుంది.

# జీవశక్తికి మూలాధారమైన నీరు

క్రీడాకారులు ఆటలాడే సమయంలో మంచినీటిని ముఖంపైన, మెడపైన చల్లుకుంటూ ఉంటారు. దీనివలన వారిలో మళ్లీ శక్తి పుంజుకుంటుంది. మన శరీర బరువులో 60 శాతం బరువు నీటిదే. మనం తీసుకునే ఆహారం శక్తిగా మారడంలో, శరీర కణజాలం వృద్ధిచెందడంలో నీరు ముఖ్యభూమికను నిర్వహిస్తుంది.

### *క్రీడాకారుల విషయంలో...*

క్రీడాకారులు, శారీరక ధృఢత్వం కోసం వ్యాయామాలు చేసేవారు. బాగా నీరు తాగాలి. కడుపునిండా నీళ్లు తాగాలి. వీరు దాహం వేసేవరకు ఆగకూడదు:. లేకపోతే వారికి తెలియకుండానే శరీరంలోని నీరు హరించుకు పోయే ప్రమాదం ఉంటుంది. ఆరారా నీరు తాగడం వల్ల అలసట తీరుతుంది.

క్రీడాకారుల విషయంలో ఎక్కువ నీరు తాగడం మంచిదికాదని అమెరికన్ పరిశోధకులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఎక్కువ నీరు తాగితే శరీరంలో హఠాత్తుగా ప్రతిష్ఠంభన ఏర్పడే ప్రమాదం ఉంటుదంటున్నారు. ఒక్కొక్కసారి ప్రాణహానికి కూడా దారితీయ వచ్చునని చెబుతున్నారు. మాటిమాటికి నీరుతాగడం కన్నా దాహం వేసినపుడు నీరు తాగడం మంచిదని వారికి సలహా ఇస్తున్నారు.

సుదూరాలు పరుగులు తీసే క్రీడాకారులు మధ్యమధ్యలో చిన్న విరామాలు తీసుకుంటూ, నీళ్లు తాగడం వల్ల వారి శరీరంలోని రక్తం పలుచబడుతుంది. అందులోని సోడియం తగ్గుముఖం పట్టి 'హైపో నెట్రెమియా' అనే హానికరమైన స్థితి వస్తుందని మరికొంతమంది వైద్యపరిశోధకులు భావిస్తున్నారు.

ప్రాంతాన్ని బట్టి మనిషి తాగాల్సిన నీటి పరిమాణం మారుతూ ఉంటుంది. ఉష్ణ ప్రదేశాల్లో నివసించేవారు ఎక్కువ నీరు తాగాలి. ఈ ప్రాంతంలో మనిషి కొన్ని లీటర్ల నీటిని చెమట రూపంలో విసర్జిస్తాడు. శరీరం మీద చన్నీళ్లు పోస్తే చెమట గ్రంథులు మూసుకుపోతాయి. వేడినీళ్లు పోస్తే చెమట గ్రంథులు బాగా విచ్చుకుంటాయి. నీరు చెమట రూపంలో బాగా విసర్జితమవుతుంది.

### *తాగే నీళ్ళు*

తాగేనీళ్ళంటే కేవలం మంచి నీళ్ళు మాత్రమే కాదు. మనిషి ఆరోగ్యానికి లాభం చేకూర్చే కొన్ని కరిగిన పదార్థాలు అందులో ఉండాలి. నీళ్లు మంచిగా నిరపాయకరంగా ఉంటే సరిపోదు. అందులో మనిషి ఆరోగ్యానికి లాభం చేకూర్చగల పదార్థాలు లేకపోతే వాటిని కలపాలి.

నీటి పిహెచ్ విలువ 7.0 నుండి 8.5 వరకు ఉంటే ఆమోదయోగ్యమే. కాని 6.5 కంటే తక్కువ వున్నా లేదా 9.2 కంటే ఎక్కువవున్నా ఆ నీటి తాగునీటిగా అంగీకరించడానికి వీలులేదు.

నీటిలో అధికంగా ఘనపదార్థాలు ఉంటే, ఆ నీటిని వాడే ప్రజల ఆరోగ్యం అనేకరకాలయిన ప్రమాదాలకు గురవుతుంది. నీటిలో ఎక్కువ అవక్షేపం ఉండే పదార్థాలు ఉంటే, ఆ నీటిని నాణ్యత లోపించిన పదార్థంగా పరగణిస్తారు. బాగా హెచ్చు స్థాయిలో ఖనిజ లవణాలు కరిగివున్న నీరు పారిశ్రామిక అవసరాలకు కూడా పనికిరాదు.

### *ఫ్లోరోసిస్*

నీటిలో రకరకాల వ్యర్థ పదార్థాలు చేరి కలుషితమైన కారణంగా దాదాపు సాలీనా 44 మిలియన్ల ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు.

నీటి ద్వారా కలిగే వ్యాధులలో ఫ్లోరోసిస్ ముఖ్యమైనది. మన దేశంలో 13 రాష్ట్రాలలో అధిక ఫ్లోరైడ్ కారణంగా వేల సంఖ్యలో పిల్లలు, పెద్దలు దంతాలకు, ఎముకలకు ఫ్లోరోసిస్ సోకి బాధ పడుతున్నారు.

ఒక లీటరు నీటికి 0.5 నుండి 0.8 మి.గ్రా, ఫ్లోరైడ్ ఉంటే ఫరవాలేదు. అంతకుమించితే ప్రమాదం. అలాగే తాగే నీటిలో నైట్రేటు ఎక్కువయితే పిల్లల్లో 'బ్లూబేబీ సింద్రోమ్' వస్తుంది.

దంత సౌభాగ్యం కోసం ఫ్లోరైడుల ఆవశ్యకత గురించి టూత్ పేస్టు కంపెనీలు కావలసినంత ప్రచారం చేస్తున్నాయి. టూత్ పేస్టులో ఫ్లోరైడ్ ఉండడం వల్ల దంతాలకు బలాన్ని చేకూర్చడంలో ప్రత్యక్షమైన పాత్ర ఏమైనా ఉందా? అనే విషయం ప్రశ్నార్థకమే! పరోక్షంగా దంతాలను శుభ్రపరచి దంతక్షయం కాకుండా కాపాడుతాయి.

నీటిలో ఫ్లోరైడ్ల వునికి పిల్లల దంతక్షయాన్ని తగ్గించడంలో ఉపయోగపడుతుంది. ఎక్కువ అయితే ఫ్లోరోసిస్‌కు దారితీస్తుంది. అందుకే ఎంత హద్దుమేర ఇది ఉంటే నిరపాయకరమో ప్రకటించ వలసి వచ్చింది.

## విషపదార్థాల ఉనికి

మన శరీరం కణాల్లో స్వల్పమోతాదుల్లో ఆర్సెనిక్ ఉంటుంది. దీని మోతాదు ఎక్కువయితే అది విష ప్రభావం చూపుతుంది. చాలా కాలం ఈ విషం ప్రభావం బహిర్గతం కాదు. కాలిమీద, చేతుల మీద గడ్డల ఏర్పడడం, కొన్ని సందర్భాలలో క్యాన్సర్ రోగంలోకి దారితీయడం జరుగుతుంది. అందుకే నీటిలో అర్సెనిక్ ఉనికి అసలు అంగీకరించడానికి ఇష్టం చూపరు.

క్రోమియం కూడా మనిషిపై విష ప్రభావం చూపుతుంది. అందుకే అది కూడా లేకుండా తాగునీటిని ఉత్పత్తి చేయమంటున్నారు. అదే విధంగా మరోవిషం 'సైనైడ్'. సుదీర్ఘకాలం సీసం కలసిన నీళ్ళు తాగితే సీసం విషానికి మనిషి ప్రభావితం కావడం జరుగుతుంది. చరిత్రలో సీసం విషానికి ప్రభావితం అయిన వారి గురించి నమోదు అయ్యింది. అందుకే నీటిలో దీని ఉనికి కూడా ఉండకూడదని అంటున్నారు.

ఆర్సెనిక్ విషం మాదిరి సెలినియం విషం కూడా పనిచేస్తుంది. దీని ప్రభావం జంతువుల మీద ఎక్కువగా ఉంటుంది. మనిషికి కూడా ఇది అపకారం చేస్తుందంటారు. కాని తగినన్ని సాక్ష్యాధారాలు లేవు. రేడియో ధార్మిక పదార్థాల ఉనికి నీటిలో నిషేధం.

పై పదార్థాలన్నీ అవధుల్లోపల నీటిలో కరిగి ఉండవచ్చునని ప్రకటించడంతో నీటి నాణ్యత నిర్ణయించగలిగారు. ఇంకా నీటిలో కరిగి ఉండే అనేక ఇతర రసాయన పదార్థాల హద్దులు నిర్ణయించాల్సి ఉంది.

## కలుషిత జలాలు - ప్రమాదాలు

తాగు నీటిలో కలుషితాలు జేరడంవల్ల ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా అనేక పల్లె ప్రాంతాల్లో రక్షిత నీటి సరఫరా లేకపోవడం వల్ల ప్రజలు తాగే నీటివల్ల కలరా, టైఫాయిడ్, పచ్చకామెర్లు, గాస్ట్రో ఎంటెరిటిస్, వాంతులు, విరోచనాలు వంటి వ్యాధులకు బలైపోతున్నారు.

పసిపిల్లలకు ఈ వాంతులు, విరోచనాలు ఎంతో హానిచేస్తున్నాయి. కోట్లాది ప్రజలు కలుషిత జలం తాగడంవల్ల జిగట విరోచనాలు, నీళ్ల విరోచనాలు కలిగించే అమిబియాసిస్ రోగంతోను, కొంకిపురుగు, నులి పురుగుల వల్ల వచ్చే అనారోగ్యాలతో అవస్థపడుతున్నారు.

మన రక్షిత నీటి నాణ్యత లక్ష్యాల మేరకు లేదని ఎంచుకున్న 958 నమూనాల్లో 207 నమూనాల నీటిలో రోగ కారకాలు వున్నట్లు గతంలో హైదరాబాద్‌లో కనుగొన్నారు.

## తాగేనీరు - పరిమితులు

తాగే నీటిలో ఉండే పదార్థాలకు శాస్త్రవేత్తలు పరిమితులు నిర్ణయించారు. తాగే నీటిలో మెగ్నీషియం అధికంగా ఉంటే ఆ నీటిని తాగేవారికి అది విరోచనకారిగా ఉంటుంది. అందుకే నీటిలో మెగ్నీషియం ఉనికి పరిమితి నిర్ణయించారు. తాగునీటిలో రాగిపాత్ర ఏమిటో స్పష్టంగా తెలియదు. కాని నీటిలో రాగి అధికంగా ఉంటే ఆ నీటికి లోహపు రుచి వస్తుంది. అటువంటి నీరు తాగితే శరీరం లోపలి పేగులకు గాయాలు అవుతాయి. అందుకే నీటిలో రాగి ఉనికికి గరిష్ట పరిమితి నిర్ణయించారు.

నీటిలో జింక్ ఉంటే ఆ నీటికి ఆమోదించలేని రుచి వస్తుంది. ఇటువంటి స్థితి ఉత్పన్నం కాకుండా ఉండేందుకు నీటిలో జింక్ ఎంతవరకు ఉంచవచ్చునో నిర్ణయించారు. తాగేనీరు ప్రజలకు సరఫరా చేసేటప్పుడు ఇటువంటి అంశాలన్నీ పరిగణలోకి తీసుకుంటారు.

## మితిమీరి నీరుతాగితే.....?

మితిమిరి నీటిని తాగితే మూత్ర పిండాలు ఈ నీటిని విసర్జించే పనిని సులువుగా నిర్వహించలేవు. ఎందుకంటే నీరుడు తయారు చేసేవాటి సామర్ధ్యం పరిమితిగా ఉంటుంది. నీటితో రక్తం బాగా విలీనం కావడంవల్ల రక్తంలోని సోడియం గాఢత బాగా తగ్గిపోతుంది. నీటిని పీల్చుకునే అనేక కణజాలాలు బాగా ఉబ్బుతాయి. దానితో మనిషికి మత్తు వస్తుంది. మత్తుతో పాటు మనిషికి తలనొప్పి, గాబరా, శక్తిహీనత, నడువలేని దుస్థితి కలుగుతాయి. ఇంకా అధికంగా నీరు తాగితే శరీరం వణకడం, వంకర్లు పోవడం జరిగి, కోమాలోకి వెడతాడు, చివరకు మరణం కూడా సంభవించవచ్చు.

## మనం తాగిన నీళ్లు ఏమవుతాయి?

మనకు దాహం వేసినప్పుడు నీళ్ళు తాగుతాం, నీళ్ళు తాగగానే శరీరం లోని అన్నవాహిక నీటిని సులువుగా పీల్చుకుంటుంది. జీర్ణాశయానికి ఉండే పలుచనిపొర నీరు జీర్ణాశయంలోకి సులువుగా వెళ్లకుండా అడ్డుకుంటుంది. చిన్న పేవుల్లో భాగమయిన డుమోడినమ్‌లోకి పోయిన నీటిని చిన్నపేవులు చురుగ్గా పీల్చుకుంటాయి. మిగిలిన నీటిని పెద్ద పేవు పీల్చుకుంటుంది.

అన్నవాహిక పీల్చుకున్న నీరు నిముషాల్లో రక్తంలో చేరుతుంది. ఫలితంగా రక్తం పలుచబడుతుంది. దాని ఘనపరిమాణం పెరుగుతుంది. రక్త పీడనంలో మార్పువస్తుంది. ఈ విలీన రక్తం మెదడులోని శరీర జల తుల్యతను అదుపుచేసే భాగం పనికి అడ్డుతగులుతుంది.

మెదడు సమీపంలోగల హైపోథాల్మస్‌లోని అస్మోరెసిప్టర్లు చురుకుదనానికి వస్తాయి. ఇవి 'పిట్యూటరీ గ్రంథి' విడుదల చేసే 'యాంటీ డై యురేటిక్' హార్మోన్ విడుదల చేయకుండాగాని, తక్కువ విడుదల అయ్యేటట్లు గాని చేస్తాయి. అసలు ఈ హార్మోన్ మూత్ర పిండాలు నీరు గ్రహించే ప్రక్రియను ప్రోత్సహిస్తుంది. అందుకే తక్కువ పరిమాణంలో నీరుడు ఏర్పడుతుంది. ఈ హార్మోను విడుదల తగ్గిపోవడంతో హెచ్చుగా నీరుడు ఉత్పత్తి కాబడి విసర్జింపబడుతుంది.

*- సి.వి సర్వేశ్వర శర్మ*

Printed & Published by: K. Chandra Mouli, Commissioner, on behalf of Andhra Pradesh Academy of Rural Development, Printed at Caxton Offset Pvt. Ltd., 11-5-416/3, Red Hills, Hyderabad-4. A.P. Published at Andhra Pradesh Academy of Rural Development, Rajendranagar, Hyderabad-30, Rangareddi. **Editor : K. Chandra Mouli**




ఇ.జి.ఎం.ఎం. స్టాల్‌ని సందర్శించిన మంత్రివర్యుల బృందం

పంచాయితీ రాజ్ ఇంజనీరింగ్ స్టాల్‌ని సందర్శించిన మంత్రివర్యుల బృందం పి.ఎం.జి.ఎస్.వై పనుల ప్రగతిని తిలకిస్తున్న దృశ్యం






గ్రామీణ నీటిసరఫరా విభాగం ప్రదర్శనను తిలకిస్తున్న మంత్రివర్యులు

ఇందిరమ్మ గృహాల ప్రగతిని తిలకిస్తున్న మంత్రివర్యులు




జనాభా నియంత్రణతోనే
దేశాభివృద్ధి
GSCE
H.O.: Sealdah
TAXI
TATA